

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం.
రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది.
ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 178

గురువారం 18-9-2025



అంధుల T-20లో వైజాగ్ అమ్మాయి దృష్టి అంతా ఆటపైనే

-IIలో



అపూర్వ పంటలు

-IIలో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



"'డ్యూయల్-టాస్క్ ఎక్సర్‌సైజ్' మెదడుకు సంబంధించిన వ్యాయామాలలో ఒకటి. ఈ వ్యాయామం న్యూరల్ కనెక్షన్‌లను శక్తిమంతం చేస్తుంది. డ్యూయల్-టాస్క్ అంటే ఒకే సమయంలో రెండు పనులు చేయడం. ఉదాహరణకు... మార్నింగ్ లేదా ఈవెనింగ్ వాక్ చేస్తూ పాడ్‌కాస్ట్ వినడం లాంటివి."



● న్యూస్‌మేకర్ - కరుణ కుమారి

'నాకు బాల్ కనపడదు. కాని నా మైండ్‌తో, చెవులతో దాని రాకను పసిగట్టి కొడతాను' అంటోంది విశాఖ అంధబాలిక పాంగి కరుణ కుమారి. పదో తరగతి చదువుతున్న కరుణ బ్యాటింగ్‌లో దిట్ట. అందుకే నవంబర్ 11న ఢిల్లీలో తొలిసారి నిర్వహించనున్న అంధుల టి20 వరల్డ్ కప్‌కి భారత జట్టులో ఎంపికైంది. తెలుగువారు సంతోషపడాల్సిన సందర్భం ఇది. స్ఫూర్తినిస్తున్న కరుణ కుమారి పరిచయం.

అంధుల T-20లో వైజాగ్ అమ్మాయి

దృష్టి అంతా ఆటపైనే

స్కూలు పుస్తకాల్లో అక్షరాలు కనపడటం లేదని చదువు మానేసి ఇంట్లో కూచున్న అమ్మాయి నేడు భారత దేశ అంధ మహిళల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించింది. ఆ అమ్మాయి పాంగి కరుణకుమారి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతం వంట్ల మామిడికి చెందిన అరుణ ప్రస్తుతం విశాఖపట్నం అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. ఢిల్లీలో నవంబర్ 11 నుంచి జరగనున్న అంధ మహిళల టి20 వరల్డ్ కప్‌లో ఆమె భారత్ తరఫున ఆడనుంది. అంధ మహిళల కోసం టి20 వరల్డ్ కప్ నిర్వహించడం ఇదే ప్రథమం.

ఆమె ఆల్‌రౌండర్

వంట్ల మామిడిలో కూలినాలి చేసుకునే రాంబాబు, సంధ్యల మొదటి కుమార్తె కరుణ పుట్టుకతోనే దృష్టిలోపంతో పుట్టింది. ఒక కన్ను కొద్దిగా మరో కన్ను పూర్తిగా కనిపించేది కాదు. ఏడవ తరగతి వచ్చేసరికి చూపు దాదాపుగా పోవడంతో చదువు మానేసి ఇంట్లో కూచుంది. అయితే చిన్నప్పటి నుంచి ఆటల్లో చురుగ్గా ఉండేది. ఫోన్‌లో క్రికెట్ చూసేది. ఈ విషయం తెలిసి అంధ బాలికలను వెతికి చదివించే బాధ్యతతో విశాఖ అంధ బాలిక ఆశ్రమ పాఠశాల వారు కరుణ తల్లిదండ్రులను ఒప్పించి తమ స్కూల్‌లో చేర్పించారు. రెసిడెన్షియల్ స్కూల్ కావడం వల్ల అక్కడ కరుణ తిరిగి చదువులో, ఆటల్లో పడింది. క్రికెట్ పట్ల ఉన్న ఆసక్తి గమనించిన పీటీ మేడమ్ కరుణను ప్రోత్సహించింది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. మూడింటిలో ప్రతిభ చూపుతూ ఆల్‌రౌండర్‌గా ఎదిగింది కరుణ. నేషనల్ సెలక్షన్స్‌లో భాగంగా 2023లో హైదరాబాద్‌లో, 2024లో హుబ్లీలో, 2025లో కొచ్చిలో మేచెస్ ఆడింది. సెలెక్టర్ల దృష్టిలో పడింది.



60 బాల్స్‌లో 100 పరుగులు

అంధ మహిళల టి20 వరల్డ్ కప్ జట్టు ఎంపిక కోసం ఆగస్టు నెలలో బెంగళూరులో 20 రోజుల క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన మ్యాచ్‌లో కరుణ 60 బంతుల్లో 100 పరుగులు చేయడమే కాక 114 నాటౌట్‌గా నిలిచింది. బౌలింగ్‌లో, ఫీల్డింగ్‌లో కూడా ప్రతిభ చూపింది. దాంతో భారత జట్టుకు కరుణను సెలెక్ట్ చేశారు. 'నాకు బాల్ కనపడదు. కాని దాని రాకను పసిగట్టగలను. బాల్ రాకను అర్థం చేసుకోలేనప్పుడు అది ఒంటికి తగిలి దెబ్బలయ్యేవి' అని తెలిపింది కరుణ. ఆమె ఆర్థిక స్థితి అంతంత మాత్రంగా ఉంది. ఇల్లు కూడా నివాస యోగ్యంగా లేదు. ఇన్ని ప్రతికూలతల్లోనూ ప్రతిభ చూపుతోంది కరుణ.

ఆరు దేశాలతో...

అంధ మహిళల టి20 వరల్డ్ కప్‌లో మొత్తం ఆరు దేశాలు పాల్గొంటున్నాయి. ఢిల్లీ, బెంగళూరుల్లో మ్యాచ్‌లు జరుగుతాయి. ఆస్ట్రేలియా, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, అమెరికా, ఇంగ్లాండ్ జట్లు కలిసి 21 లీగ్ మేచ్‌లు, 2 సెమీ ఫైనల్స్, ఒక ఫైనల్‌ను ఆడనున్నారు. ఈ వరల్డ్ కప్‌లో మన దేశం కప్పు గెలవాలని, మన కరుణ గొప్ప ప్రతిభ చూపాలని కోరుకుందాం.

● ఇన్నోవేషన్



అక్షయ్ మసెల్కర్



క్లాసులో పిల్లలతో హ్యూమనాయిడ్ రోబో

ఆట పాటల శిక్షణ

'ఆడుతూ పాడుతూ కూడా చదువు హాయిగా నేర్చుకోవచ్చు' అంటాడు అక్షయ్ మసెల్కర్. ఉత్తర కర్నాటకలోని సిర్సి జిల్లాకు చెందిన అక్షయ్, బడి అంటే దూరంగా పారిపోయే విద్యార్థుల కోసం హ్యూమనాయిడ్ రోబోను తయారు చేశాడు. దానికి 'శిక్షణ' అని పేరు పెట్టాడు.

ఎంత టీచర్ అయినప్పటికీ 'శిక్షణ' రూపం అచ్చం విద్యార్థిలాగే ఉంటుంది. ఒకటి నుంచి నాల్గో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన ఈ రోబో టీచర్ పిల్లలను నవ్విస్తూనే కన్నడ, ఇంగ్లీష్ భాషలలో పాఠాలు చెబుతుంది. గేయాలు పాడుతుంది. మాథ్స్ సులువుగా నేర్పిస్తుంది. పొడుపు కథలు వేస్తుంది. ఒకటా రెండా... ఎన్నో ఎన్నెన్నో!

ఈ రోబో పుణ్యమా అని బడికి దూరంగా ఉండే పిల్లలు కూడా బడికి ఇష్టంగా రావడం విశేషం. తమ రోబో టీచర్‌కు సంబంధించిన విషయాలను రోజూ ఇంట్లో తల్లిదండ్రులకు చెబుతుంటారు.



అక్షయ్ తల్లి టీచర్‌గా పని చేసేది. తానూ టీచర్ కావాలనుకోవడానికి అమ్మే స్ఫూర్తి. డిగ్రీ పూర్తయిన తరువాత ఒక కాలేజీలో లెక్చరర్‌గా పని చేశాడు అక్షయ్.

లెక్చరర్‌గా పనిచేస్తున్న కాలంలో విద్యావిధానం గురించి ఆలోచించేవాడు. ఈ క్రమంలోనే అతడికి కొత్త కొత్త ఐడియాలు వస్తుండేవి. అయితే తనకు వచ్చే వినూత్న ఆలోచనలను సాకారం చేసుకునే సమయం ఉండేది కాదు.

కోవిడ్ కల్లోల కాలంలో బోలెడంత తీరిక దొరకడంతో తన ఐడియాలపై పనిచేసే అవకాశం వచ్చింది. పల్లెటూరు బడుల నుంచి పట్నం బడుల వరకు చాలా బడులలో బోధనకు సంబంధించిన శాస్త్రీయ విధానాన్ని అనుసరించడం లేదని, డ్రాయింగ్ చార్ట్‌లు, బ్లాక్‌బోర్డ్ తప్ప ఇతరత్రా ఉపకరణాలను ఉపాధ్యాయులు ఉపయోగించడం లేదని గ్రహించాడు అక్షయ్.

'మొక్కుబడిగా బోధించడం కాకుండా వినూత్నమైన పద్ధతుల్లో విద్యార్థులకు చేరువ కావాలి' అనుకున్న అక్షయ్ సంవత్సరానికి పైగా పరిశోధనలు చేశాడు. సంప్రదాయ బోధన, ఆధునిక సాంకేతికతను కలిపి రోబో టీచర్‌ను తయారుచేశాడు. ఈ రోబోను తయారు చేయడానికి రెండు లక్షల రూపాయలు ఖర్చు అయింది. ఈ ఖర్చును తానే స్వయంగా భరించాడు.

ఈ రోబోలో రెండు కార్డులు ఉంటాయి. మాస్టర్‌కార్డ్ అన్‌లాక్ కోసం, నార్మల్ కార్డ్ ఇష్టమైన ప్రోగ్రామ్‌ను స్టార్ట్ చేయడానికి ఉపయోగపడతాయి. మొదట్లో ఈ రోబ్‌ను 25 స్కూల్స్‌లో ఉపయోగించారు. ఆ తరువాత మరిన్ని స్కూల్స్‌కు విస్తరించారు.

'రోబో టీచర్‌ను అక్షయ్ మాకు పరిచయం చేశారు. చాలా ఆసక్తిగా అనిపించింది. పిల్లలైతే ఎంతో సంతోషించారు. క్లాసులో కదలకుండా కూర్చుంటున్నారు. వారికి ఇది రోబో కాదు టీచర్, ఫ్రెండ్. పిల్లలకు మాత్రమే కాదు ఉపాధ్యాయులకు కూడా రోబో ఎంతో ఉపయోగపడుతుంది. వారి భారాన్ని తగ్గిస్తోంది. సైన్స్, టెక్నాలజీ విషయాలపై ఆసక్తి పెంచుతుంది' అంటుంది సిర్సిలోని మోడల్ హైయర్ ప్రైమరీ స్కూల్ సైన్స్, మ్యాథ్స్ టీచర్ సునైనా హెగ్డే.

'శిక్షణ' రోబో దగ్గర మాత్రమే ఆగిపోలేదు అక్షయ్. విద్యారంగంలో మరిన్ని వినూత్న ఆవిష్కరణల కోసం 'ఎక్స్‌పిర్‌మైండ్' స్టార్టప్ ద్వారా కృషి చేస్తున్నాడు.

'గ్రామీణప్రాంత పిల్లలకు టెక్నాలజీని పరిచయం చేయడమే కాదు భవిష్యత్‌లో వారు కూడా కొత్త ఆవిష్కరణలు చేసేలా స్ఫూర్తి కలిగించడం, ప్రోత్సహించడమే మా లక్ష్యం' అంటున్నాడు అక్షయ్.

పుస్తకం

లైఫంత లైబ్రరీ



అంకే గౌడ బుక్ హౌస్



'చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ మంచి పుస్తకాన్ని కొనుక్కో' అన్న కందుకూరి వీరేశలింగం మాటను నిజం చేశాడు కర్ణాటక, హరెలహళ్లికి చెందిన అంకే గౌడ. ఇప్పుడతని వయసు 75 ఏళ్లు. పుస్తకాలను కొని చదివి, భద్రం చేసే పనిని తన 20వ ఏట మొదలుపెట్టాడు. ఇప్పటివరకు పోగైన రెండు కోట్ల పుస్తకాలతో 'బుక్ మానే (బుక్ హౌజ్)' పేరుతో ఓ గ్రంథాలయాన్నే ఏర్పాటు చేసి.. దాన్నే తన నివాసంగా మలచుకున్నాడు.

కండక్టర్.. బుక్ కలెక్టర్

అంకే గౌడ్ ఓ వైపు కన్నడ సాహిత్యంలో పీజీ చదువుతూనే మరో వైపు బస్ కండక్టర్‌గా ఉద్యోగంలో చేరాడు. చిన్నప్పటి నుంచీ పుస్తకం పఠనం మీద ఆసక్తి మెండు. దానికి కాలేజీలో తన ప్రొఫెసర్ అనంతరాము ప్రభావం, స్ఫూర్తి తోడవడంతో పుస్తకాలను కొనడమూ మొదలుపెట్టాడు. కండక్టర్‌గా తనకొచ్చే జీతంలో ముప్పావుభాగం పుస్తకాల కొనుగోలు మీదే వెచ్చించేవాడు. పెళ్లయి, పిల్లాడు పుట్టి బాధ్యతలు పెరిగినా ఇంటి ఖర్చులను తగ్గించుకునేవాడు కానీ పుస్తకాల బడ్జెట్‌లో కోత పెట్టేవాడు కాదు. అతని ఆ ఆసక్తిని, అలవాటును సహధర్మచారిణి విజయలక్ష్మి గౌరవించి.. ఉన్నదాంట్లోనే పొదుపుగా సంసారం చేయసాగింది. చివరకు తనకు నచ్చిన, లోకం మెచ్చిన పుస్తకాలను కొనడానికి అంకే గౌడ .. మైసూరులోని తమ ఇంటిని అమ్మినా మారుమాట్లాడకుండా భర్తను అనుసరించింది ఆమె. ప్రస్తుతం 'బుక్ మానే'లోనే ఓ మూల ఆ కుటుంబం నివాసముంటోంది.

అందరికీ ఉచితం

1832 నాటి రాతప్రతులు సహా దేశ, విదేశీ భాషలన్నిటిలోని అరుదైన సాహిత్యం అంకే గౌడ 'బుక్ మానే'లో కనిపిస్తుంది. సైన్స్, టెక్నాలజీ, మైథాలజీ, ఫిలాసఫీలకు సంబంధించిన పుస్తకాలూ దొరుకుతాయి. ఈ లైబ్రరీకి ఎవరైనా వెళ్లి కావల్సిన పుస్తకాలను ప్రశాంతంగా చదువుకోవచ్చు. ప్రవేశ రుసుము కానీ, పుస్తకానికి అద్దె కానీ లేదు. పూర్తిగా ఉచితం. బడి పిల్లలు, రీసెర్చ్ స్కాలర్స్, సివిల్ సర్వీస్‌కి ప్రిపేర్ అవుతున్నవాళ్లు, సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులు ఈ లైబ్రరీకి రెగ్యులర్ విజిటర్స్. పర్యాటకుల గురించైతే విడిగా చెప్పక్కర్లేదు. ఎక్కడెక్కడి నుంచో 'బుక్ మానే'ను చూడ్డానికి వస్తూంటారు. 'పుస్తక పఠనం మీద ఆసక్తి, జ్ఞానతృష్ణ ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వచ్చి తమకు కావల్సింది చదువుకోగలిగేలా ఈ లైబ్రరీని మలచాలి.. ఓ నాలెడ్జ్ హబ్‌గా మార్చాలన్నదే నా కల, భవిష్యత్ లక్ష్యం' అంటాడు అంకే గౌడ.

సమ్‌థింగ్ స్పెషల్

చిలకల పందిరి





చిలకలు వాలిన చెట్టు ఎంత అద్భుతం! అయితే ఇప్పుడు ఆ అద్భుతాలు అరుదైపోయాయి. ఈ నేపథ్యంలో 'చిలకలను కాపాడుకుందాం' అంటున్నారు సుదర్శన్, విద్య దంపతులు.

చెన్నైలోని చింతాద్రిపేటలో ఉండే ఈ దంపతుల ఇంటి టెర్రస్‌పై రోజూ చిలకలు గుంపులు గుంపులుగా కనిపిస్తాయి. రోజు ఎన్నో చిలకలకు సుదర్శన్, విద్య దంపతులు ఆహారం సమకూరుస్తున్నారు. ఇందుకోసం వారు తెల్లవారు జామున నాలుగు గంటలకు నిద్రలేస్తారు. చిలకలకు రోజూ ఆహారం ఇవ్వడం ఖర్చుతో కూడుకున్న పని అయినప్పటికీ ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. చిలకలపై ఈ దంపతులకు ఉన్న ప్రేమను హైలెట్ చేస్తూ ఒక తమిళ సినిమాలో సీన్ క్రియేట్ చేశారు. సోషల్ మీడియాలో కూడా వీరి గురించి కథనాలు రావడంతో, చిలకల ఇంటిని చూడడానికి దేశవిదేశాల నుంచి సందర్శకులు వస్తుంటారు.

● రూట్స్

అపూర్వ పంటలు



గజవాడ స్వరూప తోటలో పండిన సూర్యముఖ మిర్చి

అక్షయపాత్ర సొరకాయ గురించి ఎప్పుడైనా విన్నారా? బోతరాసి పండ్ల గురించి బొత్తిగా తెలియదా? ... కొన్ని తరాల వెనక్కి వెళితే అపూర్వమైన కూరగాయలు ఎన్నో ఉన్నాయి. వాటిలో ఎన్నో కనుమరుగవుతున్నాయి. అలా కనుమరుగవుతున్న కూరగాయలు, పూలు, పండ్లకు పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తోంది స్వరూప.

తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన గజవాడ స్వరూప అ'పూర్వ'మైన కూరగాయలు, పూల మొక్కలను పెంచుతోంది. పూర్వకాలంలో మన పెద్దలు ఇంటి పెరటిలో, ఇంటి ముందు విత్తనాలు నాటి పండించే పంటలను కళ్లముందు ఆవిష్కరిస్తోంది.

అక్షయపాత్ర సొరకాయ నుంచి కాశీ తులసి వరకు

కూరగాయల మార్కెట్‌లో దొరకని పూర్వపు గుమ్మడి సొరకాయ, అక్షయపాత్ర సొరకాయ, నల్ల సొరకాయ... ఇలా సొరకాయల్లో 40 రకాలు, టమాటాలు పది రకాలు, చిక్కుడు కాయలు ఐదు రకాలు, బుడం కాయలు పది రకాలు, తీగకు కాసే ఆలుగడ్డలు, బోతరాసి పండ్లు, ఐదు రకాల బెండ కాయలు, అడవి కాకర, పొట్టి కాకర, రుద్రాక్ష కాకర, ఆపిల్ బొప్పాయి, నాటు దొండ, గెల చిక్కుడు, అడవి దోస, ముళ్ల వంకాయ, పొట్టిపొట్లకాయ, సూర్యముఖ మిర్చి, కాశీ తులసీ, ధనియాలు, కొత్తిమీర, నల్ల అల్లం, లక్కడోన్ పసుపు, చెమ్మకాయలు, సూదినిమ్మ, చామంతి, జడపత్రి, బచ్చలాకు, నల్లేరు...ఇలా పూర్వపు కూరగాయలను, పూలను, పండ్లను పండిస్తోంది.

దశాబ్ద కాల అపూర్వ కృషి

చిన్నప్పుడు కరీంనగర్‌లో, చుట్టాల ఇళ్ల దగ్గర రకరకాల కూరగాయలను చూసింది స్వరూప. కాలక్రమంలో ఎన్నో కూరగాయలు కనుమరుగు కావడాన్ని కూడా చూసింది. ఇలాంటి అరుదైన రకాలను భావితరాలకు పరిచయం చేయాలనే లక్ష్యంతో దశాబ్దకాలంగా అపురూపమైన కూరగాయల విత్తనాల సేకరణ మొదలుపెట్టింది.

9వ తరగతి వరకు చదువుకున్న స్వరూపకు పూర్వపు కూరగాయల విలువ బాగా తెలుసు. అందుకే ఏ ఊరు వెళ్లినా పాత తరం కూరగాయలు కనిపిస్తే విత్తనాలు సేకరించేది. ఆమె ఆసక్తిని భర్త నాగరాజు ప్రోత్సహించాడు. సిరిసిల్ల శివారులోని భూపతినగర్‌లో కొంత భూమిని కొనుగోలు చేసి అక్కడ కూరగాయల క్షేత్రాన్ని ప్రారంభించి తాను పండించిన పంటలను విక్రయిస్తూ దేశీయ విత్తనాలపై ఆసక్తి ఉన్నవారికి సరఫరా చేస్తోంది.



కూరగాయల తోటల పందిరి కిందనే ఆమె ఇల్లు



స్వరూప పండించిన సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు



విత్తనాల కోసం వేలాడ దీసిన 40 రకాల పూర్వపు సొరకాయలు

కష్టమే... అయినా ఇష్టమే!

మన తాత, ముత్తాతల కాలంనాటి కూరగాయల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. అయితే అవి ఇప్పుడు కనుమరుగవుతున్నాయి. వాటిని భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో ఎక్కడికి వెళ్లినా పూర్వపు కూరగాయల విత్తనాలను సేకరించాను. నా దగ్గర ఆకుకూరలు, కూరగాయలు, పూలకు సంబంధించి ఎన్నో రకాల విత్తనాలు ఉన్నాయి. వాటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నాను. కొన్నిసార్లు గ్రామీణ ప్రాంతాల్లో నేనే చొరవ తీసుకొని వాటిని నాటుతున్నాను. అవి పెరిగి పెద్దవై అందరికీ ఉపయోగపడతాయని నా ఆలోచన. ఈ పని చేయడం అంత సులభం కాదు. కానీ కష్టంగా ఉన్నా ఇష్టంగా చేస్తున్నాను.

– స్వరూప

ఇల్లంతా పచ్చదనమే!

స్వరూప, నాగరాజు దంపతుల ఇల్లు పాత తరం కూరగాయల చెట్లు, విత్తనాల కాయలతో 'వెజిటెబుల్ మ్యూజియం'ను తలపిస్తుంది. ఇంట్లో అంజీరా, ఆపిల్ బేర్, జామ, బెంగళూర్ చెర్రీ, ద్రాక్ష... ఇలా రకరకాల మొక్కలతో ఇల్లంతా పచ్చదనం కొలువై ఉంటుంది. 2018లో స్వరూప కృషిని గుర్తించిన అప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆమెను సత్కరించారు. రాష్ట్ర ఉద్యానవనాల శాఖ కమిషనర్ వెంకటరామిరెడ్డి మెమెంటోతో అభినందించారు. సొంతంగా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి పాతతరం కూరగాయల గురించి ప్రచారం చేస్తోంది స్వరూప.

– పూరెడి మల్లికార్జున్, సాక్షి, రాజన్న సిరిసిల్ల జిల్లా

● మన(సు)లో మాట

సరదా సరదా దొంగతనాలు: క్లెప్టోమేనియా!

నా భార్య వయసు 45 ఏళ్ళు. మాకు ఒక సొంత సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉంది. మంచి ఉన్నతమైన కుటుంబం. మా ఆవిడకు మొదటి నుంచి ఒక వింత అలవాటు ఉంది. షాపింగ్‌కు వెళ్లినపుడు అవసరం లేకపోయినా, కొనగలిగిన స్తోమత ఉన్నా, ఏదో ఒక వస్తువు దొంగిలిస్తుంది. ఆమె దొంగిలించే వాటిలో కాస్మెటిక్స్ లాంటి చిన్న వస్తువుల నుండి, ఒక్కోసారి చీరలు, చిన్న బంగారు వస్తువులు కూడా ఉన్నాయి. అలా దొంగిలించినవి కొన్ని ఇంట్లో దాచిపెడుతుంది. కొన్నేమో ఇతరులకు తాను గొప్ప అనిపించుకోవడానికి అన్నట్లు పంచిపెడుతుంది. ఆమెకు 300 లకు పైగా చీరలు,కోట్లు విలువ చేసే బంగారు నగలు ఉన్నాయి. ఒక్కోసారి నా జేబులోంచి కూడా, నాకు చెప్పకుండా డబ్బులు తీసి దాస్తుంది. ఇన్ని చేసినా ఏమి తెలియనట్లు ఉంటుంది. ఏమాత్రం గిల్టీగా ఫీలవదు. ఇన్ని ఆస్తిపాస్తులుండి కూడా, ఆమె ఎందుకు ఇలా చీప్‌గా దొంగతనాలు చేస్తుందో అర్థం కావడం లేదు. ఇలా చేసి కొన్నిసార్లు షాప్స్‌లో పట్టుబడితే, పొరపాటయిందని సారీ చెప్పింది. ఆమె ప్రవర్తన వల్ల నాకు ఇబ్బందిగా ఉంది. బయట ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి నాది. సాక్షిలో మీ కాలమ్ చూసి, మీరే ఏదైనా మంచి పరిష్కారం చూపిస్తారనే ఆశతో ఉన్నాను!

– కామేశ్వరరావు, హైదరాబాద్

రావుగారూ! మీరెంతో ఆవేదనతో మీ సమస్యను సాక్షి ద్వారా తెలియజేసినందుకు ధన్యవాదాలు. మీరన్నట్లుగా ఇది బయటకు చెప్పుకోలేని పరిస్థితి. అన్నీ ఉన్నా, అవసరం లేకున్నా ఇలా దొంగతనాలు చేయడాన్ని 'క్లెప్టోమేనియా' అంటారు. ఇది చాలా అరుదైన ఒక వింత మానసిక సమస్య. ఈ సమస్య ఉన్న వారికి, ఎలాగైనా ఏదో ఒకటి దొంగిలించాలనే 'తహ తహ' ఉంటుంది. వాస్తవానికి ఆ దొంగిలించిన వస్తువు వల్ల వారికి ఎలాంటి అవసరం ఉండదు. ఆ వస్తువు విలువ కూడా చాలా స్వల్పమై ఉండవచ్చు. మామూలు దొంగతనాల లాగా వీరు ఏదీ ప్లాన్ చేసుకుని, దొంగతనాలు చేయరు. ఏదైనా షాపింగ్‌కి అని వెళ్లినపుడు అలా సడన్‌గా చేతికందిన ఏదో ఒక వస్తువును వారికవసరం లేకపోయినా ఎత్తేస్తుంటారు. బాగా స్తోమత కలిగి, డబ్బులు పెట్టి కొనగలిగిన వారిలోనే ఈ అలవాటు ఎక్కువ. బహిష్టు సమయంలో ఇలాంటి కోరిక, కొందరిలో ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆ సమయంలో కనబడిన వస్తువు ఎత్తేయకుంటే విపరీతమైన టెన్షన్‌కు గురయి, తీసిన తర్వాత చాలా మానసిక ప్రశాంతతకు లోనవుతారు. దీనిని 'ఇంపల్స్ కంట్రోల్ డిజార్డర్' అని కూడా అంటారు.

ఈ అలవాటు యుక్తవయసులో మొదలై పెద్దయ్యే కొద్దీ తగ్గిపోయే అవకాశం ఉంది. కానీ కొందరిలో మాత్రం శాశ్వతంగా ఉండిపోతుంది. ఈ సమస్య నుంచి బయటపడేయాలంటే ఆ వ్యక్తి సహకరించాలి. కొన్నిరకాల మందులతో పాటు 'కాగ్నిటివ్ బిహేవియర్ మాడిఫికేషన్' లాంటి ప్రత్యేక మానసిక చికిత్స పద్ధతుల ద్వారా ఇలాంటి వారిని ఈ అలవాటు నుండి బయటపడేసే అవకాశముంది. మొదట్లోనే ఈ అలవాటు గుర్తించి మానసిక వైద్యుడిని కలిస్తే ఫలితాలు మంచిగా ఉంటాయి. ఇప్పటికైనా మీ భార్యను మంచి నిపుణులైన సైకియాట్రిస్ట్ క్లినికల్ సైకాలజిస్టుల పర్యవేక్షణలో తగిన థెరపీ చేయించండి. ఆల్‌దిబెస్ట్!




డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) సెప్టెంబర్ 17న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,15,250	1,13,690	1,11,710	1,13,,600	1,14,200	1,12,030
బంగారం (22 క్యారెట్లు)	1,07,950	1,02,400	1,02,400	1,05,470	1,05,060	1,02,700
వెండి	1,35,500	1,32,300	1,42,000	1,32,300	1,32,000	1,42,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 178
గురువారం 18-9-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'



పతకంపై నీరజ్ గురి

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రో ఫైనల్లోకి భారత స్టార్ -14లో



రెండో రోజూ అదే జోరు

సెన్సెక్స్ లాభం 313 పాయింట్లు.. 91 పాయింట్లు పెరిగిన నిఫ్టీ -15లో



కొందరినైనా జైలుకు పంపండి

పంట వ్యర్థాలను తగలబెడుతున్న రైతులను ఎందుకు అరెస్ట్ చేయట్లేదని పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది.

- వివరాలు 6లో



చొరబాటుదారుల కోసం యాత్రలా?

కాంగ్రెస్‌పై అమిత్ షా నిప్పులు చెరిగారు. చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా ఆ పార్టీ యాత్రలు చేస్తోందని మండిపడ్డారు.

- వివరాలు 6లో



ఈవీఎం బ్యాలెట్‌పై కలర్ ఫొటోలు

'ఎస్‌ఐఆర్' చర్చనీయాంశమైన నేపథ్యంలో ఈవీఎం బ్యాలెట్ పేపర్ లేఔట్‌లో ఆధునిక మార్పులు తేనున్నట్లు ఈసీ ప్రకటించింది.

- వివరాలు 6లో



మసూద్ అజారే సూత్రధారి

ఢిల్లీ, ముంబైలో జరిగిన ఉగ్రదాడుల్లో మసూద్‌దే కీలకపాత్ర అని 'జైషే' టాప్ కమాండర్ ఇల్యాస్ చెప్పాడు.

- వివరాలు 6లో

సమూలంగా మార్చేద్దాం

సరికొత్త విద్యా విధానాన్ని తీసుకొద్దాం

ఈ విధానం వచ్చే 25 ఏళ్ల వరకు దిశా నిర్దేశం చేసేలా ఉండాలి

తెలంగాణ విద్యా విధానం ఖరారు కమిటీ సమావేశంలో సీఎం రేవంత్

- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో బోధన సాగాలి
- ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాలి
- నిరుపేదలకు మేలు జరగాలి.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి
- మేధావులు, విద్యావేత్తలు ఈ మేరకు సలహాలివ్వాలన్న ముఖ్యమంత్రి
- మౌలిక వసతులపై ఖర్చుకు ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యా విధానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సరికొత్త తెలంగాణ విద్యా విధానం తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన అని వెల్లడించారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారిలో జ్ఞానం కొరవడిందని, జ్ఞానం ఉన్న వారికి భాషలో పట్టు లేదని అన్నారు. ఈ రెండూ ఉన్న వారిలో నైపుణ్యం ఉండటం లేదని చెప్పారు. దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, ఆ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగవ్వడం లేదని చెప్పారు. ఈ కారణంగా ఉద్యోగాలను సొంతం చేసుకోవడంలో యువత వెనుకబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో విద్యా బోధన సాగాలని, వచ్చే 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరించనున్న 'తెలంగాణ రైజింగ్–2047'లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో రాష్ట్ర విద్యా విధానం

మిగతా 3వ పేజీలో ▶



అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

ప్రణాళిక కాదు.. సర్కారు సంకల్పం

'తెలంగాణ రైజింగ్ 2047' రాష్ట్ర ప్రభుత్వ దార్శనిక పత్రం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

- వివరాలు 2లో



1,743 ఉద్యోగాల భర్తీ

- 13 ఏళ్ల తర్వాత ఆర్టీసీలో నియామకాలు
- 1,000 మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
- తెలంగాణ వచ్చాక ఆర్టీసీలో తొలి నియామకాలు

3లో

తాజా నోటిఫికేషన్ ఇలా...

డ్రైవర్ పోస్టులు:	1,000
శ్రామిక్ పోస్టులు:	743
దరఖాస్తు గడువు:	అక్టోబర్ 8 నుంచి 28 సాయంత్రం 5 వరకు
వయసు:	22 నుంచి 35 ఏళ్లలోపు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు మూడేళ్ల సడలింపు

(మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు)



'హైదరాబాద్ లిబరేషన్ డే' ఉత్సవాల్లో భాగంగా పరేడ్ గ్రౌండ్స్‌లోని సైనిక్ స్మారక్ వద్ద నివాళులు అర్పిస్తున్న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

భారత్ ఎవరికీ తల వంచదు

- పాకిస్తాన్ స్వయంగా కాల్పుల విరమణ కోరితేనే ఆపాం
- ఆపరేషన్ సిందూర్‌కు విరామం మాత్రమే
- అవసరమైతే దానిని మళ్లీ మొదలు పెడతాం
- దేశం నుంచి రజాకార్ల మద్దతుదారులను తరిమేస్తాం
- హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

13లో



దేశ ఐక్యతకు ప్రతీక హైదరాబాద్ లిబరేషన్ డే: మోదీ

2లో

నవ భారత్ బెదరదు

ఇది నవభారతం.. అణ్వాయుధాలతో మనల్ని భయపెట్టలేరు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ

- వివరాలు 6లో

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్..!

- అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో సేవలు నిలిచినట్లు నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ వెల్లడి
- 477 ఆస్పత్రుల్లో 62 మాత్రమే సేవలను నిరాకరించాయన్న ప్రభుత్వం..

- వివరాలు 2లో

నియంతలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- సీఎం వేధింపుల వల్లే మెట్రో నుంచి ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ.. త్వరలో ఎమ్మార్ ఆస్తులను అమ్మే ప్రయత్నాల్లో రేవంత్
- జైపాల్ రెడ్డి కుటుంబ భూముల కోసమే ఫోర్త్ సిటీకి రోడ్డు: కేటీఆర్

- 5లో

కుండపోత బీభత్సం

నగరంలో బుధవారం రాత్రి కుంభవృష్టి

- ఏకధాటి వర్షంతో జనజీవనం అతలాకుతలం..
- పలుచోట్ల కొట్టుకుపోయిన వాహనాలు
- కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్‌తో నరకం చూసిన వాహనదారులు

7లో

ఏఐ ముద్ర.. పడాల్సిందే

డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాలు ప్రపంచాన్ని కలవర పెడుతున్న అతిపెద్ద సమస్య. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి రూపొందించే ఈ కంటెంట్ విషయంలో మన దేశం కఠిన నియమాలు తీసుకొచ్చే దిశగా అడుగులు వేస్తోంది. నకిలీ సమాచార వ్యాప్తిని అరికట్టే లక్ష్యంతో పార్లమెంటరీ కమిటీ కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. వీడియోలను రూపొందించే కంటెంట్ క్రియేటర్లకు లైసెన్స్‌తోపాటు.. వీడియోలు, చిత్రాలను ఏఐతో రూపొందించినట్టు వెల్లడించే లేబులింగ్ వంటి అంశాలు వీటిలో ఉన్నాయి.

సాక్షి, స్పెషల్ డెస్క్

- ఏఐతో రూపొందినట్టు వెల్లడించాలి
- ఏఐ కంటెంట్‌కు త్వరలో కొత్త రూల్స్
- కంటెంట్ క్రియేటర్లకు లైసెన్సులు
- ప్రతిపాదించిన పార్లమెంటరీ కమిటీ



కమ్యూనికేషన్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించి.. లోక్‌సభ సభ్యుడు నిషికాంత్ దూబే నేతృత్వంలో ఏర్పాటుచేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవలే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక ముసాయిదా నివేదికను సమర్పించింది. నకిలీ వార్తలను వ్యాప్తి చేయడానికి ఏఐని ఉపయోగించే వ్యక్తులు లేదా కంపెనీలను గుర్తించి, విచారించడానికి కఠినమైన సాంకేతిక, చట్టపరమైన నియమాలను అమలు చేయాలని కమిటీ తన నివేదికలో వెల్లడించింది. ఈ ప్రతిపాదనలు కార్యరూపంలోకి వస్తే.. భారత్‌లో కంటెంట్ క్రియేటర్స్ ఏఐని ఉపయోగించే విధానం పెద్ద ఎత్తున మారుతుందని, అలాగే పారదర్శకత, జవాబుదారీతనం ఉంటుందన్నది నిపుణుల మాట.

బాధ్యులను పట్టుకోవచ్చు

ఏఐతో రూపొందిన తప్పుడు సమాచారం విషయంలో శిక్షా నిబంధనలను సవరించాలని, జరిమానాలను పెంచాలని కమిటీ తన నివేదికలో కోరింది. 'ఏఐతో అభివృద్ధి చేసినట్టు తెలిపే సమాచారంతో వీడియోలు, చిత్రాలు, ఇతర అంశాలను ప్రజలు సులభంగా గుర్తించగలుగుతారు. అంతేకాకుండా నకిలీ వార్తలను వ్యాప్తి చేసిన బాధ్యులను సులభంగా పట్టుకోవచ్చు' అని కమిటీ తెలిపింది.

మీడియాకు విన్నపం

నకిలీ వార్తలను కట్టడి చేసేందుకు బలమైన అంతర్గత రక్షణ చర్యలను చేపట్టాలని మీడియా సంస్థలను కూడా పార్లమెంటరీ కమిటీ కోరింది. సమాచారం నిజమేనా కాదా అన్నది తెలుసుకునే కఠిన తనిఖీ వ్యవస్థ, వార్తా ప్రసారంలో నాణ్యత, కచ్చితత్వం ప్రమాణాలను కాపాడే అంబుడ్స్‌మన్‌ను నియమించాలని సూచించింది. మోసపూరిత కంటెంట్ సులభంగా వైరల్ అయ్యే యుగంలో ప్రజల విశ్వాసాన్ని కొనసాగించడానికి ఇలాంటి చర్యలు చాలా అవసరమని అభిప్రాయపడింది.

ఇప్పటికే కొన్ని..

డీప్‌ఫేక్ సంబంధిత సవాళ్లను ఎదుర్కోవడానికి ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది. నకిలీ ప్రసంగాలను అడ్డుకోగల ; డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాలను గుర్తించగల సాధనాలను అభివృద్ధి చేయడానికి రెండు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది.

నమ్మదగినవిగా మారతాయి

కంటెంట్ అభివృద్ధి విషయానికొస్తే ప్రతిపాదిత నిబంధనలు.. క్రియేటర్లను అడ్డుకునే ప్రయత్నం ఎంత మాత్రమూ కాదనీ, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది నిపుణుల మాట. క్రియేటర్లు చేయాల్సిందల్లా తమ వీడియోలు, చిత్రాలను ఏఐతో రూపొందించినట్టు వీక్షకులకు కనిపించేలా వెల్లడించాలి. ఏఐతో రూపొందిన కంటెంట్‌తో నకిలీ వార్తలను వ్యాప్తి చేసే, పెట్టుబడి పెట్టే సృష్టికర్తలు, కంపెనీలను అడ్డుకోవడమే ఈ నిబంధనల లక్ష్యం. ఈ ప్రతిపాదనలు ఆమోదం పొందితే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అందరికీ మరింత పారదర్శకంగా, నమ్మదగినవిగా మారతాయి.

సాధారణంగా సినిమా ప్రారంభంలో 'చిత్ర నిర్మాణంలో జంతువులకు, పక్షులకు ఎలాంటి హానీ చేయలేదని, గ్రాఫిక్స్ ఉపయోగించాం' అని ఓ ప్రకటన ఇస్తారు. అదే తరహాలో ఇప్పుడు.. కంటెంట్ ఏఐతో సృష్టించినట్టు వెల్లడించాల్సి ఉంటుంది.

ఏఐతో కంటెంట్ సృష్టించినట్టుగా వెల్లడించాలన్న తప్పనిసరి నిబంధన చైనాలో ఉంది.

యూరోపియన్ యూనియన్ గతేడాది ఏఐ యాక్ట్‌ను అందుబాటులోకి తెచ్చి దశలవారీగా అమలు చేస్తోంది.

10 కోట్లకు పైగా చానళ్లు

భారత్‌లో 10 కోట్లకు పైచిలుకు యూట్యూబ్ చానళ్లు ఉన్నట్టు సమాచారం. అయితే ఇందులో 7 లక్షల మంది క్రియేటర్లు మాత్రమే ఆదాయార్జన చేస్తున్నారు. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్.. ఈ సామాజిక మాధ్యమాలను వేదికలుగా చేసుకుని కోట్లాది మంది కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. రోజూ కోట్లాది వీడియోలు, చిత్రాలు పోస్ట్ చేస్తుంటారు. ఇంతటి విశాలమైన సామాజిక మాధ్యమాల ప్రపంచంలో తప్పుడు సమాచారం కట్టడి ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ పార్లమెంటరీ కమిటీ నిబంధనలు కఠినంగా అమలైతే కొంతైనా మార్పు రావడం ఖాయం అన్నది నిపుణుల మాట. **భారత్‌లో కట్టడి చేస్తాం సరే.. అంతర్జాతీయంగా వచ్చి పడే కంటెంట్‌ను ఎలా నియంత్రిస్తారన్నది ముందున్న సవాల్.**

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలి

బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు డిమాండ్



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న రాంచందర్‌రావు. చిత్రంలో కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోరాటయోధుల త్యాగాన్ని మర్చిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు కూడా ముక్తి దివస్‌గా దీన్ని అధికారికంగా నిర్వహిస్తున్నా తెలంగాణలో జరపకపోవడం సరి కాదన్నారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో విమోచన దిన వేడుకల్లో భాగంగా రాంచందర్‌రావు జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపరేషన్ పోలో ద్వారా నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో పోలీస్ యాక్షన్ ద్వారా తెలంగాణ దేశంలో అంతర్భాగమైందని తెలిపారు. ఈరోజు మనం గుర్తుంచుకోవాల్సిందేంటంటే నియంత నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం అని చెప్పారు. బీజేపీ ఆ పోరాటయోధులను స్మరించుకునేలా లిబరేషన్ డేని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా జరపాలని పోరాటం చేస్తోందన్నారు. ప్రధాని మోదీ 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోదీ చిత్రపటానికి రాంచందర్‌రావు, ఇతర నాయకులు క్షీరాభిషేకం చేశారు.

ఇదేం జగత్



ఇంకెంతసేపు తయారవుతార్సార్! త్వరగా వచ్చేయండీ!

ప్రణాళిక కాదు.. సర్కారు సంకల్పం

'తెలంగాణ రైజింగ్ 2047' రాష్ట్ర ప్రభుత్వ దార్శనిక పత్రం

- సర్కారు ఆలోచనలు, ఆచరణ మార్గాలతో విజన్ డాక్యుమెంట్
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి
- 2047 నాటికి దేశం, రాష్ట్రాన్ని ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలపడమే లక్ష్యం
- 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్రం మోకాలొడ్డకూడదని విజ్ఞప్తి
- అమరవీరులకు నివాళులు..



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: 'స్వతంత్ర భారతదేశం 2047లో వందేళ్ల మైలురాయిని చేరుకునే నాటికి దేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ ఛేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్నది మా సంకల్పం. దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రపంచంలో నంబర్ వన్‌గా నిలబెట్టే విజన్‌పై మేం నిరంతరం శ్రమిస్తున్నాం. ఆ సంకల్పానికి దార్శనిక పత్రమే 'తెలంగాణ రైజింగ్ 2047'. ఇది కేవలం ప్రణాళిక కాదు. ప్రపంచ వేదికపై తెలంగాణను సగర్వంగా నిలబెట్టే సంకల్పం..'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు.

మూసీ పునరుజ్జీవం మొదలు వ్యవసాయ వికాసం వరకు..

'మూసీ పునరుజ్జీవం మొదలు గ్రామీణ తెలంగాణ వ్యవసాయ వికాసం వరకు విజన్ డాక్యుమెంట్‌లో విస్పష్టంగా ఉండబోతోంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడంలో కీలకమైన పలు ప్రతిపాదిత ప్రాజెక్టుల వెనుక ఉన్న ఆలోచన, ఆవిష్కరణ, ఆచరణ మార్గాలను ఇది ప్రకటిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమయ్యే భారత్ ఫ్యూచర్ సిటీ ఆధునిక ప్రపంచానికి గేట్ వేగా ఏ విధంగా ఉంటుందో.. రీజినల్ రింగ్ రోడ్డు రాష్ట్ర అభివృద్ధికి రాచమార్గంగా ఎలా నిలవబోతోందో 'తెలంగాణ రైజింగ్–2047'లో విస్పష్టంగా చెబుతాం. బాపూఘాట్ వద్ద నిర్మించే గాంధీ సరోవర్ ప్రాజెక్టు, గ్రీన్ ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, మెట్రో రెండో దశ విస్తరణ ప్రాజెక్టులు, ఔటర్ నుండి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య నిర్మించే రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, హైదరాబాద్ –నాగపూర్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో తెలంగాణ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చే ప్రణాళిక ఇది. ఈ సంకల్ప పత్రాన్ని కార్యాచరణలో పెట్టి 2047 నాటికి దేశ ప్రగతిలో తెలంగాణది కీలక పాత్రగా చేయాలనేదే మా సంకల్పం..'అని ముఖ్యమంత్రి చెప్పారు.

రెండు కీలక మైలురాళ్లు..

'నిజాం రాచరికానికి ఘోరీ కట్టి ప్రజా పాలనకు హారతి పట్టిన 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక మైలురాయి. 2023 డిసెంబర్ 7 స్వరాష్ట్ర ప్రజాస్వామ్య ప్రస్థానంలో మరో మైలు రాయి. నాటి సాయుధ పోరాట స్ఫూర్తితో నిన్నటి నియంతృత్వ పాలనను ఓడించి, ప్రజా పాలనను తెచ్చుకున్నాం. 77 ఏళ్ల తెలంగాణ ప్రస్థానాన్ని, పోరాట చరిత్రను, ఉద్యమాల సరళిని ఆకళింపు చేసుకుని పరిపాలన చేస్తున్నాం. అహంకారపు ఆలోచనలు, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతానికి మా పాలనలో తావు లేదు.

త్వరలో రాష్ట్ర విద్యా పాలసీ..

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పునర్నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలు విప్లవాత్మక మార్పులకు కేంద్రాలుగా మారబోతున్నాయి. గత పదేళ్లలో నిర్వీర్యమైన ఉస్మానియా, కాకతీయ లాంటి యూనివర్సిటీలను కేంబ్రిడ్జ్, హార్వర్డ్, ఆక్స్ఫర్డ్, స్టాన్ఫర్డ్ వంటి వర్సిటీలతో పోటీపడాలి అనే ఆశయంతో ఆలోచన చేస్తున్నాం. రేపటి తరాన్ని స్వీయ శక్తిమంతులుగా మార్చాలన్న సంకల్పంతో త్వరలో రాష్ట్ర విద్యా పాలసీని తీసుకురాబోతున్నాం..'అని సీఎం తెలిపారు.

మరిన్ని మహిళా మార్ట్‌లు

'కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. నారాయణపేట జిల్లాలో మహిళా సమాఖ్య ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ఆరు నెలల్లో రూ.15.50 లక్షల లాభాలు ఆర్జించింది. ఖమ్మంలో 'మహిళా మార్ట్' విజయవంతమైంది. రాష్ట్రంలో ఇలాంటివి మరికొన్ని ఏర్పాటు చేస్తాం. 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణ మాఫీ చేశాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు వారి ఖాతాల్లో వేశాం. ఏడాదిలో రూ.1.04 లక్షల కోట్లు రైతుల ప్రయోజనాల కోసం ఖర్చు చేసిన ప్రభుత్వం ఈ దేశంలో మరొకటి లేదు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేసి గ్రీన్ చానెల్‌లో నిధులు ఇస్తున్నాం. ఈ ఒక్క ఏడాదిలోనే 4.5 లక్షల మంది పేదలు సొంత ఇంటివారవుతారు. మరోవైపు 5 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశాం. రాష్ట్రంలోని 3.10 కోట్ల మంది నిత్యం సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు..' అని రేవంత్ చెప్పారు.

ప్రపంచానికి గేట్‌వేగా హైదరాబాద్

'హైదరాబాద్ ప్రపంచానికి గేట్ వేగా మారుతుంది. ఓఆర్ఆర్‌పై తలపెట్టిన గేట్ వే ఆఫ్ హైదరాబాద్ ఒక గొప్ప స్వాగత తోరణంగా నిలుస్తుంది. వచ్చే వందేళ్ల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారంగా గోదావరి జలాలను నగరానికి తీసుకురావడానికి రూ.7,360 కోట్లతో గోదావరి 2, 3 దశల పనులను ప్రారంభించుకున్నాం. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు, గాంధీ సరోవర్ ప్రాజెక్టు ఉండబోతున్నాయి. రూ.24 వేల కోట్లతో మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నాం..'అని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర విద్యారంగం, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు వీలుగా శాసనసభ ఆమోదించిన బిల్లులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోకాలడ్డు పెట్టకుండా తక్షణమే ఆమోదించాలని ఈ సందర్భంగా రేవంత్ విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్!

- అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో సేవలు నిలిచినట్లు నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ వెల్లడి
- 477 ఆసుపత్రుల్లో 62 మాత్రమే సేవలను నిరాకరించాయన్న ప్రభుత్వం
- రోగులకు ఇబ్బందుల్లేకుండా సర్కారు దవాఖానాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్ పడింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతోపాటు ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన బిల్లులు సకాలంలో విడుదల చేయడం లేదనే కారణంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల అసోసియేషన్ పిలుపు మేరకు (టీఏఎన్‌హెచ్‌ఏ) బుధవారం ఉదయం నుంచి జిల్లాల్లోని ప్రైవేటు ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయి. ప్రభుత్వం తరఫున మంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఉదయ్‌కుమార్ విజ్ఞప్తి చేసినప్పటికీ, తక్షణమే బకాయిలు విడుదల చేయాలనే డిమాండ్‌తో సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. అయితే రాష్ట్రంలోని కార్పొరేట్ ఆస్పత్రులతోపాటు మెజారిటీ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని 477 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో కేవలం 62 మాత్రమే ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయగా, 415 ఆసుపత్రుల్లో సేవలు కొనసాగాయని ఆరోగ్యశాఖ మంత్రి కార్యాలయం వెల్లడించింది. అంటే 87 శాతం ఆస్పత్రుల్లో సేవలు యథాతథంగా కొనసాగాయని, కేవలం 13 శాతం ఆసుపత్రుల్లోనే సేవలు ఆగినట్లు తెలిపింది. ఆరోగ్యశ్రీ కింద రెండు వారాలుగా సగటున రోజుకు 844 సర్జరీలు నమోదు కాగా, బుధవారం 799 సర్జరీలు నమోదైనట్లు వెల్లడించింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయిన జిల్లాల్లో రోగులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ దవాఖానాల్లో అధికారులు ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. అదే సమయంలో సేవలు నిలిపివేసిన ప్రైవేటు ఆసుపత్రులు కూడా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సేవలను కొనసాగించాలని ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఉదయ్‌కుమార్ మరోసారి విజ్ఞప్తి చేశారు.

100 శాతం నిలిచాయి: వద్దిరాజు రాకేశ్

బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాని కారణంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీతోపాటు ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలన్నింటినీ మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేసినట్లు టీఏఎన్‌హెచ్‌ఏ అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్ తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం స్పందించలేదని, తమను పరిగణనలోకి తీసుకోకుండా ప్రకటనలు విడుదల చేసిందన్నారు. ఈ నేపథ్యంలో తమ నిరసన కొనసాగుతుందని, ఆరోగ్య శ్రీ సేవలను కొనసాగించే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. సీఎం, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ సమావేశమై ఆరోగ్యశ్రీ విషయంలో వెనక్కు తగ్గేది లేదని తీర్మానించినట్లు పేర్కొన్నారు.

సమ్మె విరమించుకోండి

నిధుల అంశంపై చర్చిస్తున్నాం: దామోదర



అమీర్‌పేట (హైదరాబాద్): నిధుల అంశంపై చర్చలు జరుగుతున్నాయని.. ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగించాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడంపై స్పందించారు. 'మా ప్రభుత్వం వచ్చాకే ఆరోగ్యశ్రీకి నిధులు పెంచాం. మేం ఇచ్చిన స్వేచ్ఛను గౌరవించండి. గత ప్రభుత్వ హయాంలో నెలకు రూ.50 కోట్లు కూడా విడుదల చేయలేదు. మేం రూ.100 కోట్లు ఇవ్వడానికి కమిట్‌మెంట్ ఇచ్చాం. ప్రతి నెలా సుమారు రూ.90 కోట్ల వరకు ఇస్తూ వస్తున్నాము. నిధులు పెంచుతామని ఇటీవలే ప్రకటించాం. ఇకపై ప్రతినెలా రూ.100 కోట్ల చొప్పున 10 నెలలు ఇస్తే 80 శాతం చెల్లింపులు పూర్తవుతాయని భావించి రెండు రోజుల క్రితమే రూ.100 కోట్లు ఇచ్చాం'అని తెలిపారు. 'గత తొమ్మిదిన్నర ఏళ్లలో చేయని బంద్ ఇప్పుడెందుకు చేయాల్సి వస్తుంది. ప్రజలకు వైద్యం అందించేందుకు మనందరం కృషి చేయాలి. సమ్మె మంచిదికాదు..విరమించుకోవాలి' అని సూచించారు.

వారి నుంచి దేశభక్తి ఆశించడం వృథా

బీజేపీపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ విమర్శ



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. చిత్రంలో వీహెచ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'భారతీయ జనతా పార్టీ పుట్టిందే 1980లో. ఆ పార్టీకి నిజాం సంస్థానం భారతదేశంలో విలీనానికి, ఇందుకోసం జరిగిన పోరాటాలకు సంబంధం లేదు' అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఇప్పుడున్నది అప్పుడు పుట్టిన బీజేపీ కూడా కాదని, 2014లో పుట్టిన మోదీ–షా బీజేపీ అని, వీరికి చరిత్ర తెలియదని, చరిత్రను వక్రీకరించడం మాత్రం తెలుసునని ఎద్దేవా చేశారు. తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల సందర్భంగా బుధవారం గాంధీభవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విలీనం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన స్వామి రామానందతీర్థ, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావు వంటి మహనీయులు, నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీం, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ లాంటి కమ్యూనిస్టు యోధుల గురించి తెలుసుకోవడం తెలంగాణ వాసుల బాధ్యత అని అన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన ఆపరేషన్ పోలో కారణంగానే హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని గుర్తు చేశారు. గాంధీజీకి విలువ ఇవ్వని వారి నుంచి దేశభక్తిని ఆశించడం వృథా ప్రయాసేనని అన్నారు. బీజేపీ నేతల తీరుతో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆత్మ క్షోభిస్తోందని మహేశ్‌గౌడ్ విమర్శించారు. ఎమ్మెల్సీ కవితకు చరిత్ర తెలియదని, కవితకు, విలీన దినోత్సవానికి ఏ సంబంధం లేదని చెప్పారు.

దేశ ఐక్యతకు ప్రతీక 'హైదరాబాద్ లిబరేషన్ డే'

ప్రధాని నరేంద్ర మోదీ



సాక్షి, న్యూఢిల్లీ: భారత సైన్యం నిజాం నియంత పాలన నుంచి హైదరాబాద్ స్టేట్‌కు విముక్తి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సర్దార్ పటేల్ ధైర్య సాహసాలకు సెప్టెంబర్ 17 సైనిక చర్య నిదర్శనమని కొనియాడారు. ఈ ఘటనను తమ ప్రభుత్వం ఎంతో గొప్పగా 'హైదరాబాద్ విమోచన దినం'గా నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. బుధవారం మధ్యప్రదేశ్ పర్యటనలో భాగంగా ప్రధాని ధార్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. 'సెప్టెంబర్ 17.. ఒక చారిత్రక సందర్భం. ఇదే రోజు సర్దార్ పటేల్ హైదరాబాద్ స్టేట్‌కు విముక్తి కల్పించారు. సైన్యం ఇంత గొప్ప విజయాన్ని సాధించి దశాబ్దాలు గడచినా దానిని గుర్తుచేసేవారే లేరు. కానీ మేము దేశ ఐక్యతకు ప్రతీకగా ఈ రోజును 'హైదరాబాద్ లిబరేషన్ డే'గా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టాం. హైదరాబాద్‌లో.. లిబరేషన్ డేను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీతో 1.14 లక్షల మందికి ఉపాధి

- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



జాతీయ జెండాకు వందనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 2030 నాటికి రూ.1.98 లక్షల కోట్ల పెట్టుబడితో 20 వేల మెగావాట్ల పునర్వినియోగ శక్తిని ఉత్పత్తి చేస్తామని, దీని ద్వారా 1.14 లక్షల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఖమ్మంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల ద్వారా 2 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు చేపట్టామన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో రేషన్ కార్డుల పాత్ర కీలకమైందని, గత పదేళ్లుగా నిరుపేదలకు రేషన్ కార్డుల జారీలో నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ విషయాన్ని గమనించిన అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డు జారీ చేసి, ప్రతీ వ్యక్తికి ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

సీతారామతో కొత్త ఆయకట్టు..: సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో 1,38,790 ఎకరాల కొత్త ఆయకట్టును సాగులోకి తెస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. సీతారామ ఎత్తిపోతల పథకం లింకు కెనాల్ పనులకు రూ.107 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, మధిర మండలాల్లో నాగార్జునసాగర్ జోన్ – 3 రైతులకు సాగునీరు అందించేందుకు రూ.630 కోట్లతో జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశామని, పనుల వేగవంతానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఆవరణలో ప్రజాపాలన దినోత్సవం



అసెంబ్లీలోని గాంధీ విగ్రహం వద్ద ప్రసాద్‌కుమార్, గుత్తా, అద్దంకి తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా శాసనసభ ఆవరణలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు. శాసనమండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగారపు దయానంద్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో..



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్, సత్యవతి, మధుసూదనాచారి, సురేశ్‌రెడ్డి

జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ మంత్రులు పాల్గొన్నారు.

నవంబర్ 26 నుంచి 28 వరకు పౌల్ట్రీ ఎక్స్‌పో



సాక్షి, హైదరాబాద్: పౌల్ట్రీ ఇండియా 17వ ఎడిషన్ ఎక్స్‌పో నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు హైటెక్స్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎక్స్‌పోలో విదేశీ ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వివిధ దేశాల మంత్రులు పాల్గొననున్నట్టు చెప్పారు. కోళ్ల పెంపకంలో మెళకువలు, పౌల్ట్రీ రంగంలో కొత్త బ్రీడ్స్‌ను పరిచయం చేయడం, పౌల్ట్రీ అనుబంధ రంగాల వ్యాపారులు, రైతులతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఇదొక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. ప్రపంచ దేశాల్లో వస్తున్న అధునాతన విధానాలను పంచుకోవాల్సిన అవసరం ఉందని ఉదయ్‌సింగ్ అభిప్రాయపడ్డారు. గతేడాది 42 వేల మంది సందర్శకులు వచ్చారని, ఈ ఏడాది 50 వేలకుపైగా సందర్శకులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. హైదరాబాద్ వేదికగా 16 ఏళ్లుగా విజయవంతంగా ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని, దీనికి ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందిస్తున్నాయని ఆయన వెల్లడించారు. మార్కెట్‌లో కోళ్లకు స్టెరాయిడ్స్ ఇస్తున్నారని, ఇంకా ఎన్నో సందేహాలను నివృత్తి చేయడానికి హెల్ప్‌లైన్ నంబరు 7997994331 ఏర్పాటు చేశామన్నారు.

ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల భర్తీ

13 ఏళ్ల తర్వాత నియామకాలు

- వేయి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
- తెలంగాణ వచ్చాక ఆర్టీసీలో తొలి నియామకాలు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగ నియామకాలు జరగబోతున్నాయి. వేయి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆర్టీసీలో జరగబోతున్న తొలి నియామక ప్రక్రియ ఇదే కావటం విశేషం. చివరిసారిగా 2012లో డ్రైవర్, కండక్టర్లను నియమించారు. ఆ తర్వాత మళ్లీ నియామకాలు జరగలేదు. ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడినప్పటికీ, ఉన్న సిబ్బందితోనే ఆర్టీసీ నెట్టుకొస్తోంది. 2019లో ఒకేసారి ఏకంగా 2 వేల బస్సులను రద్దు చేయటం, పాత బస్సులను తుక్కుగా మార్చినప్పటికీ.. వాటి స్థానంలో చాలినన్ని కొత్త బస్సులు కొనకపోవటం తదితరాల వల్ల సమస్య తీవ్రత మరింత పెరగకుండా చూస్తూ వచ్చారు.

భారీగా పదవీ విరమణలు

సమీప భవిష్యత్తులో భారీగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో డబుల్ డ్యూటీలు పెరిగి ఇప్పటికే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇక మరింత భారం మోపితే పరిస్థితి అదుపు తప్పుతుందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీకి ఆర్టీసీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గతేడాదే ఇందుకు అనుమతి వచ్చినప్పటికీ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. గతంలో తనకు కావల్సిన సిబ్బందిని ఆర్టీసీనే సొంతంగా నియమించుకునేది. కానీ, ప్రభుత్వం దాన్ని మార్చి ప్రభుత్వ ఉద్యోగాల నియామక బోర్డులకు బాధ్యత అప్పగించింది. దీంతో డ్రైవర్లు, శ్రామిక్‌ల పోస్టుల భర్తీ ప్రక్రియ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు దక్కింది.



వారికే ఎక్కువ అవకాశం...

డ్రైవర్ల సంఖ్య భారీగా తగ్గిపోవటంతో ఇటీవల ఆర్టీసీ తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను నియమించుకుంది. దాదాపు 1,100 మంది డ్రైవర్లు తాత్కాలిక పద్ధతిలో గత నాలుగు నెలలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు పూర్తిస్థాయి నియామకాలకు నోటిఫికేషన్ రావటంతో వారు దరఖాస్తు చేయనున్నారు. నాలుగు నెలల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతున్న అనుభవం సంపాదించినందున వారికే ఎక్కువ అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. పదో తరగతి విద్యార్హత ఉండటంతో, ఆ అర్హత లేని వారికి మాత్రం అవకాశం ఉండదు.

వీరితోనే సరి...

వాస్తవానికి ఆర్టీసీలో ఉన్న డ్రైవర్ ఖాళీలు వేయికి మించి ఉన్నాయి. కానీ భవిష్యత్తులో భారీ సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోబోతున్నారు. ఇప్పటికీ నగరంలో 225 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతుండగా, మరో రెండు నెలల్లో ఇంకో 275 బస్సులు రాబోతున్నాయి. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద వచ్చే మార్చి నుంచి క్రమంగా 2,800 బస్సులు హైదరాబాద్‌కు రానున్నాయి. జిల్లాల్లో కూడా 500 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. అద్దె బస్సులకు వాటి యజమానులే డ్రైవర్లను సమకూర్చాల్సి ఉన్నందున, ఆర్టీసీకి డ్రైవర్ల అవసరం తగ్గుతుంది. దీంతో ఇప్పుడు తీసుకునే వేయి మందితోనే ఉన్న బస్సులను తిప్పనున్నారు. ఇక 1500 కండక్టర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని ఆర్టీసీ ప్రతిపాదించినప్పటికీ, నోటిఫికేషన్‌లో వాటి ఊసు లేదు. ఇటీవల 500 మంది తాత్కాలిక కండక్టర్లను ఆర్టీసీ నియమించుకుంది. తదుపరి విడత కండక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు. ఆర్టీసీలో ప్రస్తుతం మెకానిక్‌లకు కూడా కొరత ఉంది. ఉన్న శ్రామిక్‌లకు పదోన్నతి ఇవ్వటం ద్వారా మెకానిక్ పోస్టులను భర్తీ చేస్తారు. ఇప్పుడు 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినందున, వారు రాగానే ఉన్న శ్రామిక్‌లకు మెకానిక్‌లుగా పదోన్నతి ఇవ్వనున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని సౌకర్యాలు

- ఎర్రగడ్డ ఆస్పత్రిలో పాత భవనాల పరిస్థితిపై నివేదిక ఇవ్వండి
- సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలను మెరుగుపరచడంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ అనుబంధ ఆస్పత్రులలో వైద్య సేవల బలోపేతంపై ఎస్ఆర్ నగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ హెల్త్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉస్మానియా హాస్పిటల్, నిలోఫర్ చిన్నపిల్లల ఆస్పత్రి, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి, టీబీ అండ్ చెస్ట్ ఆస్పత్రి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్, సుల్తాన్ బజార్, పేట్లబుర్జు మెటర్నిటీ ఆస్పత్రులు, ఈఎన్టీ, ఫీవర్ ఆస్పత్రులు అనుబంధంగా ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ కలిసి హైదరాబాద్ నగరాన్ని హెల్త్ హబ్‌గా మార్చాయని అన్నారు. ఉస్మానియా అనుబంధ ఆస్పత్రులలో వైద్య సేవలు విస్తరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో పాత భవనాల పరిస్థితిపై రెండుమూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఈ సమీక్షలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ, డీఎంఈ డా.నరేంద్ర కుమార్, ఉస్మానియా అనుబంధ మెడికల్ కాలేజీల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సమూలంగా మార్చేద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీతో బుధవారం సచివాలయంలో సీఎం భేటీ అయ్యారు. విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించారు.

అన్ని స్థాయిల్లో ప్రక్షాళన

'విద్యా రంగం అభివృద్ధికి ఇప్పటివరకు జరిగిన కృషిపై ఏమాత్రం సంతృప్తి లేదు. ఈ రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ప్రభుత్వ స్కూళ్లల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయి. నర్సరీకి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడటం లేదు. విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఉంటుందని, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ ప్రక్షాళన అవసరం. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలి

'ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకోవాలి. విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలి. రాష్ట్రంలోని నిరుపేదలకు మేలు జరిగేలా కొత్త విద్యా విధానం ఉండేందుకు మేధావులు సలహాలివ్వాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల పేరిట విద్యార్థులను చిన్నతనం నుంచే వేరు చేస్తున్నాం. దానిని రూపుమాపి అంతా ఒకటే అనే భావన కలిగించాలి. విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలి. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలి..' అని సీఎం చెప్పారు.



విద్యా విధానం ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నిధులు ఎంతైనా వెనుకాడం

'ప్రభుత్వం కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు ఉండాలన్న లక్ష్యంతోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం. బదిలీలు, పదోన్నతులు కల్పించాం. యూనివర్సిటీలకు వీసీలను నియమించాం. దేశంలో ఐటీఐలు ప్రారంభించినప్పుడు ఉన్న డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మేము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను తెచ్చాం. సరికొత్త విద్యా విధానం ఏర్పాటుకు ఎంత నిధులైనా వెనుకాడబోం. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించాం. విద్యపై చేసే వ్యయాన్ని ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నాం. విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం..' అని రేవంత్ అన్నారు.

విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలి

'విద్యా విధానం కమిటీ చైర్మన్ కె.కేశవరావు మాట్లాడుతూ..విద్యాలయాల్లో విద్యార్థి కేంద్రంగా, నాణ్యతకు పెద్ద పీట వేసేలా బోధన ఉండాలన్నారు. ఏకీకృత బోధన విధానం వల్లే తెలంగాణ విద్యారంగంలో మార్పు సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ధనిక, పేద తారతమ్యం లేని, కులమతాల ప్రస్తావన లేని విద్యాలయాల ఏర్పాటు అవసరమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రతి తరగతికీ గది, ఉపాధ్యాయుడు ఉండాలని మరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సూచించారు. ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతాసిన్హా, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, సీఐఐ శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, అక్షర వనం మాధవరెడ్డి, ప్రొఫెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిన్నీ మాథ్యూ, రంజీవ్ ఆచార్య, తదితరులు నూతన విద్యా విధానంపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, దేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ మూడు సత్యాలను అందరికీ బోధించండి:
ఉదార హృదయం, దయగల మాట, కరుణతో కూడిన
జీవితం మానవాళిని పునరుద్ధరించే విషయాలు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
గురువారం, 18 సెప్టెంబర్ 2025

మళ్లీ అమెరికాతో నెయ్యం

ఇది స్పీడ్ యుగం. కరచాలనాలైనా, కలహాలైనా ఎంత త్వరగా మొదలవుతాయో అంత త్వరగానూ కనుమరుగవుతాయి. భారత్–అమెరికాల సంబంధాల తీరు గమనిస్తే ఇది అర్థమవుతుంది. నెల్లాళ్ల క్రితం దాదాపు ఛిద్రమయ్యాయనుకున్న ఈ సంబంధాల్లో మళ్లీ సుహృద్భావం మొగ్గ తొడుగుతోంది. ద్వైపాక్షిక ఒప్పందాన్ని సాధ్యమైనంత త్వరగా సాకారం చేసుకోవాలని మంగళవారం న్యూఢిల్లీలో అమెరికా వాణిజ్య దూత బ్రెండాన్ లించ్ నేతృత్వంలోని ప్రతినిధి వర్గంతో మన వాణిజ్య మంత్రిత్వ బృందం చర్చించాక అంగీకారం కుదిరింది. అంతేకాదు... ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా ట్రంప్ ఆయనకు ఫోన్‌చేసి శుభాకాంక్షలు చెప్పటం, దాన్ని ఎక్స్‌లో మోదీ ప్రస్తావించి రష్యా–ఉక్రెయిన్ ఘర్షణలకు శాంతియుత పరిష్కారం కోసం ట్రంప్ చొరవ తీసుకోవటాన్ని ప్రశంసించటం గమనించదగ్గవి. సరిగ్గా నెల్లాళ్ల క్రితం పరిస్థితి వేరు. రష్యా దురాక్రమణ యుద్ధం కొనసాగటానికి భారత్ వైఖరే ప్రధాన కారణమంటూ ట్రంప్ నిందించారు. అంత క్రితం ఆగస్టు మొదటి వారంలో విధించిన 25 శాతం సుంకాలతో పాటు రష్యా ముడిచమురు కొంటున్నందుకు ఆ నెల చివరిలో మరో 25 శాతం అదనంగా వడ్డించి దాన్ని 50 శాతానికి తీసుకెళ్లారు.

కేవలం భారత్‌పై విషం కక్కడం కోసం నియమితులైనట్టుగా వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మొదలుకొని వాణిజ్యమంత్రి హొవార్డ్ లుట్నిక్ వరకూ ఇష్టానుసారం మాట్లాడారు. వీరిలో నవారో మిగిలినవారికన్నా భిన్నం. ఆయన ఆశువుగా అబద్ధాలాడగలరు. ఆధారాలతోగానీ, ఇరు దేశాల చారిత్రక సంబంధ బాంధవ్యాలతో గానీ ఆయనకు పనిలేదు. ఫలానా కులానికి లబ్ధి చేకూర్చటం కోసం భారత ప్రభుత్వం కోట్లాది మంది ప్రజల ప్రయోజనాలను పణంగా పెడుతోందని వ్యాఖ్యానించగలరు. ఇరు దేశాల మధ్యా చర్చలు మొదలవుతున్న తరుణంలో కూడా భారత్‌ను 'ట్యారిఫ్‌ల మహారాజు' అనగలరు. తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించగలరు. మన దేశం ఎంతో సంయమనం పాటించబట్టే అయిదో రౌండ్ తర్వాత ఆగిపోయిన చర్చలు మళ్లీ ప్రారంభం కాబోతున్నాయి. మధ్యలో అనవసరంగా పేచీకి దిగి విపరీతాలకు పోయింది అమెరికాయే!

భారత్‌పై అదనపు సుంకాలు విధించటాన్ని సవాల్ చేస్తూ అమెరికా సుప్రీంకోర్టులో దాఖలైన కేసు విచారణలో భారత్ రష్యా చమురుకొనటాన్ని ట్రంప్ సర్కారు కారణంగా చూపింది. ఇప్పుడు సుంకాలను వెనక్కి తీసుకుంటే ఆ కేసు బలహీనపడుతుంది. ట్రంప్‌కు దౌత్యపరమైన మర్యాదలు తెలియవు. తన చర్యల వల్ల అవతలి దేశం స్థానికంగా ఎదుర్కొనక తప్పని ఒత్తిళ్లేమిటో అర్థం కావు. అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులపై విధించే సుంకాల్లో 95 శాతం కోత పెట్టడానికి మన ప్రభుత్వం అంగీకరించింది. కానీ 43 శాతం మంది గ్రామీణ ప్రజానీకానికి ఉపాధి కల్పిస్తున్న సాగు రంగాన్ని పణంగా పెట్టడానికీ, చిన్న వ్యాపారుల, పాడిపరిశ్రమ రంగ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలకూ తాము వ్యతిరేకమని మన ప్రభుత్వం కుండబద్దలు కొడుతోంది. జన్యుపరంగా మార్పిడి చేసిన మొక్కజొన్న మాకొద్దని చెబుతోంది. ఈ విషయంలో భారత్ మనోభావాలను అర్థం చేసుకోకుండా ఒక ధూర్త వ్యాపారిలా ట్రంప్ ప్రవర్తించారు. ఇప్పుడు తామే వెనక్కి తగ్గక స్థితిని సృష్టించుకున్నారు.

తమ దయా దాక్షిణ్యాలపై ఆధారపడే దక్షిణ కొరియా, జపాన్‌లు సాగిలపడటాన్ని చూసి అందరిపైనా ఆ వ్యూహమే పనికొస్తుందని ట్రంప్ భావించటమే ఇందుకు కారణం. పెహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌తో చెట్టపట్టాలేసుకున్నారు. ఆ దేశ ఆర్మీ చీఫ్‌ను నెత్తిన పెట్టుకున్నారు. ఈ పరిణామాలతో భారత్ బెంబేలు పడుతుందని భావించారు. కానీ షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో) సమావేశానికి మోదీ చైనా వెళ్లటం, అక్కడి పరిణామాలూ గమనించాక జరగబోయేదేమిటో ఆలస్యంగానైనా గ్రహించక తప్పలేదు. భారత్‌కు తాను తప్ప దిక్కులేదనుకోవటం ఘోర తప్పిదమని గ్రహించారు. పర్యవసానంగానే ఇప్పుడు మళ్లీ పరిస్థితులు మారుతున్నట్టు కనిపిస్తున్నాయి. ఈ ప్రపంచంలో వ్యాపారం తప్ప మరేం లేదన్న వైఖరిని ట్రంప్ విడనాడితేనే ప్రపంచంతో ఆయనకు సామరస్యం కుదురుతుంది. అలా కానట్టయితే నష్టపోయేది అమెరికాయే!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.12.18 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పుష్యమి ఉ.9.02 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** రా.9.45 నుండి 11.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.42 వరకు తదుపరి ప.2.45 నుండి 3.33 వరకు, **అమృత ఘడియలు:** ఉ.9.54 నుండి 10.41 వరకు.

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.59
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

పునరుద్ధరణ



మీరు న్యాయశాస్త్రంలో ఎంతగా ప్రావీణ్యం సంపాదించారన్నది కాదు. మీ ప్రావీణ్యంతో మీరు ఎంతగా న్యాయశాస్త్రాన్ని పునరుద్ధరించగలరన్నది ప్రశ్న. 'లా'ను వృత్తిగా కాక, సామాజిక మార్పునకు ఒక చోదక శక్తిగా చేయడానికి మీరు సిద్ధంగా ఉన్నారా?
– జస్టిస్ సూర్యకాంత్, సీజేఐ కానున్న న్యాయమూర్తి

సలహాలు



కెరియర్ ప్రారంభానికి ముందు నుండే 'అది చెయ్యి', 'ఇది చెయ్యి' అని మనకు అనేక మంది నుంచి సలహాలు వస్తుంటాయి. విషయం ఏంటంటే, చివరికి అవేవీ తీసుకోము. మన మనసు దేని మీద ఉంటుందో దాని వైపే మళ్లుతాం. అదే మనల్ని నిలబెట్టేది కూడా!
– నోరా ఫతేహీ, బాలీవుడ్ నటి

కొత్త చాప్టర్



రోజుకొక కొత్త ఛాప్టర్ మన జీవితం! అది పాఠ్యపుస్తకంలా ముందెవరో మన కోసం రాసిపెట్టింది కాదు. ఏ రోజు కారోజు మనమే మన జీవిత పుస్తకానికి ఒక ఛాప్టర్ అవ్వాలి. ఈరోజు మీ ఛాప్టర్‌లో ధైర్యం, దయ, కరుణలను ముఖ్యాంశాలను కానివ్వండి.
– అమృతా ఫడ్నవీస్, సామాజిక కార్యకర్త

స్ఫూర్తి



చరిత్ర సృష్టించటం అంటే, చరిత్రలో ఒక భాగం అవటం! ఎంతోమందిని స్ఫూర్తిగా తీసుకుంటే నాకు ఈ గౌరవం దక్కింది. గౌరవాన్ని నిలుపుకోవడం ఇకపై నా బాధ్యత.
– అనుపర్ణ రాయ్, 'సాంగ్స్ ఆఫ్ అన్‌ఫర్గాటెన్ ట్రీస్' దర్శకురాలు

మా ఇల్లు



అరుణాచల్‌లోని సియాంగ్‌పై ఆనకట్టను నిర్మిస్తే మా భూమి మునిగిపోతుంది. మొత్తం మా పూర్వీకుల భూమి, మా సంస్కృతి, మా మూలాలు మునిగి పోతాయి. ఇది మాకు అస్తిత్వ సంక్షోభం. మమ్మల్ని మేము కాపాడుకోవాలంటే మా ఇంటిని మేమే కదా కాపాడుకోవాలి!
– భానూ తటాక్, యాక్టివిస్ట్


ఖాయంగా!



నేను కలిసిన వివిధ రంగాలలోని అనేకమంది విజేతలు అత్యంత ప్రతిభావంతులో లేదా అదృష్టవంతులో కాకపోయి ఉండొచ్చు, కానీ వారు తమ లక్ష్యానికి కట్టుబడి, అవిశ్రాంతంగా కష్టపడుతూ ముందుకు సాగే వ్యక్తులు అని ఖాయంగా చెప్పగలను.
– ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగర్, నటుడు–కాలిఫోర్నియా మాజీ గవర్నర్

వార్తలు రాయడమే నేరమా?

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసింది!' కోట్లాది హిందువుల మనోభావాలను గాయపరుస్తూ ఏపీ ముఖ్యమంత్రి అయిన కొద్ది కాలానికే చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణ ఇది. ఆ వెంటనే దానిని అందుకుని సనాతని వేషం కట్టారు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.

'ప్రకాశం బ్యారేజీని బోట్లతో ధ్వంసం చేయడానికి యత్నించారు'... ఇది కృష్ణానదికి వరదలు వచ్చిన సమయంలో బ్యారేజీ వద్దకు కొట్టుకు వచ్చిన బోట్ల గురించి చంద్రబాబు చేసిన మరో విమర్శ. ఇలా అనేక అభియోగా లను చంద్రబాబు అధికారంలోకి వచ్చాక చేశారు. వాటన్నిటిలో అత్యధిక భాగం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆపాదించి చేశారు.

అలాగైతే ఎన్ని కేసులు పెట్టొచ్చు?

అధికారంలోకి వచ్చాకే కాదు, అంతకు ముందు విపక్షంలో ఉన్నప్పుడు కూడా ఈ నేతలు జగన్‌పై పలు తీవ్రమైన అభియోగాలు గుప్పించారు. 'జగన్ ఏపీలో ప్రజల భూములన్నీ కొట్టేయడానికి యత్నిస్తున్నారు; జగన్ పద్నాలుగు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు' అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఇక పవన్ కల్యాణ్ అయితే 30 వేల మంది అమ్మాయిలు ఏపీలో తప్పిపోయారంటూ వలంటీర్లపై నిందలు వేశారు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రామాణికంగా తీసుకుంటే అప్పట్లో వారిపై ఎన్ని కేసులు పెట్టి ఉండవచ్చో! అలాంటి అబద్ధపు ఆరోపణలను ప్రచారం చేసిన ఎల్లో మీడియాపై ఎన్ని కేసులు పెట్టాలో! కానీ జగన్ టైమ్‌లో అలా చేయలేదు. వాటిని రాజకీయంగానే చూసి వదలివేశారు. ఇటీవలి కాలంలో ఏపీని పోలీసు రాజ్యంగా మార్చి, విపక్ష వైసీపీ వారిపైనే కాకుండా, తనకు గిట్టని 'సాక్షి' మీడియాపైనా చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి, వేధింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ సంగతులు గుర్తు చేయవలసి వచ్చింది.

కేసులతో కొత్త రికార్డులు

రాజకీయ నేతల ప్రెస్ కాన్ఫరెన్స్‌ల ఆధారంగా మీడియాపై కేసులు పెడుతూ చంద్రబాబు ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇటీవల వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ అమరావతి వరద ముంపు గురించి మీడియాకు ఒక విషయం చెప్పారు. ఆ వరద నీటి మళ్లింపు వల్ల గుంటూరు చానల్‌కు గండి పడిందనీ, తత్ఫలితంగా పొన్నూరు ప్రాంతంలో సుమారు 70 వేల ఎకరాల పంట పొలాలు మునిగాయనీ ఆరోపించారు. ఆయన చెప్పిన విషయాలను 'సాక్షి' ప్రచురించింది. సాధారణంగా ప్రభుత్వ పక్షాన ఎవరైనా ఏమి చేయాలి? అది వాస్తవమా, కాదా? అన్నదానిని పరిశీలించి మీడియాకు వివరణ ఇచ్చి, వార్తను ప్రజలకు తెలియచేయాలని కోరవచ్చు. అలాకాకుండా సంబంధిత అధికారి ఒకరితో 'సాక్షి'పై ఏకంగా కేసు పెట్టించారు. తాడేపల్లి పోలీసులు 'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనంజయ రెడ్డికి నోటీసు ఇచ్చి తమ ముందు విచారణకు హాజరు కావాలని కోరారు. విశేషం ఏమిటంటే, ఇదే సమయంలో టీడీపీ మీడియా ఒక కథనాన్ని ఇస్తూ, అమరావతిలో వరద ముప్పు నివారణ కోసం ప్రభుత్వం ఆరు వేల కోట్లతో మరో రెండు ప్రాజెక్టులను చేపడుతోందని తెలిపింది.



◆ ఇదంతా రెడ్ బుక్ ఎఫెక్ట్ అనీ, ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికీ, ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికీ ఇలాంటి అసంబద్ధ చర్యలకు దిగుతోందని తెలుస్తోంది. 'సాక్షి' గొంతు నొక్కివేస్తే తమను ప్రశ్నించే వారు ఉండరని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారేమో!

కేసులు అక్రమమని తెలిసినా, పోలీసులు ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు లొంగక తప్పడం లేదు. ఆ మాట కొందరు పోలీసు అధికారులు జర్నలిస్టులకు వ్యక్తిగతంగా చెబుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇదంతా రెడ్ బుక్ ఎఫెక్ట్ అనీ, ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికీ, ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికీ ఇలాంటి అసంబద్ధ చర్యలకు దిగుతోందని తెలుస్తోంది. 'సాక్షి' గొంతు నొక్కివేస్తే తమను ప్రశ్నించేవారు ఉండరని పెద్దలు భావిస్తున్నారేమో తెలియదు.

మరో వార్త చూడండి. అవినీతి కారణంగానే పోలీసు అధికారుల ప్రమోషన్లను జాప్యం చేస్తున్నారని 'సాక్షి' స్టోరీ ఇచ్చింది. దానికి పోలీస్ పెద్దలకు కోపం వచ్చిందట. అది నిజం కాకపోతే వారు ఖండించవచ్చు. కానీ, పోలీసు ఉద్యోగుల సంఘం నేతతో కేసు పెట్టించేశారు. గతంలో ఈ తరహా వార్తలు మీడియాలో వస్తే సదరు సంఘం నేతలు వివరణ ఇచ్చేవారు. పాపం... ఇప్పుడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు కానీ, మరికొందరు టీడీపీ నేతలు, జనసేన క్యాడర్‌గానీ కొంతమంది పోలీసుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినా ఈ సంఘం నేతలు నోరు మెదపలేకపోతున్నారు. కానీ 'సాక్షి' మీద సంఘం అధ్యక్షుడు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడం, అర్ధరాత్రి వేళ 'సాక్షి' ఆఫీస్‌కు పోలీసులు వచ్చి హడావిడి చేయడం జరిగింది. ఈ కేసులో కూడా విచారణకు నోటీసులు ఇచ్చారు. ఆ విచారణకు ఎడిటర్ ధనంజయ రెడ్డితో పాటు సీనియర్ పాత్రికేయులు హాజరయ్యారు. ఆ సందర్భంలో ఏ పోలీసు అధికారులు ఆ సమాచారం ఇచ్చారో చెప్పాలని కోరారట! జర్నలిజం సూత్రాల ప్రకారం సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ రహస్యంగా ఉంచాలి. అయినా ఆ వివరాలు కోరారు. ఆ పోలీసు అధికారులకు కూడా తమ శాఖలో జరుగుతున్న పరిణామాలు తెలిసే ఉండాలి. ఏ అధికారులు ప్రమోషన్లు పొందలేక పోయారో, దానికి కారణాలు ఏమిటో వారికి తెలిసి ఉండాలి. కానీ పై స్థాయి నుంచి ఒత్తిడి వచ్చింది కాబట్టి వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని అర్థం అవుతుంది.

ద్వంద్వ ప్రమాణాలు

ఇంకో ఉదంతం చూద్దాం. రాయలసీమకు చెందిన ఒక పోలీసు అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై 'సాక్షి' ఒక వార్తను ఇచ్చింది. ఆ అధికారి పేరు రాయలేదు. తమకు వచ్చిన సమాచారంలో నిజం ఉందని నమ్మితే, కొన్ని జాగ్రత్తలు తీసుకుని కథనాలు ఇస్తుంటారు. ఈ స్టోరీపై సీనియర్ అధికారికి ఆగ్రహం వచ్చింది. వేరే అధికారిని పిలిచి కేసు పెట్టించారు. ఆ అధికారి తను ఏ తప్పు చేయకపోతే, ఆ కథనం తనను ఉద్దేశించి రాశారన్న అభిప్రాయం కలిగితే ధైర్యంగా మీడియా సమావేశం పెట్టి తన వాదనను వినిపించి ఉండవచ్చు. తన పరువుకు భంగం కలిగించారని నోటీసు ఇచ్చి ఉండవచ్చు. అలా చేయకుండా మరొకరితో కేసు పెట్టించడంలోనే డొల్లతనం ఉందనిపిస్తుంది.

ఏపీ పోలీసుల ప్రవర్తనకు పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక జరిగిన వైనమే పెద్ద శాంపుల్. తమ ఓట్లు తమను వేయనివ్వాలని కొందరు ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకున్నారంటే అది పోలీస్ వ్యవస్థకు ఎంత అప్రతిష్ఠో ఊహించుకోవచ్చు. కోర్టులలో బెయిల్ రాకుండా ఉండటం కోసం సంబంధం ఉన్నా, లేకపోయినా తోచిన సెక్షన్లు పెట్టి రిమాండ్ ఉత్తర్వులు వచ్చేలా చేయడంలో ఏపీ పోలీసులు స్పెషలైజేషన్ సంపాదించారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ వారిపై వీలైనన్ని కేసులు పెట్టడం... అదే టీడీపీ, జనసేన కార్యకర్తలు తమ సమక్షంలోనే గూండాయిజానికి పాల్పడినా నిస్సహాయంగా ఉండిపోవడం సమాజానికే ప్రమాదకరమని చెప్పక తప్పదు.

రెండు రోజుల క్రితం మచిలీపట్నంలో జనసేన కార్యకర్తలు చేసిన గూండాయిజం తెలిసిందే! 'సాక్షి' టీవీ చర్చలో అభ్యంతర పదం వాడారని అంటూ కూటమి నేతలే కొంతమందిని పురిగొల్పి కృత్రిమ ఆందోళనలు చేయించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, పోలీసు వ్యవస్థ ధర్మంగా, నిష్పక్షపాతంగా లేకపోతే అది సమాజానికి హానికరం. పోలీసులకు ప్రామాణికం రెడ్ బుక్ కాదనీ, రాజ్యాంగమనీ ఎప్పటికి గుర్తిస్తారో!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఈ వేలంవెర్రికి తెర పడదా?

సింపుల్‌గా....

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సన్నిహితుడూ, కరడు గట్టిన జాతీయవాదీ అయిన చార్లీ కిర్క్ హత్యోదంతంతో ప్రపంచం ఉలిక్కిపడింది. అమెరికాలో యూటా వ్యాలీ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతుండగా, ఈ నెల 10న ఓ ముష్కరుడు జరిపిన ఆ కాల్పులతో అమెరికాలోని తుపాకీల సంస్కృతిపై మరోమారు చర్చ రేగింది. అలనాటి అబ్రహామ్ లింకన్ నుంచి నేటి కిర్క్ దాకా అనేక హత్యా ఘటనలు, స్కూళ్లలో కాల్పులు, రాజకీయ ప్రేరేపిత దాడులు జరుగుతూనే ఉన్నాయి. తుపాకీలపై వ్యామోహం, వినియోగాన్ని నియంత్రిస్తూ కట్టుదిట్టమైన చట్టం తీసుకువచ్చేందుకు గతంలో పలు అమెరికన్ ప్రభుత్వాలు ప్రయత్నించినా అడ్డంకులు ఎదురయ్యాయి.

ఇప్పుడేం జరిగింది?

అమెరికాలో తుపాకీల పిచ్చి ఎంతంటే... ఆ దేశ జనాభా కన్నా తుపాకీల సంఖ్యే ఎక్కువ. ప్రపంచ జనాభాలో అక్కడున్నది 5 శాతం కన్నా తక్కువే. కానీ, భూమిపై సామాన్యుల దగ్గరున్న గన్స్‌లో 45 శాతం పైగా అక్కడే ఉన్నాయి. తుపాకీ లైసెన్సును దేవుడిచ్చిన హక్కుగా సంబోధిస్తూ, ఆ సంస్కృతిని సమర్థిస్తూ వచ్చిన 31 ఏళ్ళ వీర జాతీయవాది చార్లీ కిర్క్. ఆయన తన 18వ ఏటనే టర్నింగ్ పాయింట్ అనే సంస్థను నెలకొల్పి, తన ప్రసంగాలతో ఆకర్షిస్తూ వచ్చారు. ఉదారవాద అమెరికన్ కాలేజీల్లో జాతీయవాద ఆదర్శాలను విస్తరింపజేసేందుకు ప్రయత్నించారు. గన్స్ నియంత్రణను వ్యతిరేకించిన ఆయన చివరకు ఓ స్నైపర్ దూరం నుంచి గురిచూసి కాల్చిన తూటా మెడకు తగిలి, ప్రాణాలు కోల్పోయారు.

నేపథ్యం ఏమిటి?

అమెరికా రాజ్యాంగ రెండో సవరణ ప్రకారం గన్స్ హక్కు పౌరులకుంది. అదే ఆ దేశ సంస్కృతినీ తీర్చిదిద్దింది. సాక్షాత్తూ నలుగురు దేశాధ్యక్షుల నుంచి సామాన్యుల దాకా ఎందరో బలయ్యారు. అమెరికన్ రాజకీయాలనూ, నిత్యజీవితాన్నీ ప్రభావితం చేసిన



ఈ తుపాకీల సంస్కృతి నియంత్రణకు సంబంధించి ఏళ్ళుగా చర్చ సాగుతూనే ఉంది. అయితే, ఈ అంశం కేవలం విధానపరమైనదే కాదు. రాజ్యాంగంలోని వివిధ అంశాల వ్యాఖ్యానం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వ్యక్తిగత భద్రతలతోనూ ముడిపడిన విషయం. నియంత్రణ సమర్థకులు, వ్యతిరేకులుగా అమెరికన్ సమాజం నిట్టనిలువునా చీలిపోయింది. కిర్క్ హత్యా ఘటన చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

గత చరిత్ర

అమెరికాలో మొదట వేట, స్వీయ రక్షణ కోసం గన్స్ వచ్చాయి. 1791లో తెచ్చిన 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఆయుధాలను కలిగివుండే రాజ్యాంగ రెండో సవరణ కూడా చోటుచేసుకుంది. క్రమంగా తుపాకీలను స్వేచ్ఛకు ప్రతీక అనుకోవడం మొదలైంది. అయితే, గన్స్ వినియోగం దోవ తప్పి నేరాలకు దారితీసింది. 1934లో ప్రధానమైన తొలి ఫెడరల్ ఆయుధ చట్టం తెచ్చారు. దశాబ్దాల అనంతరం జాన్ ఎఫ్ కెనడీ, రాబర్ట్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌ల హత్యల తర్వాత అమెరికన్ కాంగ్రెస్ తుపాకీ నియంత్రణ చట్టం 1968 చేసింది. అయినా దుర్వినియోగం ఆగలేదు. తర్వాతా సంస్కరణలు తేవాలని పలువురు అమెరికన్ అధ్యక్షులు యత్నించి, విఫలమయ్యారు. ఒబామా అలాంటి చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని 17 సార్లు ప్రయత్నించారు.

వర్తమానం... భవిష్యత్తు...


అమెరికాలో ప్రతి 10 మందిలో నలుగురి ఇంటి వద్ద తుపాకీలు ఉన్నాయట. యుద్ధ పీడిత యెమెన్‌తో పోలిస్తే ఇక్కడే రెట్టింపు కన్నా ఎక్కువగా తలసరి 1.2 గన్నులున్నాయి. సగటున రోజూ 128 గన్ డెత్స్ సంభవిస్తున్నాయి. అంటే, సగటున ప్రతి 11 నిమిషాలకూ ఒకరు ప్రాణాలు వదులుతున్నారు.

ఇంత జరుగుతున్నా గన్ రైట్స్‌పై అమెరికా ఒక్కతాటి మీద లేదు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ లాంటి బలమైన లాబీలూ దీని వెనుక పనిచేస్తున్నాయి. మునుపు 1980, 90లలో ఆస్ట్రేలియాలో ఇలానే తుపాకీలు రాజ్యమేలుతుంటే, కఠినమైన నియంత్రణతో అదుపు చేశారు. అమెరికాలోనేమో అలాంటిది కనుచూపు మేరలో కనిపించడం లేదు.

గయ మహిమ

'త్రిమూర్తుల్లో భేదం లేదు, ముగ్గురూ ఒకటే' అనటానికి గయ క్షేత్రం నిదర్శనం. చనిపోయిన ఆత్మీయ బంధు మిత్రుల పేర ఈ చోట కర్మకాండలా చరిస్తే మరణించిన వారికి ఉత్తమ గతులు కల్గుతాయి. ఈ కర్మనే 'గయా శ్రాద్ధ' మంటారు. మన ఇంటిలో పితృకార్యం జరిగినప్పుడు కూడా 'గయా శ్రాద్ధ ఫలితమస్తు' అని మంత్రం చదువుతారు. పిండ ప్రదానం చేస్తూ 'గయా పిండ సదృశా భవంతు' అని అంటారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మన దేశంలో గయ, కాశీ, ప్రయాగ... ఈ మూడు ఈ విషయంలో అత్యంత ముఖ్యమైన క్షేత్రాలు, తీర్థాలున్నూ! వీటినే క్షేత్ర త్రయమంటారు. ఈ గయా క్షేత్రానికి పెద్ద చరిత్ర ఉంది. వేల సంవత్సరాలకు పూర్వం గయుడనే రాక్షసుడుండేవాడు. విష్ణువును గురించి ఘోరంగా తపస్సు చేసి, వందల మైళ్ళ దీర్ఘమైన భారీ శరీరం కావాలని వరం కోరుకున్నాడు. క్షణంలో అంత పెద్ద భయంకర శరీరం గయునికి వచ్చింది.

గర్వం నెత్తికెక్కినప్పుడు ఎవరికైనా తిక్క మాటలు వస్తాయి. ఏకంగా బ్రహ్మదేవుడినే ఉద్దేశించి, 'నీకేమైనా వరం కావాలంటే కోరుకో' అన్నాడు. ఎంత కండకావరమో చూడండి! 'అయితే గయుడా! ఈ శరీర భాగాల్లో ఒక చోట నాకు యజ్ఞం చేయాలని ఉంది' అంటాడు బ్రహ్మ. 'అలాగే యజ్ఞం చేయి కానీ, ఒక షరతు! అప్పుడు నా శరీరం కదలటానికి వీలులేనంత బరువు నాపై పెట్టాలి' అన్నాడు.

బ్రహ్మ ముందు శివ పార్వతులను ప్రార్థించాడు. 'శివ శిల' అనే పెద్ద రాయిని గయుడి మీద పెట్టారు. వెంటనే రాక్షసుని రొమ్ము మీద నిలబడ్డాడు విష్ణువు. ఎంత గింజుకున్నా గయుడింక కదలలేదు. బ్రహ్మ సంకల్పం కదా! శివుని శిల, విష్ణు పాదం... ఈ ముగ్గురి స్పర్శాదుల వల్ల వాడిలో మార్పు వచ్చింది. 'త్రిమూర్తులు నా వల్ల జగత్తుకు ఏ మాత్రం బాధ కలగకూడదని సంకల్పించి యుక్తిగా నా లోని చెడును ఈ విధంగా తొక్కిపెట్టారు' అని తప్పు తెలుసుకున్నాడు. 'నా చివరి కోరిక ఒక్కటే. ఈ ప్రాంతానికి నా పేరు పెట్టాలి. నా మీద పడిన పవిత్ర పాదముద్రలకు అభిషేకం చేసినా, పితృశ్రాద్ధం చేసినా, నివేదనం పెట్టినా భక్తులను అనుగ్రహించాలి' అని ప్రార్థించాడు.

తమాషా ఏమిటంటే ఇంతవరకూ బ్రహ్మ గయుని దేహం మీద యజ్ఞం చేయలేదు. గయుని పైకి లెమ్మని కూడా అనలేదు. గయుని శరీరమే గయా క్షేత్రంగా ఉండిపోయింది. త్రిమూర్తుల సమష్టి కృషి ఫలితంగా లోక కల్యాణం కలుగుతున్నది.

డేటా పాయింట్

ట్యూషన్ భారం



కేంద్ర ప్రభుత్వం విద్యపై నిర్వహించిన కాంప్రహెన్సివ్ మాడ్యులర్ సర్వే – 2025 (ఏప్రిల్ – జూన్) ప్రకారం... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ట్యూషన్ల కోసం దేశంలో సగటున చేస్తున్న వ్యయం రూ. 2,409.

తరగతి	వ్యయం (రూ.)	మొత్తం విద్యపై చేసే వ్యయంలో శాతం
1-5	1,313	12.3
6-9	2,189	17.6
9-10	4,183	28.3
11-12	6,384	31.7
దేశ సగటు	2,409	19.1

జన విస్ఫోటనం

ఇన్ బాక్స్

ఉపఖండం మొలతాడుకు వేలాడుతున్న
బాంబుల విస్ఫోటనం నలు దిశలా!
భాష, మతం, సమాజం వేరు వేరు.
పేలుతున్న కోరిక ఒకటే!
అవినీతిపై తిరుగుబాటే!

ఇంటిల్లిపాదీ పాలకులే!
అయినవారికి అధికార పందేరాలే!
యౌవరాజ్య పట్టాభిషేకాలు
అచ్చం రాచరికంలా!

నిరుద్యోగ వెకిలినవ్వు, కట్టెదుట శూన్య భవిష్యత్తు!
మండే మిరపకళ్ళ యువజన విస్ఫోటనం!
అసలు సిసలు పీపుల్స్ వార్ లాంగ్ మార్చ్ చేస్తోంది.
మోసగాళ్ళ గుండెల్లో డైనమైట్లు పేలుస్తోంది.



మొన్న లంక, నిన్న బంగాళ.
నేడు మండుతున్న మంచుకొండ.
మూడువక్కలా అంటుకొన్న అగ్గి
ఊరి మధ్యన అడుగిడటం ఎంతసేపు?

హెలికాప్టర్లకు వేలాడే డోలీలకూ,
వీసాలకూ డిమాండ్ హెచ్చింది.
జన సమూహాల ఎదుట ఆశారేఖ విచ్చింది.

– గార రంగనాథం । 98857 58123

నియంతలా సీఎం రేవంత్

- రాష్ట్రంలోని అన్నివర్గాలను ప్రభుత్వం వేధిస్తోంది
- సీఎం వేధింపుల వల్లే మెట్రో నుంచి ఎల్‌అండ్‌టీ నిష్క్రమణ
- త్వరలో ఎమ్మార్ ఆస్తులను అమ్మే ప్రయత్నాల్లో సీఎం
- జైపాల్ రెడ్డి కుటుంబ భూముల కోసమే ఫోర్త్ సిటీకి రోడ్డు
- రేవంత్ రెడ్డి ముమ్మాటికీ బీజేపీ మనిషే, ఎంపీలను అమ్మేశారు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ


కాళేశ్వరం దాక్యుమెంటరీని విడుదల చేస్తున్న కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలపై నిరంకుశత్వాన్ని చూపుతోందని మండిపడ్డారు. గ్రూప్ 1 అభ్యర్థులు, విద్యార్థులు కనీసం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించుకునే పరిస్థితి కూడా లేదని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 'సీఎం రేవంత్ బెదిరింపులు, ముడుపుల కోసం వేధింపులు తట్టుకోలేక హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ సంస్థ వైదొలుగుతోంది. గతంలో ఎల్‌అండ్‌టీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌ను జైల్లో పెడతానని బెదిరించారు. గతంలో వివాదాస్పదమైన ఎమ్మార్ సంస్థ ఆస్తులను కూడా కమీషన్ల కోసం రేవంత్‌రెడ్డి త్వరలో అమ్మబోతున్నారు. పలు కంపెనీలపై గతంలో ఉన్న కేసులను అడ్డుపెట్టుకుని రేవంత్‌రెడ్డి సెటిల్‌మెంట్లు చేసుకోవడంతోపాటు కంపెనీల నుంచి ముడుపులు తీసుకుంటున్నారు'అని కేటీఆర్ ఆరోపించారు.

జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యుల కోసమే..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) అలైన్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిన మార్చుతుండటంతో వేలాది మంది రైతులు భూములు కోల్పోతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఫోర్త్ సిటీ దగ్గర ఉన్న తమ భూముల కోసం అలైన్‌మెంట్, ట్రిపుల్ ఆర్ స్వరూపాన్ని మార్చేశారని ఆరోపించారు. 'ట్రిపుల్ ఆర్‌కు, ఫోర్త్ సిటీకి మధ్యలో వేస్తున్న రోడ్డు కేవలం రేవంత్ రెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యుల భూముల కోసమే. ఈ రోడ్డు వెంబడి అనేక మంది నుంచి భూములు కొనుగోలు చేసి ఇప్పటికే రేవంత్ కుటుంబం ఒప్పందాలు చేసుకుంది. ఆయన హైదరాబాద్‌లోని భూములన్నింటినీ అమ్ముతున్నారు. రాష్ట్రంలో రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ దొరికినా సీఎం, ఈగల్ టీమ్‌కు సమాచారం లేదు. హైడ్రా మంచి ఫలితాలు ఇస్తే వర్షం వచ్చినప్పుడు హైదరాబాద్ నగరం ఎందుకు మునిగిపోతోంది'అని కేటీఆర్ ప్రశ్నించారు.

ఎంపీలను అమ్మేసిన రేవంత్..: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎంపీలను రేవంత్‌రెడ్డి గొర్రెల్లా అమ్మేశారని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ముమ్మాటికీ బీజేపీ మనిషే అని అన్నారు. 'రాష్ట్రంలో అద్భుత పాలన ఉంటే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి వెంటనే ఉప ఎన్నికలు పెట్టాలి. కనీసం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేనంత బలహీనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్ మాట మార్చి రాహుల్ గాంధీకి ప్రధాన మంత్రి పదవితో ముడిపెడుతున్నాడు. తీన్మార్ మల్లన్నతో సహా ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టుకునే హక్కు ఉంది. గ్రూప్ 1 ఉద్యోగాలు రూ.3 కోట్ల చొప్పున అమ్ముకున్నారని అభ్యర్థులే చెప్తున్నారు. గ్రూప్ 1 పరీక్షలో అవినీతిపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉంది? యువతతో పెట్టుకుంటున్న రేవంత్ రెడ్డికి పతనం తప్పదు'అని కేటీఆర్ హెచ్చరించారు.

కాళేశ్వరంపై బీజేపీ, కాంగ్రెస్ రాజకీయం

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ కలిసికట్టుగా చిల్లర రాజకీయం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్‌ఎస్ నేత ఏనుగు రాకేశ్‌రెడ్డి రూపొందించిన కాళేశ్వరం డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో బుధవారం కేటీఆర్ విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోతే హైదరాబాద్‌కు గోదావరి జలాల తరలింపు ఎలా సాధ్యమని అసెంబ్లీలో ప్రశ్నిస్తే సర్కారు వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న వికారాబాద్ జిల్లా రైతులు బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. వారికి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

బీసీలకు రాజ్యాధికారమే 'టీఆర్‌పీ' లక్ష్యం

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పాటు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న తీన్మార్ మల్లన్న తదితరులు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, అధికారం దక్కించుకోవడం కోసం 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'(టీఆర్‌పీ)ని స్థాపిస్తున్నట్లు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. ఇప్పటివరకున్న రాజకీయ పార్టీలన్నీ అగ్రవర్ణాల ఆధిపత్యంతోనే కొనసాగుతున్నాయని ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీసీలకు ప్రత్యేక రాజకీయ పార్టీ ఆవశ్యకత ఉందని అన్నారు. దేశంలో తెలంగాణ విలీనమైన రోజును పురస్కరించుకుని బుధవారం హోటల్ తాజ్‌కృష్ణాలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలంగాణ రాజ్యాధికార పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా టీఆర్‌పీ ముందుకు వెళ్తుందన్నారు. బీసీల్లోని ఎన్నో కులాలు ఇప్పటి వరకు చట్టసభల ముఖం చూడలేదని, అలాంటి కులాలకు అవకాశం దక్కాలని చట్టసభల్లోనే ప్రస్తావించానని, కానీ బీసీ వాదాన్ని వదిలేస్తే ఎలాంటి సహకారం అయినా అందిస్తామంటూ తనకు ఇతర పార్టీలు ప్రలోభాలకు గురిచేశాయని ఆయన చెప్పారు. కానీ వాటన్నింటినీ తిరస్కరించి బీసీ వాదాన్ని బలపర్చేందుకే రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పార్టీ ఏర్పాటులోనూ ఎన్నో అడ్డంకులు వచ్చాయని, కానీ వాటిని అధిగమించామని తెలిపారు. హోటల్‌లో పార్టీ ఆవిర్భావం కోసం అనుమతి నిరాకరించారని, బయట ఫ్లెక్సీలు లేకుండా ఓ అగ్రకుల అధికారి శతవిధాలా ప్రయత్నించారని, త్వరలో ఓట్లద్వారా అలాంటి అధికారుల మెడలు వంచుతామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు.

19 మందితో పార్టీ కార్యవర్గం ఏర్పాటు

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేరును సభాముఖంగా ప్రకటించారు. అదేవిధంగా మరో 18 మందితో కార్యవర్గాన్ని ప్రకటించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా సుదగాని హరిశంకర్, మాదం రజనీకుమార్ యాదవ్‌లను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా వట్టె జానయ్య, సంగెం సూర్యారావు, పల్లె బోయిన అశోక్ ముదిరాజ్, జ్యోతి పండాల్, వేములవాడ మదన్మోహన్ చారి, లింగాల గంగాధర్, కోశాధికారిగా కలివెల మధులను ప్రకటించారు. త్వరలో భారీ బహిరంగసభను ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

పూల పండుగ విశిష్టతను కళారూపాల ద్వారా చాటిచెప్పండి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ కవులు, కళాకారులు తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలు, మహిళల ఐక్యత, ప్రకృతి సౌందర్యాన్ని వర్ణిస్తూ రచనలు, కళా ప్రదర్శనలతో ప్రపంచానికి పూల పండుగ ప్రత్యేకతను తెలియజెప్పాలని పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. బుధవారం ఆయన టూరిజం ప్లాజాలో కవులు, కళాకారులతో భేటీ అయ్యారు. ప్రకృతిని, మహిళలను ఆరాధించే ఈ పూల పండుగ విశిష్టతను ప్రపంచానికి తెలపటంతోపాటు మన భావితరాల్లో కొత్త చైతన్యం తేవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం, వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, చలనచిత్ర దర్శకులు నర్సింగరావు, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, పలువురు కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలిస్తున్న కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉంటాం

- ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: అబద్ధపు హామీలిస్తున్న కాంగ్రెస్‌ను నిలదీస్తూనే ఉంటామని, మత విద్వేషాలను రెచ్చ గొట్టే బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. బుధవారం జాగృతి కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం కవిత మాట్లాడారు. విమోచన దినోత్సవమంటూ ఫెడరల్ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీజేపీ కార్యక్రమాలు నిర్వహిస్తోందని, సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవమే అన్నారు. తెలంగాణ విలీనంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని, భూస్వాములు, దొరలు ఆనాడు చేసిన అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాటం చేశారని కవిత గుర్తుచేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 1942లో సాయుధ రైతాంగ పోరాటం మొదలైందని, ఆనాటి పోరాట స్ఫూర్తిని ఇప్పటికీ రష్యాన్ వర్సిటీల్లో పాఠాలుగా చెబుతున్నారని, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తికి రైతాంగ సాయుధ పోరాటం ఒక ఉదాహరణ అని అన్నారు. బీజేపీ నాయకులు ఇది ముస్లిం రాజులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు.


సాగర్ 16 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

'సాగర్' 16 గేట్లు ఎత్తివేత

నాగార్జునసాగర్/దోమలపెంట: ఎగువనుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 1,38,805 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో బుధవారం అధికారులు ప్రాజెక్టు 16 క్రస్ట్ గేట్లను ఎత్తారు. వీటి ద్వారా 1,59,207 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 306.1010 టీఎంసీల నీరు ఉంది.

శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్ల ఎత్తివేత


ఎగువ నుంచి వరద ప్రవాహం భారీగా వస్తుండటంతో శ్రీశైలం ఆనకట్ట వద్ద బుధవారం నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 1,42,180, విద్యుదుత్పత్తి చేస్తూ 34,879 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 29,154, హంద్రీ నుంచి 1,125 కలిపి మొత్తం 2,06,213 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తోంది. దీంతో ఆనకట్ట నాలుగు గేట్లను ఒక్కొక్కటి పది అడుగుల మేర పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,11,016 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తిని చేస్తూ మరో 66,060 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.3 అడుగుల వద్ద 211.4759 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా అదనపు కలెక్టర్ నరసింహారెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా మహబూబ్‌నగర్‌కు చెందిన అనుగు నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఆయన రెవెన్యూ శాఖలో అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. డిప్యుటేషన్‌పై రెండేళ్ల కాలానికి ప్రభుత్వం ఆయన్ను నియమించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయం నుంచి డైరెక్టర్‌గా కొనసాగిన మామిడి హరికృష్ణ కొద్ది రోజుల కిందట సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఇప్పుడు ఆమెను రిలీవ్ చేస్తూ నరసింహారెడ్డిని నియమించింది. మామిడి హరికృష్ణను ఆయన మాతృశాఖ అయిన సహకార శాఖకు పంపుతూ ఉత్తర్వు జారీ చేసింది. కాగా, తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకుడిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ అర్జున్‌రావును నియమిస్తూ మరో ఉత్తర్వు జారీచేసింది.

డిజిటల్ అరెస్టుకు మహిళ బలి

- సీబీఐ కేసు పేరుతో సైబర్ నేరగాళ్ల ఫోన్‌కాల్
- రూ.6.6 లక్షలు స్వాహా చేసినా వదలని వైనం
- మూడు రోజుల పాటు 'నిర్బంధం'తో హార్ట్‌స్ట్రోక్
- చికిత్స పొందుతూ ప్రభుత్వ మాజీ వైద్యురాలి మృతి
- నగర సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు



సాక్షి, హైదరాబాద్: డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ మోసగాళ్ల వేధింపులకు ఓ వృద్ధురాలు బలైంది. హైదరాబాద్ మధురానగర్‌కు చెందిన మహిళ (76) చంచల్‌గూడ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న మామిడిపూడి నాగార్జున ఏరియా ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆమెకు ఈ నెల 5న తొలిసారి సైబర్ నేరగాళ్ల నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. బెంగళూరు పోలీసు లోగో, పోలీసు డ్రెస్‌లో ఉన్న వ్యక్తి ఫొటోతో కూడిన ప్రొఫైల్ పిక్చర్ వినియోగించి సైబర్ నేరగాళ్లు వృద్ధురాలితో మాట్లాడారు. ఆమె ఆధార్ కార్డు వివరాలు దుర్వినియోగం అయ్యాయని, మనుషుల అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి కేసు నమోదైందని బెదిరించారు. సుప్రీంకోర్టు జారీ చేసినట్లు సీల్‌తో ఉన్న నకిలీ పత్రాలను షేర్ చేశారు. ఈ కేసు సదాకత్ ఖాన్ హ్యూమన్ ట్రాఫికింగ్ కేసుకు అనుబంధంగా నమోదైందని, అరెస్టు తప్పదని భయపెట్టారు. అరెస్టు కాకుండా ఉండాలంటే తాము అడిగినంత డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయపడిపోయిన బాధితురాలు సెప్టెంబర్ 6న తన బ్యాంకు ఖాతాలో ఉన్న పెన్షన్ సొమ్ము రూ.6.6 లక్షలు సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలోకి బదిలీ చేసింది. ఆ బ్యాంకు ఖాతా మహారాష్ట్రలోని ఓ షెల్ కంపెనీ పేరుతో ఉన్నట్లు తేలింది. ఆపై మరో నంబర్ నుంచి బాధితురాలికి వీడియో కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు.. న్యాయస్థానం జారీ చేసినట్లు తయారు చేసిన నకిలీ నోటీసులు పంపారు. తమ నుంచి క్లియరెన్స్ వచ్చేవరకు వీడియో కాల్ ఆన్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 8 వరకు ఇలా 'నిర్బంధం'లో ఉండిపోయిన వృద్ధురాలు విషయం ఇంట్లో వారికి కూడా చెప్పలేదు. ఆ ఒత్తిడితో గుండెపోటుకు గురై కిందపడిపోయారు. కుటుంబీకులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. అంత్యక్రియలు ముగిసిన తర్వాత ఆమె ఫోన్‌ను కుటుంబ సభ్యులు పరిశీలించగా డిజిటల్ అరెస్టు గురించి తెలిసింది. దీంతో ఆమె కుమారుడు సోమవారం సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీని ఆధారంగా ఐటీ యాక్ట్‌తో పాటు బీఎన్ఎస్‌లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సాంకేతిక ఆధారాలతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను బట్టి దర్యాప్తు చేస్తున్నారు.

ఏమిటీ సదాకత్ ఖాన్ కేసు?

ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లాకు చెందిన ఘరానా నేరగాడు సదాకత్ ఖాన్. మన దేశం నుంచి అనేకమందిని ఉద్యోగాల పేరుతో కాంబోడియా తీసుకెళ్లి సైబర్ ముఠాలకు అప్పగించేవాడు. అక్కడ వారితో బలవంతంగా సైబర్ నేరాలు చేయించేవారు. సిరిసిల్లకు చెందిన ఓ మహిళ ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది నవంబర్ 6న దుబాయ్ నుంచి వచ్చిన సదాకత్ ఖాన్‌ను ఢిల్లీ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో ప్రజలను మోసం చేయడానికి ఈ కేసును వాడుతున్నారు.

ప్రపంచంలో ఎక్కడా డిజిటల్ అరెస్టు లేదు

దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడా ఓ నేరంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని డిజిటల్ అరెస్టు చేసే విధానం అమలులో లేదు. ఏ పోలీసు అధికారి వీడియో కాల్ చేసి కేసు నమోదైందని చెప్పరు. నిందితుడిగా ఆరోపణలు ఉంటే... ఫోన్ చేసి పోలీసుస్టేషన్‌కు రమ్మని పిలుస్తారు. ఏ కేసులో అయినా నిర్దోషిత్వం నిరూపించుకోవాలంటే దర్యాప్తు అధికారులను నేరుగా కలిసి తగిన ఆధారాలు సమర్పించాలి. లేదంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తగిన ఉత్తర్వులు పొందాలి. మీ ప్రమేయం లేకుండా ఆధార్, పాన్‌కార్డు వంటివి దుర్వినియోగమైనా ప్రమాదం ఉండదు. బాధితుల భయమే సైబర్ నేరగాళ్ల పెట్టుబడి అని గుర్తుంచుకోవాలి.

– సైబర్ క్రైమ్ పోలీసులు

క్లుప్తంగా...

చిట్‌చాట్ పేరిట కేటీఆర్ సోది

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: మీడియాతో చిట్‌చాట్ పేరిట బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెత్త వాగుతున్నారని, పనీపాటా లేక సోది పోగేసి చెప్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై పడి ఏడవడం తప్ప.. వేరే పని లేకుండా పోయిందన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్ సెక్రటేరియట్‌కు రావడం లేదని చిట్‌చాట్‌లో కేటీఆర్ వ్యాఖ్యానించిన సమయానికి.. రేవంత్ సెక్రటేరియట్‌లోనే ఉన్నారని స్పష్టం చేశారు. చిట్‌చాట్ పేరుతో ఏదో సోది చెప్పే బదులు.. చెల్లెలు కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పవచ్చని, కానీ ఆ ధైర్యం చేయడం లేదన్నారు. రేవంత్ బెదిరింపుల కారణంగానే మెట్రో నుంచి ఎల్‌అండ్‌టీ తప్పుకుంటోందంటున్న కేటీఆర్ తండ్రి కేసీఆరే గతంలో బేగంబజార్ నుంచి మెట్రో లైన్ వేయకుండా ఎల్‌అండ్‌టీని బెదిరించారని ఆరోపించారు.

తెలంగాణ ప్రజలు బాగుపడొద్దనేదే కేటీఆర్ ఉద్దేశమా?

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉద్దేశమేంటో అర్థం కావడం లేదని, తెలంగాణ ప్రజలు ఎవరూ బాగుపడొద్దన్నదే ఆయన ఉద్దేశమా? అని భువన గిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. గ్రూప్‌- 1 రాసి ఉత్తీర్ణులైన వారిపై ఆయన విషం కక్కుతున్నాడని, అవమానిస్తున్నాడని మండిపడ్డారు. 'మాకు ఓటేయలేదు మీరు అనుభవించండి'అని కేసీఆర్ అన్న రోజే అర్థమైందని, అధికారంలో ఉన్నప్పుడైనా ప్రతిపక్షంలో ఉన్నప్పుడైనా బీఆర్‌ఎస్ విధానం తెలంగాణను కూల్చడమేనని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో చామల విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ ఎక్కడున్నారని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారని, సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి సచివాలయంలో ఉన్నాడని తాము చెప్తున్నామని, మరి కేటీఆర్ నాయన కేసీఆర్ ఎక్కడున్నారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మెట్రో రైలు కాంగ్రెస్ హయాంలో వస్తే బీఆర్‌ఎస్ హయాంలో నష్టాల్లోకి పోయిందని, బీఆర్‌ఎస్ హయాంలో డ్రగ్స్ దందా నడిచేదన్నారు. రేవంత్‌రెడ్డిది నియంత పాలన అంటున్న కేటీఆర్ అసలు ప్రజలకు ఏం చెప్పదల్చుకున్నాడని, కేసీఆర్ హయాంలోనే నియంత పాలన జరిగిందని చామల వ్యాఖ్యానించారు.

పంట నష్టం.. రైతు ఆత్మహత్య


పెద్దులు

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం మందపల్లి గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి, పసుపు పంట నష్టపోయిన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ హన్మండ్లు తెలిపిన వివరాలివి. బొమ్మెన పెద్దులు (51) తన కున్న రెండెకరాల్లో పత్తి, పసుపు పంటలు వేశాడు. భారీ వర్షాలకు నీరు చేరి మొక్కల్లో ఎదుగుదల లోపించింది. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందిన పెద్దులు.. మంగళవారం ఉదయం పత్తి చేనులో పురుగు మందు తాగాడు. ఇంటికి రాకపోవడంతో చేనుకు వెళ్లిన భార్య పత్తి చేనులో పడి ఉండడాన్ని గమనించి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ కంచెకు తగిలి రైతు దుర్మరణం



నర్సయ్య

పరిగి: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం నారాయణపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల నర్సయ్య (60) పొలం వద్ద సాగు చేసిన మొక్కజొన్న పంటను కోతులు, అడవి పందుల బారినుంచి రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సా మిల్లుల స్టేట్ కమిటీలో హనుమాండ్లు

సాక్షి, హైదరాబాద్: రంపపు మిల్లు లేదా కలప మిల్లు (సా మిల్లులు)ల రాష్ట్రస్థాయి కమిటీలో ప్రత్యేక ఆహ్వానితునిగా తెలంగాణ శ్రీ విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు వడ్ల హనుమాండ్లును నామినేట్ చేశారు. దీనికి సంబంధించి అటవీశాఖ పీసీసీఎఫ్ పంపించిన ప్రతిపాదనలను ఆమోదించారు. బుధవారం ఈ మేరకు అటవీశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్ ఉత్తర్వులు జారీ చేశారు.

యాదగిరి క్షేత్రంలో ఉట్లోత్సవం


ఉట్టిని కొడుతున్న ఉద్యోగులు, సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ మాడ వీధిలో బుధవారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా ఉట్లోత్సవాన్ని అర్చకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నిర్వహించారు. ముందుగా శ్రీస్వామి అమ్మవార్లతో పాటు శ్రీకణ్ణన్ ఉత్సవ మూర్తులను సేవగా ఆలయ తిరువీధిలో ఊరేగిస్తూ, ఉట్టి కొట్టే ప్రాంతానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకణ్ణన్ తిరు నక్షత్ర ఉత్సవాల్లో భాగంగా ఈ ఉట్లోత్సవాన్ని జరిపించారు. కాగా, యాదగిరిగుట్ట క్షేత్రంలో శ్రీకణ్ణన్ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా రుక్మిణీ కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా జరిగాయి. బుధవారం రాత్రి ఆలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, బంగారు, వజ్రాభరణాలతో అలంకరించిన అర్చకులు.. స్వామి, అమ్మవార్లకు ముత్యాల తలంబ్రాలను పోసే పర్వాన్ని జరిపించారు.

రోడ్డు వేస్తారా.. పన్నులు తిరిగిస్తారా..

- కరీంనగర్‌లో 9వ డివిజన్ వాసుల వినూత్న నిరసన


కుటుంబ సభ్యులతో కాలనీ వాసి నిరసన

కరీంనగర్ కార్పొరేషన్: 'ఇంటి పన్ను వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మా 9వ డివిజన్ రోడ్ల మీద లేదా? రోడ్లు వేయండి.. లేదా మేం ఇప్పటివరకు చెల్లించిన ఇంటిపన్ను వాపస్ ఇవ్వండి'.. అంటూ కరీంనగర్‌లోని 9వ డివిజన్ అలకాపురి కాలనీ వాసులు వినూత్న నిరసన చేపట్టారు. కోతిరాంపూర్‌లోని కరీంనగర్, హైదరాబాద్ మెయిన్‌రోడ్ నుంచి అలకాపురి కాలనీకి వెళ్లే రోడ్డు, గుంతలతో నీళ్లు నిలిచి అధ్వానంగా మారింది. ప్రతి వర్షాకాలం ఇదే దుస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితిలో మార్పు లేదు. కాలనీకి చెందిన దుంపేటి రాము, నందికొండ నర్సింహారెడ్డి, బాపురెడ్డి, రవికిరణ్‌రెడ్డి, మహిళలు, చిన్నారులు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచిన రోడ్డుపై కూర్చొని ప్లకార్డులతో ఆందోళన చేపట్టారు. గుంతల్లో వరి నాట్లు వేశారు. ఆటోనగర్, అలకాపురి కాలనీ, కోతిరాంపూర్, అయోధ్యపురి కాలనీలోని అన్ని రోడ్లు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే తాము ఇప్పటివరకు నగరపాలక సంస్థకు కట్టిన ఇంటి పన్నులను వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

- అంతర్రాష్ట్ర రహదారిపై ఆందోళన


నిరసనకు దిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఉండవెల్లి: తమకు పాఠాలు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేకపోవడంతో ఎంతో నష్టపోతున్నామని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలంటూ విద్యార్థులు అంతర్రాష్ట్ర రహదారిపై ఆందోళనకు దిగారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం బొంకూరులో బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. బొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గణితం, సామాన్య, సాంఘిక సబ్జెక్టులు బోధించేందుకు ఉపాధ్యాయులు లేరు. ఏళ్ల తరబడి డిప్యుటేషన్‌పై వస్తూ.. మధ్యలో మళ్లీ సొంత పాఠశాలలకు వెళ్తున్నారని విద్యార్థులు వాపోయారు. దీంతో ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటూ తల్లిదండ్రులతో కలిసి తెలంగాణ– కర్ణాటక అంతర్రాష్ట్ర రహదారిపై కూర్చొని నిరసన తెలిపారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఎంఈవో శివప్రసాద్ వెంటనే విద్యార్థుల వద్దకు చేరుకుని.. నలుగురు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పాఠశాలకు పంపిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం ఆయన పాఠశాలను సందర్శించారు.

గోదావరి లంకల్లో చిక్కుకున్న కూలీలు

- జేసీబీ సాయంతో దాటించిన రైతులు


జేసీబీ సాయంతో కూలీలను దాటిస్తున్న రైతులు

వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం (కె) మండలంలో గోదావరి వరద క్రమంగా పెరుగుతోంది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వరద నీటిని కిందకు వదలడంతో.. బుధవారం సాయంత్రం గోదావరి వరద పెరిగి పాయలోకి నీరు చేరింది. దీంతో గోదావరి లంకల్లో మిర్చి పనుల కోసం వెళ్లిన సుమారు 20 మంది కూలీలు గోదావరి పాయ ఆవలి వైపు చిక్కుకున్నారు. రైతులు జేసీబీ సాయంతో కూలీలను గోదావరి పాయ దాటించి సురక్షితంగా తీసుకొచ్చారు. ట్రాక్టర్లను సైతం రైతులు ఇవతలి ఒడ్డుకు తీసుకొచ్చారు.

నవ భారత్ బెదరదు!

రెప్పపాటు కాలంలోనే ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిలబెట్టాం

- ఇది నవభారతం.. అణ్వాయుధాలతో మనల్ని భయపెట్టలేరు
- ఉగ్రవాదుల ఇళ్లలోకి ప్రవేశించి మరీ మట్టుబెట్టగలం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- 75వ జన్మదినం సందర్భంగా మధ్యప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ధార్: అణ్వాయుధాలను బూచిగా చూపించి భారత్‌ను బెదిరిస్తామంటే ఎంతమాత్రం కుదరదని పాకిస్తాన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరోక్షంగా పాకిస్తాన్‌కు తేల్చిచెప్పారు. అణ్వస్త్రాలకు నవ భారతదేశం(న్యూ ఇండియా) భయపడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. భారత్ వైపు కన్నెత్తి చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థలకు కోలుకోలేని నష్టం జరిగిందని తెలిపారు. నష్టం జరిగినట్లు జైషే మొహమ్మద్ కమాండర్ స్వయంగా అంగీకరించాడని గుర్తుచేశారు. 75వ జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో పర్యటించారు. పలు సేవా కార్యక్రమాలు, అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలకు శ్రీకారం చుట్టారు. భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆయన ఏం మాట్లాడారంటే...



చిన్నారితో

మన సత్తా ప్రపంచానికి తెలిసొచ్చింది

"పాకిస్తాన్ ఉగ్రవాదులు మన అక్కచెల్లెమ్మలు, కుమార్తెల సిందూరం తుడిచేశారు. ముష్కరులకు బుద్ధి చెప్పడానికి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించాం. వారి స్థావరాలను ధ్వంసం చేశాం. అపూర్వమైన ధైర్య సాహసాలు కలిగిన మన సైనిక దళాలు కేవలం రెప్పపాటు కాలంలో పాకిస్తాన్‌ను మోకాళ్లపై నిల్చోబెట్టాయి. ఈ ఆపరేషన్‌లో పాకిస్తాన్ ఉగ్రవాద ముఠా నాయకులకు జరిగిన నష్టాన్ని నిన్ననే ఓ ముష్కరుడు రోదిస్తూ బయటపెట్టడం ప్రపంచమంతా చూసింది. ఇది నవ భారత్. అణు బాంబులతో మనల్ని ఎవరూ భయపెట్టలేరు. ఉగ్రవాదుల ఇళ్లలోకి ప్రవేశించి మరీ వారిని మట్టుబెట్టగలం. మన సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసొచ్చింది.

మన మంత్రం స్వదేశీ

ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేసి, ఉపయోగించుకోవాలని మరోసారి కోరుతున్నా. పండుగల సీజన్ రాబోతోంది. స్వదేశీ ఉత్పత్తుల వాడకం పెంచుకోవాలి. మీరు కొనేది, విక్రయించేది ఏదైనా సరే అది 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తి కావాలి. స్వాతంత్ర్యం సాధించడానికి జాతిపిత మహాత్మా గాంధీ స్వదేశీని ఒక ఆయుధంగా ప్రయోగించారు. 'అభివృద్ధి చెందిన భారత్'కు స్వదేశీ ఉత్పత్తుల వాడకమే పునాది అని మర్చిపోవద్దు. మన దేశంలో తయారైన వస్తువులు, సరుకులు ఉపయోగిస్తేనే దేశానికి లబ్ధి చేకూరుతుంది. ప్రగతి పథంలో ముందుకు సాగుతుంది. ప్రజలు స్వదేశీ ఉద్యమంలో పాలుపంచుకోవాలి. మన ఉత్పత్తుల పట్ల మనం గర్వించాలి. అది చిన్న వస్తువైనా, పెద్ద వస్తువైనా మన దేశంలో తయారైన వస్తువునే కొనండి. పిల్లల బొమ్మలు, దీపావళి విగ్రహాలు, ఇంట్లో అలంకరణ సామగ్రి, మొబైల్ ఫోన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు మన దగ్గర తయారవుతున్నాయి. వాటిని ఉపయోగించుకోండి. ఏదైనా కొనుగోలు చేసే ముందు అది 'మేడ్ ఇన్ ఇండియా' అవునో కాదో తనిఖీ చేసుకోండి. స్వదేశీ ఉత్పత్తులు కొంటే మన డబ్బు మన దేశంలోనే ఉంటుంది. అది నేరుగా దేశ అభివృద్ధికి తోడ్పడుతుంది. ఆ సొమ్ముతో రోడ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు నిర్మించవచ్చు. పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేయొచ్చు. స్వదేశీ వస్తువుల విక్రయాలు పెరిగితే కంపెనీల్లో వాటి ఉత్పత్తిని పెంచాల్సి ఉంటుంది. తద్వారా మన దగ్గర ఎంతోమందికి ఉద్యోగాలు లభిస్తాయి. తగ్గించిన జీఎస్టీ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి రాబోతున్నాయి. స్వదేశీ వస్తువులు కొని ఈ రేట్ల తగ్గింపు ప్రయోజనం పొందండి. విక్రయదారులు తమ దుకాణాల వద్ద 'స్వదేశీ' బోర్డులు గర్వంగా ఏర్పాటు చేసుకోండి.



విల్లు ఎక్కుపెట్టిన మోదీ

కోటికి చేరిన సికిల్ సెల్ స్క్రీనింగ్ కార్డులు

ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశాం. దీనివల్ల దేశంలో వస్త్ర పరిశ్రమకు నూతన బలం చేకూరుతుంది. యువతకు పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవచ్చు. అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తారు. ఔషధాలు సైతం ఉచితంగా అందజేస్తారు. ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది. అవగాహన, వనరులు లేవన్న కారణంతో మహిళలు నష్టపోవడానికి వీల్లేదు. అందుకే ఈ కార్యక్రమం ప్రారంభించాం. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ అనీమియా వ్యాధిని అరికట్టడానికి 2023లో నేషనల్ మిషన్‌ను మధ్యప్రదేశ్‌లోనే ప్రారంభించాం. అప్పట్లో మొట్టమొదటి సికిల్ సెల్ స్క్రీనింగ్ కార్డు అందజేశాం. ఈరోజు కార్డుల సంఖ్య కోటికి చేరింది. దేశవ్యాప్తంగా 5 కోట్ల మందికిపైగా ప్రజలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలు కళ్లముందే కనిపిస్తున్నాయి. దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు'' అని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు.



బుధవారం ధార్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మోదీ

పీఎం మిత్రా పార్కు

దేశంలో మొట్టమొదటి 'ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్, అప్పారెల్(పీఎం మిత్రా)' పార్కు నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్‌ను, రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఎం మిత్రా పార్కులో భాగంగా తెలంగాణ, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో ప్రపంచ స్థాయి టెక్స్‌టైల్ తయారీ కేంద్రాలను స్థాపించబోతున్నారు. రాష్ట్రీయ పోషణ్ కార్యక్రమం కింద శిశు సంరక్షణ, విద్యతోపాటు స్థానికంగా లభించే పౌష్టికాహారాన్ని ప్రోత్సహిస్తారు. చక్కెర, వంటనూనెల వినియోగం తగ్గించుకోవాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తారు. సుమన్ సఖి చాట్‌బాట్‌ను సైతం మోదీ ప్రారంభించారు. తల్లి, శిశువుల ఆరోగ్యంపై అవగాహన పెంచబోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులకు తగిన సమాచారం అందజేస్తారు. తన జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ స్వయం సహాయక సంఘం సభ్యురాలికి ఒక మొక్కను బహూకరించారు.

సిబ్బందిని కట్టేసి రూ. 21 కోట్లు లూటీ

- కర్ణాటక బ్యాంకులో ముసుగు దొంగల ఘాతుకం
- తుపాకులు, కత్తులతో బెదిరించిన వైనం

విజయ్‌పురా (కర్ణాటక): ముసుగు ధరించిన ముగ్గురు దుండగులు తుపాకులు, కత్తులతో సిబ్బందిని బెదిరించి ఓ బ్యాంకును లూటీ చేసి రూ.20 కోట్లకు పైగా దోచుకున్నారు. ఈ ఘటన కర్ణాటక విజయ్‌పురా జిల్లాలోని ఎస్‌బీఐకి చెందిన చాడ్‌చాన్ బ్రాంచ్‌లో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దుండగులు దోచుకున్న నగదు, బంగారు ఆభరణాల విలువ రూ. 21 కోట్లకుపైగా ఉంటుందని బ్యాంకు అధికారులు తెలిపారు. ముసుగు ధరించిన ముగ్గురు వ్యక్తులు కరెంటు ఖాతా తెరవాలంటూ బ్యాంకుకు వచ్చి మేనేజర్, క్యాషియర్, ఇతర సిబ్బందిని తుపాకులు, కత్తులతో బెదిరించారని పోలీసులు చెప్పారు. దుండగులు బ్యాంకు సిబ్బంది కాళ్లు, చేతులను కట్టేసి రూ.కోటికిపైగా నగదు, రూ.20 కోట్ల విలువైన 20 కేజీల బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశామని, దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు పోలీసులు తెలిపారు. దుండగులు నకిలీ నంబర్ ప్లేటు ఉన్న సుజుకీ ఎవా అనే కారులో వచ్చారని విజయ్‌పురా ఎస్పీ లక్ష్మణ్ నింబర్గి చెప్పారు. చోరీ అనంతరం దుండగులు మహారాష్ట్రలోని పండర్‌పూర్ వైపు పారిపోయినట్లు తెలిపారు.

మోదీకి ఫోన్‌లో పుతిన్ గ్రీటింగ్స్

న్యూఢిల్లీ: మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం స్వయంగా ఫోన్ కాల్ చేశారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌తో పరిష్కారానికి అన్ని రకాల సాయంచేసేందుకు సిద్ధంగా ఉన్నానని పుతిన్‌కు మోదీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా తర్వాత పంచుకున్నారు. '75వ బర్త్‌డే విషెస్ చెప్పేందుకు స్వయంగా ఫోన్‌చేసిన అధ్యక్షుడు, మిత్రుడు పుతిన్‌కు నా ధన్యవాదాలు. భారత్, రష్యాల ప్రత్యేక, ప్రతిష్ఠాత్మక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్ఠంచేసేందుకు మనిద్దరం కంకణబద్ధమయ్యాం. ఇక ఉక్రెయిన్ విషయంలో శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు భారత్ సిద్ధంగా ఉంది' అని మోదీ అన్నారు.

ఈవీఎం బ్యాలెట్‌పై కలర్ ఫొటోలు

- తొలిసారిగా బిహార్‌లో శాసనసభ ఎన్నికల్లో కొత్త రూల్స్
- నూతన నిబంధనల్ని అమలుచేయనున్న ఎన్నికల సంఘం

పట్నా: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నేపథ్యంలో శాసనసభ ఎన్నికల్లో మరింత పారదర్శకత తీసుకొచ్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నడుంబిగించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం) బ్యాలెట్ పేపర్ లేఔట్‌లో ఆధునిక మార్పులు తేనున్నట్లు ఈసీ ప్రకటించింది. గతంలో ఈవీఎం లేఔట్‌పై అభ్యర్థుల ఫొటోలు నలుపు,తెలుపు రంగులో ఉండేవి. కొందరి ఫొటోలైతే అస్సలు ముద్రించకపోయేవాళ్లు. ఇకపై కలర్ ఫొటోలను ముద్రించి ఓటర్లు సులభంగా తమ అభ్యర్థులను గుర్తించే వెసులుబాటు కల్పించనున్నారు. ఫొటో కోసం కేటాయించిన మొత్తం ప్రదేశంలో ముప్పావువంతు సైజులో ఫొటో పెద్దగా కన్పించనుంది. దీంతో కంటి సమస్యలున్న ఓటర్లు సైతం తమ అభ్యర్థి ముఖాన్ని స్పష్టంగా చూశాకే ఓటేసే అవకాశమొచ్చింది.

కొత్తగా వచ్చిన మార్పులేంటి?

- → అభ్యర్థి సీరియల్ నంబర్‌తోపాటు 'ఎవరికి ఓటు వేయబోము(నన్ ఆఫ్ ది ఎబో–నోటా) అనే ఆప్షన్ సైతం పెద్ద సైజులో ఉండనుంది.
- → అంతర్జాతీయ భారతీయ అంకెల విధానమైన లక్షలు, కోట్లు వంటి వాటిని సైతం ఉపయోగించనున్నారు. ఈ అంకెలను 30 నంబర్ ఫాంట్‌సైజులో ముద్రిస్తారు.
- → స్పష్టంగా కనిపించేందుకు మందంగా బోల్డ్‌లో ప్రింట్‌చేస్తారు.
- → అభ్యర్థుల అందరి పేర్లు ఒకే పరిమాణంలో కన్పించేలా ఒకే నంబర్ ఫాంట్ సైజును ఉపయోగించనున్నారు. నోటాకు సైతం ఇదే వర్తించనుంది. లిపి(ఫాంట్) రకాలు వేర్వేరుకాకుండా ఒకే రకం ఫాంట్‌ను వాడనున్నారు
- → చదరపు మీటర్‌కు 70 గ్రాముల బరువు ఉండే 70 జీఎస్ఎం గ్రేడ్ పేపర్‌ను ఈవీఎం బ్యాలెట్ పేపర్ ముద్రణ కోసం ఉపయోగిస్తారు. శాసనసభ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గులాబీరంగు పేపర్‌ను ఉపయోగిస్తారు. అందులోనూ పింక్, రెడ్, గ్రీన్‌లను ప్రత్యేకంగా వాడనున్నారు.
- → బిహార్‌లోనే తొలిసారిగా ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెస్తున్నారు.

ఆ ఏఐ వీడియో తొలగించండి

కాంగ్రెస్‌కు పట్నా హైకోర్టు ఆదేశం

పట్నా: ప్రధాని మోదీ కలలోకి ఆయన తల్లి, దివంగత హీరాబెన్ వచ్చి సవ్యంగా పరిపాలించాలంటూ హితబోధ చేస్తున్నట్లు చూపించిన కృత్రిమమేధ (ఏఐ) వీడియోను కాంగ్రెస్ పార్టీ తక్షణం ఆన్‌లైన్ వేదికల నుంచి తొలగించాలని పట్నా హైకోర్టు బుధవారం సూచించింది. ప్రజాప్రతినిధ్యం చట్టంలోని నిబంధనలను ఉల్లంఘిస్తూ రాజకీయ పార్టీలు, రాజకీయ నేతలను కించపరిచేలా ఈ వీడియో ఉందంటూ న్యాయవాది వివేకానంద్ సింగ్, తదితరులు దాఖలుచేసిన పిటిషన్‌ను పట్నా హైకోర్టు విచారించి పై విధంగా ఆదేశాలిచ్చింది. ఈ కేసు తదుపరి విచారణ తేదీ వరకు సంబంధిత ఏఐ వీడియో ఆన్‌లైన్ నుంచి తొలగించాలని కోర్టు స్పష్టంచేసిందని కేంద్రప్రభుత్వం తరఫున కోర్టుకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కేఎన్ సింగ్ చెప్పారు. ''సాహబ్‌కి కలలో అమ్మ వచ్చింది. వీళ్ల మధ్య పసందైన సంభాషణ చూద్దాం' అని ట్యాగ్‌లైన్‌తో ఈ వీడియోను బిహార్ కాంగ్రెస్ విభాగం తమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేయడంతో బీజేపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం తెల్సిందే.

కొందరు రైతులనైనా జైలుకు పంపండి

- అప్పుడే మిగతా వారికి గట్టి సందేశం వెళుతుంది
- పంట వ్యర్థాల కాల్చివేతపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- కాలుష్య మండళ్లలో ఖాళీలను భర్తీచేయండి
- యూపీ, హరియాణా, రాజస్తాన్, పంజాబ్ ప్రభుత్వాలకు కోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: పంట వ్యర్థాలను తగలబెడుతూ వాయుకాలుష్యానికి కారణమవుతున్న రైతులను ఎందుకు అరెస్ట్ చేయట్లేదని పంజాబ్ ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం నిలదీసింది. కొందరు రైతులను కటకటాల వెనక్కి నెడితేనే ఇతర రైతుల్లో భయం ఉంటుందని, వ్యర్థాలను తగలబెట్టే రైతులకు గట్టి సందేశం ఇచ్చిన వాళ్లమవుతామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉత్తరప్రదేశ్, హరియాణా, రాజస్తాన్, పంజాబ్‌లలో రాష్ట్రాల కాలుష్య నియంత్రణ మండళ్లలో పోస్టుల భర్తీకి సంబంధించిన అంశాన్ని సుమోటోగా స్వీకరించి విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం పై విధంగా స్పందించింది. 'రైతులు నిజంగా ప్రత్యేకమైనవాళ్లే. వాళ్ల కారణంగానే మనం ఆహారం తినగల్గుతున్నాం. అంతమాత్రాన మనం పర్యావరణాన్ని కాపాడకుండా మౌనంగా కూర్చోలేం కదా. పంట వ్యర్థాలను తగలబెడుతున్న రైతులను శిక్షించే సెక్షన్లు ఉన్నాయి కదా? వాయుకాలుష్యంతో పర్యావరణానికి హాని తలపెడుతున్న కొందరు రైతులను అరెస్ట్‌చేస్తేనే మిగతా వాళ్లకు గట్టి సందేశం వెళుతుంది. తప్పు చేసిన రైతులను శిక్షించేందుకు చట్టంలో నిబంధనలు ఉన్నాయని మీకు తెలియదా? పర్యావరణాన్ని కాపాడాలనే సత్‌సంకల్పం మీకు ఉంటే రైతులను అరెస్ట్‌చేయడానికి ఎందుకు జంకుతున్నారు?'' అని న్యాయస్థానం నిలదీసింది. ''పంట వ్యర్థాలను జీవఇంధనంగా ఉపయోగం చవచ్చన్న వార్తలను మేం కూడా వార్తాపత్రికల్లో చదివాం. ఇలా సద్వినియోగం చేసుకోండి అని మేం పదేపదే చెప్పలేం'' అని సీజేఐ గవాయ్ అసహనం వ్యక్తంచేశారు. 'సీఏక్యూఎం, సీపీసీబీల్లో పోస్టులను మూడు నెలల్లోపు భర్తీచేయండి. పదోన్నతి పోస్టులను ఆరు నెలల్లోపు భర్తీచేయండి' అని కోర్టు ఆదేశించింది.



రైతులు కథలు చెబుతున్నారు

ఈ కేసులో పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది రాహుల్ మెహ్రా, అమికస్ క్యూరీ(కోర్టు సహాయకురాలు)గా అపరంజిత హాజరయ్యారు. గతేడాదితో పోల్చితే పంట వ్యర్థాల దహనం తగ్గుముఖం పట్టిందని మెహ్రా న్యాయస్థానానికి తెలిపారు. ఈ ఏడాది వ్యర్థాల దహనాలను మరింతగా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ వాదనలతో అమికస్ క్యూరీ అపరంజిత విభేదించారు. రైతులు పంట వ్యర్థాలను తగలబెట్టకుండా ఉండటానికి ప్రభుత్వం రైతులకు నగదు ప్రోత్సాహకాలు, ఇతర పరికరాలు అందిస్తున్నప్పటికీ పెద్దగా మార్పు లేదని ఆమె న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఉపగ్రహాలు తమ పంటపొలాల మీదుగా వెళ్లిన సమయాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టొద్దని వ్యవసాయశాఖ అధికారులే తమకు ఉప్పందించారని రైతులు అవే కథలు మళ్లీ మళ్లీ చెబుతున్నారని ఆమె కోర్టుకు వివరించారు. పంట వ్యర్థాల దహనంపై 2018లోనే సుప్రీంకోర్టు విస్తృతమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ మరోసారి రాష్ట్ర ప్రభుత్వాలు నిస్సహాయ స్థితిలో కోర్టు ముందు నిలిచాయని వ్యాఖ్యానించారు.

లేదంటే మేమే నిర్ణయం తీసుకుంటాం

'పర్యావరణానికి నష్టం కలిగించే రైతులపై చర్యలు తీసుకోవాలి. ఒక వేళ కఠిన చర్యలు తీసుకోవడానికి మీకు మనసురాకపోతే ఆ విషయాన్ని అయినా లిఖితపూర్వకంగా మాకు తెలపండి. మీరు ఒక నిర్ణయం తీసుకోండి. లేకుంటే మేమే తుది నిర్ణయం తీసుకుంటాం'' అని సీజేఐ ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ముందుగా అరెస్టులు, చర్యలు తీసుకున్నాం. కానీ వీరిలో హెక్టార్ సాగుభూమి ఉన్న రైతులే ఎక్కువ. వీళ్లను జైల్లో పెడితే, వీళ్లపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి ఏంటి? గడిచిన సంవత్సరాల్లో పంట వ్యర్థాలకు నిప్పు పెట్టిన ఘటనలు 77,000 జరిగితే అవి ఏకంగా 10,000 స్థాయికి దిగొచ్చాయి' అని రాహుల్ మెహ్రా కోర్టుకు నివేదించారు. దీనిపై సీజేఐ స్పందించారు. 'ఎప్పట్లాగా రొటీన్‌గా రైతులకు సూచనలు చేయడం మానేసి ఈసారి అరెస్టులు, జైలుకు పంపడానికి కూడా మేం వెనకాడము అనే గట్టి సందేశాన్ని ఇవ్వండి. వచ్చే పంటకాలంలోపు పొలాల్లో వ్యర్థాలు పర్యావరణహితంగా తొలగించాలి' అని ఆయా రాష్ట్రాలకు సీజేఐ సూచించారు.

దోస్త్ అంటూనే డ్రగ్స్ జాబితాలోకి

భారత్‌ను చేర్చిన ట్రంప్

న్యూయార్క్/వాషింగ్టన్: మంచి మిత్రదేశం అంటూనే వివాదాస్పద, అపఖ్యాతి పాల్జేసే జాబితాలో భారత్‌ను అమెరికా చేర్చింది. మాదకద్రవ్యాల కట్టడిపై ఉక్కుపాదం మోపే భారత్‌ను ప్రధాన డ్రగ్స్ రవాణా, ఉత్పత్తి దేశాల జాబితాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేర్చారు. ఈ మేరకు 'అధ్యక్షుడి సంకల్పం' పత్రాన్ని సోమవారం అమెరికా కాంగ్రెస్‌కు ట్రంప్ సమర్పించారు. భారత్, బహమాస్, బెలీజ్, బొలివియా, బర్మా, చైనా, కొలంబియా, కోస్టారికా, డొమినికా రిపబ్లిక్, ఈక్వెడార్, ఎల్ సాల్వడార్, గ్వాటిమాల, హైతీ, హోండురాస్, జమైకా, లా వోస్, మెక్సికో, నికరాగ్వా, పాకిస్తాన్, పనామా, పె రూ, వెనెజువెలా సహా 23 దేశాలతో జాబితాను సిద్ధంచేసి కాంగ్రెస్‌కు ట్రంప్ సమర్పించారు. ''ఏదే శాల్లో ఉత్పత్తయి ఈ దేశాల గుండా అమెరికాకు డ్రగ్స్ రావడం, లేదంటే ఈ 23 దేశాలు ఆ జాబితా లో ఉన్నాయి.

మసూదే సూత్రధారి

- పార్లమెంట్, 26/11 దాడులకు వ్యూహరచన అతడిదే
- జైషే మొహమ్మద్ కమాండర్ ఇల్యాస్ కశ్మీరీ వెల్లడి

ఇస్లామాబాద్: భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్ కుటుంబం ముక్కలైపోయిందని స్వయంగా వెల్లడించిన ఆ సంస్థ టాప్ కమాండర్ మసూద్ ఇల్యాస్ కశ్మీరీ మరో సంచలన విషయం బయటపెట్టాడు. భారత్‌లోని ఢిల్లీ, ముంబైలో జరిగిన భీకర ఉగ్రవాద దాడుల్లో మసూద్ అజార్‌దే కీలక పాత్ర అని స్పష్టం చేశాడు. ఆయా దాడులకు ప్రణాళిక రూపొందించి, అమలు చేసింది అతడేనని పేర్కొన్నాడు. ఢిల్లీ, ముంబై ఉగ్రవాద దాడుల వెనుక తమ పౌరుల హస్తం లేదంటూ నమ్మబలుకుతున్న పాకిస్తాన్ ప్రభుత్వం అసలు రంగు దీనితో తేలిపోయింది. పాకిస్తాన్ గడ్డపై ఆశ్రయం పొందుతున్న ఉగ్రవాద సంస్థలే భారత్‌లో మారణహోమం సృష్టించినట్లు స్పష్టంగా బహిర్గతమయ్యింది.



మసూద్ అజార్

బాలాకోట్ నుంచే కుట్ర

భారత నిఘా వర్గాలు గాలిస్తున్న మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అమీర్–ఉల్–ముజాహిదీన్ మౌలానా మసూద్ అజార్‌కు మసూద్ ఇల్యాస్ కశ్మీరీ ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందాడు. అతడు ఇటీవల మాట్లాడిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఢిల్లీలోని తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో 1999లో విమానం హైజాక్ ఉదంతంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల డిమాండ్ మేరకు భారత ప్రభుత్వం మసూద్ అజార్‌ను విడుదల చేసింది. అలా పాకిస్తాన్‌కు చేరుకున్న మసూద్ అజార్ ఇక్కడి నుంచే భారత్‌లో ఉగ్రవాద దాడులకు వ్యూహరచన చేశాడని మసూద్ ఇల్యాస్ కశ్మీరీ చెప్పాడు. పాకిస్తాన్ భూభాగంలోని బాలాకోట్‌ను అడ్డాగా మార్చుకొని, అనుచరుల సంఖ్యను పెంచుకొని, వారికి శిక్షణ ఇచ్చి, భారత్‌పైకి ఉసిగొల్పాడని వెల్లడించాడు. బాలాకోట్ అతడికి సురక్షిత ప్రాంతంగా మారిందని అన్నాడు. 2001 డిసెంబర్ 13న ఢిల్లీలోని భారత పార్లమెంట్‌పై ఆత్మాహుతి దాడి, 2008 నవంబర్ 26న ముంబైలో దాడులకు బాలాకోట్ నుంచే కుట్ర సాగించాడని తేల్చిచెప్పాడు.

రెండు భీకర దాడులు

జైషే మొహమ్మద్‌ను ఐక్యరాజ్యసమితి ఉగ్రవాద సంస్థగా ఇప్పటికే గుర్తించింది. భారత పార్లమెంట్‌పై 2001లో ఐదుగురు జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడికి దిగారు. హోంశాఖ స్టిక్కర్ ఉన్న కారులో లోపలికి దూసుకొచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆరుగురు ఢిల్లీ పోలీసులు, ఇద్దరు పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీసు సిబ్బంది, ఒక తోటమాలి మరణించారు. ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు కాల్చి చంపాయి. 2008లో ముంబైలో పాకిస్తాన్ ఉగ్రవాదులు బీభత్సం సృష్టించారు. 12 ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. 166 మందిని బలి తీసుకున్నారు.

హురియత్ కాన్ఫరెన్స్ మాజీ చీఫ్ అబ్దుల్ గనీ భట్ కన్నుమూత

శ్రీనగర్: చాన్నాళ్లపాటు కశ్మీర్‌లోయలో వేర్పాటు వాద ఉద్యమానికి సారథ్యంవహించిన హురియత్ కాన్ఫరెన్స్ మాజీ ఛైర్మన్, మితవాద వేర్పాటువాది అబ్దుల్ గనీ భట్ వృద్ధాప్యంకారణంగా బుధవారం కన్ను మూశారు. 90 ఏళ్ల గనీ గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ బారాముల్లాలోని సోపోర్‌లో సొంతింటికే పరిమితమయ్యారని ప్రస్తుత హురియత్ ఛైర్మన్ మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ చెప్పారు. గతంలో ఎన్‌డీఏ ప్రభుత్వంతో, తర్వాత మన్మోహన్ హయాంలో కేంద్రంతో హురియత్ కాన్ఫరెన్స్ చర్చలు జరపడంలో భట్ కీలక భూమిక పోషించారు.


అత్యధికులు ఎస్ఐఆర్‌లో డాక్యుమెంట్లు ఇవ్వక్కర్లేదు

చాలా రాష్ట్రాల్లో మెజారిటీ ఓటర్లపై ఈసీ అభిప్రాయం

న్యూఢిల్లీ: దేశంలోని చాలా రాష్ట్రాల్లో సగం కంటే ఎక్కువ మంది ఓటర్లు ఓటర్ల జాబితా సవరణ వేళ కొత్తగా ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన అవసరం రాకపోవచ్చని కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. చాలా రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) 2002 నుంచి 2004 ఏడాది మధ్యలో జరిగింది. తదుపరి ఎస్ఐఆర్‌కు ఈ సంవత్సరాలనే కటాఫ్ తేదీగా పరిగణించబోతున్నారు. దేశ వ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహణపై ఈసీ త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఈ ఏడాదిలోపే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన పూర్తిచేసే అవకాశముంది. రాష్ట్రాలవారీగా చివరి ఎస్ఐఆర్ తర్వాత అక్కడి ఓటర్ల జాబితాను ముద్రించే సిద్ధంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ)లకు ఆదేశాలు వెళ్లాయి. ఢిల్లీ, ఉత్తరాఖండ్ సహా కొన్ని రాష్ట్రాల సీఈఓలు ఇప్పటికే ముద్రిత జాబితాను తమ వెబ్‌సైట్‌లలో అందుబాటులోకి తెచ్చారు. కటాఫ్ ఏడాది తర్వాత వచ్చి చేరిన కొత్త ఓటర్లను ఓటు గుర్తింపు రుజువు పత్రాలు అడగనున్నారు.

చొరబాటుదారుల కోసం కాంగ్రెస్ యాత్రలా?

- వారి ఓట్లతో ఎన్నికల్లో నెగ్గడానికి కుట్రలు
- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆగ్రహం



న్యూఢిల్లీ: విపక్ష కాంగ్రెస్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. చొరబాటుదారులను రక్షించడమే లక్ష్యంగా ఆ పార్టీ యాత్రలు చేస్తోందని మండిపడ్డారు. చొరబాటుదారుల ఓట్లతో ఎన్నికల్లో నెగ్గాలని కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం ఢిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 ప్రజా సంక్షేమ పథకాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ తీరును తప్పుపట్టారు. దేశ పౌరులపై కాంగ్రెస్‌కు, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఏమాత్రం విశ్వాసం లేదని విమర్శించారు. అందుకే చొరబాటుదారులకు అండగా నిలుస్తున్నారని, వారిని ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితాల్లో చొరబాటుదారులు ఎప్పటికీ ఉండాలన్నదే కాంగ్రెస్ విధానమని ఆక్షేపించారు. మనదేశంలోకి అక్రమంగా వలస వచ్చిన వారికి ఓటు హక్కు ఇవ్వాలని డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల్లో నెగ్గడానికి అక్రమ వలసదారులకు అండగా నిలుస్తారా? ఇదెక్కడి చోద్యం అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

మోదీ విజయాలను ప్రజలు మర్చిపోలేరు

దేశంలో ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియకు బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు అమిత్ షా స్పష్టంచేశారు. బిహార్‌లో కాంగ్రెస్ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రపై విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారుల పేర్లను తొలగిస్తే తప్పేమిటని అన్నారు. దేశ సరిహద్దులను మోదీ ప్రభుత్వం కాపాడుతోందని చెప్పారు. మన సరిహద్దులను అతిక్రమించాలని చూసిన శత్రువులపై సర్జికల్, వైమానిక దాడులు చేసినట్లు గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం నేర్పామని వ్యాఖ్యానించారు. మోదీ నాయకత్వంలో 2027 నాటికి మన దేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని అమిత్ షా ధీమా వ్యక్తంచేశారు. ఇకపై స్వదేశీ ఉత్పత్తులు ఉపయోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఇప్పటిదాకా ఎన్నో విజయాలు సాధించిందని, దేశ ప్రజలు వాటిని ఎప్పటికీ మర్చిపోలేరని వెల్లడించారు. మోదీ పాలనలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి లభించిందని గుర్తుచేశారు.



.. 'అవినీతి అనకొండలు'

గ్రేటర్ పరిధిలోని 'మణి'కొండ చుట్టే 'అవినీతి అనకొండలు' పాగా వేశాయి. ఈ అనకొండలు ఒక్కొక్కటిగా బయటికి వచ్చి ఏసీబీ వలకు చిక్కుతున్నాయి.

-8లో



రిచ్.. రుచి

ఇరానీ చాయ్, కబాబ్‌లు, బిర్యానీలకు సిటీ ప్రసిద్ధి చెంది ఉండవచ్చు.. కానీ ఇప్పుడు ఖరీదైన రుచులకూ కేరాఫ్‌గా మారుతోంది.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/23.0

వాతావరణం

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

కుండపోత బీభత్సం

నగరం మరోసారి తడిసిముద్దయింది. బుధవారం రాత్రి కుంభవృష్టి బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసిన భారీ వర్షంతో నగర జన జీవనం అతలాకుతలమైంది. ఆకాశానికి చిల్లుపడిందా? అన్నట్లుగా వర్ష ఉధృతితో నగరవాసులు బెంబేలెత్తిపోయారు. వర్షం దాటికి నిమిషాల వ్యవధిలోనే రోడన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు అపార్ట్‌మెంట్లతోపాటు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. ప్రధాన రహదారులపై మోకాళ్ల లోతు నీరు వచ్చి చేరగా, డ్రైనేజీ, ఓపెన్ నాలాలు పొంగిపొర్లాయి. మెట్రో స్టేషన్లు, బ్రిడ్జిల కింద భారీగా నీరు చేరింది. పలు ప్రాంతాల్లో వరద నీటి ధాటికి వాహనాలు కొట్టుకుపోయాయి. భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అయింది. మాదాపూర్–హైటెక్ సిటీ చౌరస్తా, రాయదుర్గం, అమీర్‌పేట బంజారాహిల్స్ ఐకియా మార్గంలో, మియాపూర్– చందానగర్ నగర్ మార్గంలో రహదారిపై వాహనాలు ముందుకు కదల్లేదు. దీంతో ముంబై జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి 12 గంటల వరకు అత్యధికంగా ముషీరాబాద్ తాళ్లబస్తీలో 18.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. – సాక్షి, సిటీబ్యూరో



రాత్రి 12 గంటల వరకు వర్షపాతం ఇలా..

ప్రాంతం	సెంటీమీటర్లలో
ముషీరాబాద్ తాళ్ల బస్తీ	18.4
భోలక్‌పూర్	15.5
చిలకలగూడ	14.7
మోండా మార్కెట్	14.6
న్యూ మెట్టుగూడ	14.0
హెచ్‌సీయూ	13.9
లింగంపల్లి	12.9
మియాపూర్	12.7



బేగంపేట పెట్రోల్ బంక్ సమీపంలోని రహదారిని ముంచెత్తిన వరద



ప్రజా భవన్ సమీపంలో..



బేగంపేటలో వరద నీటిలో వాహనదారుడి కష్టాలు

నేటి నుంచి ట్రాఫిక్ సమ్మిట్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసులు తొలిసారిగా ట్రాఫిక్ సమస్యలు, పరిష్కారాలపై కీలక సదస్సు నిర్వహించనున్నారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ నేతృత్వంలో ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025 పేరుతో రెండు రోజుల పాటు దీనిని తలపెట్టారు. నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్‌లో గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సదస్సును ప్రారంభించనున్నారు. ఇందులో వివిధ వాణిజ్య సంస్థలు, నిపుణులు, స్టార్టప్స్, స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొననున్నారు. సురక్షిత నగరాలు, స్థిరమైన రవాణా, సమగ్రమైన ప్రయాణ వ్యవస్థలు, రోడ్డు భద్రతకు సంబంధించిన డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞాతం వినియోగం, భవిష్యత్తులో సవాళ్లు, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాలపై కూలంకషంగా రెండు రోజుల పాటు చర్చించనున్నారు. సదస్సు తీర్మానాలను విధానపరమైన నిర్ణయాల కోసం ప్రభుత్వానికీ సిఫార్సు చేయాలని అధికారులు నిర్ణయించారు. రహదారి భద్రత, ఎలక్ట్రానిక్ వాహనాలు తదితర రంగాల్లో సేవలు అందిస్తున్న స్టార్టప్స్, సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ఈ సమ్మిట్‌లో అవకాశం కల్పిస్తున్నారు. నగరంలోని ట్రాఫిక్ సమస్యలు, విభాగాల మధ్య సమన్వయ లోపం, నగరవాసుల్లో అవగాహన లేమి, పాలకుల నిర్లక్ష్యాలకు ఈ సమ్మిట్ ద్వారా పరిష్కార మార్గాలు చూపాలని సెక్యూరిటీ కౌన్సిల్ భావిస్తోంది.

హైడ్రాలో ప్రజాపాలన దినోత్సవం



జెండా వందనం చేస్తున్న రంగనాథ్ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: సామాన్య ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలని బాధ్యత అందరిపై ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు గుర్తిస్తూ వాటిని పరిష్కరించే విధంగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. బుద్ధ భవన్‌లోని హైడ్రా ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన రంగనాథ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. '1948 సెప్టెంబరు 17న భారత ప్రభుత్వంలో హైదరాబాద్ రాష్ట్రం విలీనమైన సందర్భం నాటి పోరాట పటిమకు నిదర్శనం. దాన్ని ప్రజాపాలనకు హారతి పట్టిన రోజుగా అభివర్ణించవచ్చు. అందుకే ప్రభుత్వం ప్రతి ఏటా ఆ రోజున ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించింది. ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలి. హైడ్రాలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలి. వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేయాలి. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం కూడా ఇదే' అని రంగనాథ్ అన్నారు.

7న హెచ్‌సీయూ 25వ స్నాతకోత్సవం



రాయదుర్గం: వచ్చే నెల 7న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) 25వ స్నాతకోత్సవాన్ని గచ్చిబౌలి శాంతి సరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహ్మరెడ్డి, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర శాస్త్ర , సాంకేతిక మంత్రిత్వశాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పాల్గొంటారు. సుమారు 1,700 మంది గ్రాడ్యుయేట్లకు వివిధ కోర్సులలో డిగ్రీలు, ప్రతిభ చాటిన వారికి బంగారు పతకాలను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవంలో వ్యక్తిగతంగా డిగ్రీలను పొందాలనుకునే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని హెచ్‌సీయూ అధికారులు సూచించారు.

రేపు పశువైద్య విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ఏజీవర్సిటీ: ఈ నెల 19న పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు వీసీ ఎం.జ్ఞాన ప్రకాశ్ తెలిపారు. బుధవారం పశువైద్య విశ్వవిద్యాలయంలో వీసీ భవనంలో ఆయన మాట్లాడుతూ.. స్నాతకోత్సవం 2023 నుంచి 2024 వరకు పట్టభద్రులైన మొత్తం 524 మందికి పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. 25 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



హైదరాబాద్‌ను అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దుతాం

జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచంలోనే హైదరాబాద్‌ను అగ్రశ్రేణి నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అధికారులు, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ.. అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ప్రాంతం రాజరిక, నిరంకుశ పాలన నుంచి విముక్తి పొంది ప్రజా పాలనకు అడుగులు పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. ఒక్క హైదరాబాద్ నగరంలోనే 50 వేలకు పైగా పేద కుటుంబాలకు ఇటీవల రేషన్‌కార్డులను పంపిణీ చేశామన్నారు. మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ ప్రక్షాళన, హై సిటీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ ప్రపంచంలోనే మేటి నగరంగా మారనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, అదనపు కమిషనర్లు కె. వేణు గోపాల్, గీతా రాధిక, సీసీపీ శ్రీనివాస్ , చీఫ్ ఇంజినీర్లు సహదేవ్ రత్నాకర్, నిత్యానంద్, విజిలెన్స్ ఏఎస్పీ సుదర్శన్ , డీఎస్పీ నరసింహారెడ్డి, ప్రజా సంబంధాల అధికారి మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

- ముగ్గురు గల్లంతై నాలుగు రోజులు
- ఇప్పటికీ ఆచూకీ దొరకని దైన్యం
- తిలా పాపం తలా పిడికెడు వైనం
- రూ.కోట్లు ఖర్చయినా తీరని సమస్యలు

ఎవరిది పాపం.. ఎవరికి శాపం?

ఎన్నేళ్లయినా తప్పని నాలా చావులు

సాక్షి, సిటీబ్యూరో

ముషీరాబాద్ పార్సీగుట్ట ప్రాంతంలో దినేశ్, మల్లేపల్లి అఫ్జల్ సాగర్ ప్రాంతంలో అర్జున్, రామ అనే ముగ్గురు యువకులు నాలాల్లో గల్లంతై నాలుగు రోజులైనా ఆచూకీ లభించలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ మొక్కుబడి ప్రకటనలు తప్ప అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు వివిధ ప్రభుత్వ విభాగాలు అందుకు కారణం తాము కాదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. నాలాల వెంబడి ఉండే పేదలు, అమాయకుల ప్రాణాలు నాలాల్లో కలిసిపోతున్నాయి. కనీసం కడసారి చూసుకుందామనుకున్నా.. మృతదేహాలు జాడ కనిపించడం లేదు.

దాదాపు 15 వేల ఆక్రమణలు..

నగరంలో నాలాల సమస్యలు ఈనాటివి కావు. వరద ముప్పునకూ అవే కారణం కావడంతో 2000 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాల నుంచీ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు మారడం.. రూ.కోట్లు ఖర్చయ్యాయి తప్ప పాతికేళ్లయినా ప్రజల ప్రాణాలు పోవడం ఆగలేదు. అసలు నాలా సమస్య పరిష్కారానికి కిర్లోస్కర్, వాయెంట్స్ సొల్యూషన్స్ నివేదికలే కీలకమైనా.. నేతలు తమ ఓట్ల కోసం వాటికి డీవియేషన్లు చేశారు. దాంతో సమస్యలకు శాశ్వత పరిష్కారం లేకుండా పోయింది. డ్రోన్లతో సహ వివిధ సర్వేలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దాదాపు 15వేల ఆక్రమణలు తొలగించనిదే సమస్య పరిష్కారం కాదు. నిధులు సైతం రూ.20వేల కోట్లు అవసరం. కానీ.. ఆక్రమణలు తొలగిస్తే ఓట్లు రాలవనే తలంపుతో ఏ ప్రభుత్వంలోని వారైనా ప్రత్యామ్నాయంగా పనులు దారి మళ్లించడమో, నాలాలను విస్తరించే బదులు లోతు పెంచడమో వంటి ఆలోచనలే చేశారు. ఇందుకు ఏపార్టీ మినహాయింపు కాదు. అధికార యంత్రాంగం సైతం ఎప్పుడో సంభవించే ప్రమాదాల కోసం అంత భారీ పనులు నెత్తికెత్తుకోలేమనే ఆలోచనలే చేశాయి. దాంతో సమస్యకు శాశ్వత పరిష్కారం అనేది లేకుండాపోయింది.



అర్జున్, రామ కొట్టుకుపోయిన ప్రదేశం

రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేసినా..

దాదాపు రూ. 15వేల కోట్లు ఖర్చయ్యే పరిష్కారాల బదులు ఖర్చు తగ్గే ప్రణాళికలు వేశారు. ప్రత్యేకంగా ఎస్ఎన్‌డీపీ(వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) పేరిట దాదాపు వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేశారు. కానీ, కనీస భద్రత చర్యలు మాత్రం గాలికొదిలారు.

అశ్రద్ధ.. నిర్లక్ష్యం

ఇటీవలే బంజారాహిల్స్‌లో నాలా కప్పు కూలి లారీ దిగబడింది. అదృష్టవశాత్తూ అప్పుడు ప్రాణాపాయం తప్పింది. ఆ ఘటనతోనైనా అప్రమత్తమయ్యారా? అంటే కాలేదనే చెప్పాలి. నాలాలకు ఎక్కడ కప్పులు సరిగా లేవో, ఎక్కడ రిటైనింగ్ వాల్స్ దెబ్బతిన్నాయో తనిఖీలు చేసి తగిన మరమ్మతులు చేయడం.. కనీసం సదరు ప్రాంతాల్లో మెష్‌లు, హెచ్చరికల బోర్డుల వంటివి ఏర్పాటు చేసినా ప్రమాదకర నాలా ఉన్నట్లు తెలుస్తుంది. కనీసం ఆ పనులు కూడా చేయలేదు.

ఏదీ నాలా సేఫ్టీ ?

గతంలో ప్రతియేటా వర్షాకాలానికి ముందే తమ పరిధిలోని నాలాలన్నింటినీ ఇంజినీర్లు స్వయంగా కాలినడకన తిరిగి ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరగకుండా భద్రతచర్యలు తీసుకునేలా చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే జవాబుదారీ వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దాంతో, పూర్తిస్థాయిలో కాకపోయినా ప్రమాదాల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం నాలా సేఫ్టీ అనేది పూర్తిగా విస్మరించారు.



దారుస్సలాం వద్ద నాలా దుస్థితి

గొప్పయితే తాము.. తప్పయితే కాదు

ఇటీవల నాలాలకు సంబంధించిన బాధ్యతలు కూడా హైడ్రాకు అప్పగించడంతో జీహెచ్‌ఎంసీ నాలాలపై దృష్టి సారించడంలేదు. నాలాల్లో పూడిక తీత పేరిట ఏటా రూ.50 కోట్లకు పైగా ఖర్చవుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది.

వేలాది కిలోమీటర్లు

నగరంలో అక్కడా ఇక్కడా అని కాదు. అన్ని ప్రాంతాల్లో దాదాపు 5వేల కిలోమీటర్ల మేర నాలాలున్నాయి.

అధికారుల లెక్కల మేరకు..

నాలాల పొడవు: 1302 కిలోమీటర్లు
మేజర్ నాలాల పొడవు : 393 కిలోమీటర్లు
బఫర్‌జోన్ పరిధిలో
అక్రమ నిర్మాణాలు: 28,000

కప్పుల్లేవ్.. రక్షణ చర్యల్లేవ్

రెండు మీటర్లలోపు వెడల్పు ఉండే నాలాలన్నింటికీ పైకప్పులుండాలి. కానీ, చాలా ప్రాంతాల్లో లేవు. నేరేడ్‌మెట్ నాలాలో పడి బాలిక మరణించినప్పుడు అన్నింటికీ పైకప్పులు వేస్తామని ప్రకటించినా, ఇప్పటికీ ఆ పనులు పూర్తి కాలేదు. ముషీరాబాద్ నాలాకు కూడా పైకప్పు లేదు. రెండు మీటర్ల కంటే ఎక్కువ వెడల్పుండే నాలాల్లో ప్రజలు పడిపోకుండా, వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలి. వాటిని విస్మరించారు.

చెత్త పనులూ కారణమే..

నగరంలోని నాలాల్లో నానాల రకాల చెత్త కుమ్మరిస్తున్న ప్రజలు కూడా సమస్యలకు కారకులే. ఆహార వ్యర్థాల నుంచి మొదలు పెడితే పరుపుల దాకా నాలాల్లో కుమ్మరిస్తుండటంతో వర్షాలొచ్చినప్పుడు పొంగిపొర్లుతున్నాయి.

అవగాహన లేమి

చాలామంది అధికారులకే నగరంలోని నాలాల గురించి సరైన అవగాహన లేదు. ఏ నాలా ఎక్కడ మొదలై, ఎక్కడ ముగుస్తుందో తెలియదు. నాలాలకు సంబంధించిన ఇన్వెంటరీ కూడా లేకపోవడం శోచనీయం.

ఆక్రమణలు ప్రధాన కారణం

ఇక నాలాల ఆక్రమణలకు అంతే లేదు. నాలాలను ఆక్రమించి పలు బహుళ అంతస్తుల భవనాలు నగరంలో కోకొల్లలు. నాలా అంచుల వెంబడే ఉన్న భవనాలకూ లెక్కేలేదు.

ప్రజలు సైతం..

నాలాల ప్రాంతాల్లో ఉండే ప్రజలు సైతం ఆస్తుల సేకరణకు అంగీకరించడం లేదు. ఎంతోకాలంగా ఉంటున్న సొంత స్థలాన్ని వదులుకోవడానికి వారు ససేమిరా అంటున్నారు. ప్రమాదాలు జరిగినా తమకే కదా .. అంటున్న వారూ ఉన్నారు.

విమోచనోత్సాహం

సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ సుమారు 800 మంది కళాకారులు, 12 బృందాల నృత్య, సంగీత ప్రదర్శనలు సందర్శకులను కట్టిపడేశాయి. – సాక్షి, సిటీబ్యూరో/కంటోన్మెంట్





దర్శకుడు ఆర్‌జీవీపై కేసు నమోదు

గచ్చిబౌలి: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ(ఆర్‌జీవీ)పై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన దర్శకత్వం వహించిన 'దహనం' వెబ్ సిరీస్ 2022లో ఏప్రిల్ 14న విడుదల చేశారు. ఇందులో ఫ్యూడలిస్టులు, నక్సలైట్లకు మధ్య జరిగే పోరాటాన్ని తెరకెక్కించారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి చెప్పిన వాస్తవ ఘటనల ఆధారంగా వెబ్ సిరీస్ రూపొందించినట్లు ఆర్‌జీవీ చెప్పారని, ఇది అవాస్తవమని రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అంజనా సిన్హా రెండు రోజుల క్రితం రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తాను ఎవరితోనూ వాస్తవ ఘటనలంటూ చెప్పలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్‌జీవీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మెట్రో రైల్లో నగదు, వస్తువులు చోరీ

అమీర్‌పేట: మెట్రో రైల్లో ప్రయాణించిన ఓ వ్యక్తి నగదు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.22లో ఉంటున్న బూక్యా రామకృష్ణ ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న ఉదయం ఎల్బీనగర్ వెళ్లేందుకు అమీర్‌పేటలో మెట్రో రైలు ఎక్కాడు. రైల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో అతను బ్యాగు కింద పెట్టాడు. కొద్ది సేపటి తర్వాత చూసుకోగా బ్యాగులో పెట్టిన పర్సు కనిపించలేదు. పర్సులో ఐడీ, ఏటీఎం, ఆధార్, పాన్‌కార్డుతో పాటు రూ.10,500 నగదు ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తుర్కయాంజాల్ స్థలాలకు స్పందన శూన్యం

హెచ్ఎండీఏ బిడ్డింగ్‌లో రెండింటికే బేరం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ స్థలాలకు కొనుగోలుదారులు విముఖత చూపారు. బుధవారం తుర్కయాంజాల్‌లోని 12 ప్లాట్లకు ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించగా కేవలం 2 ప్లాట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్లాట్‌కు గజానికి రూ.లక్ష డిమాండ్ రాగా మరో ప్లాట్‌కు గజానికి రూ.70 వేలు ధర పలికినట్లు తెలిసింది. తుర్కయంజాల్‌లోని ప్లాట్లు నలువైపులా సమంగా లేకపోవడం వల్ల, మూలలు హెచ్చుతగ్గులుగా ఉండడం వల్ల కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపలేకపోయారు. మరోవైపు ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధత కూడా కారణమని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా గురువారం బాచుపల్లిలో 70 ప్లాట్లకు వేలం జరుగనుంది. ఈ స్థలాలకు అప్రోచ్ రోడ్డు లేకపోవడం లోపంగా భావిస్తున్నారు. ఈ స్థలాలకు స్పందన ఎలా ఉండనుందో చూడాలి.

భర్త పండ్లు కొనేలోగా..భార్య అదృశ్యం


సువర్ణ(ఫైల్)

మూసాపేట: భర్త పండ్లు కొనుక్కొని వచ్చేలోపే భార్య అదృశ్యమైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అండగ్ల శ్రీనివాస్, సువర్ణ (20) దంపతులు. వీరు కర్ణాటకలోని కాలకుండ గ్రామం నుంచి ఈ నెల 14న కూకట్‌పల్లిలోని మేనమామ ఇంటికి బయలుదేరి వచ్చారు. కూకట్‌పల్లి బస్టాప్‌లో దిగిన శ్రీనివాస్..సిగ్నల్ వద్ద భార్య సువర్ణను నిలబడమని చెప్పి కొద్ది దూరంలో ఉన్న షాపులో పండ్లు కొనుగోలు చేయటానికి రోడ్డు దాటాడు. పండ్లు కొనుక్కుని ఐదు నిమిషాల లోపే తిరిగి వచ్చి చూడగా.. అతని భార్య కనిపించలేదు. చుట్టు పక్కల ఎంత వెతికినా, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో వెతికినా సమాచారం దొరకలేదు. దీంతో కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'మణి'కొండ చుట్టే 'అవినీతి అనకొండలు'!

విద్యుత్, మున్సిపల్, ఇరిగేషన్, కమర్షియల్ ట్యాక్స్ విభాగాల్లో పాగా



- ఏసీబీ వలకు వరుసగా చిక్కుతున్న అవినీతి తిమింగలాలు..
- నార్సింగి టీపీఓ అంశాన్ని మర్చిపోక ముందే తాజాగా మరొకరు
- సంచలనం సృష్టించిన ఏడీఈ అంబేద్కర్ ఉదంతం
- చేవెళ్ల ఏడీఈ ఇంట్లోనూ తాజాగా సోదాలు?

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని 'మణి'కొండ చుట్టే 'అవినీతి అనకొండలు' పాగా వేశాయి. ఇప్పటి వరకు ఎవరికీ కన్పించకుండా పుట్టలో దాగి ఉన్న ఈ అనకొండలు ఒక్కొక్కటిగా బయటికి వచ్చి ఏసీబీ వలకు చిక్కుతున్నాయి. ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ కోసం రూ.నాలుగు లక్షలు తీసుకుంటూ వారం రోజుల క్రితం నార్సింగి మున్సిపల్ కార్పొరేషన్ టీపీఓ మణిహారిక ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే..మంగళవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇబ్రహీంబాగ్ ఆపరేషన్స్ ఏడీఈ అంబేద్కర్‌ను ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో ఏసీబీ అరెస్ట్ చేసింది. తాజాగా బుధవారం ఆయన సన్నిహితుడిగా పేరొందిన చేవెళ్ల ఏడీఈ రాజేష్ ఇంట్లోనూ సోదాలు నిర్వహించింది. బాత్‌రూంలో రూ.20 లక్షల నగదు సహా పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

తప్పించినా..తప్పుకోకుండా...

ఏడీఈ అంబేద్కర్ 1998లో ఏపీఎస్ఈబీ ద్వారా ఖమ్మంలో తొలి పోస్టింగ్ సంపాదించారు. ఆ తర్వాత డిప్యూటేషన్‌పై జీహెచ్ఎంసీకి ఏఈగా వచ్చారు. ఏడీఈగా పదోన్నతి పొందిన తర్వాత డిస్కంలోకి అడుగుపెట్టారు. పటాన్‌చెరు, కేబీహెచ్‌పీ, గచ్చిబౌలిలో కీలక పోస్టుల్లో పని చేశారు. ఆయన సర్వీసు అంతా ఫోకల్ పోస్టుల్లోనే కొనసాగారు. అయితే ఇబ్రహీంబాగ్, మణికొండ, గచ్చిబౌలి డివిజన్లపై గత ఏడాది డిస్కం ఉన్నతాధికారులకు భారీగా ఫిర్యాదులు అందాయి. విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహా అవినీతి, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు అందడటంతో ఈ అంశాన్ని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సీరియస్‌గా తీసుకున్నారు. అప్పట్లోనే గచ్చిబౌలి డీఈని బదిలీ చేశారు. ఇబ్రహీంబాగ్ డీఈకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇదే సమయంలో ఏడీఈ అంబేద్కర్‌ను సైతం మరో చోటికి బదిలీ చేశారు. ఆయినా..వెళ్లకుండా ప్రభుత్వంలోని పెద్దలకు భారీగా ముడుపులు ముట్టజెప్పి మళ్లీ ఆయన అదే పోస్టులో కొనసాగుతూ వచ్చారు. సాధారణంగా మూడేళ్లు ఫోకల్ పోస్టులో పని చేస్తే..ఆ తర్వాత ఆ పోస్టులో ఉంచరు. కానీ ఏడీఈ అంబేద్కర్ విషయంలో ఇవేవీ అమలు కాలేదు. ఏడీఈగా ప్రభుత్వ సంస్థ నుంచి ప్రతి నెలా రూ.లక్షల్లో వేతనాలు పొందుతూ..తన బినామీలతో యూజీ కేబుల్ వర్క్ చేయించి పెద్ద మొత్తంలో ఆస్తులను కూడబెట్టినట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఇళ్లు సహా బంధువులు, సన్నిహితుల ఇళ్లు, ఆఫీసుల్లోనూ ఏసీబీ సోదాలు నిర్వహించింది.

చేవెళ్ల ఏడీఈ ఇంట్లోనూ సోదాలు?

ఇబ్రహీంబాగ్ డివిజన్ చిలుకూరు సెక్షన్ ఏఈగా పని చేసి, ఇటీవలే పదోన్నతిపై చేవెళ్ల వెళ్లిన ఏడీఈ రాజేష్... అంబేద్కర్‌కు సన్నిహితుడని సమాచారం. మారేడుపల్లిలో నివాసం ఉంటున్న రాజేష్ ఇంట్లో బుధవారం ఏసీబీ సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. బాత్‌రూమ్‌లో రూ.17 లక్షల నగదు సహా కీలక స్థిరాస్తి డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. అయితే ఏసీబీ అధికారులు ఈ అంశాన్ని ఇంకా ధృవీకరించలేదు.

ఈ ప్రాంతంలోనే అధికం

- శివారు మున్సిపాలిటీలు, పోలీసుస్టేషన్లు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, విద్యుత్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసుల్లో పోస్టుల కోసం ఉద్యోగుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటుంది. ఐటీ అనుబంధ సంస్థలు, హైరేజ్‌భవనాలు, హోటళ్లు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఎక్కువగా ఉన్న హైటెక్‌సిటీ, మణికొండ, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, బండ్లగూడజాగీర్, నార్సింగి, కోకాపేట్, గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్, మెయినాబాద్ సహా శివారు ప్రాంతాలు ఆయా విభాగాల ఉ ద్యోగులకు కాసుల వర్షంకురిపిస్తుంటాయి. వివిధ విభాగాల్లోని, వివిధ సెక్షన్లలో ఫోకల్ పోస్టింగ్‌ల కోసం భారీగా ఖర్చు చేస్తుంటారు. పెట్టిన ఈ ఖర్చులను తిరిగి సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతూ ఇలా ఏసీబీకి అడ్డంగా దొరికిపోతున్నారు.
- వీరిలో రాజేంద్రనగర్ మున్సిపాలిటీ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ జులై 24న ఓ హోటల్ యజమాని నుంచి రూ.2 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.
- మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జలమండలి మేనేజర్ స్ఫూర్తి రెడ్డి నల్లాకనెక్షన్‌కు రూ.30 వేలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడింది.
- మణికొండ మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈ దివ్యజ్యోతి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు స్వయంగా ఆమె భర్త వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఉన్నతాధికారులు ఆమెను ఇక్కడి నుంచి తప్పించారు. ఆమెపై ఏసీబీ కేసు నమోదైంది.
- నెక్నంపూర్‌లోని ఓ నిర్మాణానికి నిరభ్యంతర పత్రం జారీ కోసం రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన ఇరిగేషన్ ఏఈ నిఖేష్, గండిపేట సర్వేయర్ గణేష్ ఎన్ఓసీ జారీ కోసం భారీగా డబ్బులు డిమాండ్ చేసి పట్టుబడ్డారు.
- నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్ కార్తీక్‌లు ఏసీబీ కేసులో అరెస్ట్ అయ్యారు.
- గోపన్‌పల్లిలోని ఓ నిర్మాణంలో ఉన్న భవనానికి విద్యుత్ మీటర్ మంజూరు కోసం డబ్బులు డిమాండ్ చేసి గచ్చిబౌలి డివిజన్ ఏడీఈ సతీష్ ఏసీబీకి చిక్కారు. ఆయన వంద కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టినట్లు గుర్తించారు.
- మాదాపూర్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ ఎం.సుధ జులై 9న ఓ చిన్న కంపెనీకి జీఎస్టీ రిజిస్ట్రేషన్ కోసం రూ.8 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు.

ఆటోల దొంగ అరెస్ట్


స్వాధీనం చేసుకున్న ఆటోలతో మేడ్చల్ ఏసీపీ తదితరులు

మేడ్చల్ రూరల్: చెడు వ్యసనాలకు బానిసై..డబ్బుల కోసం ఆటోలను దొంగిలించి సొమ్ము చేసుకుంటున్న వ్యక్తిని మేడ్చల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం..లింగాపూర్ గ్రామానికి చెందిన కొరుపతి శ్రీరాములు అలియాస్ రాము కొంత కాలంగా దుండిగల్ పరిధిలోని చర్చి గాగిల్లాపూర్‌లో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన రాము తన జల్సాలు తీర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అందులో భాగంగా స్టీరింగ్ లాక్ (తాళం) లేని ఆటోలను దొంగిలించేందుకు ప్లాన్ వేసుకుని మేడ్చల్, దుండిగల్, గండిమైసమ్మ ప్రాంతాల్లో ఆటోలను దొంగలించారు. ఇటీవల మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఆటో దొంగిలించగా పోలీసులు దర్యాప్తు చేసి దొంగతనాలకు పాల్పడుతున్న రామును అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితుడు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అతని వద్ద నుండి మూడు ఆటోలు స్వాధీనం చేసుకుని బుధవారం రిమాండ్‌కు తరలించారు.

ఓవర్ హెడ్‌ట్యాంక్ ఓవర్ ఫ్లో: వ్యక్తికి జరిమానా

సాక్షి, సిటీబ్యూరో: ఓవర్ హెడ్ ట్యాంకు ఓవర్ ఫ్లోలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బంజారాహిల్స్‌లో ఇంటి యజమానికి అధికారులు జరిమానా విధించారు. తట్టిఖాన పరిధి బంజారాహిల్స్‌లో ఒక ఇంటి నుంచి బోర్ వెల్ నీరు ట్యాంక్ నిండి నీరు ఓవర్ ఫ్లో అయి వీధిలోకి వచ్చింది. అక్కడే విధుల్లో ఉన్న మేనేజర్.. నీటి వృధా గమనించి ఇంటి యాజమానికి నోటీసు జారీ చేసి రూ.5000 జరిమానా విధించారు.

అందుబాటులోకి టెలీ రోబోటిక్ సర్జరీలు


సర్జరీ వివరాలు తెలుపుతున్న డాక్టర్ చంద్రమోహన్

సాక్షి, సిటీబ్యూరో: 'రోబోటిక్ సర్జరీలు చేశాం..టెలీ సర్జరీల గురించి విన్నాం...ఈ రెండింటిని కలపి సుదూర ప్రాంతంలో ఉన్న వ్యక్తికి ఖచ్చితత్వంతో కూడిన టెలీ రోబోటిక్ సర్జరీ చేయడం కొత్త టెక్నాలజీ' అని ప్రీతీ కిడ్నీ ఆసుపత్రి ఎండీ చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పుట్టుకతోనే కిడ్నీ సమస్య ఉన్న 16 నెలల బాలుడికి చికిత్స చేయాల్సి వచ్చిందన్నారు. అయితే గురుగ్రాంలో ఉన్న తాను కొండాపూర్ ప్రీతి ఆసుపత్రిలో ఉన్న బాలునికి టెలీ–రోబోటిక్ పద్ధతిలో సర్జరీని విజయవంతంగా పూర్తి చేశానని చంద్రమోహన్ తెలిపారు. దీనికి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. మరో కేసులో ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో ఓ మహిళకు గర్భసంచి తొలగించిన తరువాత సమస్య రావడంతో తమను సంప్రదించారని, ఆమెకు టెలీ–రోబోటిక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ప్రీతి ఆసుపత్రి ఈడీ డా.రూప, సీఈఓ రంగప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాలాలపై ఆక్రమణలు తొలగించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు
- అఫ్జల్‌సాగర్ నాలా బాధితులకు పరామర్శ

నాంపల్లి: భారీ వర్షాల కారణంగా నాలుగు రోజుల క్రితం వరదలో కొట్టుకుపోయిన అఫ్జల్‌సాగర్ మాన్గార్ బస్తీకి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలను బుధవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా అఫ్జల్‌సాగర్ నాలా పరివాహక ప్రాంతాలను ఆయన స్వయంగా పరిశీలించారు. నాలాలో గల్లంతైన వారిని గుర్తించేందుకు సెర్చ్ ఆపరేషన్‌ను వేగవంతం చేయాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. అలాగే హబీబ్‌నగర్ నాలా, అఫ్జల్ సాగర్ నాలాల వెంబడి ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. మురికివాడలపై ప్రత్యేక దృష్టిని సారించాలని, కూలడానికి సిద్ధంగా ఉన్న వాంబే గృహాల్లో నివసిస్తున్న నిరుపేదలకు ప్రత్యామ్నాయంగా ఆవాసం కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. మురికివాడల్లో స్వచ్ఛత కనపించడం లేదని, మురికి కూపంలా మారిన బస్తీలను కాస్త పరిశుభ్రంగా ఉంచాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, దోమలు, ఈగలు విజృంభించకుండా చూడాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా సమీక్షా సమావేశంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అఫ్జల్‌సాగర్, మాన్గార్ బస్తీల భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జిల్లా అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్‌చంద్ర, డివిజన్ అధ్యక్షులు మధు, స్థానిక బీజేపీ నేతలు గోపి తదితరులు పాల్గొన్నారు.


అఫ్జల్‌సాగర్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

లోన్ తీసుకుని లూటీ చేశారు!

- ఏపీకే ఫైల్ ద్వారా కథనడిపిన కేటుగాళ్లు
- బాధితుడి ప్రమేయం లేకుండానే రుణం
- మొత్తం రూ.13 లక్షలు స్వాహా చేసిన వైనం



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు నానాటికీ తెలివి మీరుతున్నారు. బాధితులు ఊహించని, వారి ఊహకు అందని విధంగా పంజా విసురుతున్నారు. సెల్‌ఫోన్లలోని ఏపీకే ఫైల్స్ పంపి, వారి ఖాతాలకు ఖాళీ చేస్తున్న నేరాలు ఇటీవల కాలంలో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయితే బాధితుల నెట్ బ్యాంకింగ్‌ను వాడి, వారి ప్రయేయం లేకుండానే వారి పేరుతో రుణం తీసుకుని, ఖాతాలో పడిన తర్వాత, సేవింగ్స్‌తో కలిపి కాజేస్తున్న ఉదంతాలు పెరుగుతున్నాయి. ఈ పంథాలో రూ.12.75 లక్షలు కోల్పోయిన సికింద్రాబాద్ వ్యక్తి ఈ నెల 2న సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు. తాజాగా రూ.13 లక్షలు కోల్పోయిన మరో బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన బాధితుడి (45) ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు ఇటీవల 'ఈ చలాన్ ఆర్టీఓ.ఏపీకే' పేరుతో ఉన్న లింకు పంపారు. దీనిపై అవగాహన లేని ఆ బాధితుడు అది ఈ–చలాన్లకు సంబంధించిన యాప్ అని భావించి క్లిక్ చేశారు. ఆ వెంటనే అందులో ఉన్న ఏపీకే ఫైల్ బాధితుడి ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిపోయింది. ఇలా బాధితుడి ఫోన్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు ఆయనకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నెట్ బ్యాంకింగ్‌ను యాక్సస్ చేశారు. 'పే యూ మన ప్పుడు ఫిన్' పేరుతో ఉన్న వారి ఖాతాను బెనిఫిషియరీ అకౌంట్‌గా యాడ్ చేసుకున్నారు. లావాదేవీలకు సంబంధించిన ఓటీపీలు సైతం నేరగాళ్లు చూడగలగటంతో బాధితుడి నెట్ బ్యాంకింగ్ ద్వారానే రూ.12.5 లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మొత్తం మంజూరై బాధితుడి ఖాతాలో పడింది. దీంతో పాటు అప్పటికే ఖాతాలో ఉన్న సేవింగ్స్ రూ.50 వేలు కలిపి మొత్తం రూ.13 లక్షలు స్వాహా చేశారు. ఈ లావాదేవీలకు సంబంధించిన సందేశాలు వరుసపెట్టి అందుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించారు. అతడి ఫోన్ అధ్యయనం చేసిన అధికారులు ఈ ఏపీకే ఫైల్‌తో కూడిన యాప్ గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

భార్యాభర్తలు గొడవ పడొద్దన్నందుకు..

స్నేహితుడిపై కత్తితో దాడి

ఇబ్రహీంపట్నం రూరల్: భార్యాభర్తలు గొడవపడుతుండగా వద్దని వారించిన మిత్రుడు కత్తిపోట్లకు గురయ్యాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన ప్రకారం.. ఆదిబట్ల ఠాణా పరిధి కుర్మల్‌గూడ ఆర్‌జీకేలో నివాసం ఉండే అహ్మద్ హుస్సేన్ ఈవెంట్ వర్కర్. రాత్రి పని ముగించుకుని ఒంటిగంట ప్రాంతంలో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి సమీపంలో ఉన్న గ్రౌండ్‌లో అహ్మద్ హుస్సేన్ తమ్ముడు సోఫియా తన మిత్రులతో కలిసి ముచ్చటిస్తున్నాడు. పక్కబ్లాక్‌లో ఉండే అహ్మద్ స్నేహితుడు అజహర్ భార్యతో గొడవపడుతున్నాడు. వారి అరుపులు విన్న సోఫియా సర్దిచెప్పేందుకు వెళ్లగా నీకు ఎందుకు అంటూ అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేశాడు. దీంతో సోఫియా తిరిగి గ్రౌండ్‌కు వచ్చేశాడు. ఇంతటితో ఆగని అజహర్ ఇంట్లోని కత్తి జేబులో పెట్టుకుని వచ్చి సోఫియాతో గొడవకు దిగాడు.

సోదరుడి గొడవను గమనించిన అహ్మద్ హుస్సేన్ అక్కడకు చేరుకుని వద్దని వారించడంతో అజహర్ వెంట తెచ్చుకున్న కత్తితో వీపు, నడుము క్రింది భాగంతో దాడి చేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన అహ్మద్ హుస్సేన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ బిల్లు పెండింగ్ అంటూ 'సైబర్' టోకరా

నాగోలు: నీటి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వెంటనే బిల్లు క్లియర్ చేయాలని ఓ వ్యక్తి వాట్సాప్‌కు ఏపీకే ఫైల్ పంపించి..అతని క్రెడిట్ కార్డులో ఉన్న రూ.95,237 నగదును సైబర్ నేరస్తులు కాజేశారు. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మన్సూరాబాద్, శ్రీరామ్‌నగర్ కాలనీలో నివాసం ఉండే శ్రీనివాస్‌రెడ్డికి గత నెల 11న నీటి బిల్లులు పెండింగ్ ఉన్నాయని, వెంటనే చెల్లించాలంటూ మొబైల్ నంబర్‌కు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో బిల్లు క్లియర్ చేయాలనే ఉద్దేశంతో మెసేజ్ పంపిన వ్యక్తికి ఫోన్ ద్వారా సంప్రదించాడు. అతను వాట్సాప్ ద్వారా ఏపీకే ఫైల్‌ను పంపి దానిని ఇన్‌స్టాల్ చేయమని కోరాడు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయగా..అతని ఫోన్ హ్యాక్ చేసి..అతని క్రెడిట్ కార్డు నుండి రూ.95,237 డబ్బులు కాజేశారు. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు బుధవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య


రాజేష్ (ఫైల్)

మూసాపేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం రోడ్డులో నివాసముంటున్న దొడ్డపనేని రాజేష్ (35). ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేసేటప్పుడు ఆర్థిక ఇబ్బందుల గురించి బాధపడ్డాడు. అనంతరం పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఉదయం తన భర్తకు డ్యూటీ లేనందున బయటకు వెళ్లేందుకు అడుగుదామని తలుపులు తెరవగా తెరుచుకోలేదు. తన తమ్ముడు గోపి రామకృష్ణకు విషయం చెప్పి తలుపులు తెరవగా రాజేష్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. చుట్టు పక్కల వారి సాయంతో దగ్గరలోని ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.ఆర్థిక ఇబ్బందుల వల్లనే తన భర్త ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

పోచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం..ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన షేక్ పర్వీన్ (35) తన కూతురు షేక్ రజియాతో కలిసి సాదత్‌అలీగూడలో ఉంటూ అదే ప్రాంతంలోని ఓ భవన నిర్మాణ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. ఉప్పల్‌లోని డీఎస్ఎల్ మాల్‌లో రజియా పనిచేస్తోంది. ఆర్థిక ఇబ్బందులతో పర్వీన్ విచారంగా ఉండేది. మంగళవారం రజియా పనికి వెళ్లగా ఆమె ఇంట్లోనే ఉన్నారు. అదే రోజు సాయంత్రం సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో రజియా ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతోనే పర్వీన్ ఆత్మహత్య చేసుకుని ఉంటారని, ఎవరిపైనా అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

స్లాబ్ మీద పడి వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్: భవనం కూల్చివేత పనుల చేపడుతుండగా ప్రమాదవశాత్తు స్లాబ్ మీద పడి ఓ వ్యక్తి తీవ్రగాయాలకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మలక్‌పేట దయానంద్ నగర్‌లో ఓ భవనం కూల్చివేత పనులు చేపడుతున్నారు. ఇక్కడ పని చేయడానికి వచ్చిన కార్మికుడు రవికిరణ్ గోడను కూలుస్తుండగా ప్రమాదవశాత్తు రెండవ అంతస్తులోని బాత్రూం స్లాబ్ అతనిపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


రంజిత్ (ఫైల్)

ఉప్పల్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన ప్రకారం..వరంగల్ మండలం నిక్కొడ గ్రామానికి చెందిన వెలిశాల రంజిత్ (35) రామంతాపూర్ ఇందిరానగర్‌లో నివాసముంటూ ఉప్పల్‌లో ఓ షాపింగ్‌మాల్‌లో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి స్నేహితుడు బాలకృష్ణతో కలిసి బైకుపై రామంతాపూర్ వెళ్తుండగా మార్గమధ్యలో డీఎస్ఎల్ మాల్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న రంజిత్ కింద పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. బాలకృష్ణ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రంజిత్‌కు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

తెలంగాణ భవన్‌లో జాతీయ సమైక్యతా దినోత్సవం



బంజారాహిల్స్: తెలంగాణ భవన్‌లో బుధవారం జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు హాజరై తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి సంబరాలు జరుపుకున్నారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ హాజరై జాతీయ సమైక్యతా దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వడ్డాణం శ్రీనివాస్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, మేరీసునంద, రమాదేవి, ఉద్యోగ సంఘాల నాయకులు కాంతం ప్రేమ్‌కుమార్, భరత్‌రెడ్డి, యాకేష్‌దైద తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి



విద్యార్థులకు స్కూలు బ్యాగులు అందజేస్తున్న విజయలక్ష్మీ..

రహమత్‌నగర్: ప్రతివ్యక్తీ సేవాగుణం కలిగి ఉండాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకురాలు కంజర్ల విజయలక్ష్మీ పేర్కొన్నారు. బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో ఎంతో మంది నిరుపేదలు సరైన సౌకార్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారిని ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆమే సూచించారు. కాంగ్రెస్ నాయకుడు రాజు యాదవ్,ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బోరబండలో ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న శోభారాణి

రహమత్‌నగర్: బోరబండ డివిజన్‌లోని అర్బన్ ప్రైమరీహెల్త్ సెంటర్‌లో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాష్ట్ర మహిళా కోఆపరేటివ్ డెవలప్ మెంట్ చైర్ పర్సన్ శోభారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్లమ్ ఏరియాల్లో తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల పేద ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.నగర కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా, వైద్యాధికారులు డా.నాగ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర, హస్త కళా ప్రదర్శన

సనత్‌నగర్: పద్మారావునగర్‌లోని కొత్త కామకోటి కల్యాణ నిలయంలో కళాసిల్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర, హస్త కళా ఉత్పత్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత వస్త్రాలు, అన్ని రకాల కాటన్ వస్త్రాలు, దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులు, హస్తకళా వస్తువులు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలో అన్ని రకాల శుభకార్యాలకు సంబంధించిన వస్త్రాలు, ఇంటి గృహోపకరణాలు లభ్యమవుతాయని పేర్కొన్నారు. ఇటువంటి ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి లభించడంతో పాటు వినియోగదారులకు తక్కువ ధరలకే ఉత్పత్తులు దొరుకుతాయన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలని తెలిపారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

బస్తీలో బడి ఏర్పాటు..త్వరలో నిర్మాణం

- నెరవేరనున్న దశాబ్దాల బస్తీ ప్రజల కల..
- శ్రీరామ్‌నగర్‌కాలనీ బస్తీవాసుల హర్షాతిరేకాలు..



విద్యాశాఖకు భూమి అప్పగిస్తూ సంబంధిత పత్రాలను అందజేస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ బస్తీలో ఏడు వేలకు పైగా జనాభా నివసిస్తుండగా ఇక్కడ పాఠశాల లేకపోవడంపై బస్తీవాసులు గతంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారుల దృష్టికి మేయర్ తీసుకువెళ్లగా స్థలం లేకపోవడంతో పాఠశాలను ఏర్పాటు చేయలేకపోతున్నామని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి రూ.4 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం 240 గజాలను కాలనీలో బడి భవన నిర్మాణానికి గుర్తించారు. బడి భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు శ్రీరాంనగర్ కాలనీ వాసుల సమక్షంలో షేక్‌పేట రెవెన్యూ అధికారులు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ చేతుల మీదుగా విద్యాశాఖకు భూమి అప్పగిస్తూ సంబంధిత పత్రాలను బుధవారం అందజేశారు. మరోవైపు ప్రాథమిక పాఠశాల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా సమర్పించారు. త్వరలోనే కలెక్టర్ నిధులతో సదరు స్థలంలో బడి భవనం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌నగర్‌కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ పిల్లలు చదువు కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రైవేటు చదువులు భారమయ్యాయని, మేయర్ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి బడి నిర్మాణానికి స్థల గుర్తింపుపై ప్రత్యేక దృష్టిపెట్టారని ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే తమ కల సాకారం కానుందని, స్పందించిన మేయర్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నట్లు చెప్పారు.

స్మృతివనం కోసం వంద ఎకరాలు కేటాయించండి



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుదర్శన్‌రావు..

బంజారాహిల్స్: తెలంగాణ సాధన కోసం 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ఎంతగానో పోరాటం చేసిందని, వారి జ్ఞాపకార్థం కంటోన్మెంట్‌లో స్మృతివనం నిర్మాణం కోసం వంద ఎకరాల స్థలం కేటాయించాలని సమితి సెక్రటరీ జనరల్ సుదర్శన్‌రావు బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. 1969 ఉద్యమకారుల జ్ఞాపకార్థం వంద ఎకరాలు కేటాయించాలని ఇప్పటికే తాము బీజేపీ ఎంపీలందరికీ, ప్రధాని మోదీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ రక్షణ శాఖ అధికారులతో మాట్లాడి ఇందుకు సంబంధించిన నిర్ణయం తీసుకుంటామని, త్వరలోనే వారందరినీ పిలిపించి చర్చిస్తామన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఫిలింనగర్ అంబేద్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి మోహిత్ కృష్ణ ఈ పుస్తకాలను బహుకరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, తులసి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: భవిష్యత్ తరాల మనుగడ కోసం ఓజోన్ పొరను కాపాడుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంలో యువత కీలకపాత్ర వహించాలని ప్రముఖ పర్యావరణ వేత్త, ప్రొఫెసర్ కె.పురుషోత్తం రెడ్డి అన్నారు. బుధవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ .. సూర్యుని నుండి వచ్చే హానికరమైన అల్ట్రా వైలెట్ కిరణాల నుండి ఓజోన్ పొర భూమికి రక్షణ కవచంగా ఉంటుందని క్లోరో ఫ్లోరో కార్బన్ వంటి రసాయణాలు ఓజోన్ పొరను క్షీణింప చేస్తాయని దీని ఫలితంగా చర్మ క్యాన్సర్, కంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పర్యావరణ విజ్ఞాన శాఖ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యాద అజీమోనిసా మాట్లాడుతూ .. సాంప్రదాయ ఇంధన వనరుల స్థానంలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచడం ద్వారా భూతలాన్ని తగ్గిస్తూ ఓజోన్ పొరను కాపాడేందుకు వీలౌతుందన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర కుమార్, అమీర పీస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఫరూక్ అలీ, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ్, మహమ్మద్ అక్తర్, నవీన్, రాఘవేందర్, వినాయక కుమార్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు సీజ్..



బంజారాహిల్స్: అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. తేజాకాలనీలో నూర్జహాన్‌బేగం పేరిట స్టిల్ట్ ప్లస్ 2 నిర్మాణానికి అనుమతులు పొంది 3, 4, 5 అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం అక్రమంగా నిర్మించగా ఆ భవనాన్ని సీజ్ చేశారు. అలాగే అదే కాలనీలో అర్షియా తబ్బసుం పేరిట స్టిల్ట్ ప్లస్ 2 అంతస్తులకు అనుమతులు తీసుకుని 3, 4, 5 అంతస్తులు, పెంట్‌హౌస్ నిర్మాణం అనధికారికంగా నిర్మించగా సదరు భవనాన్ని కూడా అధికారులు సీజ్ చేశారు.

22 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ అర్జున్‌యాదవ్.

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు శ్రీభ్రమరాంబదేవి అమ్మవారి దసరా శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్ తెలిపారు. వేడుకల్లో భాగంగా శ్రీభ్రమరాంబదేవి అమ్మవారికి వివిధ అలంకారాలతో శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. బుధవారం ఆలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 22వ తేదీన అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో, 23న శ్రీగాయత్రీదేవి, 24న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 25న అఖిలాండేశ్వరిదేవి, 26న శ్రీమహాలక్ష్మీదేవిగా, 27న శ్రీలలితాదేవిగా, 28న శ్రీస్కంద మాతదేవిగా, 29న శ్రీసరస్వతీదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిగా, 2న శ్రీరాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారని తెలిపారు. ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ కూడా పాల్గొన్నారు.

24 నుంచి బ్రహ్మోత్సవాలు..

శ్రీనగర్‌కాలనీ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 24 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అర్జున్‌యాదవ్ తెలిపారు. మొదటిరోజున శ్రీస్వామి వారి శేషవాహన సేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబర్ 2న సాయంత్రం శమీ వృక్షపూజ, రావణ దహనం వేడుకలు ఉంటాయని తెలిపారు. అక్టోబర్ 3న ఏకాదశి వేడుకలు నిర్వహిస్తామన్నారు. అదేరోజు మహా పూర్ణాహుతి, పుష్పయాగం, అశ్వవాహనసేవ వైభవంగా జరుగుతాయని తెలిపారు.

చెత్త తరలించే వారే చెత్త వేస్తే ఎలా..?



బంజారాహిల్స్ రోడ్ నెం. 3 పేజ్ కాలేజీ చౌరస్తాలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది సేకరించి వేసిన చెత్త

వెంకటేశ్వరకాలనీ: బస్తీల్లో, కాలనీల్లో సేకరించిన చెత్తను తరలించాల్సిన జీహెచ్‌ఎంసీ సిబ్బందే కాలనీ చౌరస్తాలలో కుప్పలుగా చెత్తను పోస్తే ఎలా అని కాలనీవాసులు మండిపడుతున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని పేజ్ కాలేజీ చౌరస్తాలో గడిచిన కొన్ని నెలలుగా స్థానికంగా విధులు నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది సేకరించిన చెత్తను రోడ్డుపక్కన కుప్పలుగా పోస్తున్నారని దీంతో దోమలు స్వైర విహారం చేయడంతో పాటు కుక్కల చెత్తను చిందరవందర చేసి రోడ్డు మీదికి ఈడ్చుకొస్తున్నాయని, దీంతో స్థానికంగా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుందని ఇంటింటికి తిరిగి సేకరించిన చెత్తను ఇక్కడ కుప్పలుగా పోస్తున్నారని ఇలా చేయవద్దని పలుమార్లు చెప్పినా తమ మాట వినిపించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

బంజారాహిల్స్‌లో నగల చోరీ..

బంజారాహిల్స్: ఇంటి తాళాలు పగులగొట్టి అల్మారాలో నుంచి ఖరీదైన బంగారు నగలను చోరీ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బీదర్‌కు చెందిన శివరాజ్ ఉదయ్‌నగర్‌లో నివాసం ఉంటూ జీవీకే చౌరస్తాలో పానీపూరి బండి నడిపిస్తుంటాడు. ఈ నెల 14న ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం రాత్రి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇల్లంతా చిందరవందరగా ఉంది. అల్మారాలో ఉన్న బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 లక్షల నగదు చోరీకి గురయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బోటిక్‌లో చోరీ..

బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని తన బోటిక్‌లో హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయంటూ గ్యాదరి కరుణశ్రీ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నివసించే కరుణశ్రీ బంజారాహిల్స్‌లో బోటిక్ నడుపుతుండగా హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఆరు తులాల బంగారు గాజులు, రెండు తులాల గొలుసు కొట్టేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ ఆదేశిస్తే పోటీచేస్తా : మాధవీలత

రహమత్‌నగర్: పార్టీ ఆదేశిస్తే తాను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసి నియోజకవర్గానికి పట్టిన దరిద్రాన్ని వదిలిస్తానని బీజేపీ నాయకురాలు మాధవీలత పేర్కొన్నారు. బోరబండలో ఆమె బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి పోటీ చేసే అవకాశం, అదృష్టం రావాలని కోరుకుంటున్నాన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు, రోడ్ల పరిస్థితి బాగలేదని ఆరోపించారు.

చిన్నారితో అసభ్య ప్రవర్తన.. పోక్సో కేసు నమోదు

వెంగళరావునగర్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్‌లో నివాసముండే ఓ వ్యక్తి చిన్న కుమార్తె మంగళవారం ఇంట్లో ఆటుకుంటుండగా ఎదురింట్లో ఉండే అక్బర్ అనే వ్యక్తి ఆ బాలిక వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో ఆ బాలిక తండ్రి ఇంట్లో లేడు. బుధవారం బాలిక జరిగిన విషయాన్ని తండ్రికి తెలియజేసింది. దీంతో బాలిక తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్బర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న లంబాడీల ఆత్మగౌరవ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సత్యవతి రాథోడ్, సీతారామ్ నాయక్, కవిత తదితరులు ..

పంజగుట్ట: కొంతమంది లంబాడీ జాతిపై పగపట్టినట్లు, మా జాతికి అన్యాయం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని వారికి సరైన సమాధానం చెప్పేందుకు తెలంగాణ లంబాడీ ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఇందిరాపార్క్ వద్ద లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు వక్తలు తెలిపారు. ఎవరైనా మాకు ఏదైనా కావాలి అని పోరాడాలి కాని ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించండి అని అనడం హాస్యాస్పదమని, 33 లక్షల జనాభా ఉన్న లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగిస్తే ఏడు లక్షల జనాభా ఉన్న ఆదివాసీలకు 10 శాతం రిజర్వేషన్ ఎలా ఇస్తారని ఇంత చిన్న లాజిక్ ఎలా మర్చిపోతున్నారో అర్థం కావడం లేదని వారు అన్నారు. సభ పోస్టర్‌ను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీలు కవిత, సీతారామ్ నాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డి.టి.నాయక్, జిల్లాపరిషత్ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. లంబాడీల ఎస్టీ జాబితా అంశం సుప్రీకోర్టులో ఉందని కోర్టు తీర్పు వచ్చేవరకు ఆగకుండా కొంతమంది లంబాడీలకు వ్యతిరేకంగా ర్యాలీలు, వారికి ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వరాదని అధికారులపై ఒత్తిళ్లు తేవడం, లంబాడీలు దొంగలుగా, ద్రోహులుగా చూపడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. తాము దూరంగా తాండాల్లో నివసిస్తాం, దేశం మొత్తం ఒకే భాష మాట్లాడ తాము తమను గిరిజనులుగా గుర్తించేందుకు ఇంకా ఏం కావాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో వివిధ గిరిజన సంఘాల నాయకులు చారులత, కరాటే రాజు, సంపత్, శరత్ నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం చెల్లించాలి



మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హిమాయత్‌నగర్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చెల్లించని పక్షంలో దసరా తర్వాత విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎంపీ ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు ఉంటే రూ.600 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయం అన్నారు. అవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజు రియంబర్స్‌మెంట్ పథకానికి బడ్జెట్ ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ఫీజులు చెల్లించడానికి డబ్బులు లేవనడం, విద్యను నిర్లక్ష్యం చేయడమేనని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కాంట్రాక్టర్లకు రూ.5 నుంచి 6 వేల కోట్లు ఏకకాలంలో చెల్లిస్తుందని మండిపడ్డారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న 14 లక్షల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు ఇవ్వడానికి అవరోధం ఏమిటని ప్రశ్నించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, పగిళ్ల సతీష్ పాల్గొన్నారు.

ఢిల్లీలో ప్రతిభ చూపిన సైఫాబాద్ ఎన్‌సీసీ క్యాడెట్లు



సత్తా చాటిన నీలేష్‌దాస్ అంజలి

బంజారాహిల్స్: సెప్టెంబర్ 1 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఆలిండియా తల్ సైనిక్ క్యాంపులో ఉస్మానియా యూనివర్సిటీ సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సత్తా చాటారు. కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న నీలేష్‌దాస్ (మ్యాప్ రీడింగ్ విభాగం), అంజలి (ఫైరింగ్ విభాగం) ఏఐటీఎస్‌సీ–2025 ఢిల్లీలో ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ తరుపున పాల్గొని పతకాలు సాధించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 33 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఈ శిబిరంలో పాల్గొనగా సైఫాబాద్ కళాశాల నుంచి ఇద్దరు క్యాడెట్లు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 17 డైరెక్టరేట్ల నుంచి చురుకైన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. హైదరాబాద్ గ్రూపు నుంచి ఎంపికై, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో శిక్షణ పొంది జీఆర్‌జీ1, టీఆర్‌జీ2, టీఆర్‌జీ3లో ఎంపికై ఆల్ ఇండియా తాల్ సైనిక్ క్యాంపులో అడుగు పెట్టారు. వీరిని పలువురు త్రివిధ దళాల అధికారులు అభినందించి పతకాలు అందించారు. ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమడోర్ నర్సింగ్‌శైలని, మూడో బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్‌శరత్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజలు ప్రత్యేకంగా అభినందించారు.

స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

సనత్‌నగర్: బేగంపేట పాటిగడ్డ మోడల్ మార్కెట్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మహిళా ఆరోగ్య సాధికారత చేకూర్చే దిశగా కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అక్టోబర్ 2 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు, ఆరోగ్యంపై అవగాహన, అవసరమైన వైద్య సేవలను అందించి వారి ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంపై వైద్యులు దృష్టిసారించనున్నారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీనియర్ నేత విశాల్ సూదంలు హాజరై మహిళల ఆరోగ్య సంరక్షణకు మార్గనిర్దేశం చేశారు.

సెట్విన్‌లో ఈవీ బస్సులు

- ఎండీ వేణుగోపాల్‌రావు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో ఎలక్ట్రానిక్ సెట్విన్ బస్సులు రోడ్డెక్కనున్నాయి. ఈ మేరకు ఈవీ బస్సులు ప్రవేశపెట్టేందుకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి సెట్విన్ సంస్థ ప్రతిపాదనలు పంపింది. కొత్త వాహన విధానంలో భాగంగా దశలవారీగా డీజిల్ బస్సులను తొలగించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానే ఈవీ బస్సులను సెట్విన్ ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వం అనుమతిచ్చిన రూట్లలో వంద బస్సులు రాకపోకలు సాగించాల్సి వున్నా 15 ఏళ్ల కాలపరిమితి దాటిన బస్సులను సెట్విన్ సంస్థ తొలగించడంతో ప్రస్తుతం గ్రేటర్ వ్యాప్తంగా 40 బస్సులు మాత్రమే నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలోనే ఇకపై ఎలక్ట్రానిక్ బస్సులను మాత్రమే అనుమతించే అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని ప్రభుత్వానికి సెట్విన్ ప్రతిపాదనలు సమర్పించింది. దీనికి ప్రభుత్వం కూడా సూత్రప్రాయంగా అంగీకరించిన నేపథ్యంలో త్వరలో ఈవీ బస్సులు అందుబాటులోకి వస్తాయని, పర్యావరణ పరిరక్షణతో పాటు ఖర్చులు కూడా తగ్గుతాయని సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావు తెలిపారు. మరోవైపు కొత్తగా వస్తున్న విద్యుత్ బస్సుల కోసం కొత్త రూట్‌లను కేటాయించాలని, ప్రస్తుతం ఉన్న 8 కిలో మీటర్ల పరిధిని పెంచి 20 కిలో మీటర్లు చేయాలని బస్సుల యజమానులు కోరుతున్నారు.

బతుకమ్మ పండుగకు బల్దియా ఏర్పాట్లు

- కూడళ్లలో నిలువెత్తు బతుకమ్మలు
- కార్యాలయాలకు రంగురంగుల వెలుగులు

సాక్షి, సిటీబ్యూరో: త్వరలో జరగనున్న బతుకమ్మ పండుగ కోసం జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తోంది. నగరంలోని వివిధ కూడళ్లల్లో ఐదడుగుల ఎత్తయిన బతుకమ్మలను నిలపనుంది. బతుకమ్మ ఆటలు ముగిశాక నిమజ్జనం చేసేందుకు కొలనుల్ని సిద్ధం చేస్తోంది. కొలనులను శుభ్రం చేయడంతోపాటు తాత్కాలిక లైటింగ్ తదితర ఏర్పాట్లు చేస్తోంది. జీహెచ్ఎంసీ కార్యాలయాలు, ఆయా ప్రధాన మార్గాలు, జంక్షన్లను రంగురంగుల విద్యుల్లతలతో అలంకరించనుంది. ఇంకా ప్రభుత్వ నిర్ణయానికనుగుణంగా ఈ నెల 29వ తేదీన పీపుల్స్ ప్లాజాలో బెస్ట్ బతుకమ్మ పోటీలు నిర్వహించనుంది. ప్రముఖ మాల్స్‌లోనూ బతుకమ్మలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనుంది. ప్రపంచ రికార్డు కోసం ప్రభుత్వం ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న 10 వేల మందితో బతుకమ్మ ఆట కోసం జీహెచ్ఎంసీ నుంచి 6 వేల మందిని తరలించనుంది.

స్టైపండ్ బకాయిలివ్వకుంటే ఆందోళన తప్పదు

- తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం

గాంధీఆస్పత్రి: సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తప్పదని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం (టీ–జూడా) స్పష్టం చేసింది. ఈ మేరకు టీజూడా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఐజాక్ న్యూటన్, అజయ్‌కుమార్ గౌడ్, చైర్‌పర్సన్ మదన్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలోని వేలాది మంది జూడాలు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులు, డెంటల్ పోస్ట్‌గ్రాడ్యుయేట్స్, హౌస్ సర్జన్లు, నర్సింగ్ విద్యార్థులకు టీ–జూడా ప్రాతినిధ్యం వహిస్తుందని, వీరికి సకాలంలో స్టైపండ్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో ఆయా సంస్థల అధిపతులు సకాలంలో బిల్లులు సమర్పిస్తున్నప్పటికీ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న జాప్యంతో స్టైపండ్ బకాయిలు పేరుకుపోతున్నాయని పేర్కొన్నారు. కేవలం స్టైపండ్‌పై ఆధారపడిన వేలాదిమంది మానసిక, ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. పలుమార్లు సమ్మె నోటీసులు ఇవ్వడంతో ప్రభుత్వం దిగి వచ్చి హామీలు ఇచ్చినా అవి నేటికీ నెరవేరలేదని పేర్కొన్నారు. స్టైపండ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు స్టైపండ్ విడుదల చేసే అధికారాలు ఇవ్వాలని, ప్రతినెలా క్రమం తప్పకుండా స్టైపండ్ అందించాలనే మూడు ప్రధాన డిమాండ్లతో ఆందోళన కార్యక్రమాలు త్వరలోనే చేపడతామని తెలిపారు. శాంతియుత ఆందోళనతో సమస్య పరిష్కారం కాకుండా సాధారణ విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

హైడ్రా కార్యాలయం వద్ద డీఆర్‌ఎఫ్ సిబ్బంది ధర్నా

- జీతాలు తగ్గించడంపై నిరసన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బుద్ధభవన్ హైడ్రా కార్యాలయం ముందు బుధవారం డీఆర్‌ఎఫ్ సిబ్బంది ధర్నా చేశారు. జీతాలను తగ్గించారని నిరసిస్తూ పెద్ద ఎత్తున డీఆర్‌ఎఫ్ సిబ్బంది హైడ్రా కమిషనర్ కార్యాలయం ఆందోళనకు దిగారు. తగ్గించిన జీతాలను వెంటనే చెల్లించాలని డీఆర్‌ఎఫ్ సిబ్బంది నినాదాలు చేస్తూ హోరెత్తించారు. డీఆర్‌ఎఫ్ ఉద్యోగులు నాగరాజ్ గౌడ్, క్రిష్ణ, ఉదయ్ కిరణ్, కాసీం, శివ, సురేష్ తదితరులు మాట్లాడుతూ జీవో నెంబర్ 1272ను వెంటనే సవరించి డీఆర్‌ఎఫ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. విపత్తుల సమయంలో ఎంతో కష్టపడి పని చేస్తున్న తమ జీతాలను ఉన్నపళంగా తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన నేపథ్యంలో హైడ్రా కమీషనర్ రంగనాథ్ ఉద్యోగులను పిలిచి మాట్లాడారు. 'మీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రంగనాథ్ హామీతో డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆందోళనను విరమించి తిరిగి విధుల్లో చేరారు.

జీతాలు తగ్గడం లేదు...

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు తగ్గడం లేదని హైడ్రా స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. జీవో నం.1272 ప్రకారం జీహెచ్ఎంసీలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల సవరణ జరిగిందని, ఆ ప్రభావం జీహెచ్ఎంసీ నుంచి హైడ్రాలోకి వచ్చిన సిబ్బందిపై లేకుండా, అదనపు మొత్తాన్ని జీహెచ్ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్‌గా అందించాలని ప్రభుత్వం సూచించిందని తెలిపింది. స్టాండింగ్ కమిటీ ఆమోదం తర్వాత నిధులు విడుదల చేస్తామని జీహెచ్ఎంసీ చెప్పడంలో ఆలస్యం అవుతోందని పేర్కొంది.

గ్యాస్ బుకింగ్.. నో బిల్లింగ్!

- పక్షం రోజులైనా ఇదే పరిస్థితి
- ప్రశ్నార్థకంగా డొమెస్టిక్ సిలిండర్ డెలివరీ
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు
- మహానగరంలో వంటగ్యాస్ ఏజెన్సీల చేతివాటం



నగరంలోని రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్ వంట గ్యాస్ సిలిండర్ బుక్ చేశారు. తక్షణమే గ్యాస్ బుక్ అయినట్లు సెల్‌ఫోన్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వచ్చింది. కానీ, పక్షం రోజులైనా బిల్లు జనరేట్ అయినట్లు సమాచారం అందలేదు. సిలిండర్ కూడా డెలివరీ కాలేదు. గ్యాస్ ఏజెన్సీని ఫోన్‌లో సంప్రదించగా కస్టమర్ నెంబర్, అడ్రస్ తీసుకొని మరసటిరోజు పంపిస్తామని చెప్పారు. కానీ, సిలిండర్ మాత్రం ఇంటికి చేరలేదు. అసలు బిల్లు జనరేట్ కానప్పుడు సిలిండర్ డెలివరీ ఎలా..? ఇది ఒక శ్రీనివాస్ సమస్య కాదు, సుమారు 20 శాతం మంది గృహోపయోగ వంటగ్యాస్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బంది.

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో కొన్ని వంట గ్యాస్ ఏజెన్సీల డీలర్లు చేతివాటం వినియోగదారులకు శాపంగా మారింది. వంట గ్యాస్ బుకింగ్ చేసినా బిల్లు జనరేట్ అవడంలేదు. అసలు బిల్లు జనరేట్ కానప్పుడు సిలిండర్ డెలివరీ అనేది ప్రశ్నార్థకమే. మొన్నటి వరకు బిల్లు జనరేట్ అయి సిలిండర్ డెలివరీ కాకుండా పక్కదారి పట్టేది. తాజాగా బిల్లు జనరేట్ సమస్యగా తయారైంది. దీంతో గృహ వినియోగదారులకు గ్యాస్ తిప్పలు తప్పడం లేదు. వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలపై తీవ్రంగా ఒత్తిడి తేస్తే తప్ప సిలిండర్లు డోర్ డెలివరీ జరగని పరిస్థితి నెలకొంది.

డీఏసీ తప్పనిసరి..

సిలిండర్ డెలివరీ ఓటీపీ మెసేజ్ అమల్లోకి వచ్చినా, ఆచరణలో అంతంత మాత్రంగానే ఉంది. గ్యాస్ సిలిండర్ బుక్ చేసిన తర్వాత ఎస్ఎంఎస్ రూపంలో వినియోగదారుడి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు డ్యాక్ (డెలివరీ అథంటికేషన్ కోడ్) వస్తుంది. సిలిండర్ డెలివరీ సమయంలో బాయ్‌కు చెబితేనే సిలిండర్ డెలివరీ ప్రాసెస్ పూర్తవుతుంది. ఇందులో నాలుగు అంకెలు ఉంటాయి. ఒకవేళ ఈ కోడ్ చెప్పకపోతే సిలిండర్ పొందటం సాధ్యం కాదు. కానీ, చాలా ప్రాంతాల్లో డెలివరీ బాయ్స్ డ్యాక్ కోడ్ అడగడం లేదు. కేవలం రూ.30 చేతిలో పెడితే చాలు, సిలిండర్ డెలివరీ చేసి వెళ్లిపోతున్నారు.

వాణిజ్య అవసరాలకు..

గృహ వినియోగ సిలిండర్లు బాహాటంగా వాణిజ్య అవసరాలను తీర్చుతున్నాయి. నగరంలో గృహోపయోగ వంట గ్యాస్ అక్రమ దందాకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. నగరంలో పెద్ద హోటల్స్ ఐదువేలకు పైగా ఉండగా, చిన్నా చితక హోటల్స్, టీ, టిఫిన్, గరం మిర్చి సెంటర్లు, బండీలు సుమారు లక్షల వరకు ఉంటాయన్నది అంచనా. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్యపరమైన సిలిండర్లు వినియోగిస్తుండగా, మిగిలిన చిన్నా, చితకా హోటళ్లు, బండీల్లో డొమెస్టిక్ సిలిండర్లు దర్శనమిస్తున్నాయి. మరోవైపు నగరంలోని సుమారు ఐదువందల వరకు గల ప్రయివేటు హాస్టళ్లు సైతం వంటవార్పు కోసం డొమెస్టిక్ సిలిండర్లనే వినియోగిస్తున్నాయి. మొత్తం మీద ప్రతిరోజు లక్షకుపైగా డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్లు దారి మళ్లుతున్నట్లు తెలుస్తోంది.

వాణిజ్య కనెక్షన్లు అంతంతే..

- మహా నగరంలోని హైదరాబాద్–రంగారెడ్డి–మేడ్చల్ జిల్లాల్లో కలిపి ప్రధాన మూడు చమురు సంస్థలకు చెందిన డొమెస్టిక్ సిలిండర్లు సుమారు 40 లక్షల వరకు ఉన్నాయి.
- వాణిజ్య కనెక్షన్లు లక్షకు మించిలేవని అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నగరంలో మొత్తం 165 ఎల్పీజీ ఏజెన్సీలుండగా ప్రతిరోజు 1.20 నుంచి 3 లక్షల వరకు డొమెస్టిక్ సిలిండర్ల డిమాండ్ ఉంది. కానీ, ప్రస్తుతం 60 వేలకు మించి డోర్ డెలివరీ కావడంలేదని తెలుస్తోంది. వాణిజ్య అవసరాలకు కొరత లేకపోవడం గమనార్హం.

పోలీసుల శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

చార్మినార్/దూద్ బౌలి: మహిళా పోలీసుల కోసం నూతన శిశు సంరక్షణ కేంద్రాన్ని నగర పోలీస్ కమిషనర్ సి.వి. ఆనంద్ బుధవారం ప్రారంభించారు. పేట్లబురుజులోని సీఏఆర్ ప్రధాన కార్యాలయంలో మహిళా పోలీసు అధికారుల పిల్లల కోసం ఈ నూతన శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో 150–200 మంది పిల్లలకు వసతి కల్పిస్తుందని తెలిపారు. ఈ భవనాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సీఎస్ఆర్ ప్రాజెక్టులో భాగంగా ఆ సంస్థ డైరెక్టర్ పామిరెడ్డి రమారెడ్డి సౌజన్యంతో నిర్మించారని తెలిపారు. మహిళా ఉద్యోగులు తమ పిల్లలను డ్యూటీ ప్రదేశానికి తీసుకువస్తే వారి సంరక్షణకు ఈ కేంద్రం ఎంతో భరోసా ఇస్తుందన్నారు. ఇక్కడ పిల్లలకు ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారం అందిస్తారని వివరించారు. ఈ శిశు సంరక్షణ కేంద్రంలో ఇండోర్, అవుట్ డోర్ ప్లే ఏరియాలు, ఊయలలు, ఫీడింగ్ రూమ్‌లు, మెడికల్ రూమ్‌లు, గర్భిణుల కోసం డార్మిటరీ వంటి సౌకర్యాలు ఉన్నాయని, సీసీటీవీ ద్వారా పూర్తి స్థాయి పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. శిశు సంరక్షణ కేంద్రంలో హైదరాబాద్ సిటీ పోలీసు విభాగానికి సంబంధించిన ఎవరైనా (ఆడ, మగ తేడా లేకుండా) వారి పిల్లలను చేర్పించుకోవచ్చని తెలిపారు. మేఘా సంస్థ డైరెక్టర్ డాక్టర్ రవిరెడ్డి మాట్లాడుతూ పోలీసులకు సేవ చేయడం ద్వారా వారి జీవితాలను సులభతరం చేయడం తమకు చాలా సంతోషంగా ఉందని పామిరెడ్డి రమారెడ్డి అన్నారని తెలిపారు. కార్యక్రమంలో మేఘా ఇంజనీరింగ్ నుండి పామిరెడ్డి మంజులారెడ్డి, పామిరెడ్డి మేఘారెడ్డి, మురళి, నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్సింగ్ మాన్, నగర ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ డి.జోయల్ డెవిస్, డీసీపీ, డిసిపి చైతన్య కుమార్, మహిళా అధికారులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్

సోషల్ థీమ్‌తో క్రికెట్ టోర్నీ



- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించడం అభినందనీయం
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ జెర్సీ, ట్రోఫీ ఆవిష్కరణ
- సందడి చేసిన సినీతారలు, రాజకీయ ప్రముఖులు

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మొక్కుబడిగా కాకుండా అంతర్జాతీయ స్టేడియంలో ప్రొఫెషనల్ క్రికెటర్స్ ఆడే పిచ్‌ల మీద టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 9, 10 తేదీల్లో నగరంలోని ఉప్పల్ స్టేడియంలో నిర్వహించనున్న ఎలైట్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ జెర్సీతో పాటు ట్రోఫీను ఆయన బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తనకు కూడా క్రికెట్ అంటే ఎంతో ఇష్టమని అప్పట్లో బాగా ఆడేవాడినని ఫిట్నెస్ కారణాలతో ఇప్పుడు క్రికెట్ ఆడడం లేదని అన్నారు. సామాజిక చైతన్యం కోసం ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో ఆరు టీంలు పాల్గొంటున్నాయని, సినీ సెలబ్రిటీల టీమ్‌తో పాటు పొలిటికల్ టీం, మీడియా టీం, పోలీస్ టీం, కార్పొరేట్స్ టీం, టీవీ నటుల టీం వంటి విభాగాలు భాగస్వామ్యం అవుతున్నాయని చామల ఫౌండేషన్ ఫౌండర్ చామల ఉదయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. సామాజిక అంశాలను థీమ్‌గా తీసుకొని ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఈ టోర్నమెంట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆర్మీ అమరవీరుల కుటుంబాలకు అందిస్తామని పేర్కొన్నారు. సేవ్ వాటర్ సేవ్ ఎర్త్, సే నో టు డ్రగ్స్, క్లీన్ హైదరాబాద్, డొనేట్ బ్లడ్ సేవ్ లైఫ్ అనే స్లోగన్స్‌తో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టాలీవుడ్ సినీ హీరోలు తరుణ్, సుధీర్ బాబు, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు సినీ నటుడు రవి రెడ్డి, ఆపరేషన్ సింధూర్‌లో పాల్గొన్న వింగ్ కమాండర్ రాఘవ్, చామల ఫౌండేషన్ సెక్రటరీ భాను చందర్ రెడ్డి, ఆర్యవైశ్య ఫెడరేషన్ చైర్మన్ కల్వ సుజాత, జర్నలిస్ట్ మూర్తి, ప్రొడ్యూసర్ దామోదర్ ప్రసాద్, అమిత్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో ప్రజాపాలన దినోత్సవం

జలమండలిలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ అశోక్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈడీ మయాంక్ మిట్టల్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఆపరేషన్స్ డైరెక్టర్ వినోద్ భార్గవ, సీజీఎంలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



జిల్లా సమగ్రాభివృద్ధికి సమన్వయంతో కృషి

- కలెక్టర్ హరిచందన దాసరి



సాక్షి,సిటీబ్యూరో: లక్ష్యసాధన దిశగా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేస్తూ జిల్లాను ముందంజలో ఉంచాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సందర్భంగా అదనపు కలెక్టర్లు ముకుంద రెడ్డి, కదిరవన్ పలనితో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను తొలగించాం

వెల్లడించిన బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ

పంజగుట్ట: బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి నుంచి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను తొలగించామని, ఫ్రంట్‌తో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పాలూరు రామకృష్ణయ్య ప్రకటించారు. బీసీ పార్టీకే మోసం చేసిన మల్లన్న యావత్ బీసీ సమాజానికి ఏం చేస్తాడో అర్థం కావడంలేదన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేకపోతుల నరేందర్ గౌడ్, లక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. మల్లన్న 10 సార్లు తనను సంప్రదించి పార్టీ మొత్తం అప్పగించాలని అడిగారని, అది సాధ్యమయ్యే పనికాదని, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇస్తామని చెప్పడంతో దానికి ఆయన ఒప్పుకున్నారని తెలిపారు. గత ఆగస్టు 30న నియామకపత్రం కూడా తీసుకున్నారని గుర్తుచేశారు. అయితే కొన్ని యూట్యూబ్ చానళ్లలో మల్లన్న భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చి బీసీ యునైటెడ్ ఫ్రంట్‌ను కొనుగోలు చేశారంటూ అసత్య ప్రచారం చేయించారని ఆరోపించారు. ఇక నుంచి బీసీ యునైటెడ్ ఫ్రంట్‌కు మల్లన్నకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమావేశంలో ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు బెక్కం వెంకట్, పేదల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు గిరగాని భిక్షపతి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరి గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలూరు రామకృష్ణయ్య

డిఫెన్స్ రంగంలో విస్తృత అవకాశాలు

- డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి



సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సతీష్‌రెడ్డి

కుషాయిగూడ: డిఫెన్స్ రంగంలో రాణించాలనుకునే పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి అన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో సీఐఏ, ఐలా ఆధ్వర్యంలో ప్రోగ్రెసివ్ డిఫెన్స్ ఇండస్ట్రీ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న పరిజ్ఞానం, అవకాశాలపై అవగాహన కల్పించారు. డిఫెన్స్ రంగంలో దేశం సాధించిన ప్రగతిని వివరిస్తూ పారిశ్రామిక ఉత్పత్తులకు ఉన్న అవకాశాలను వివరించారు. దేశంలో పెరుగుతున్న యువశక్తిని సద్వినియోగం చేసుకునే దిశగా ఆలోచించాలని సూచించారు. ప్రధాని మోదీ ఆశయానికి అనుగుణంగా మేకిన్ ఇండియాలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఐలా చైర్మన్ గోవిందారెడ్డి, సీఐఏ అధ్యక్షుడు డీఎస్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ కాశిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యంతోనే కుటుంబం ఆరోగ్యం

- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ

అమీర్‌పేట: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా మహిళలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 20 వేల క్యాంపులు నిర్వహించి పలు రకాల వైద్యపరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. అమీర్‌పేట ఆసుపత్రిలో నిర్వహించిన సశక్త్ పరివార్ అభియాన్ మెగా హెల్త్ క్యాంపులో రక్తదానం చేసినవారికి మంత్రి బుధవారం సర్టిఫికెట్లు అందజేశారు.

పెద్ద ఆసుపత్రి వస్తుండగా వంద పడకలు ఎందుకు?

అధికారులు, ఆసుపత్రి వైద్యులు, నర్సులతో మంత్రి రాజనర్సింహ మాట్లాడి రోగులకు అందుతున్న సేవలు, స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 50 పడకలుగా ఉన్న ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కేసీఆర్ పుణ్యమా అని అప్పులు చేసి సనత్‌నగర్‌లో నిర్మించిన పెద్ద ఆసుపత్రి రెండు నెలల్లో అందుబాటులోకి వస్తుందని, కేవలం రెండు కిలో మీటర్ల దూరంలోనే జనరల్ ఆసుపత్రి ఏర్పాటవుతుండగా, అమీర్‌పేట ఆసుపత్రిని 100 పడకలకు పెంచడం అవసరమా అని ప్రశ్నించారు. మిగతా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేసిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్' ప్రారంభం

- హాజరైన కేంద్ర, రాష్ట్రమంత్రులు

అమీర్‌పేట: అమీర్‌పేటలో స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభమైంది. అమీర్‌పేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌పై ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. మోదీ తన ప్రసంగంలో 1948 సెప్టెంబర్ 17 అంశాన్ని ప్రస్తావించారు. ఆరోజు నిజాం పాలన అకృత్యాల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆధ్వర్యంలోనే ప్రజలకు విముక్తి లభించిన సందర్భంగా లిబరేషన్ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున జరుపుకుంటున్నారని మోదీ గుర్తు చేశారు.

మెగా హెల్త్ క్యాంపు..

స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపులో వివిధ రకాల స్టాల్స్‌ను కిషన్‌రెడ్డి, బండి సంజయ్, దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఫుడ్ సేఫ్టీ శాఖ ఆధ్వర్యంలో ఈట్ రైట్ ఇండియా అభియాన్ పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, అంజిరెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యానారాయణ, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, డీఎంఈ నరేంద్రకుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్, సూర్యశ్రీ,వెంకట్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు' బకాయిలపై భగ్గుమన్న విద్యార్థులు



బర్కత్‌పురలో రాస్తారోకో.. భారీగా ట్రాఫిక్ జామ్

కాచిగూడ: ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పట్ల విద్యార్థిలోకం భగ్గుమంది. విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతోనే విద్యార్థులపట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతోందని అన్నారు. ఆయా కళాశాలల్లోని బీసీ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పురలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో బర్కత్‌పుర చమన్ నుంచి లింగంపల్లి ఎక్స్‌రోడ్ వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు బకాయిలు రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉండగా, కేవలం రూ.600 కోట్లు బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇలా అయితే విద్యార్థుల చదువులు ఎలా సాగుతాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, గ్రూప్ 1 అభ్యర్థులకు న్యాయం చేయాలని, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సి.రాజేందర్, చెరుకు మణికంఠ, భాస్కర్, రవియాదవ్, నరేష్, నిఖిల్ పటేల్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ అవసరం

పరిశ్రమల శాఖ సదస్సులో జిల్లా కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: సూక్ష్మ, చిన్న, తరహా పరిశ్రమల ఉత్పత్తులకు డిజిటల్ మార్కెటింగ్ అవసరమని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలోఎంఎస్ఎంఈ, ఈ కామర్స్ (ఆన్‌లైన్) జీఎస్టీ, రిజిస్ట్రేషన్, ఉత్పత్తుల మార్కెటింగ్ విధానంపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా వారి ఆర్థిక స్థితి బలోపేతానికిగాను ఉత్పత్తుల విక్రయ విధానంలో సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక రంగంలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉత్పత్తిదారుల ఉత్పత్తులను ఈ–కామర్స్ పోర్టల్స్ ద్వారా విక్రయించేందుకు ఈ సదస్సు అవగాహన కలిగిస్తుందన్నారు. ట్రయల్ బేస్‌లో ఉత్పత్తిదారుల ఉత్పత్తులను జెమ్ పోర్టల్‌లో ఐదు రిజిస్ట్రేషన్, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల ఉత్పత్తిదారులు 130 మంది వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోగా, అందులో 50కు పైగా మహిళా ఉత్పత్తిదారులే ఉన్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం పవన్ కుమార్, ఏడీ హేమలత, ఎంఎస్. ఎంఈ ఏడీ సుమతి, ఫ్యాకల్టీ నెంబర్ ముత్యాల శరత్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ మాధవరెడ్డి, సంజీవ్ అధికారి, ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ మార్కెటింగ్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

అవినీతి పెరగడానికి కేసీఆరే బాధ్యుడు

ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ



ఆళ్ల రామకృష్ణ

హిమాయత్‌నగర్: తెలంగాణలో అవినీతి పెరిగిపోవడానికి మాజీ సీఎం కేసీఆర్ కారణమని ఓబీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దాదాపు 400 అవినీతి కేసులను తెలంగాణ అవినీతి నిరోధక శాఖ నమోదు చేయగా, బీఆర్ఎస్ 10 ఏళ్లలో 800 కేసులు మాత్రమే నమోదయ్యాయని వెల్లడించారు. 800 కేసుల్లో అవినీతిపరుల నుంచి తగిన మొత్తం తీసుకొని, ఈ కేసులను నీరుకారుస్తూ ప్రాసిక్యూషన్‌కు పంపించకుండా శాఖపరమైన విచారణకు మాత్రమే కేసీఆర్ అనుమతించారని ఆరోపించారు. అవినీతి కేసులు నమోదు చేస్తే సమాజంలో తన ప్రభుత్వం మీద దురభిప్రాయం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే అవినీతి నిరోధక శాఖను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నేడు ఒక చిన్న స్థాయి విద్యుత్ అధికారి రూ.200 కోట్ల అవినీతి సొమ్ముతో దొరికిపోవడం అంటే ప్రజా ప్రభుత్వాలు, ప్రభుత్వ నిఘా సంస్థలు సిగ్గుపడాలన్నారు. ఈ మూడు నెలల కాలంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల అవినీతి కేసుల్ని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పెట్టి వీరందరిని శిక్షిస్తే తెలంగాణ పేద ప్రజలకు విభజన ఫలితాలు పూర్తిగా దక్కుతాయన్నారు.

హెచ్ఐసీసీలో ఇంధన సామర్థ్యంపై సదస్సు



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో బుధవారం భారత పరిశ్రమల సమాఖ్య, గ్రీన్ బిజినెస్ సెంటర్ (సీఐఐ– జీబీసీ) ఇంధన సామర్థ్యంపై సదస్సు నిర్వహించాయి. సదస్సులో 2,500 మంది ప్రతినిధులు, వంద మంది ప్రముఖ వక్తలు, ప్రభుత్వం, పరిశ్రమ, అంతర్జాతీయ సంస్థలు, విద్యాసంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వంద మంది ప్రదర్శన కారులు పాల్గొన్నారు. ఇంధన సామర్థ్య పద్ధతులపై ఉన్నత స్థాయి సెషన్లు, సాంకేతిక ప్రదర్శనలు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. డీకార్బనైజేషన్‌ను స్వీకరించడం ద్వారా భారతదేశ తయారీ రంగం ప్రపంచ వ్యాప్తంగా కార్బన్ పరివర్తనకు కొత్త ప్రమాణాలను నిర్దేశించే అవకాశాన్ని కలిగి ఉందని యూనిడో ఉపప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ క్రిస్టియానో పాలసీ అన్నారు. కార్యక్రమంలో ఎనర్జీ ఎఫీషియన్సీ కౌన్సిల్ చైర్మన్ రవిచంద్రన్ పురుషోత్తమన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 18, సెప్టెంబర్, 2025

వన్నె తగ్గని చేనేత వస్త్రాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్‌లూమ్ ఇండియా–2025 చేనేత వస్త్ర ప్రదర్శనను సోషలైట్ కవితా జైన్ ప్రారంభించారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. నేటితరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని చెప్పారు. ప్రతిఒక్కరూ చేనేత కళాకారులను ప్రోత్సహించాలన్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతిపని బృందాలు తమ సిల్క్, హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

రిచ్.. రుచి

ఇడ్లీ రూ.1200, చాక్లెట్ రూ.1800

- నగరంలో ఖరీదైన రుచులకు సరికొత్త ఊపు
- అటు రెస్టారెంట్స్, ఇటు భోజనప్రియుల్లో ఆసక్తి..
- తమదైన ప్రత్యేకత చాటుకునేందుకు ఉభయుల తహతహ



ఇరానీ చాయ్, కబాబ్‌లు, బిర్యానీలకు సిటీ ప్రసిద్ధి చెంది ఉండవచ్చు.. కానీ ఇప్పుడు ఖరీదైన రుచులకూ కేరాఫ్‌గా మారుతోంది. తమ దగ్గర ఉన్న విలాస విందు గురించి రెస్టారెంట్స్, తాము రుచిచేసిన కాస్ట్‌లీ ఫుడ్ గురించి నగరవాసులు సోషల్ వేదికలపై పంచుకుంటూ రిచ్ రుచుల వెల్లువకు కారణమవుతున్నారు. ఫలితంగా బంగారంతో చుట్టిన ఇడ్లీలు, రాజకుటుంబానికి సరిపోయేంత పెద్ద పళ్లెంలో విందులకు కూడా నగరం పేరొందుతోంది. అనేక మందికి ఇదో ఖరీదైన రుచికరమైన యాత్ర. ఈ వంటకాలు కేవలం భోజనం మాత్రమే కాదు, అవి జ్ఞాపకాల్లో ఒదిగిపోయే అనుభవాలు కూడా అంటున్నారు ఫుడ్ లవర్స్.

– సాక్షి, సిటీబ్యూరో

ఒకప్పుడు ఆకలి తీర్చుకోవడానికి తినడం.. ఇప్పుడు అభిరుచులు నెరవేర్చుకోవడానికి తినడం దాకా పరిణామం చెందింది. ఆకలికి హద్దు ఉంటుందేమో కానీ అభిరుచులకు ఉండదు కదా.. అలాగే ఇప్పుడు ఆహార అభిరుచులు కూడా కొత్త పుంతలు కాస్ట్‌లీ వింతలుగా మారుతున్నాయి. ఈ సోషల్ మీడియా యుగంలో తినడం మాత్రమే కాదు ఆనందించడం.. ఆ ఆనందాన్ని నలుగురితో పంచుకోవడం కూడా అలవాటైంది. ఇన్‌స్టాలో పోస్ట్ చేయాలంటే ఇరానీ చాయ్ సరిపోదు.. ఇడ్లీ రూ.1200 ఉండాల్సిందే అనేది సిటీ సోషల్'ఇష్టుల' మాట బాట. అలాంటి వారి కోసం నగరంలోని పలు రెస్టారెంట్స్, కేఫ్స్, ఐస్‌క్రీమ్ పార్లర్స్.. వైవిధ్య భరితంగా అదే సమయంలో అత్యంత విలాసవంతమైన రుచులను అందిస్తున్నాయి. అలాంటి కాస్ట్‌లీ వంటకాల్లో కొన్నింటి విశేషాలు..



- బంజారాహిల్స్‌లోని లెవాంట్ రెస్టారెంట్‌లో ఉన్న మషావి ముషాకల్ ప్లేట్ ధర: రూ.3,300.. నగరంలో ఫైవ్‌స్టార్ హోటల్స్‌ను మినహాయిస్తే.. రెస్టారెంట్స్‌లోని ఖరీదైన ప్లేట్ ఇదే. దీనిలో వడ్డించే మిడిల్ ఈస్టర్న్ విందు మాంసం ప్రియులను చవులూరిస్తుంది. బాషా షీష్, అదానా కబాబ్, లాంబ్ చుకాఫ్, బాల్కా షీష్, లెవాంట్ జాయేనా.. గ్రిల్ చేసి స్టైల్‌గా వడ్డిస్తారు. ఇది రోజంతా తినాల్సిన భోజనాన్ని సులభంగా భర్తీ చేయగలదు.

- ఐటీసీ కోహినూర్‌లో అందించే హైదరాబాదీ బిర్యానీ దమ్ పుఖ్త్ బేగం ధర రూ.2500. ప్రీమియం కుంకుమ పువ్వు, సువాసన గల బాస్మతి బియ్యం లేత మాంసంతో మేళవించి వండుతారు. ఈ బిర్యానీ ఒక హ్యాండీలో అందంగా కనిపిస్తుంది.


- బంజారాహిల్స్‌లోని కృష్ణ ఇడ్లీని 24–క్యారెట్ గోల్డ్ ఇడ్లీగా పేర్కొంటారు. ఈ ఇడ్లీ ప్లేట్ ధర: రూ.1200 ఇది దక్షిణ భారత దేశంలోని పేరొందిన అల్పాహారం.. రెండు మృదువైన ఇడ్లీలు తినదగిన బంగారు ఆకులతో కప్పబడి, గులాబీ రేకులను చల్లి, సాంబార్ చట్నీలతో వడ్డిస్తారు. బహుశా ఇడ్లీని ఇంత అందంగా ఎప్పుడూ చూసి ఉండరు.

- బంజారాహిల్స్, హిమాయత్‌నగర్‌లలోని హుబెర్ – హోలీ అందించే మైటీ మిడాస్ గోల్డ్ ఐస్ క్రీం ధర: రూ.1200. ఇది కేవలం డెజర్ట్ కాదు, ట్రెజర్ అని చెప్పొచ్చు. బెల్జియన్ చాక్లెట్, ప్రాలైన్ బాదం, మాకరూన్లు, చాక్లెట్ నిండిన బాల్స్. 24 క్యారెట్ తినదగిన బంగారు ఆకులో చుట్టబడిన చాక్లెట్ బార్‌తో తయారైంది. ఇది ఆర్డర్ ఇచ్చాక స్వీకరించడానికి గంట కంటే ఎక్కువ సమయం పడుతుంది.

- బంజారాహిల్స్‌లోని రోస్ట్ సిసిఎక్స్‌లో యానిమేటెడ్ చాక్లెట్ అందుబాటులో ఉంది. దీని ధర: రూ.1800 ప్లస్ పన్నులు అదనం. ఈ షోటాపర్ డెజర్ట్, అందమైన జంతువులు లేదా కార్టూన్ పాత్రలుగా మలిచారు. నగరంలోని అత్యంత అందమైన అత్యంత ప్రీమియం డెజర్ట్‌లలో ఒకటిగా పేరొందింది.







- నగరంలోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్, ది వెస్టిన్‌లోని ప్రీగో అత్యంత ఖరీదైన బిర్యానీలను అందిస్తాయని సమాచారం. ధరలపై స్పష్టత లేనప్పటికీ అక్కడ బిర్యానీల ధర రూ.6వేల వరకూ ఉంటుందని తెలుస్తోంది

- బంజారాహిల్స్‌లోని హౌస్ ఆఫ్ దోసె, నగరంలోనే అత్యంత ఖరీదైన దోసెను అందుబాటులోకి తెచ్చింది. దీని ధర సుమారు రూ.1000 పైనే ఉంది. అయితే ఇది ఆర్డర్‌పై మాత్రమే అందిస్తారు. దీని తయారీలో తినదగిన బంగారు పూత, వేయించిన జీడిపప్పు, బాదం, స్వచ్ఛమైన నెయ్యి చట్నీలు లభ్యత: కస్టమర్ ఆర్డర్ చేసిన తర్వాత మాత్రమే తయారు చేస్తారు. గింజలు నెయ్యితో వస్తుంది. ఈ బంగారు దోసె ఆహార ప్రియులకు, వారాంతాల్లో ఆకర్షణగా మారింది.





ప్రపంచ పజిల్ ఛాంపియన్‌షిప్‌లో..

తండ్రీ కొడుకులు

సాక్షి, సిటీబ్యూరో: హంగేరీలోని ఎగర్‌లో జరగనున్న 18వ ప్రపంచ సుడోకు ఛాంపియన్‌షిప్, 32వ ప్రపంచ పజిల్ ఛాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన తండ్రి కొడుకులు దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. హంగేరియన్ పజిల్లర్స్ అసోసియేషన్ నిర్వహించే ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని గ్లోబల్ ఎడ్జ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, తన కుమారుడు కార్తీక్ రెడ్డితో కలిసి ఈ నెల 21 నుంచి 30 వరకు జరగనున్న ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 24 గంటల పజిల్ ఛాంపియన్‌షిప్ కూడా ఉంటుంది. అనుభవజ్ఞుడైన పజిల్ ఔత్సాహికులు జైపాల్‌రెడ్డి మొదట 2007లో అధికారిక పజిల్ పోటీల్లో భాగస్వామ్యమయ్యారు. తన పాఠశాల రోజుల నుంచి పజిల్స్ అంటే చాలా ఇష్టమని ఆయన గుర్తు చేసుకున్నారు. భారతదేశం అంతటా ప్రాంతీయ రౌండ్లలో పాల్గొన్న తర్వాత 2008 నాటికి జాతీయ జట్టులో స్థానం సంపాదించానని, ప్రస్తుతం అంతర్జాతీయ పజిల్ పోటీలలో క్రమం తప్పకుండా పాల్గొంటున్నానని తెలిపారు. ప్రస్తుతం 23 ఏళ్ల కార్తీక్‌రెడ్డి ఈ అభిరుచిని వారసత్వంగా పొందారని, 2015లో ప్రారంభించిన తన ప్రయాణం త్వరితగతిన అంతర్జాతీయ స్థాయికి ఎదిగిందని పేర్కొన్నారు. వీరు దివంగత కాంగ్రెస్ నాయకుడు ఎం.బాగారెడ్డి వారసులు కావడం విశేషం.

విద్యార్థుల కోసం మీడియా ల్యాబ్స్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తూ, భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు యూత్ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగస్వామిగా మారినట్టు నికాన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ కుమార్ తెలిపారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా నగరంతో పాటు దేశవ్యాప్తంగా పలు పాఠశాలలు కళాశాలల్లో మీడియా ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డిజిటల్ స్టోరీ టెల్లింగ్, మీడియా ఎథిక్స్ వంటి రంగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. జర్నలిజం, మీడియా రంగాలు, కంటెంట్ క్రియేషన్ వంటి అంశాలపై విద్యార్థులకు పరిచయంతో పాటు వర్క్‌షాప్‌లు, ప్రాజెక్టులు, గైడ్ చేసిన టూర్ల ద్వారా అనుభవాత్మక అభ్యాసం కూడా ఉంటాయన్నారు.



రోటరీ ఆధ్వర్యంలో

వృక్షారోహణ

సాక్షి, సిటీబ్యూరో: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోటరీ క్లబ్‌తో కలిసి ర్యాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, నగరంలోని కొండాపూర్, కొంపల్లి, గండి మైసమ్మలోని తమ క్యాంపస్‌లలో వృక్షారోహణ పేరిట కార్యక్రమం చేపట్టింది. 'ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి' అని పిలుపునిస్తూ 900కుపైగా మామిడి, పనస, జామ, నేరేడు వంటి పండ్ల మొక్కలను విద్యార్థులు, రోటేరియన్లు నాటారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ రవి శంకర్ దకోజు, డా.ఎస్.వి.రాంప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ర్యాన్ చైర్మన్ డా.ఏఎఫ్. పింటో ప్రారంభించిన 'మన భూమి.. మన భవిష్యత్తు.. మనం పునరుద్ధరణ తరం' ఆవిష్కరణలో భాగంగా ఈ వృక్షారోహణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రన్ ఫర్ హ్యాపీనెస్

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా 28వ తేదీన నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ఆధ్వర్యంలో 'రన్ ఫర్ హ్యాపీనెస్' 3వ ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యకరమైన, చురుకైన జీవనశైలిని స్వీకరించాలనే లక్ష్యంతో రన్ ఫర్ హ్యాపీనెస్ నిర్వహిస్తున్నామని నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ఆపరేషన్స్ అధ్యక్షుడు జయేన్ నాయక్ తెలిపారు. రిజిస్ట్రేషన్ల నుంచి వచ్చే ఆదాయం బీయింగ్ సోషల్ – ఏక్ నయా షురువాత్ సహకారంతో ఒక సామాజిక కారణానికి ఉపయోగించబడుతుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు.. www. indiarunning. com లేదా 9620961824 / 9985411876.



ప్లాంట్స్.. దోమలకు చెక్

ఆరోగ్యం, పర్యావరణానికి మేలు

వంటింట్లోకి కూడా ఉపయోగం

సాక్షి, సిటీబ్యూరో: విష జ్వరాలు, డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా వంటి ఎన్నో రకాల వ్యాధులు దోమ కాటుతో వస్తాయి. దోమ కాటు వేసిందా ఎంతటి వారైనా మంచాన పడాల్సిందే. మరి అలాంటి దోమల నివారణకు ఎవరో వచ్చి దోమల మందు పిచికారీ చేస్తారని ఎదురు చూడకుండా ఇంటి పెరట్లోనో, బాల్కనీల్లోనో చిన్న కుండీల్లో ఈ మొక్కలను పెంచుకుంటే దోమలు రాకుండా ఉంటాయని వృక్షశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. అవి ఒక్క దోమల నివారణకే కాకుండా వంటింటికీ ఉపయోగపడతాయని అంటున్నారు. రసాయన లిక్విడ్లకు బదులుగా సహజ సిద్ధంగా దోమల నివారణ ఆరోగ్యం, పర్యావరణానికి మంచిదని బోటనీ ప్రొఫెసర్ దిలీప్ చెబుతున్నారు. మొక్కలు పెంచే సమయంలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.





- నిమ్మ గడ్డి వాసనకు దోమలు దూరం కావడంతో పాటు వంటల్లోనూ దీన్ని ఉపయోగిస్తారు. సిట్రోనెల్లా గడ్డిలో సిట్రోనెల్లాల్, సిట్రోనెల్లోల్, జెరానియోల్ కలిసి ఉంటాయి. ఇది ఘాటైన వాసనలను వెదజల్లుతుంది. ఈ వాసనకు దోమలు తరలిపోతాయి.



- పాత కాలంలో ఇంటి ఆవరణలో తులసి మొక్కకు పూజలు చేసేవారు. ఉదయం లేచి స్నానం చేసి, తులసి గుండం వద్ద దీపం వెలిగించేవాళ్లు. అది ఆధ్యాత్మికంగా, అందులో ఔషధ గుణాలు ఆరోగ్యపరంగానూ ఉపయోగకరంగా ఉంటాయి. ఈ మొక్కల ఆకుల వాసనతో దోమలు దూరమవుతాయట.

- వంటింట్లో మనకు నిత్యం కనిపించే పుదీనా ఆకు ఘాటైన వాసనలకు దోమలు దూరమవుతాయట. పుదీనా పెంచుకుంటే ఒక వైపు దోమల నివారణ, మరో వైపు వంటకు అవసరమైన పుదీనా ఆకు సొంతంగా పెంచుకున్నట్లు అవుతుంది. ఎప్పటికప్పుడు ఫ్రెష్ లీవ్స్ అందుబాటులో ఉంటాయి.

- రోజ్‌మెరీ కొమ్మలను కాల్చినా, నూనె వాడినా దోమలు దూరమవుతాయి. కుప్ప చెట్టు రసాయనాల కంటే ప్రభావవంతంగా పనిచేస్తుంది.



- ఇంట్లో లావెండర్, బంతి మొక్కలు పెంచుకుంటే వాటి పువ్వులు సువాసనలు వెదజల్లుతాయి. కలర్‌ఫుల్‌గా ఉండే పువ్వులు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. రిలాక్స్‌గా అనిపిస్తుంది. వీటిలో లినాలూల్, కర్పూరం సమ్మేళనాలు ఉంటాయి. వీటి సువాసన, నూనె దోమలను తరిమేస్తుంది.







- తమిళ సంస్కృతిని ప్రతిబింబిస్తున్న ఫుడ్ ఫెస్టివల్
- రాడిసన్ బ్లూ ప్లాజా వేదికగా తమిళ వంటకాలు
- ఈ నెల 21వరకు కొనసాగనున్న ఫెస్టివల్



తెలుగునాట కొంగునాడు

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న సంస్కృతుల సమ్మేళనం హైదరాబాద్.. ఎప్పటికప్పుడు తన ప్రశస్తిని చాటుకుంటూనే ఉంటుంది. నగరం వేదికగా ఆతిథ్యమిచ్చే విభిన్న సంస్కృతుల ఆహార రుచులు సైతం ఈ సమ్మేళనంలో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగానే నగరంలోని బంజారాహిల్స్ రాడిసన్ బ్లూ ప్లాజా వేదికగా తమిళనాడు వంటకాలతో ఆవిష్కృతమైన 'కొంగునాడు ఫుడ్ ఫెస్టివల్' విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫెస్ట్‌లో భాగంగా తమిళనాడు సెలం, ఈరోడ్, కోయంబత్తూర్ ప్రాంతాలకు చెందిన సంప్రదాయ వంటకాలు నిజాం నగరానికి పరిచయం చేస్తున్నాయి. తమిళనాడుకు చెందిన ప్రముఖ మాస్టర్ చెఫ్ గౌతమ్–టీమ్ ప్రత్యేకంగా ఈ ఫెస్టివల్‌ను వండి వారిస్తున్నారు. దక్షిణాదిలోని పాకశాస్త్ర నైపుణ్యాలు, వారసత్వ పద్ధతులకు అధునాతన హంగులు అద్దిన రుచులు నగరంలోని ఫుడ్ లవర్స్ నోరూరిస్తున్నాయి.





రుచుల విందు.. సాంస్కృతిక సమ్మేళనం

తమిళ సంస్కృతి అంటేనే పురాతన, వారసత్వ వైభవానికి పట్టం కట్టే ఆనవాయితీ అని పేరుంది. ఇందులో వారసత్వ పరిణామ క్రమంలో తమ ప్రశస్తిని చాటిచెప్పే వంటకాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని మాస్టర్ చెఫ్ గౌతమ్ తెలిపారు. కంబు దోస, అరిసి పరుప్పు సాదం, కోళి మిరియాల కర్రీ, కరి దోస, మటన్ చుక్కా వంటి అరుదైన కొంగు వంటకాలను ఈ ఫుడ్ ఫెస్ట్‌లో రుచి చూడవచ్చు. సెలమ కొంగు ప్రాంతపు వంటకాలు సాధారణంగా మిల్లెట్స్ ఆధారితంగా, మిరియాల రుచులు, తక్కువ మసాలా వినియోగం, నెయ్యి సువాసనలు కలగలిపి ప్రత్యేకతను సంతరించుకున్నాయి.



మార్పు అవసరమే.. అసాధ్యమేమీ కాదు..

రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన జరగాలి

మార్పు జరుగుతుందన్న నమ్మకం ఉంది

'ప్యూ' సర్వేలో భారతీయుల మనోగతం

- సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రపంచ వ్యాప్తంగా భారత్, అమెరికా, కెనడా, గ్రీస్, ఫ్రాన్స్, స్పెయిన్, యూకే, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్ వంటి 25 దేశాలలో 'ప్యూ' నిర్వహించిన ఈ సర్వేలో 50 శాతానికిపైగా ప్రజలు తమ దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులు లేదా పూర్తి సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. ఇదే అభిప్రాయాన్ని సర్వేలో పాల్గొన్న భారతీయుల్లో 70 శాతానికిపైగా వ్యక్తం చేశారు. 2025 జనవరి 8 – ఏప్రిల్ 26 మధ్య 'ప్యూ' ఈ సర్వేను నిర్వహించింది. సర్వే కోసం 28,333 మంది అభిప్రాయాలు సేకరించింది.


దేశ రాజకీయ వ్యవస్థలో మార్పులు అవసరమని భారతీయులు భావిస్తున్నట్లు 'ప్యూ రిసెర్చ్ సెంటర్' తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. మొత్తం 25 దేశాల్లో ఒక్క భారతీయులు మాత్రమే రాజకీయ వ్యవస్థలో మార్పును కోరుకుంటూనే.. ఆ మార్పులు జరుగుతాయన్న నమ్మకాన్ని కూడా ప్రబలంగా వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. ప్రజలు రాజకీయ వ్యవస్థలో ప్రక్షాళనను కోరుకుంటున్నారని, అయితే ప్రక్షాళన జరగటంపై సందేహాలు వ్యక్తం చేశారని 'ప్యూ' తెలిపింది.


మార్పుపై మనవాళ్లు

భారీ మార్పు అవసరం అన్న భారతీయులు 37 శాతం మంది కాగా, మొత్తం అంతా మారిపోవాలి అన్నవాళ్లు 34 శాతం మంది. అసలు మార్పే అవసరం లేదన్నవారు 9 శాతం మంది, చిన్నచిన్న మార్పులు అవసరం అన్నవారు 16 శాతం మంది. రాజకీయ వ్యవస్థ మారుతుందని 59 శాతం మంది భారతీయులు నమ్ముతుండగా, 10 శాతం మంది తమకు అలాంటి నమ్మకం లేదని తెలిపారు. 25 శాతం మంది కొద్దిపాటి మార్పులు చేస్తే బాగుంటుందని / అసలు మార్పులే అవసరం లేదని అన్నారు.

కొన్ని దేశాల్లో పెదవి విరుపు

రాజకీయ వ్యవస్థలో మార్పులు జరిగే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు వివిధ దేశాల ప్రజలు వేర్వేరుగా సమాధానాలు ఇచ్చారు. ఉదాహరణకు, దక్షిణ కొరియా వాసుల్లో 87 శాతం మంది రాజకీయ సంస్కరణలు అవసరమని చెప్పినప్పటికీ, అవి జరుగుతాయన్న నమ్మకం తమకు లేదని అన్నారు. మొత్తం 25 దేశాల్లో ఒక్క భారతీయులు మాత్రమే రాజకీయ వ్యవస్థలో మార్పును కోరుకుంటూనే, ఆ మార్పులు జరుగుతాయన్న నమ్మకాన్ని కూడా ప్రబలంగా వ్యక్తం చేశారు.







నాయకులపై సానుకూలత

ప్రపంచ దేశాలన్నిటిలోనూ నాయకులపై సానుకూల భావనే కనిపించింది. భారతీయులు కూడా – తమ దేశ రాజకీయాల్లో వ్యవస్థాగత మార్పులు అవసరం అంటూనే, తాము ఎన్నుకున్న నాయకుల వ్యక్తిత్వాల పట్ల ఎక్కువగా సదభిప్రాయాలనే వ్యక్తం చేశారు. ఎంపిక చేసిన ఐదు రకాల గుణగణాలు (నిజాయితీ, ప్రజావసరాలను అర్థం చేసుకోవటం, సమస్యలపై దృష్టి పెట్టటం, నైతిక ప్రవర్తన, యోగ్యతలు).. తమ నాయకులలో అవి ఉన్నదీ లేనిదీ గుర్తించమని 'ప్యూ' సర్వే అడిగినప్పుడు ఎక్కువమంది సానుకూలంగా స్పందించారు.

భారతీయులదీ అదే తీరు

భారతీయులు తాము ఎన్నుకున్న నాయకుల వ్యక్తిత్వంపై పూర్తి వ్యతిరేకంగా లేరు. 33 శాతం మంది తమ నాయకుల నిజాయితీకి, 31 శాతం మంది ప్రజావసరాలను అర్థం చేసుకునే నైజానికి, 27 శాతం మంది ప్రజా సమస్యలపై పెడుతున్న దృష్టికి, 27 శాతం మంది నైతికతకు, 23 శాతం మంది యోగ్యతలకు పాజిటివ్ రేటింగ్ ఇచ్చారు.

మనకు నమ్మకం ఎక్కువే

రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని చెప్పిన దేశాల్లో నైజీరియా మొదటి స్థానంలో (51 శాతం)లో ఉండగా, దక్షిణ కొరియా రెండో స్థానంలో (43 శాతం), ఇండియా మూడో స్థానంలో (34) ఉన్నాయి. 7 శాతంతో స్వీడన్ చివరి స్థానంలో ఉంది. ఎప్పటికైనా మార్పులు జరుగుతాయన్న నమ్మకం ఉన్న దేశాల్లో ఇండియా, కెన్యా రెండూ సమానంగా (59 శాతం) ప్రథమ స్థానంలో ఉండగా; మార్పులు జరుగుతాయన్న నమ్మకం లేని దేశాల్లో ఇండియా (10 శాతం) ఆఖర్న, గ్రీసు మొదట (68 శాతం) ఉన్నాయి. ఇక నేతల వ్యక్తిత్వాలు, సామర్థ్యాలపై నమ్మకం ఉన్న ఆసియా–పసిఫిక్ దేశాలలో 28 సగటు శాతంతో ఇండియా నాలుగో స్థానంలో ఉంది. మొదటి మూడు స్థానాల్లో వరుసగా ఆస్ట్రేలియా (41 శాతం), దక్షిణ కొరియా (34 శాతం), ఇండోనేషియా (31 శాతం) ఉన్నాయి.

క్లుప్తంగా...

ప్రధాని మోదీకి వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో.. దేశ సేవలో మరింతగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బేబీ, తమ్మినేని తదితరులు

జనగామ రూరల్/ఖమ్మం గాంధీచౌక్: రాష్ట్రాల్లోని సహజ సంపదను అంబానీ, అదానీకి.. నరేంద్రమోదీ ప్రభుత్వం కట్టబెడుతోందని, రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ కోరారు. జనగామ జిల్లా కేంద్రంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రెస్టేజ్ మైదానంలో బహిరంగ సభలో ఎంఏ బేబీ మాట్లాడారు. దేశంలో భూ సంస్కరణల అమలుకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మార్గదర్శకంగా నిలిచిందని స్పష్టం చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో పాల్గొని సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు.

అక్రమ కేసులతో మీడియాను అణచివేయడం అసాధ్యం

కుల సంఘాల స్పష్టీకరణ

- సాక్షి ఎడిటర్‌పై ఏపీ సర్కార్ అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్



సాక్షి, హైదరాబాద్: అక్రమ కేసులతో మీడియాను అణచివేయడం అసాధ్యం అని కుల సంఘాలు స్పష్టం చేశాయి. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై ఏపీ పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని ఈ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరించే మీడియా.. ప్రజల సమస్యలతో పాటు ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతుందని, అలాంటి వాటిని సానుకూలంగా స్వీకరించి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని సూచించాయి. సాక్షి మీడియా వచ్చిన తర్వాత బీసీలు, బడుగు, బలహీన వర్గాల గొంతు పెద్ద ఎత్తున వినిపిస్తోందని ఆ సంఘాలు తెలిపాయి.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి..



ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకం. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వ్యవహరించే ఈ వ్యవస్థను బలవంతంగా కేసులు పెట్టి లొంగదీసుకోవాలనుకోవడం మూర్ఖత్వం. సాక్షి మీడియా ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. వెంటనే ఏపీ ప్రభుత్వం ఈ కేసులను ఉపసంహరించుకోవాలి.

– జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు

పత్రికా స్వేచ్ఛను హరించడమే..



ప్రతిపక్షంతో పాటు విపక్ష అనుకూల మీడియా గొంతు నొక్కుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాల చర్యలను ఎండగట్టడంలో మీడియా పాత్ర కీలకం. అలాంటి వార్తలను ప్రభుత్వం పాజిటివ్‌గా తీసుకుని పరిష్కార చర్యలు చేపట్టాలి. అలాకాకుండా మీడియాపైన అక్రమంగా కేసులు పెట్టడమంటే ప్రతికా స్వేచ్ఛను హరించడమే. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి.

– గవ్వల భరత్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం

మీడియాపై దాడి మంచిదికాదు



ప్రభుత్వాలు ఏ మీడియాపైనా ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేయవద్దు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు వస్తే.. వాటికి వివరణ ఇవ్వడమో, ఖండించడమో జరగాలి. అలా కాకుండా ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తామనడం సరికాదు. సాక్షి ఎడిటర్‌పై ఏపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. మీడియాలో కేవలం పాలక పక్షం వార్తలే కాకుండా ప్రతిపక్షం వార్తలు కూడా వస్తాయి. ప్రతిపక్షాల వార్తలు రాసినందుకు సాక్షి మీడియాపై కేసులు నమోదు చేయడమంటే జర్నలిజంపై నేరుగా దాడి చేయడమే.

– జి.చెన్నయ్య, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

సినీ కార్మికులను విస్మరించొద్దు

- వారికేం కావాలో చెప్పండి
- సినిమా ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిని హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి సినిమా కార్మికులకు ఏమీ కావాలో చర్చించుకుని చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సినిమా రంగానికి చెందిన ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సినిమా కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో సినిమా కార్మికులకు శిక్షణ ఇప్పిస్తామని, వారు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అన్ని భాషల చిత్రాల షూటింగ్‌లు తెలంగాణలో జరిగేలా సహకరించాలని, చిన్న నిర్మాతలకు సహకరించాలని కోరారు. పరిశ్రమలో పని వాతావరణాన్ని చెడగొట్టుకోవొద్దని హితవు పలికారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు సమ్మెకు పోతే రెండువైపులా నష్టం జరుగుతుందని హెచ్చరించారు. సమస్యను సమస్యగానే చూస్తానని, వ్యక్తిగత పరిచయాలను చూసుకోనని స్పష్టం చేశారు. 'నేను కార్మికుల వైపు ఉంటాను. అదే సమయంలో నాకు రాష్ట్ర ప్రయోజనాలు కూడా ముఖ్యమే. సమ్మె జరుగుతుంటే చూస్తూ ఊర్కోలేం. సినిమా కార్మికులకు ఆరోగ్య బీమా అందించే ప్రయత్నం చేస్తాం'అని రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో ఇన్నేళ్లలో సినిమా కార్మికులను పిలిచి మాట్లాడిన ముఖ్యమంత్రి లేరని ప్రతినిధులు అన్నారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు, తెలుగు సినీ పరిశ్రమ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని, ప్రధాన కార్యదర్శి అమ్మిరాజు కానుమిల్లి, వివిధ సినీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్. చిత్రంలో దిల్ రాజు

భారీ వర్షాలతో జాగ్రత్త

హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. చాలాచోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయని, ట్రాఫిక్‌కు అంతరాయం ఉన్నచోట్ల వెంటనే పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నాలాలున్న చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. వర్షం ఎక్కువ కురిసిన ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ, విద్యుత్తు విభాగాల అధికారులు తగిన సహాయక చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

యువతతో పెట్టుకుంటే మనుగడ లేదు

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: యువతతో పెట్టుకున్న ప్రభుత్వం ఏదీ మనుగడ సాగించలేదని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిరుద్యోగ యువతను గాలికి వదిలేయొద్దని, వారికి ఏదైనా దారి చూపించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరుద్యోగులు పోషించిన పాత్ర వెలకట్టలేనిదన్నారు. తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా నిరుద్యోగులతో కలిసి ఆయన గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసిన బీఆర్‌ఎస్ హయాంలో.. తెలంగాణ కోసం పోరాడిన ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదన్నారు. కేసీఆర్‌ను ఫామ్‌హౌజ్‌కు పంపించడంలో యువత పాత్ర కీలకమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూనే ఉద్యోగాల కల్పన చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో యువత అందరికీ ఉద్యోగాలు వస్తాయని, యువత అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. నిరుద్యోగులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటానని, ఉద్యోగాల భర్తీ విషయంలో సీఎంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

పోరాటం కమ్యూనిస్టులదైతే ఆర్భాటం బీజేపీకి ఎందుకు?

- అబద్ధాలతో చరిత్ర వక్రీకరిస్తున్న కాషాయ పార్టీ
- సీపీఎం జాతీయ నాయకురాలు, మాజీ ఎంపీ బృందాకారత్

సూర్యాపేట: కమ్యూనిస్టుల నాయకత్వంలో జరిగిన వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో విషపురుగులైన కాషాయ ఉన్మాదులకు సంబంధమేంటని సీపీఎం జాతీయ నాయకురాలు, మాజీ ఎంపీ బృందా కారత్ ప్రశ్నించారు. మట్టి మనుషుల మహోన్నత పోరాట చరిత్ర గురించి మాట్లాడే నైతిక అర్హత మతోన్మాద బీజేపీకి లేదన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో 'తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం–వాస్తవాలు–వక్రీకరణలు' అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆమె హాజరై ప్రసంగించారు. 1946, సెప్టెంబర్ 11 నుంచి 1951, సెప్టెంబర్ 17 వరకు జరిగిన వీరోచిత వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మచ్చుకైనా కనిపించని మతోన్మాదులు ఆ పోరాటానికి వారసులమంటూ సభలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 1913లో హిందూ మహాసభ, 1925లో ఆర్‌ఎస్‌ఎస్, 1951లో జనసంఘ్ ఏర్పడితే.. ఆ పోరాటం జరిగిన కాలంలో మీరు ఎందుకు ఆ పోరాటంలో పాల్గొనలేదని ప్రశ్నించారు. నైజాం తెలుగు మాట్లాడొద్దంటూ ఉర్దూ మాత్రమే ఉండాలని చెప్పినట్టుగా.. నేడు బీజేపీ హిందీ మాత్రమే మాట్లాడాలి అని మాతృభాష మాట్లాడకూడదు అంటూ చెబుతోందని బృందాకారత్ విమర్శించారు. విసునూరు రామచంద్రారెడ్డి, ఎర్రబాడు దొరలు, భూస్వాములు, జాగీర్దారులు నిజాం సైన్యంలో అత్యధికులు తెలంగాణ గడ్డలోని మట్టి మనుషులను నానా చిత్రహింసలు పెట్టారని, దోపిడీ చేశారని తెలిపారు. అది హిందూ, ముస్లింల పోరాటం కాదని దోపిడీ చేసిన దోపిడీదారులు, దోపిడీకి గురైన పేదలు కూడా హిందువులేనని చెప్పారు. ఆ పోరాటంలో మొదటగా ప్రాణాలు ఇచ్చింది షేక్ బందగీ ముస్లిం కాదా? అని బృందా కారత్ ప్రశ్నించారు. నిజాం రాజైన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు రాజ్య ప్రముఖ్ ప్రకటించి కిరీటం పెట్టింది నెహ్రూ, పటేల్ ప్రభుత్వం కాదా? అని అడిగారు. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని ఈ తరానికి అందించకుండా దానికి మతం రంగు పులిమి యువతరాన్ని తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, చెరుపల్లి సీతారాములు, మల్లు లక్ష్మి, మల్లు నాగార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బృందాకారత్, చిత్రంలో జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, చెరుపల్లి సీతారాములు తదితరులు



రావి నారాయణరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే..

అనేక పోరాటాలకు ప్రేరణ

బంజారాహిల్స్ (హైదరాబాద్): నిజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలించి వేసిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే దేశంలో అనేక ఉద్యమాలకు ఊపిరి పోసిందని పలువురు వక్తలు అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట 77వ వారోత్సవాల ముగింపు బహిరంగ సభ బుధవారం లోటస్ పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా కూనంనేని అధ్యక్షోపన్యాసం చేస్తూ దొరల పెత్తనం, భూస్వాముల అరాచకాలను వ్యతిరేకిస్తూ నాడు అన్ని ప్రవంతులు ఏకమై సాగించిన సమరమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమన్నారు. ఈ పోరాటం ద్వారానే నిరంకుశ నిజాం పాలన పతనమై హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైందని.. ఎవరూ ఔనన్నా కాదన్నా చరిత్రే ఇందుకు సాక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సయ్యద్ అజీజ్‌పాషా, చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ తొలుత భాషా పరిరక్షణ ఉద్యమంగా ప్రారంభమై ఆతర్వాత నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మారిందే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని చెప్పారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ సాయుధ పోరాటం ప్రభావం తెలంగాణ సమాజంపై ఎప్పుడూ ఉంటుందన్నారు. కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో సాధించుకున్న స్వేచ్ఛ మన తెలంగాణ అని తెలిపారు. ఈ బహిరంగ సభకు జస్టిస్ చంద్రకుమార్, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.డి.యూసుఫ్, అరుణోదయ సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు విమలక్క తదితరులు హాజరయ్యారు.

అక్రమ ఇసుక.. ఓవర్ లోడ్.. రాంగ్ రూట్..

డ్రైవర్ మద్యం మత్తు.. ఏడుగురిని బలిగొన్న టిప్పర్

- ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జు
- కారులో ఉన్న ఏడుగురూ అక్కడికక్కడే మృతి
- ఏపీలోని శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోరం




టిప్పర్ కారు ఢీకొన్న దృశ్యం

సంగం: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన సమీపంలో జాతీయ రహదారిపై తెలుగుదేశం పార్టీ నేత ఇసుక టిప్పర్ రాంగ్ రూట్లో అతివేగంగా ఎదురుగా వచ్చి కారును ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగిన ఈ ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపింది. అనధికారికంగా పడమటి కంభంపాడు వద్ద నిర్వహిస్తున్న క్వారీ నుంచి సంగం మండలానికి చెందిన టీడీపీ నేతకు చెందిన టిప్పర్ ఇసుక లోడ్‌తో నెల్లూరు వైపు రాంగ్ రూట్‌లో బయలు దేరింది. అదే సమయంలో నెల్లూరు నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న కారును పెరమన వద్ద అతివేగంతో ఎదురుగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తాళ్లూరి శ్రీనివాసులు (40), తాళ్లూరి రాధ (36), ఇందుకూరుపేటకు చెందిన చల్లగుండ శ్రీనివాసులు (40), చల్లగుండ్ల లక్ష్మి (34), శేషం సారమ్మ (40), శేషం వెంగయ్య (38), కారు డ్రైవర్ కత్తి బ్రహ్మయ్య (24) కారులోనే మృతి చెందారు. టిప్పర్ అతి వేగంగా కారును ఢీకొనడంతో వీరి శరీరాలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఘటనలో మృతి చెందిన వారంతా బంధువులే.

అతి కష్టం మీద మృతదేహాల వెలికితీత

సుమారు 40 టన్నుల ఇసుక ఉన్న 12 టైర్ల టిప్పర్.. రాంగ్ రూట్‌లో అతివేగంగా దూసుకు రావడంతో కారు నుజ్జునుజ్జు అయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురూ క్షణాల్లో చనిపోయారు. మృతదేహాలను వెలికి తీసేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. జిల్లా ఎస్పీ అజిత ఏజెండ్ల ఘటన స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్ లొంగిపోయాడని వెల్లడించారు. ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నదీ, లేనిదీ విచారిస్తామని చెప్పారు. కాగా, పోలీసుల అదుపులో ఉన్నది ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కాదని, నకిలీ అని సమాచారం. కాగా, ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇసుక టిప్పర్ డ్రైవర్ మద్యం మత్తులో ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. కారును ఢీకొట్టిన వెంటనే డ్రైవర్ టిప్పర్ దిగి పారిపోయాడు. ఏడుగురు మరణానికి కారణమైన టిప్పర్ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఏఎస్ పేట మండలం చిరమనకు చెందిన కాటం రవీంద్రారెడ్డిదిగా గుర్తించారు. తెలుగుదేశం పార్టీ నేత టిప్పర్ కావడంతో కేసును తారుమారు చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి.

అసంతృప్త యువతరం



నడి వయసు వారికంటే జెన్‌–జెడ్‌లో అధిక అసంతృప్తి

సంప్రదాయ సూత్రీకరణలకు భిన్నంగా వాస్తవ స్థితి

సోషల్ మీడియా, ఆర్థిక అస్థిరత, కోవిడ్‌తో యువతలో నిరాశ

44 దేశాల్లో అధ్యయనం ద్వారా తేల్చిన పరిశోధకులు

యువతరం అనగానే ఉరిమే ఉత్సాహం, నిత్య చైతన్యం నిండిన ముఖాలే గుర్తుకొస్తాయి. సాధారణంగా జీవితంలో అసంతృప్తి దశ అంటే మధ్య వయసు అని ఎన్నాళ్లుగానో ఒక నమ్మకం బలపడిపోయింది. కానీ, ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని తాజా అధ్యయనంలో తేలింది. మధ్య వయస్కులకంటే జనరేషన్‌–జెడ్‌ (1996–2010 మధ్య పుట్టిన వారు)గా పిలుస్తున్న యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెల్లడైంది. భవిష్యత్తుపై అనిశ్చితి, సోషల్ మీడియా ప్రభావం, కోవిడ్‌–19 తర్వాత వచ్చిన మార్పులు తదితర పరిణామాలతో యువతలో అసంతృప్తి అధికంగా ఉందని 44 దేశాల్లో దీర్ఘకాలం పాటు నిర్వహించిన గ్లోబల్ సర్వేలో తేలింది. డేవిడ్ జీ.బ్లాంచ్‌ఫ్లవర్, అలెక్స్ బ్రైసన్, జియావోయ్ జు అనే శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయన నిర్వహించింది. 2024 వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ వంటి పరిశోధనలను బట్టి చూస్తే మధ్య వయస్కులలోనే అసంతృప్తి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. కానీ, ఈ సంప్రదాయ సూత్రీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పు అని ఈ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఐక్యరాజ్య సమితి సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) నిర్వహించిన సర్వేలోనూ దాదాపు ఇవే ఫలితాలు వచ్చాయి. దశాబ్దాలుగా పరిశోధకులు 'మిడ్ లైఫ్ అన్‌హ్యాపినెస్ హంప్'ను ప్రామాణికంగా తీసుకుంటూ వచ్చారు. కానీ, ఇప్పుడు యువతలో.. అదీ కూడా 15 నుంచి 28 ఏళ్ల మధ్య వయసులో ఉన్న వారిలో ఈ ధోరణి అధికంగా ఉందని గుర్తించారు. ఇందుకు సోషల్ మీడియా, ఆర్థిక అస్థిరత, కోవిడ్‌–19 దీర్ఘకాలిక ప్రభావాలు, ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అస్థిర పరిస్థితులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటివి కారణమని తేల్చారు.

స్కీ స్లోప్‌లోకి జెన్ జెడ్

అధిక ఆదాయ దేశాల్లోని (హై ఇన్‌కమ్ కంట్రీస్) యువతలో అసంతృప్తి స్థాయి అధికంగా ఉంది. విభిన్న నేపథ్యాలున్న దేశాల్లోనూ ఈ పరిస్థితి పెరుగుతోంది. జెన్‌– జెడ్ అసంతృప్తిలో 'స్కీ స్లోప్'ను అంటే.. పల్లంలోకి జారుకునే స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇతర అధ్యయనాల్లోని డేటా కూడా ఈ ధోరణిని సమర్థిస్తోంది. మానసిక ఆందోళన, ఒత్తిళ్లు, కుంగుబాటు అనేవి 16–19 ఏళ్ల మధ్యనున్న టీనేజర్లు, 20–24 ఏళ్ల మధ్య వయసులోని యువతలో అధికంగా ఉన్నట్టు తేలింది. గత పదేళ్లుగా యువతరం మానసిక ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని ఈ బృందం ప్రచురించిన అధ్యయనంలో పేర్కొన్నారు.

సాక్షి, హైదరాబాద్

ఐక్యరాజ్య సమితి సీడీసీ నివేదికలోని అంశాలు..

- యువకుల్లో మానసిక ఆరోగ్య సమస్యలు 1993లో 2.5% ఉండగా, 2024లో 6.6%కి పెరిగాయి.
- యువతుల్లో ఇదే కాలంలో 3.2% నుంచి 9.3%కి చేరింది.
- 2023 గ్యాలప్ సర్వేలో జెన్ జెడ్‌లో 15% మంది తమ మానసిక ఆరోగ్యం బాగా ఉందని తెలిపారు.
- 1981–1996ల మధ్య జన్మించిన 52% మిలీనియల్స్ (మధ్య వయసువారు) మానసిక ఆరోగ్యం మాత్రం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు.

సమస్యలకు కారణాలు..

- సోషల్ మీడియా అధిక వినియోగంతో అవాస్తవిక సామాజిక పోలికలు ఏర్పడి ఆందోళన, అసంతృప్తి పెరుగుతోంది. జెన్ జెడ్ ఎక్కువగా ఆర్థిక ఆందోళన, అస్థిరతను ఎదుర్కొంటున్నారు.
- కోవిడ్‌–19 వల్ల సామాజిక, విద్యా జీవితానికి ఏర్పడిన అంతరాయాలు యువత మానసిక ఆరోగ్యంపై శాశ్వత ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.
- రాజకీయ అనిశ్చితి, వాతావరణ మార్పులపై అవగాహన పెరగడం యువతలో నిరాశ, భవిష్యత్తుపై అనిశ్చితి భావాలకు దారితీస్తోంది.

పరిష్కారాలు..

- యువతలో సంతోషాలు నింపేందుకు వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని మెరుగుపర్చాలి. పాఠశాలల్లో ఫోన్ వాడకాన్ని నిషేధించాలి.
- మెంటల్ హెల్త్ సర్వీసెస్‌ను పెంచాలి.
- కౌమార దశ నుంచి వయోజనులుగా మారుతున్న క్రమంలో యువతకు సంబంధించి స్కూళ్ల విధానాలను నవీకరించడంతోపాటు డిజిటల్–సేఫ్టీ చర్యలు చేపట్టాలి.
- సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, చుట్టూ ఉన్న వారితో ప్రత్యక్ష సంబంధాలను ప్రోత్సహించాలి.
- స్నేహితులతో అధిక సమయం గడపడం ద్వారా యువతలో ఆనందాన్ని మెరుగుపర్చవచ్చు అని నిపుణులు పేర్కొంటున్నారు.

'జీఎస్టీ' దెబ్బ గట్టిగానే!

జీఎస్టీ రేట్ల శ్లాబ్‌లు తగ్గించడంతో రాష్ట్ర ఖజానాకు భారీ గండి

- ప్రాథమిక అంచనాలు సిద్ధం చేసిన పన్నుల శాఖ అధికారులు.. ఐరన్ అండ్ స్టీల్, ఆటోమొబైల్స్, ఎఫ్‌ఎంసీజీ రంగాల్లో నష్టం ఎక్కువగా వచ్చే అవకాశం



సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల శ్లాబ్‌ల తగ్గింపు కారణంగా రాష్ట్ర ఖజానాకు ఏడాదికి రమారమి రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని వాణిజ్య పన్నుల శాఖ వర్గాలు ఓ అంచనాకు వచ్చాయి. ఆయా వస్తువుల అమ్మకాలను బట్టి సుమారు రూ.5–7 వేల కోట్లు నష్టం వస్తుందని వాణిజ్య శాఖ వర్గాలు తమ ప్రాథమిక అంచనాలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది. జీఎస్టీ శ్లాబ్‌ల హేతుబద్ధీకరణ కారణంగా ఏ మేరకు నష్టం వాటిల్లుతుందనే వివరాలను తెలియజేయాలని ప్రభుత్వం కోరిన మేరకు అన్ని రంగాల్లో వస్తువుల అమ్మకాలకు సంబంధించిన గణాంకాలను తెప్పించిన వాణిజ్య పన్నుల శాఖ ఈ మేరకు నష్ట నిర్ధారణ చేసినట్టు సమాచారం.

ఎక్కువగా ఈ రంగాల్లోనే..

కాగా, జీఎస్టీ రేట్ల శ్లాబ్‌లను హేతుబద్ధీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణలోని పలు ప్రధాన రంగాల అమ్మకాలపై ప్రభావం చూపనుంది. రాష్ట్రం నుంచి ఎక్కువగా అమ్ముడయ్యే ఐరన్‌అండ్ స్టీల్, ఆటో మొబైల్స్ రంగాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని పన్నుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ రంగాలతో పాటు ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) అమ్మకాలపై వచ్చే పన్నులు కూడా పెద్ద ఎత్తున తగ్గిపోయి భారీ గండి పడుతుందని ఆ శాఖ వర్గాలంటున్నాయి. అలాగే టెక్స్‌టైల్స్, సిమెంట్ లాంటి కీలక రంగాల ద్వారా వచ్చే ఆదాయం కూడా కుదుపునకు గురవుతుందని, కొన్ని రంగాల్లో కొంత మేర అమ్మకాలు పెరిగినప్పటికీ ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో గండి పడటం ఖాయమని ఆ వర్గాలంటున్నాయి. అయితే, జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపుతో ధరలు పెంచాలని ఐరన్ అండ్ స్టీల్, సిమెంట్ పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఈ రెండింటి ధరలు పెరిగే అవకాశముందని కూడా వారు అంటున్నారు.

వివరాల సేకరణకు తంటాలు

జీఎస్టీ ద్వారా ఏ డీలర్ ఏయే సరుకులు, ఎంత మేర అమ్ముతున్నారన్న వివరాలను సేకరించి అంచనాలను రూపొందించడం కష్టతరంగా మారిందని పన్నుల శాఖ వర్గాలు చెపుతున్నాయి. గతంలో వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు డీలర్ కోడ్ నమోదు చేస్తే అన్ని సరుకుల వివరాలు వచ్చేవని, ఇప్పుడు జీఎస్టీలో ఆ వివరాలు అందుబాటులోకి రావడం లేదని, ఈ నేపథ్యంలో ప్రతి డీలర్ ఏ సరుకులు అమ్ముతున్నాడనే వివరాలను క్షేత్రస్థాయి నుంచి తెప్పించి మదింపు చేయాల్సి వస్తోందని పన్నుల శాఖ వర్గాలు అంటున్నాయి.

క్లుప్తంగా...

లంచాల తహసీల్దార్ పట్టివేత

- రైతు నుంచి రూ.10 వేలు లంచం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన తహసీల్దార్, ఆర్‌ఐ, ఆపరేటర్



తల్లాడ: ఒక రైతు నుంచి తహసీల్దార్‌తో పాటు మరో ఇద్దరు రూ.10 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఖమ్మం జిల్లా తల్లాడలో బుధవారం జరిగిన ఈ సంఘటనపై ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపిన వివరాలివి. తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన ఓ రైతు 15 గుంటల భూమిని భూభారతి రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ఫీజు చెల్లించాడు. అయితే రిజిస్ట్రేషన్ చేసేందుకు తహసీల్దార్ వంకాయల సరేష్‌కుమార్, ఆర్‌ఐ మాలోత్ భాస్కర్‌నాయక్, భూ భారతి ఆపరేటర్ బాణోత్ శివాజీరాథోడ్ రూ.12 వేలు లంచం అడిగారు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు రూ.10 వేలు లంచం ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. కాగా, ప్రజాపాలన వేడుకల అనంతరం తహసీల్దార్ తదితరులు కార్యాలయంలో ఉండగా.. సదరు రైతు రూ.10 వేలు తీసుకెళ్లి ఇచ్చాడు. ముందుగానే అక్కడికి వచ్చిన డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి సరస్ మేళా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 19న శిల్పారామం లోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో గ్రామీణ ఉత్పత్తుల మహాప్రదర్శన, అమ్మకానికి ఉద్దేశించిన ఈ మేళాను పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. ఈ నెల 29 వరకు సాగనున్న ఈ సరస్ మేళాలో గ్రామీణ ప్రతిభకు పెద్దపీట వేయనున్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ ఉత్పత్తులు, ప్రత్యేక కళాకృతులు, చేనేత వస్త్రాలు, ఆయా రాష్ట్రాల్లోని వంటకాలన్నీ ఒకేచోట సందర్శకులకు అందుబాటులోకి రానున్నాయి.

నేడు శ్రీవారి డిసెంబర్ దర్శన కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ కోటాను గురువారం ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అంగ ప్రదక్షిణ టోకెన్లను కూడా ఈనెల నుంచి ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా జారీ చేయనున్నారు. టోకెన్లు పొందిన వారు సెప్టెంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు నగదు చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవ టికెట్లను సెప్టెంబర్ 22న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను జారీ చేస్తుంది. అలాగే, డిసెంబర్‌కు సంబంధించిన శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది. సెప్టెంబర్ 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనుంది. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

భారత్ ఎవరికీ తల వంచదు



కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో గజేంద్రసింగ్ షెకావత్, బండి సంజయ్, ఈటల రాజేందర్

పాక్‌తో యుద్ధాన్ని ఆపామని కొందరి గప్పాలు

- పాకిస్తాన్ స్వయంగా కాల్పుల విరమణ కోరితేనే ఆపాం
- దేశం నుంచి రజాకార్ల మద్దతుదారులను తరిమేస్తాం
- హైదరాబాద్ లిబరేషన్ డే వేడుకల్లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్

సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌కు విరామం మాత్రమే ఇచ్చామని, అవసరమైతే అది మళ్లీ మొదలవుతుందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను మతం అడిగి చంపిన పాకిస్తాన్ ఉగ్రమూకలను తుదముట్టించడంతో మన సైన్యం సత్తా ఏమిటో ప్రపంచానికి తెలిసి వచ్చిందని తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైదరాబాద్ లిబరేషన్ డే'ఉత్సవాల్లో రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరేడ్ గ్రౌండ్స్ సమీపంలోని సైనిక్ స్మారక్ వద్ద నివాళులు అర్పించారు. పరేడ్‌గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం 'జోహార్ తెలంగాణ.. అందరికీ నమస్కారం'అని ఆయన తెలుగులో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. భారత్‌ను ఎవరూ సవాల్ చేయలేరనేందుకు ఆపరేషన్ సిందూర్ స్పష్టమైన ఉదాహరణ అని పేర్కొన్నారు. కాల్పులు విరమించాలని పాక్ కోరడంతోనే మనం అంగీకరించామని చెప్పారు. పాకిస్తాన్‌తో భారత్ యుద్ధాన్ని తామే ఆపామని కొందరు గొప్పలు చెప్పుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించారు. భారత్ ఎవరి నుంచి ఆదేశాలు తీసుకోదని, ఎవరికీ తల వంచదని స్పష్టంచేశారు.

వారిని తరిమికొడతాం

దేశంలో ఇంకా రజాకార్ల మద్దతుదారులు ఉన్నారని, వారే మనకు అతిపెద్ద శత్రువులని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారత్ నుంచి వారిని తరిమికొట్టి అఖండ భారత్‌ను సాధిస్తామని స్పష్టం చేశారు. 'నాడు భారత సైన్యం శక్తిని సర్దార్ పటేల్ చాటితే.. బాలాకోట్ నుంచి ఆపరేషన్ సిందూర్ వరకు భారత్ సత్తాను ప్రధాని మోదీ చాటారు. భారత్‌లో ఉత్తర ప్రాంతాన్ని దక్షిణాదితో కలిపే నగరం హైదరాబాద్ వల్లభాయ్ పటేల్ కృషితోనే హైదరాబాద్ స్టేట్‌కు విముక్తి లభించి భారత్‌లో విలీనమైంది. సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానానికి విముక్తి చేయటం దేశ చరిత్రలో ఒక నిర్ణయాత్మక, గౌరవప్రదమైన రోజు. 75 ఏళ్ల తర్వాత కూడా ఇలాంటి చారిత్రక ఘటనను అధికారిక ఉత్సవంగా నిర్వహించక పోవడానికి ఇక్కడి ప్రభుత్వాలు, రాజకీయ పక్షాల ఓటుబ్యాంక్ రాజకీయాలే కారణం. నాడు ధనబలంతో నిజాం విర్రవీగినట్టే నేడు కొన్నిదేశాలు, కొందరు అధినేతలు అతి చేయాలని ప్రయత్నించినా ఇండియా భయపడకుండా బలంగా నిలబడింది'అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల పోరాటాన్ని అవమానిస్తున్నారు: కిషన్‌రెడ్డి

'హైదరాబాద్ లిబరేషన్ డే'పేరు మార్చి ఇక్కడి రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు తెలంగాణ ప్రజల పోరాటాన్ని, త్యాగాలను అవమానిస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సర్దార్ పటేల్ నేతృత్వంలో నిజాం పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రానికి విముక్తి లభించిన చరిత్ర గురించి కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు ఈ తరానికి తెలియకుండా తొక్కిపెట్టారని ఆరోపించారు. ఓట్లకోసం ఎంఐఎంకు భయపడే ఇన్నాళ్లు ఈ చరిత్రను ప్రభుత్వాలు తొక్కిపెట్టాయని ధ్వజమెత్తారు. మజ్లిస్ నేతలకు వంగి వంగి సలాం కొట్టే పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ప్రధాని మోదీ ఆదేశాలతో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని తమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. రాష్ట్రంలో తెలంగాణ విమోచన దినోత్సవం జరుపుకునే హక్కు బీజేపీకి మాత్రమే ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ సభలో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

మధ్యతరగతి కోసమే నెక్స్ట్‌జెన్ జీఎస్టీ 2.0

- నవరాత్రులు నుంచే కొత్త శ్లాబులు
- రూ.2 లక్షల కోట్ల వరకు ప్రజలపై భారం తగ్గుతుంది
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆత్మీయ సత్కారం

సాక్షి, విశాఖపట్నం: మధ్య తరగతి ప్రజల విస్తృత ప్రయోజనాల కోసమే నెక్స్ట్‌జెన్ జీఎస్టీ 2.0ను అమలు చేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. విశాఖలోని మధురవాడలోని వైజాగ్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జీఎస్టీ సంస్కరణల సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నవరాత్రులు ప్రారంభం నుంచే కొత్త శ్లాబులు అమల్లోకి వస్తాయని తెలిపారు. దీనివల్ల రూ.2 లక్షల కోట్ల వరకు ప్రజలపై భారం తగ్గుతుందని వెల్లడించారు. గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని ప్రతిపక్షాలు ఆక్షేపిస్తున్నా.. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరంగా జీఎస్టీని సరళీకృతం చేశామని వివరించారు. జీఎస్టీ 2.0 తీసుకొస్తే ఎనిమిదేళ్ల ప్రజల నుంచి భారీగా పన్నులు వసూలు చేసినట్లు ఒప్పుకుంటున్నారా అని ప్రతిపక్షాలు మాట్లాడుతుండటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. పదేళ్లు జీఎస్టీ తీసుకురాకుండా కాలయాపన చేసిన యూపీఏ ప్రభుత్వానికి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. జీఎస్టీ ద్వారా వచ్చిన ఆదాయం వల్లే 144 వందేభారత్‌ల ప్రవేశం, 60 శాతం కంటే ఎక్కువ హైవేలు, విమానాశ్రయాల నిర్మాణం, రెట్టింపు, సంక్షేమ పథకాలు అమలు, రక్షణ వ్యవస్థ బలోపేతం సాధ్యమయ్యాయని తెలిపారు.

నా వల్లే రిలయన్స్ ఇన్ఫో ఏర్పాటు

- ధీరూబాయ్ అంబానీకి ఇన్‌ఫ్రా, టెలీకమ్యూనికేషన్ గురించి చెప్పాను
- నాలుగురోజులకే రిలయన్స్ ఇన్ఫో పెడుతున్నట్టు ప్రకటించారు: చంద్రబాబు



సాక్షి, విశాఖపట్నం: టెక్నాలజీ గురించి నేను వివరించడం వల్లే ధీరూబాయ్ అంబానీ రిలయన్స్ ఇన్ఫో ఏర్పాటు చేశారని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. విశాఖలో బుధవారం సాయంత్రం జరిగిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్(జీసీసీ) బిజినెస్ సమ్మిట్‌కు చంద్రబాబుతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ హాజరయ్యారు. చంద్రబాబు మాట్లాడుతూ అప్పట్లో ధీరూబాయ్ అంబానీని కలిసి టెక్నాలజీ, టెలీకమ్యూనికేషన్ గురించి వివరిస్తే తనకు ఇందులో అనుభవం లేదన్నారని, ఆ తర్వాత నాలుగు రోజులకు ఫోన్ చేసి 5 బిలియన్ డాలర్లు పెట్టుబడితో రిలయన్స్ ఇన్ఫో తీసుకొస్తున్నట్లు చెప్పారని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో వన్ ఫ్యామిలీ–వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదంతో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు.నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ 2024 బడ్జెట్ సమయానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో 50 శాతం వరకూ భారత్‌లో ఉన్నాయని వెల్లడించారు. మిగిలిన దేశాల్లో ఉన్న జీసీసీల్లో 50 శాతం సంస్థల్ని భారతీయులే ప్రాతినిధ్యం వహిస్తుండటం గర్వకారణంగా ఉందన్నారు.

సింగిల్ జడ్జి తీర్పు చట్టవిరుద్ధం

ఊహలు, 'విపరీత ధోరణి'తో ఆదేశాలు వెలువరించారు

- గ్రూప్–1పై హైకోర్టులో టీజీపీఎస్సీ అప్పీల్
- మా వివరణను పరిగణనలోకి తీసుకోవడంలో విఫలం.. తీర్పు కొట్టివేయాలన్న కమిషన్
- ఒకట్రెండు రోజుల్లో విచారణ చేపట్టనున్న ద్విసభ్య ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను మళ్లీ దిద్దాల్సిందేనంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ).. హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. టీజీపీఎస్సీ తరఫున అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి (లీగల్) ఆర్.సుమతి బుధవారం అప్పీల్ దాఖలు చేశారు. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను రద్దు చేస్తూ ఈ నెల 9న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలని కోరారు. తీర్పు అమలు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రిట్ పిటిషన్ దాఖలు చేసిన గ్రూప్–1 అభ్యర్థులు 222 మందిని ప్రతివాదులుగా చేర్చారు. ఈ అప్పీల్‌పై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఒకట్రెండు రోజుల్లో విచారణ చేపట్టనుంది.

కేసు పూర్వాపరాలు

2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. మెయిన్స్ తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ జాబితాను రద్దు చేశారు. అన్ని సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని కమిషన్‌ను ఆదేశించారు. ఇది సాధ్యం కాని పక్షంలో మెయిన్స్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీల్ వేసింది.

ఊహలతో తీర్పు సమ్మతం కాదు..: 'సింగిల్ జడ్జి ఉత్తర్వులు చట్టబద్ధంగా లేవు. టీజీపీఎస్సీ సమర్పించిన వివరాలు, ఆధారాలను పరిగణనలోకి తీసు కోలేదు. మున్సిపల్ కమిటీ, హోషి యార్‌పూర్ వర్సెస్ పంజాబ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఊహలు, నమ్మదగిన సాక్ష్యాలు లేనప్పుడు తీర్పు ఇవ్వడం సముచితం కాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం సూచన పరంగా చూస్తే ఈ తీర్పు 'విపరీత ధోరణి'తో ఉంది. మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని చెబుతూనే మెయిన్స్ మళ్లీ నిర్వహించాలని చెప్పడం పరస్పర విరుద్ధం. కమిషన్ ఉద్యోగ నియమావళి ప్రకారం.. ఫలితాలిచ్చిన 15 రోజుల్లోగా మాత్రమే పునః మూల్యాంకనానికి వీలుంటుంది. మళ్లీ దిద్దాలనడం కూడా చెల్లదు. మెయిన్స్ పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసం ఉందని సింగిల్ జడ్జి పేర్కొనడం సబబు కాదు. గత ఏడాది అక్టోబర్ 27న స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు 18 మందితో కలిపి 21,093 మంది ఉన్నారని ప్రాథమిక సమాచారం ఇచ్చాం. తర్వాత తుది సమాచారం ఆధారంగా ఆ సంఖ్య 21,110 మందికి పెరిగింది. కోర్టు ఆదేశాల కారణంగా వీరిలో 25 మందిని పక్కకు పెట్టాల్సి వచ్చింది. దీంతో ఆ సంఖ్య 21,085కు తగ్గినట్లు మార్చి 30న వెల్లడించాం. ఆంగ్లంలో 924 మంది అభ్యర్థులు అర్హత సాధించకపోవడంతో ఆ సంఖ్య 20,161కి తగ్గింది. ఈ వ్యత్యాసాన్ని శాస్త్రీయంగా వివరించినా సింగిల్ జడ్జి పట్టించుకోలేదు'అని టీజీపీఎస్సీ పేర్కొంది.


వేర్వేరు హాల్‌టికెట్లు సమర్థనీయమే

'ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఇవ్వడం సమర్థనీయమే. అలా ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందో కూడా వివరణ ఇచ్చాం. యూపీఎస్సీ విధానాన్ని అనుసరించాలని ఎక్కడా లేదు. పరీక్షా కేంద్రాల సంఖ్య 45 నుంచి 46కి పెరగడంపై పిటిషనర్ల ఆందోళనకు అర్థం లేదు. తొలుత 45 కేంద్రాలుగా నిర్ణయించినా క్షేత్రస్థాయిలో ఒక కేంద్రం ఎత్తైన చోట ఉంది. దీంతో 87 మంది దివ్యాంగుల సౌలభ్యం కోసం సర్దుబాటు చేసే క్రమంలో ఒక పరీక్షా కేంద్రం పెరిగింది' అని కమిషన్ తెలిపింది.

అనుభవమున్న వారినే ఎంపిక చేశాం: 'ఫలితాల గణాంకాలను సింగిల్ జడ్జి తప్పుగా పరిగణనలోకి తీసుకున్నారు. ఒకటోసారి, రెండోసారి మూల్యాంకనం చేశాక 15% కంటే ఎక్కువగా మార్కుల తేడా ఉంటే మూడోసారి మూల్యాంకనం చేసిన విషయాన్ని పట్టించుకోలేదు. ఎవరి పేపరు మూల్యాంకనం చేస్తున్నామనేది దిద్దేవాళ్లెవరికీ తెలియదు. అనుభవమున్న, తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో నిపుణులైన అధ్యాపకులనే మూల్యాంకనం కోసం ఎంపిక చేశాం. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరైనప్పుడు ఒకే తరహా మార్కులు పలువురికి రావడం సర్వసాధారణం. 719 మంది ఒకే రకమైన మార్కులు సాధించడంపై కమిషన్ ఇచ్చిన వివరణను న్యాయమూర్తి పట్టించుకోలేదు'అని టీజీపీఎస్సీ పేర్కొంది.

సిరిసిల్ల కలెక్టర్‌కు హైకోర్టు వారెంట్

- భూసేకరణ పరిహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: భూ సేకరణ పరిహారం చెల్లింపునకు సంబంధించి తాము ఇచ్చిన ఆదేశాలను పాటించడంలో విఫలమైన రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు హైకోర్టు బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. పరిహారం చెల్లించకపోవడమే కాకుండా, తమ ముందు హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్టోబర్ 8న తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జిల్లా భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌కు కూడా వారెంట్ జారీ చేయాలని.. ఈ మేరకు చర్యలు చేపట్టాలని రిజిస్ట్రీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 8కి వాయిదా వేసింది. మిడ్ మానేర్ ప్రాజెక్ట్ కారణంగా ఇల్లు కోల్పోయినా, ప్రభుత్వం పరిహారం చెల్లించడం లేదంటూ చీర్లవంచ గ్రామానికి చెందిన 88 ఏళ్ల వృద్ధుడు వేల్పుల యెల్లయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2009లో అతని భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. 2024, ఏప్రిల్ 25న అతనికి అనుకూలంగా పరిహార బిల్లు రూపొందించినా ఇప్పటికీ విడుదల చేయలేదని చెప్పారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్.. వెంటనే పరిహారం చెల్లించాలని కలెక్టర్‌ను ఈ ఏడాది జూన్‌లో ఆదేశించారు. అయినా చెల్లించకపోవడంతో రెండు వారాల్లో చెల్లించకుంటే తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తూ సెప్టెంబర్ 3న ఉత్తర్వులిచ్చారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి బుధవారం మరోసారి విచారణ చేపట్టారు. పరిహారం చెల్లించకపోవడమే కాకుండా, జిల్లా కలెక్టర్ హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ తీరును తీవ్రంగా పరిగణిస్తున్నామని వారెంట్ జారీ చేస్తూ.. విచారణ వాయిదా వేశారు.

ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోలేం

నీట్ అభ్యర్థుల పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం తెచ్చిన జీవో 33, 150లో తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీవో 33ను సవరిస్తూ 150ని జారీ చేసిందని, ఇందులో తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని చెబుతూ పిటిషన్‌ను కొట్టివేసింది. వైద్య విద్యలో ప్రవేశాలకు సంబంధించి నాలుగేళ్లు (9, 10, ఇంటర్) తెలంగాణలో చదివి ఉండాలని జీవో 33 తెచ్చిన విషయం తెలిసిందే. దీనికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సవరణ చేస్తూ ఈ నెల 8న కొత్త నిబంధనలు చేర్చింది. రాష్ట్ర ప్రభుత్వంలో పని చేస్తూ బదిలీల్లో భాగంగా తెలంగాణ వెలుపల నివసిస్తున్న ఉద్యోగుల పిల్లలు, ఆలిండియా సర్వీసుల కేడర్ కుటుంబాలకు చెందిన పిల్లలకు స్థానికత మినహాయింపు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ 34 మంది అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

క్యాప్స్ గోల్డ్‌లో ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తోపాటు సికింద్రాబాద్, విజయవాడ, బెంగళూరు, ముంబైల్లోని ప్రముఖ బంగారు, ఆభరణ వ్యాపార సంస్థ క్యాప్స్‌గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ బుధవారం సోదాలు నిర్వహించింది. ఈ సోదాల కోసం 15 బృందాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని సంస్థ కార్యాలయం, సికింద్రాబాద్‌లోని కలాసిగూడ బ్రాంచ్, అబిడ్స్‌లోని ప్రధాన కార్యాలయంతోపాటు, సంస్థ ప్రమోటర్ల నివాసాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. పన్ను ఎగవేత అనుమానంతో, ముఖ్యంగా బంగారు విక్రయాల్లో అవకతవకలపై దర్యాప్తులో భాగంగా ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. దీపావళి సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో, కంపెనీ లావాదేవీలు, రిటైల్ స్కీమ్‌లకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. 1901లో చందా అంజయ్య పరమేశ్వర్ స్థాపించిన క్యాప్స్‌గోల్డ్, మొదట చందా అంజయ్య పరమేశ్వర్ (సీఏపీ) పేరుతో ప్రారంభమైంది.



తొలిసారి వరల్డ్ నంబర్‌వన్‌గా వరుణ్ చక్రవర్తి

దుబాయ్: భారత మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో అగ్ర స్థానాన్ని అందుకున్నాడు. తన కెరీర్‌లో వరుణ్ తొలిసారి వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌లో (733 రేటింగ్ పాయింట్లు) నిలవడం విశేషం. ఇటీవలి నిలకడైన ప్రదర్శనతో మూడు స్థానాలు ఎగబాకి శిఖరానికి చేరిన వరుణ్... టీమిండియా తరఫున బుమ్రా, రవి బిష్ణోయ్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడో బౌలర్. **ఇప్పటి వరకు అగ్ర స్థానంలో ఉన్న జాకబ్ డఫీ (న్యూజిలాండ్) రెండో ర్యాంక్‌కు** పడిపోగా, అకీల్ హొసీన్ (విండీస్) మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. టాప్-10లో భారత్ నుంచి రవి బిష్ణోయ్ (10వ స్థానం) కూడా ఉన్నాడు. టి20 బ్యాటర్ల జాబితాలో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు. తాజా బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాదీ తిలక్ వర్మ రెండు నుంచి నాలుగో స్థానానికి, భారత కెప్టెన్ సూర్యకుమార్ ఆరు నుంచి ఏడుకు పడిపోయినా... టాప్-10లో కొనసాగుతున్నారు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా నంబర్‌వన్ స్థానానికి ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. 237 రేటింగ్ పాయింట్లు సాధించిన పాండ్యాకు, రెండో **స్థానంలో ఉన్న నబీ (213)కి మధ్య రేటింగ్‌లో భారీ అంతరం ఉండటం విశేషం.**

స్మృతి మెరుపు సెంచరీ

రెండో వన్డేలో 102 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం

- ఆస్ట్రేలియాకు అతిపెద్ద పరాజయం
- 2007 తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాను ఓడించిన టీమిండియా


స్మృతి మంధాన

ముల్లాన్‌పూర్: తొలి వన్డేలో ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న భారత మహిళల జట్టు రెండో వన్డేలో చెలరేగి సిరీస్‌ను సమం చేసింది. అన్ని విభాగాల్లో సమష్టి ప్రదర్శనతో రాణించి ఆస్ట్రేలియా మహిళలను చిత్తు చేసింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 102 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. ఎట్టకేలకు స్వదేశంలో ఆస్ట్రేలియా చేతిలో వరుసగా 11 పరాజయాల తర్వాత వన్డే ఫార్మాట్‌లో టీమిండియా గెలుపు రుచి చూసింది. 2007లో చెన్నై వేదికగా చివరిసారి వన్డేల్లో ఆస్ట్రేలియాను భారత్ ఓడించింది. రెండో వన్డేలో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. **ఓపెనర్ స్మృతి మంధాన (91 బంతుల్లో 117; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకంతో చెలరేగింది.** 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' **స్మృతి 77 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేసుకుంది. భారత** ఇతర బ్యాటర్లలో దీప్తి శర్మ **(53 బంతుల్లో 40; 2 ఫోర్లు)**, రిచా ఘోష్ **(29), ప్రతీక** రావల్ (25), స్నేహ్ రాణా **(24) కూడా కీలక** పరుగులు సాధించారు. ఆసీస్ **బౌలర్లలో డార్సీ** బ్రౌన్ 3, యాష్లీ గార్డ్‌నర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆసీస్ 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. అనాబెల్ సదర్లాండ్ (45), ఎలైస్ పెరీ (44) మినహా అంతా విఫలమయ్యారు. క్రాంతి గౌడ్ 3, దీప్తి శర్మ 2 వికెట్లు తీయగా...రాధ యాదవ్, రేణుక సింగ్, స్నేహ్ రాణా, అరుంధతి రెడ్డి తలా ఒక వికెట్ పడగొట్టారు. తాజా ఫలితంతో వన్డే సిరీస్ 1-1తో సమం కాగా, చివరిదైన మూడో మ్యాచ్ శనివారం ఢిల్లీలో జరుగుతుంది. వైరల్ ఫీవర్ కారణంగా భారత బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఈ మ్యాచ్‌తో పాటు తర్వాతి వన్డేకు కూడా దూరమైంది.

102 వన్డేల్లో ఆస్ట్రేలియాకు ఇదే అతి పెద్ద పరాజయం. 1973లో ఆసీస్ 92 పరుగులతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది.

12 వన్డేల్లో స్మృతి సెంచరీల సంఖ్య. ఓవరాల్ జాబితాలో బీమాంట్ (12 : ఇంగ్లండ్)తో సమానంగా మూడో స్థానానికి చేరింది. మెగ్ లానింగ్ (15 : ఆస్ట్రేలియా), సుజీ బేట్స్ (13 : న్యూజిలాండ్) మాత్రమే ముందున్నారు.

పతకంపై నీరజ్ గురి

తొలి ప్రయత్నంలోనే ఫైనల్‌కు అర్హత

- సచిన్ యాదవ్‌కు కూడా బెర్త్
- ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ కూడా ముందుకు
- నేడు జావెలిన్ త్రో మెడల్ ఈవెంట్


నీరజ్ చోప్రా

టోక్యో: అంతా అనుకున్నట్లు జరిగితే... ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఈరోజు భారత్ పతకాల బోణీ కొట్టనుంది. పురుషుల జావెలిన్ త్రో ఈవెంట్‌లో భారత్ నుంచి డిఫెండింగ్ ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా, రైజింగ్ స్టార్ సచిన్ యాదవ్ ఫైనల్‌కు అర్హత సాధించారు. భారత్‌కే చెందిన మరో ఇద్దరు జావెలిన్ త్రోయర్లు యశ్‌వీర్ సింగ్, రోహిత్ యాదవ్ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకం... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన నీరజ్ చోప్రా 'హ్యాట్రిక్ పతకం' లక్ష్యంగా నేడు మెడల్ రౌండ్‌లో బరిలోకి దిగనున్నాడు. బుధవారం జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫయింగ్ రౌండ్‌లో నీరజ్ ఒక్క ప్రయత్నంలోనే ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. క్వాలిఫయింగ్‌లో ఒక్కో జావెలిన్ త్రోయర్‌కు మూడు అవకాశాలు ఇస్తారు. జావెలిన్‌ను కనీసం 84.50 మీటర్ల దూరం విసిరిన వారు లేదా టాప్-12లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత పొందుతారు. గ్రూప్ 'ఎ'లో పోటీపడ్డ నీరజ్ తన మొదటి ప్రయత్నంలోనే జావెలిన్‌ను 84.85 మీటర్ల దూరం విసిరి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. గ్రూప్ 'ఎ'.. గ్రూప్ 'బి' నుంచి ఓవరాల్‌గా ఏడుగురు జావెలిన్ త్రోయర్లు మాత్రమే అర్హత ప్రమాణాన్ని అధిగమించారు. మరో ఐదుగురికి ర్యాంక్ ప్రకారం ఫైనల్ బెర్త్‌ను కేటాయించారు. అర్హత ప్రమాణాన్ని అధిగమించిన ఏడుగురిలో నీరజ్ చోప్రాతోపాటు ఆండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 89.53 మీటర్లు), జూలియన్ వెబెర్ (జర్మనీ; 87.21 మీటర్లు), జూలియస్ యెగో (కెన్యా; 85.96 మీటర్లు), వెగ్నెర్ (పోలాండ్; 85.67 మీటర్లు), పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 85.28 మీటర్లు), కర్టిస్ థాంప్సన్ (అమెరికా; 84.72 మీటర్లు) ఉన్నారు. ఓవరాల్‌గా 8 నుంచి 12 స్థానాల్లో నిలిచిన జాకుబ్ వెడ్లెచ్ (చెక్ రిపబ్లిక్; 84.11 మీటర్లు), కెషార్న్ వాల్కట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో; 83.93 మీటర్లు), సచిన్ యాదవ్ (భారత్; 83.67 మీటర్లు), కామెరాన్ మెసెన్‌టైర్ (ఆస్ట్రేలియా; 83.03 మీటర్లు), రుమేశ్ థరంగ (శ్రీలంక; 82.80 మీటర్లు) కూడా ఫైనల్లో చోటు సంపాదించారు. భారత కాలమానం ప్రకారం ఈరోజు మధ్యాహ్నం 3 గంటల 53 నిమిషాల నుంచి పురుషుల జావెలిన్ త్రో ఫైనల్ జరుగుతుంది. మరోవైపు ట్రిపుల్ జంప్ క్వాలిఫయింగ్‌లో భారత క్రీడాకారులు ప్రవీణ్ చిత్రవేల్ (16.74 మీటర్లు) 15వ స్థానంలో, అబూబకర్ (16.33 మీటర్లు) 24వ స్థానంలో నిలిచారు. 200 మీటర్లలో జాతీయ చాంపియన్ అనిమేశ్ కుజుర్ హీట్స్‌లోనే వెనుదిరిగాడు.

'సూపర్-4'కు పాకిస్తాన్


యూఏఈపై 41 పరుగుల తేడాతో విజయం


ఫఖర్ జమాన్

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో రెండో విజయంతో పాకిస్తాన్ 'సూపర్-4' దశకు అర్హత సాధించింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో పాక్ 41 పరుగుల తేడాతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ని ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (36 బంతుల్లో 50; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా, ఇతర ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. సయీమ్ అయూబ్ (0) వరుసగా మూడో మ్యాచ్‌లోనూ డకౌటై అంతర్జాతీయ టి20ల్లో ఈ చెత్త రికార్డును నెలకొల్పిన మూడో పాకిస్తానీ ఆటగాడిగా నిలిచాడు. ఫర్హాన్ (5), కెప్టెన్ సల్మాన్ ఆగా (27 బంతుల్లో 20), హసన్ (3), ఖుష్‌దిల్ (4), హారిస్ (18) ప్రభావం చూపలేకపోయారు. చివర్లో షాహిన్ అఫ్రిది (14 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడటంతో పాక్ మెరుగైన స్కోరు సాధించింది. యూఏఈ బౌలర్లలో జునేద్ సిద్దిఖీ 4 వికెట్లు పడగొట్టగా, సిమ్రన్‌జీత్ సింగ్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం యూఏఈ 17.4 105 పరుగులకు ఆలౌటైంది. రాహుల్ చోప్రా (35 బంతుల్లో 35; 1 ఫోర్, 1 సిక్స్) రాణించగా, ధ్రువ్ పరాశర్ (20) ఫర్వాలేదనిపించాడు. పాక్ బౌలర్లలో షాహిన్ అఫ్రిది, రవూఫ్, అబ్రార్ అహ్మద్ రెండు వికెట్లు చొప్పున తీశారు. నేడు జరిగే మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్‌తో శ్రీలంక తలపడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'డ్రామా' తర్వాత మైదానానికి...


పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ ఆగా

భారత ఆటగాళ్లు 'షేక్ హ్యాండ్' ఇవ్వలేదనే సాకుతో ఆదివారం నుంచి అసహనాన్ని ప్రదర్శిస్తూ వచ్చిన పాకిస్తాన్ జట్టు చివరకు ఏమీ సాధించకుండానే యూఏఈతో మ్యాచ్ బరిలోకి దిగింది. భారత క్రికెటర్లు తమతో కరచాలనం చేయకుండా మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ నిలువరించారని, ఆయనను ఆసియా కప్ రిఫరీ బాధ్యతల నుంచి తప్పించాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చేసిన డిమాండ్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఏమాత్రం పట్టించుకోలేదు. టోర్నీ సంగతి తర్వాత... యూఏఈతో బుధవారం పాక్ ఆడిన మ్యాచ్‌కు కూడా పైక్రాఫ్ట్‌నే రిఫరీగా ఎంపిక చేసి తమ ఉద్దేశాన్ని స్పష్టం చేసింది. ఈ మ్యాచ్ తాము ఆడబోమని, టోర్నీనే బహిష్కరిస్తామంటూ పాక్ మేనేజ్‌మెంట్ నుంచి ముందుగా సందేశాలు వచ్చాయి. అందుకు తగినట్లుగానే నిర్ణీత సమయానికి పాక్ ఆటగాళ్లు మైదానానికి బయలుదేరకుండా హోటల్‌లోనే ఉండిపోయారు కూడా. అయితే చివరకు తమకు పైక్రాఫ్ట్ 'క్షమాపణ' చెప్పారంటూ పాక్ ఆటగాళ్లు స్టేడియానికి వచ్చారు. 'సమాచార లోపం కారణంగానే ఇది జరిగిందంటూ పైక్రాఫ్ట్ మాకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంలో నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరిపిస్తామని ఐసీసీ కూడా చెప్పింది' అంటూ పీసీబీ ప్రకటన విడుదల చేసింది. పైక్రాఫ్ట్‌తో తమ బృందం చర్చిస్తున్న వీడియోను కూడా పోస్ట్ చేసింది. అయితే పాక్ ఏదైనా రుజువులు చూపిస్తే తప్ప వారి ఆరోపణలపై తాము విచారణ చేసే అవకాశాలు లేవని ఐసీసీ అధికారి ఒకరు స్పష్టం చేసినట్లు సమాచారం. మొత్తంగా ఈ పరిణామాల వల్ల పాక్, యూఏఈ మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది.


సాక్షి సినిమా

మోదీ జీవితంతో మా వందే


'మా వందే' పోస్టర్

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్ వెండితెరకు రానుంది. 'మా వందే' పేరుతో రూపొందనున్న ఈ సినిమాలో మోదీ పాత్రలో మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ నటించనున్నారు. క్రాంతికుమార్ సీహెచ్. రచన, దర్శకత్వంలో వీర్ రెడ్డి .ఎం నిర్మించనున్నారు. బుధవారం (సెప్టెంబరు 17) మోదీ పుట్టినరోజు సందర్భంగా 'మా వందే' ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. వీర్ రెడ్డి .ఎం మాట్లాడుతూ– ''మోదీగారి వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని ఘటనలు, విశేషాలను ఎంతో సహజంగా మా సినిమాలో చూపించబోతున్నాం. సమాజం కోసం ఎన్నో ఆకాంక్షలు గల బాలుడి నుంచి దేశ ప్రధానిగా మోదీ ఎదిగిన క్రమాన్ని చూపిస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలు, సాంకేతిక విలువలు, వీఎఫ్‌ఎక్స్‌తో 'మా వందే'ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లిష్‌లోనూ నిర్మిస్తాం. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్ప బలం గొప్పదనే సందేశం ఈ కథలో కీలకం. మోదీ ప్రపంచ నాయకుడిగా ఎదగడం వెనక ఆయన మాతృమూర్తి హీరాబెన్ ప్రేరణ ఎంతో ఉంది'' అని చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: కేకే సెంథిల్ కుమార్, సంగీతం: రవి బస్రూర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: గంగాధర్ .ఎన్ ఎస్, వాణిశ్రీ .బి, లైన్ ప్రొడ్యూసర్: టీవీఎన్ రాజేశ్.

ఇలాంటి పాత్రతో సినిమా రాలేదు



- విజయ్ ఆంటోనీ

''డైరెక్టర్ అరుణ్ ప్రభుగారికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయనతో ఓ సినిమా చేయాలనుకున్నప్పుడు 'భద్రకాళి' కథ తీసుకొచ్చారు. కథ వినగానే నచ్చింది. అయితే ఆయన గత సినిమా కంటే ఈ చిత్రం బడ్జెట్ బాగా పెరిగింది. నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది'' అని హీరో విజయ్ ఆంటోనీ చెప్పారు. అరుణ్ ప్రభు దర్శకత్వంలో విజయ్ ఆంటోనీ హీరోగా తృప్తి రవీంద్ర, రియాజిత్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భద్రకాళి'. మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, సర్వంత్‌రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా విజయ్ ఆంటోనీ విలేకరులతో మాట్లాడుతూ– ''భద్రకాళి' పొలిటికల్ థ్రిల్లర్ మూవీ. ప్రస్తుత రాజకీయాలే మా సినిమాలోని కోర్ ఎలిమెంట్. నేను రాజకీయ మధ్యవర్తిగా కనిపిస్తాను. రాజకీయాల్లో ఒక మధ్యవర్తి పాత్ర ఎలా ఉంటుంది? ఒక పెద్ద కుంభకోణంలో తన పాత్ర ఏంటి? అనేది ఆసక్తిగా ఉంటుంది. ఇలాంటి పాత్ర నేపథ్యంలో ఇప్పటివరకు ఏ సినిమా రాలేదు. ఈ పాత్ర కోసం మేకప్ లేకుండా నటించాను. ఈ సినిమాని సురేష్‌బాబుగారు విడుదల చేస్తున్నారు. నా గత చిత్రం 'మార్గన్'ని కూడా ఆయన అద్భుతంగా రిలీజ్ చేశారు. ఇప్పుడు 'భద్రకాళి'ని తెలుగులో దాదాపు 300లకు పైగా థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నారు. నటుడిగా 25 సినిమాల ప్రయాణం చేరుకోవడం హ్యాపీగా ఉంది. ప్రస్తుతం 'బిచ్చగాడు' సినిమా దర్శకుడు శశితో 'వంద దేవుళ్లు' సినిమా చేస్తున్నాను'' అని చెప్పారు.

మేం రెడీ


కమల్‌హాసన్, రజనీకాంత్

''ఒకప్పుడు మాకు అర బిస్కెట్ (ఒకే సినిమాలో స్క్రీన్ షేర్ చేసుకోవడం గురించి) దొరికింది. హ్యాపీగా చేశాం. అప్పుడు చాన్స్ రావడమే గొప్ప... అందుకే అర బిస్కెట్టేనా? అనుకోలేదు. ఆ తర్వాత ఫుల్ బిస్కెట్ (సోలో హీరోలుగా చేయడం గురించి) దొరికింది. ఇద్దరం ఫుల్ బిస్కెట్‌ని ఎంజాయ్ చేస్తూ వస్తున్నాం'' అని గతంలో తాను, రజనీకాంత్ కలిసి నటించిన విషయం గురించి పేర్కొని, ''ఇప్పుడు మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం వస్తే హ్యాపీ'' అంటూ ఇటీవల కమల్‌హాసన్ పేర్కొన్నారు. తాజాగా తమ కాంబినేషన్ గురించి రజనీకాంత్ కూడా స్పందించారు. బుధవారం చెన్నై ఎయిర్‌పోర్టులో మీడియాతో రజనీకాంత్ మాట్లాడుతూ – ''రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (కమల్‌హాసన్ బేనర్), రెడ్ జెయింట్ మూవీస్ మా ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా నిర్మిస్తాయి. అయితే డైరెక్టర్, కథ ఫైనలైజ్ కాలేదు. మళ్లీ కలిసి సినిమా చేయడానికి నేను, కమల్ రెడీ. కానీ మాకు తగ్గ కథ, పాత్రలు దొరికితే చేస్తాం. డైరెక్టర్ కూడా కుదరాలి'' అని పేర్కొన్నారు. ఇక కెరీర్ ఆరంభంలో 'అపూర్వ రాగంగళ్, మూండ్రు ముడిచ్చు, అంతు లేని కథ' వంటి పలు చిత్రాల్లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు రజనీ–కమల్. 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' (1979) తర్వాత మళ్లీ కలిసి నటించలేదు. సో... రజనీ–కమల్ ఆశిస్తున్నట్లు కథ, పాత్రలు, డైరెక్టర్ సెట్ అయితే దాదాపు 45 ఏళ్ల తర్వాత ఈ కాంబినేషన్ రిపీట్ అయ్యే అవకాశం ఉంది.

టీజర్ చూడగానే సినిమా చూడాలనిపిస్తోంది

- శేఖర్ కమ్ముల



రాహుల్ శ్రీనివాస్, శేఖర్ కమ్ముల, తిరువీర్, సందీప్, టీనా శ్రావ్య

''ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' మూవీ టీజర్‌ని రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. టీజర్ చూడగానే సినిమా చూడాలనిపిస్తోంది. ఇలాంటి కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు నిర్మించడానికి ధైర్యం, ప్యాషన్ ఉండాలి. ఈ చిత్ర నిర్మాతలను చూస్తుంటే నా 'డాలర్ డ్రీమ్స్, ఆనంద్' రోజులు గుర్తొచ్చాయి'' అని డైరెక్టర్ శేఖర్ కమ్ముల తెలిపారు. 'మసూద' మూవీ ఫేమ్ తిరువీర్ హీరోగా, టీనా శ్రావ్య హీరోయిన్‌గా నటిస్తోన్న చిత్రం 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వంలో సందీప్ అగరం, అస్మితా రెడ్డి బాసిని నిర్మిస్తున్న ఈ సినిమా నవంబరు 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ను హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శేఖర్ కమ్ముల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– ''ఈ సినిమా టీమ్ మొత్తం యంగ్ అండ్ ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అని చెప్పారు. తిరువీర్ మాట్లాడుతూ– ''ఈ కథ వింటున్నప్పుడు నవ్వుతూనే ఉన్నాను. పప్పెట్ షో అనే బ్యానర్‌ని స్థాపించి, పారితోషికం తీసుకోకుండా ఈ సినిమాలో భాగమయ్యాను'' అని పేర్కొన్నారు. ''మేము అనుకున్న బడ్జెట్ కంటే ఐదింతలు పెరిగింది. కథపై నమ్మకంతో రాజీ పడకుండా నిర్మించాం'' అన్నారు సందీప్. ''సందీప్, రంజిత్‌గార్లు తొలి మీటింగ్‌లోనే కథని ఓకే చేశారు'' అని రాహుల్ శ్రీనివాస్ చెప్పారు. ''మా సినిమా ఆద్యంతం ప్రేక్షకులను నవ్విస్తుంది'' అని అస్మితా రెడ్డి చెప్పారు.

వాస్తవ ఘటనల కాయిన్


జైరామ్ చిటికెల, చంద్రహాస్, సాయి రాజేశ్

చంద్రహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కాయిన్'. జైరామ్ చిటికెల దర్శకత్వంలో శ్రీకాంత్ రాజారత్నం నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 17న చంద్రహాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ మూవీ గ్లింప్స్, టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన దర్శకుడు సాయి రాజేశ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రకథ విన్నప్పుడు 'కాయిన్' చుట్టూ ఇంత జరిగిందా? అని షాక్ అయ్యాను'' అని చెప్పారు. చంద్రహాస్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల ఆధారంగా 'కాయిన్' తీస్తున్నారు దర్శకుడు. పాత ఐదు రూపాయల కాయిన్స్‌ని బ్యాన్ చేయడం, ఆ కాయిన్స్‌ని మెల్ట్ చేయడం, వాటి నేపథ్యంలో క్రైమ్ అనే పాయింట్లతో ఈ కథను రాశారాయన'' అన్నారు. ''ఐదు రూపాయల కాయిన్ ఎందుకు బ్యాన్ అయింది? అనే నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాను'' అని జైరామ్ చిటికెల చెప్పారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ నిమిషి జాకియాస్, లైన్ ప్రొడ్యూసర్ గంగాధర్ మాట్లాడారు.

ప్రభాస్ సినిమాలో..?


అభిషేక్ బచ్చన్

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ టాలీవుడ్‌కి పరిచయం కానున్నారనే వార్త జోరుగా ప్రచారం అవుతోంది. అది కూడా ప్రభాస్ తాజా పాన్ ఇండియా మూవీ 'ఫౌజీ' (పరిశీలనలో ఉన్న టైటిల్ అని సమాచారం)తో అని టాక్. హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ పీరియాడికల్ మూవీని నిర్మిస్తోంది. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్రకు అభిషేక్ బచ్చన్‌ని తీసుకోవాలనుకున్నారట. అభిషేక్‌ని కలిసి, కథ, పాత్రను హను రాఘవపూడి వివరించారని సమాచారం. ఈ చిత్రంలో అభిషేక్ నటించడం దాదాపు ఖరారు అయిందని, అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం అనీ బాలీవుడ్ అంటున్న మాట. ఈ సినిమాలో ఇప్పటికే బాలీవుడ్ నటులు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి నటిస్తున్నారు. ఓ కీలక పాత్రను జయప్రద పోషిస్తున్నారు. ఇమాన్వీ ఇస్మాయిల్ కథానాయికగా నటిస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రం రూపొందుతోందని సమాచారం. ఇదిలా ఉంటే... బిగ్ బి అమితాబ్ బచ్చన్ 'సైరా, కల్కి 2898 ఏడీ' వంటి తెలుగు చిత్రాల్లో నటించారు. మరి... ఆయన తనయుడు అభిషేక్ బచ్చన్ 'ఫౌజీ'తో టాలీవుడ్‌కి పరిచయమవుతారా? వెయిట్ అండ్ సీ.

యాక్షన్ రెడీ


అథర్వ, లావణ్య

అథర్వా మురళీ నటించిన తమిళ చిత్రం 'టన్నెల్'. లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 19న ఈ చిత్రాన్ని తెలుగులో ఎ. రాజు నాయక్ రిలీజ్ చేస్తున్నారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. ఈ చిత్రం గురించి ఎ. రాజు చెబుతూ – ''క్రైమ్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్‌లో రూపొందిన ఈ చిత్రం తమిళంలో ఘనవిజయం సాధించింది. ఈ సినిమాలో మంచి సందేశం కూడా ఉంది. యాక్షన్ సీక్వెన్స్ అబ్బురపరిచేలా ఉంటాయి. జస్టిన్ ప్రభాకరన్ మ్యూజిక్ వీనుల విందుగా, శక్తి శరవణన్ సినిమాటోగ్రఫీ కనువిందుగా ఉంటాయి. ఈ చిత్రం తెలుగులోనూ సూపర్ హిట్టవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

మనసులను కదిలిస్తుంది

- విజయ్‌పాల్ రెడ్డి



''బ్యూటీ' చిత్రంలో అందమైన ప్రేమకథతో పాటు మనసుని కదిలించే భావోద్వేగాలు ఉంటాయి. ప్రతి మధ్య తరగతి వాళ్లు, పిల్లలు, తల్లిదండ్రులు చూడాల్సిన చిత్రమిది. నాకు వ్యక్తిగతంగా భావోద్వేగాలంటే ఇష్టం. ఈ కథలోని ఎమోషన్స్ నచ్చే నిర్మించాను'' అని విజయ్‌పాల్ రెడ్డి అడిదల తెలిపారు. అంకిత్ కొయ్య, నీలఖి జంటగా నటించిన చిత్రం 'బ్యూటీ'. వానర సెల్యులాయిడ్, జీ స్టూడియోస్, మారుతి టీమ్ ప్రొడక్ట్స్‌పై విజయ్‌పాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్‌పాల్ రెడ్డి మాట్లాడుతూ– ''బ్యూటీ' కథ విన్న వెంటనే ఈ మూవీ చేద్దామని మారుతిగారికి చెప్పాను. ఈ సినిమాని ఇప్పటివరకు చాలా మంది చూశారు. కొందరైతే 'బేబీ, కోర్ట్' స్టైల్లో ఉందని మెచ్చుకున్నారు'' అని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
18-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	313	82,694
నిఫ్టీ ▲	91	25,330

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	22,235	▽	100
డోజోన్స్	45,962	▲	205
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,206	▲	10
డాక్స్	23,304	▲	15
షాంఘై	3,876	▲	14
నికాయ్	44,790	▽	112

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.45	88.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.40	121.35
€	యూరో	ఎస్‌బీఐ	102.90	105.69
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.25	59.51
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.43	70.09
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.63	24.13
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.13	24.38
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.51	13.34

రెండో రోజూ అదే జోరు

- యూఎస్‌తో ద్వైపాక్షిక ఒప్పందంపై ఆశలు
- ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు
- సెన్సెక్స్ లాభం 313 పాయింట్లు
- 91 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: భారత్–అమెరికాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదరొచ్చన్న ఆశలతో ఇన్వెస్టర్లు ఐటీ, బ్యాంకులు, ఆటో షేర్లలో కొనుగోళ్లకు తెరతీశారు. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ 313 పాయింట్లు పెరిగి 82,694 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 91 పాయింట్లు బలపడి 25,330 వద్ద నిలిచింది. సూచీలకిది వరుసగా రెండో రోజు లాభాల ముగింపు. ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు, డాలర్ మారకంలో రూపాయి బలోపేతం అంశాలు సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఉదయమే లాభాల్లో మొదలైన సూచీలు రోజంతా సానుకూల ధోరణితో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 361 పాయింట్లు పెరిగి 82,741 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు బలపడి 25,347 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య నిర్ణయాల వెల్లడికి ముందు అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ఆసియాలో జపాన్, సింగపూర్, తైవాన్, కొరియా దేశాల మార్కెట్లు 0.50% నష్టపోగా, హాంగ్‌కాంగ్, ఇండోనేసియా, చైనా సూచీలు 1% పెరిగాయి. యూరప్‌లో జర్మనీ, బ్రిటన్ మార్కెట్లు 0.25% పెరిగాయి. ఫ్రాన్స్ స్టాక్ సూచీ 0.30% నష్టపోయింది. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

నాలుగో రోజూ బలపడిన రూపాయి

వరుసగా నాలుగో రోజూ రూపాయి బలపడింది. డాలర్ మారకంలో 24 పైసలు పెరిగి 87.85 వద్ద స్థిరపడింది. ఫెడ్ రిజర్వ్ రేట్ల తగ్గింపు అంచనాలతో అంతర్జాతీయంగా డాలర్ విలువ బలహీనపడింది. భారత్ అమెరికాల మధ్య చర్చలు సఫలం అవ్వొచ్చనే ఆశలు, స్టాక్ మార్కెట్ లాభాల ట్రేడింగ్ అంశాలు కలిసొచ్చాయి.

కొత్త జీఎస్‌టీ రేట్లపై కేంద్రం నోటిఫికేషన్

- ఇక రాష్ట్రాల వంతు



న్యూఢిల్లీ: ఈ నెల 22 నుంచి వివిధ ఉత్పత్తులపై కొత్తగా అమల్లోకి వచ్చే సెంట్రల్ జీఎస్‌టీ (సీజీఎస్‌టీ) రేట్లను కేంద్ర ఆర్థిక శాఖ నోటిఫై చేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్‌జీఎస్‌టీ రేట్లను నోటిఫై చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లు, సెప్టెంబర్ 22 నుంచి రెండు శ్లాబులుగా ఉంటాయి. మెజారిటీ ఉత్పత్తులకు 5 శాతం, 18 శాతం ట్యాక్స్ రేట్లే వర్తిస్తాయి. విలాసవంతమైన ఉత్పత్తులపై మాత్రం 40 శాతం శ్లాబు ఉంటుంది. చాలా మటుకు ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గుతున్న నేపథ్యంలో ఆ ప్రయోజనాలను కస్టమర్లకు బదలాయించాల్సిన బాధ్యత పరిశ్రమపై ఉంటుందని నిపుణులు తెలిపారు. నోటిఫికేషన్ జారీ చేయడం ద్వారా వివిధ ఉత్పత్తులకు వర్తించే రేట్లపై ప్రభుత్వం స్పష్టతనిచ్చిందని ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ పార్ట్‌నర్ రజత్ మోహన్ తెలిపారు.

ఫెడ్ వడ్డీ రేటు పావు శాతం కోత

4-4.25 శాతానికి చేరిన ఫండ్స్ రేటు



వాషింగ్టన్ డీసీ: యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ రెండు రోజుల పాలసీ సమీక్షలో వడ్డీ రేటును పావు శాతం తగ్గించేందుకు నిర్ణయించింది. ఫెడ్ చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన రెండు రోజుల పాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌ఓఎంసీ) తాజాగా వడ్డీ రేటులో 0.25 శాతం కోతకు ఓటు వేసింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేటు 4–4.25%కి దిగివచ్చింది. గత ఐదు పాలసీ సమీక్షలలో యథాతథ వడ్డీ రేటు (4.25–4.5%) అమలుకే మొగ్గు చూపిన ఫెడ్ 9 నెలల తదుపరి రేట్ల కోతకు నిర్ణయించింది. తదుపరి నిర్వహించే విలేకరుల సమావేశంలో వచ్చే ఏడాది జూన్‌కల్లా మరో రెండుసార్లు రేట్లను తగ్గించే సంకేతాలివ్వనున్నట్లు ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం పెరగడానికితోడు ఉపాధి మార్కెట్ క్షీణించడం రేట్ల కోతకు కారణమైనట్లు విశ్లేషించారు. కాగా.. గత కేలండర్ ఏడాది (2024)లో ఫెడ్ 3 సార్లు వడ్డీ రేటులో కోత పెట్టిన సంగతి తెలిసిందే.

మూడు లిస్టింగ్‌లూ మెప్పించాయ్



ఇటీవల ఐపీఓలు పూర్తి చేసుకున్న 3 కంపెనీల షేర్లు లిస్టింగ్‌లో మెప్పించాయి. అర్బన్ కంపెనీ షేరు భారీ లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.103)తో పోలిస్తే 56% ప్రీమియంతో రూ.161 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 74% ఎగసి రూ.179 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 62% లాభంతో రూ.167 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,987 కోట్లుగా నమోదైంది.

- శ్రింగార్ హౌస్ ఆఫ్ మంగళసూత్ర షేరు ఇష్యూ ధర (రూ.165)తో పోలిస్తే 14% ప్రీమియంతో రూ.188 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 16% పెరిగి రూ.191 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 12% లాభంతో రూ.185 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,783 కోట్లుగా నమోదైంది.
- దేవ్ యాక్సిలరేటర్ షేరు ఇష్యూ ధర (రూ.61)తో పోలిస్తే 0.49% స్వల్ప ప్రీమియంతో 61.30 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో 5.50% ఎగసి రూ.64.36 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకి, అక్కడే ముగిసింది.

కస్టమర్లకు జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాలు బదిలీ

భారతి సిమెంట్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సిమెంటుపై 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గే వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రయోజనాలను కస్టమర్లు, వ్యాపార భాగస్వాములకు పూర్తిగా బదలాయిస్తామని భారతి సిమెంట్ డైరెక్టర్ (మార్కెటింగ్) రవీందర్ రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 22 నుంచి ఎంఆర్‌పీ తగ్గింపు ధరలు .. తమ ఇన్‌వాయిస్‌లలో, సిమెంటు బ్యాగ్‌లపై ప్రతిఫలిస్తాయని వివరించారు. సిమెంటు ధరలను తగ్గించి, ప్రయోజనాలను బదిలీ చేయాలని ఇప్పటికే తమ డీలర్లకు సూచించినట్లు రవీందర్ రెడ్డి చెప్పారు. లక్షల కొద్దీ గృహ నిర్మాణదారులు, మౌలిక సదుపాయాల డెవలపర్లు, సామాన్యులకు నేరుగా లబ్ధి చేకూర్చేలా జీఎస్‌టీ సంస్కరణలు చేపట్టినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. దీనితో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని, ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఎకానమీగా భారత్ ఆవిర్భవించేందుకు తోడ్పడుతుందని రవీందర్ రెడ్డి చెప్పారు. వికాట్ ఫ్రాన్స్ అనుబంధ సంస్థగా భారతి సిమెంట్ కార్యకలాపాలు సాగిస్తోంది.

ఏఎంసీ షేర్ల హవా

దేశీ స్టాక్ మార్కెట్లను మించుతూ గత ఆరు నెలలుగా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ(ఏఎంసీ)లు లాభాల దౌడు తీస్తున్నాయి. ఈ కాలంలో మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ బీఎస్‌ఈ సెన్సెక్స్ 10 శాతం పుంజుకోగా.. లిస్టెడ్ కంపెనీల షేర్లు 50-30 శాతం మధ్య పురోగమించాయి. ప్రధానంగా దేశీ పెట్టుబడులు జోరందుకోవడం ఇందుకు సహకరిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

- మార్కెట్లను మించుతూ లాభాల దౌడు
- గత 6 నెలల్లో 50–30 శాతం మధ్య అప్
- రిటైలర్ల సిప్‌లు, ఫండ్స్ పెట్టుబడుల దన్ను



పెట్టుబడుల తీరిలా

నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ వివరాల ప్రకారం గత నెల(ఆగస్ట్)లో ఈక్విటీలలోకి నికర పెట్టుబడులు నెలవారీగా చూస్తే 25 శాతం క్షీణించి రూ. 42,360 కోట్లకు పరిమితమయ్యాయి. ఇందుకు ప్రపంచస్థాయిలో భౌగోళిక, రాజకీయ అస్థిరతలు కొంతమేర ప్రభావం చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు. అయితే సిప్ పథకాలకు నిలకడగా రూ. 28,270 కోట్లు ప్రవహించడం రిటైల్ ఇన్వెస్టర్ల కట్టుబాటును సూచిస్తున్నట్లు ప్రస్తావించారు! ఇక ఈ ఏడాది తొలి అర్ధభాగం(జనవరి–జూన్)లో ఎంఎఫ్‌ల ఏయూఎం 11 శాతం బలపడి రూ. 74.41 లక్షల కోట్లను తాకాయి. ఇందుకు ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ ఫండ్స్ దన్నునిచ్చాయి. ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ వివరాల ప్రకారం ఈ కాలంలో ఏయూఎం రూ. 7 లక్షల కోట్లమేర పుంజుకుంది. నికరంగా రూ. 4.18 లక్షల కోట్ల పెట్టుబడులు జమయ్యాయి.

ఏఎంసీ షేర్ల దూకుడు

కంపెనీ పేరు	ప్రస్తుత ధర	ఆరు నెలల్లో(%)
నిప్పన్ లైఫ్ ఇండియా	851	55
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	5,809	53
యూటీఐ ఏఎంసీ	1,367	48
ఆదిత్య బిర్లా సన్ లైఫ్	817	40
శ్రీరామ్ ఏఎంసీ	446	23
కేఫిన్ టెక్నాలజీస్	1,118	22

(షేరు ధర రూ.లలో)

కుటుంబ ఆదాయాలు బలపడటం, పెట్టుబడి అవకాశాల పట్ల పెరుగుతున్న అవగాహన, డిజిటలైజేషన్‌తోపాటు.. మార్కెట్లో సరళతర లావాదేవీలకు వీలు ఏర్పడటం వంటి అంశాలు కొద్ది నెలలుగా రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిస్తున్నాయి. ఇటీవల కొంతకాలంగా పొదుపునకు వెచ్చించగల ఆదాయాలు పెరుగుతుండటంతో ఇన్వెస్టర్లు వివిధ పెట్టుబడి విభాగాలపై దృష్టిపెడుతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఫలితంగా బంగారం, రియల్టీ తదితర ఫిజికల్ ఆస్తుల నుంచి పొదుపు ఆలోచన ఆర్థిక మార్గాలవైపు మళ్లుతున్నట్లు తెలియజేశారు. దీనికితోడు దేశీయంగా రిటైలర్లు ఈక్విటీ పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నట్లు వెల్త్‌మిల్స్ సెక్యూరిటీస్ ఈక్విటీ స్ట్రాటజీ డైరెక్టర్ క్రాంతి బత్తిని పేర్కొన్నారు. ఫలితంగా విభిన్న ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌కు ప్రాధాన్యత ఏర్పడినట్లు తెలియజేశారు. వెరసి మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్)కు చెందిన క్రమానుగత పెట్టుబడి(సిప్) పథకాలు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు), రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్(రీట్‌లు) తదితరాలకు పెట్టుబడులు తరలివస్తున్నట్లు వివరించారు.

సిప్ పెట్టుబడుల నిలకడ

నెల	పెట్టుబడులు
ఏప్రిల్	26,632
మే	26,688
జూన్	27,269
జూలై	28,464
ఆగస్ట్	28,270

(రూ. కోట్లలో)

సిప్‌ల దన్ను

బీఎస్‌ఈ గణాంకాల ప్రకారం ఆస్తుల నిర్వహణా పరిశ్రమలోని లిస్టెడ్ దిగ్గజాలలో అత్యధికంగా నిప్పన్ లైఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ స్టాక్స్ గత ఆరు నెలల్లో 53 శాతానికిపైగా దూసుకెళ్లాయి. ఈ బాటలో యూటీఐ ఏఎంసీ 48 శాతం, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ 40 శాతం జంప్‌చేయగా.. శ్రీరామ్ ఏఎంసీ 23 శాతం, కేఫిన్ టెక్నాలజీస్ 22 శాతం చొప్పున ఎగశాయి. ప్రధానంగా పసిడి, వెండిపై ఇన్వెస్ట్ చేసే కుటుంబ ఆదాయాలు విభిన్న పెట్టుబడి పథకాలవైపు ప్రయాణిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎంఎఫ్‌లకు తరలి వస్తున్న పెట్టుబడులు, నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) విలువ భారీగా మెరుగుపడటం, సిప్‌ల ద్వారా రిటైలర్ల నిరవధిక పెట్టుబడులు ఏఎంసీ కంపెనీల షేర్లకు జోష్‌నిస్తున్నట్లు తెలియజేశారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
5 ఏళ్లలో రూ. 70 లక్షల కోట్లు | పండుగ సీజన్‌పై 'సోనీ' ఆశలు..!

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 350 మేనేజర్ పోస్టులు

పుణెలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర శాశ్వత ప్రాతిపదికన వివిధ విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 350.
» **పోస్టులు:** డిప్యూటీ జనరల్/అసిస్టెంట్ జనరల్/చీఫ్/సీనియర్ మేనేజర్/మేనేజర్(స్కేల్–2, 3, 4, 5, 6)
» **విభాగాలు:** ఐటీ, డిజిటల్ బ్యాంకింగ్, ఐటీ సెక్యూరిటీ, ఐఎస్ ఆడిట్, సీఐఎస్‌ఓ, ట్రెజరీ, ఇంటర్నేషనల్ బిజినెస్, లీగల్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ అకౌంట్స్, క్రెడిట్, సీఏ, ఇంటిగ్రేటెడ్ రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ అండ్ పబ్లిసిటీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్/బీఈ, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 నుంచి 50 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు స్కేల్–2, 3, 4, 5, 6 పోస్టులకు రూ.64,820 నుంచి రూ.1,40,500
» **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1180. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.118.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.09.2025
» **వెబ్‌సైట్:** https://bankofmaharashtra.in

డీఎస్ఎస్‌బీ ఢిల్లీలో 1180 ఫ్యాకల్టీ పోస్టులు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు(డీఎస్ఎస్‌బీ) వివిధ విభాగాల్లో అసిస్టెంట్ టీచర్(ప్రైమరీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1180.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిప్లొమా(ఎలిమెంటరీ ఎడ్యుకేషన్)లేదా డిగ్రీ(బీఈఐఈడీ), సీటెట్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 30 ఏళ్ల మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.10.2025
» **వెబ్‌సైట్:** https://dsssb.delhi.gov.in

ఏపీఈడీఏలో అసోసియేట్ పోస్టులు

న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఈడీఏ).. ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంబీఏ(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/పబ్లిక్ పాలసీ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్ల ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.80,000 నుంచి 1,05,000
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** recruitment@apeda.gov.in
» **దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
» **వెబ్‌సైట్:** https://apeda.gov.in

ఐఐటీ బీహెచ్‌యూలో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బెనారస్ హిందూ యూనివర్శిటీ(బీహెచ్‌యూ) ..ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంటెక్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.61,000.
» **వయసు:** 32 ఏళ్ల ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.09.2025
» **వెబ్‌సైట్:** https://iitbhu.ac.in

మేటి కాలేజీల్లో ఎంబీఏకు మ్యాట్

» మ్యాట్ 2025 సెప్టెంబర్ నోటిఫికేషన్ విడుదల
» నచ్చిన విధానంలో పరీక్ష రాసుకోవచ్చు.



ఉన్నత సంస్థల్లో వ్యాపార నిర్వహణ, హెచ్‌ఆర్ విభాగాల్లో ఉద్యోగంలో చేరేందుకు ఉత్తమ మార్గం.. ఎంబీఏ కోర్సులు! దేశంలోని మేనేజ్‌మెంట్ విద్యను అందించే కాలేజీల్లో ఎంబీఏ, పీజీడీఎమ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే అర్హత పరీక్ష మ్యాట్ (మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్). ఇటీవల ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎమ్ఏ).. మ్యాట్ పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. మ్యాట్‌పై ప్రత్యేక కథనం..

సాఫ్ట్‌వేర్, ఐటీ, ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలను సాధారణ గ్రాడ్యుయేట్లు సైతం రెండేళ్ల ఎంబీఏ, పీజీడీఎమ్ కోర్సును పూర్తి చేసి పొందవచ్చు. మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ విభాగాల్లో ఉన్నత స్థాయిలో సేవలందించవచ్చు. అయితే, మంచి కాలేజీలో కోర్సును పూర్తి చేసిన వారినే టాప్ కంపెనీలు కొలువులకు ఆహ్వానిస్తాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని 600లకుపైగా విద్యాసంస్థల్లో ఎంబీఏ కోర్సుల్లో మ్యాట్ పరీక్షతో సీటును సాధించవచ్చు.

అర్హతలు

మ్యాథ్స్, సైన్స్, ఆర్ట్స్ లేదా మరేదైనా విభాగంలో డిగ్రీని 50 శాతం మార్కులతో పూర్తి చేసి ఉండాలి. ప్రస్తుతం డిగ్రీ చివరి ఏడాది చదువుతున్న వారు సైతం దరఖాస్తుకు అర్హులే.

'మూడు'ను బట్టి పరీక్ష రాయొచ్చు!

సాధారణంగా ఏదైనా పోటీ పరీక్ష గానీ అర్హత పరీక్ష గానీ ఒకే ఫార్మాట్‌లో నిర్వహిస్తారు. అది ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కావొచ్చు. అయితే, మ్యాట్ పరీక్షను మాత్రం అభ్యర్థి తనకు నచ్చిన పద్ధతిలో రాసుకునే వెసులుబాటు ఉంది. పేపర్ బేస్డ్ టెస్ట్ (పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ), పీబీటీ+ సీబీటీ.. ఇలా మూడు రకాలుగా పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థి తనకు నచ్చిన విధానంలో పరీక్ష రాసుకోవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో..

మ్యాట్ స్కోరుతో దేశంలోని 600 మేటి కళాశాలలు ఎంబీఏ కోర్సుల్లో సీటును అందిస్తున్నాయి. అందులో తెలుగు రాష్ట్రాల్లోని టాప్ కాలేజీలు న్నాయి. అవి.. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్ ప్రైజ్ (ఐపీఈ) లాంటి ప్రముఖ విద్యాసంస్థలు మ్యాట్ స్కోరుతో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఏడాది పాటు మ్యాట్ స్కోరుకు వాలిడిటీ ఉంటుంది.

పరీక్ష, సిలబస్..

- పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో 150 మార్కులకు 150 ప్రశ్నలు ఉంటాయి.
- ఐదు విభాగాల్లో అభ్యర్థి ప్రతిభను పరీక్షిస్తారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్–30 ప్రశ్నలు, ఇంటలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్–30, మ్యాథమెటికల్ స్కిల్స్–30, డేటా అనాలసిస్ అండ్ సఫిషియన్సీ –30, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ –30 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు(0.25 శాతం)ను తగ్గిస్తారు.

ప్రిపరేషన్ ఇలా..

లాంగ్వేజ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించాలంటే.. ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ సబ్జెక్ట్ నాలెడ్జ్‌లను పెంచుకోవడానికి కృషి చేయాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్,జంబుల్డ్ పారాగ్రాఫ్‌లను ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రాణించాలంటే..అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

- ఇంటలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్‌లో.. క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- డేటా అనాలసిస్ అండ్ సఫిషియన్సీలో.. విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణ నైపుణ్యాన్ని పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో మెరుగైన స్కోర్ సాధించాలంటే టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మ్యాథమెటికల్ స్కిల్స్.. మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే ఈ విభాగంలో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలంటే అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, డిస్టెన్స్–టైం వంటి అంశాలపై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఫీజు:** పీబీటీ, సీబీటీలో ఏదో ఒక విధానంలో పరీక్ష రాసేందుకు రూ.2,200, పీబీటీ+సీబీటీ రెండు విధానాల్లో రాయడానికి రూ.3,800 చెల్లించాలి.
- **పీబీటీ పరీక్ష తేది:** 21.09.2025
- **సీబీటీ పరీక్ష దరఖాస్తుకు చివరి తేది:** 22.09.2025
- **సీబీటీ పరీక్ష తేది:** 28.09.2025
- **పరీక్ష ఫలితాలు:** అక్టోబర్ రెండో వారంలో..
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:**
  పేపర్ బేస్డ్ టెస్ట్: హైదరాబాద్, విశాఖపట్నం.
  కంప్యూటర్ బేస్డ్ టెస్ట్: హైదరాబాద్, విజయవాడ.
- **వెబ్‌సైట్:** https://mat.aima.in

జీఆర్ఈ.. బెస్ట్ స్కోర్ ఇలా

» జీఆర్ఈ స్కోర్‌తో విదేశీ వర్సిటీల్లో అడ్మిషన్
» ఒక గంట 58 నిమిషాల్లో టెస్ట్ పూర్తి చేసే అవకాశం
» నచ్చిన విధానంలో పరీక్ష రాసుకోవచ్చు

గ్రాడ్యుయేట్ రికార్డ్స్ ఎగ్జామినేషన్.. సంక్షిప్తంగా జీఆర్ఈ! విదేశీ విద్య అభ్యర్థులకు సుపరిచితమైన టెస్ట్! ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగానే.. ప్రముఖ ఫారెన్ యూనివర్సిటీల్లో.. మేనేజ్‌మెంట్, టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది! ఏటా లక్ష మందికి పైగా భారతీయ విద్యార్థులు జీఆర్ఈకి హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో.. జీఆర్ఈ పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు..

స్కోరింగ్ విధానం..ప్రశ్నల సంఖ్య

జీఆర్ఈ పరీక్ష వ్యవధి ఒక గంట 58 నిమిషాలు. మూడు విభాగాల్లో కలిపి మొత్తం 55 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. విభాగాల వారీగా స్కోరింగ్ విధానం ఉంటుంది. క్వాంటిటేటివ్, వెర్బల్ రీజనింగ్ విభాగాల్లో ప్రతి విభాగంలో 1 నుంచి 170 పాయింట్ల స్కోర్ మేరకు లెక్కిస్తారు. అనలిటికల్ ఎస్సేకు సంబంధించి గరిష్ఠంగా ఆరు పాయింట్లు కేటాయిస్తారు.సబ్జెక్ట్ టెస్ట్‌ల స్కోరింగ్ విధానం 200–990 పాయింట్ల మధ్యలో ఉంటుంది.

స్కోర్ వెల్లడి వేగంగా

జీఆర్ఈ జనరల్ టెస్ట్‌కు సంబంధించి పరీక్ష ముగిసిన తర్వాత 8 నుంచి 10 రోజుల్లోనే అధికారిక స్కోర్‌ను అందుకోవచ్చు. ఇది ఆయా విదేశీ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకునేందుకు అనుకూల పరిణామంగా పేర్కొంటున్నారు.

ఏడాదిలో అయిదుసార్లు

జీఆర్ఈ పరీక్షకు ఏడాదిలో అయిదుసార్లు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రతి టెస్ట్‌కు మధ్య 21 రోజుల వ్యవధి ఉండాలి. ఇలా ఒకటి కంటే ఎక్కువ సార్లు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమకు బెస్ట్ స్కోర్ వచ్చిన టెస్ట్ ఫలితాలతో యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షకు హాజరైన ప్రతిసారి నిర్ణీత ఫీజు చెలించాల్సి ఉంటుంది. ఎక్కువసార్లు హాజరై సాధించిన స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల పట్ల వర్సిటీలు కొంత ప్రతికూలంగా ఉంటాయనే అభిప్రాయముంది. కాబట్టి అభ్యర్థులు ఒకటి లేదా రెండు టెస్ట్‌లలోనే బెస్ట్ స్కోర్ పొందేందుకు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

స్కోర్‌కు అయిదేళ్ల గుర్తింపు

జీఆర్ఈ టెస్ట్ స్కోర్‌కు అయిదేళ్ల వరకు గుర్తింపు ఉంటుంది. దీంతో.. ఒక సంవత్సరంలో ఆయా యూనివర్సిటీల్లో అడ్మిషన్ అవకాశాలు కోల్పోయినా.. ఇదే స్కోర్‌తో తదుపరి ఏడాదిలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

300కు పైగా స్కోర్‌తో

బెస్ట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సీటు ఖరారు చేసుకోవాలనుకుంటే.. అభ్యర్థులు ప్రతి విభాగంలో 150కు పైగా మొత్తంగా 300కు పైగా స్కోర్ లక్ష్యంగా కృషి చేయాలి.



సబ్జెక్ట్ టెస్ట్‌లు కూడా

జీఆర్ఈలో ప్రస్తుతం మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, సైకాలజీ విభాగాల్లో సబ్జెక్ట్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నారు. ప్రముఖ యూనివర్సిటీలు సైన్స్, ఇంజనీరింగ్ పీజీ కోర్సుల ప్రవేశాల సమయంలో జీఆర్ఈ సబ్జెక్ట్ టెస్ట్ స్కోర్‌ను ముఖ్యంగా మ్యాథ్స్, ఫిజిక్స్ స్కోర్‌లను కూడా ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

- **వెబ్‌సైట్:** www.ets.org/gre/test-takers.htm

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–తెలుగు (ఎస్‌జీటీ)
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–రసాయన శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



LOVED IN 100 COUNTRIES
BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN
ప్రపంచం చూస్తుంది,
నువ్వేంటో
చూపించు.
CELEBRATING LANDMARK GST REFORMS
HAT-TRICK SAVINGS
SAVE ₹18 000/-
100% GST BENEFIT + NO PROCESSING FEE + INSURANCE SAVINGS
అన్ని పల్సర్ మోడల్స్ పై 1.5 రెట్లు GST లాభం
MODEL | 125 CF | NS 125 | 150 | NS 160 | NS 200
100% GST లాభం | ₹8 287/-* | ₹9 897/-* | ₹10 758/-* | ₹12 532/-* | ₹13 603/-*
PF + ఇన్సూరెన్స్ లో ఆదా | ₹3 000/-* | ₹3 500/-* | ₹3 800/-* | ₹4 500/-* | ₹4 800/-*
హ్యాట్రిక్ సేవింగ్స్ | ₹11 287/-* | ₹13 397/-* | ₹14 558/-* | ₹17 032/-* | ₹18 403/-*
pulsar
DEFINITELY DARING
Flipkart మరియు amazon.in లో అందుబాటులో ఉంది
మీకు దగ్గరలోని డీలర్‌ను కనుగొనండి
72198 21111
BAJAJ SECURE
SHRIRAM Finance
IDFC FIRST Bank ALWAYS YOU FIRST
BAJAJ AUTO CREDIT
L&T Finance
TATA CAPITAL Two Wheeler Loans

సాక్షి ప్లస్
గురువారం । 18-9-2025

‘శ్రీపురం’ శ్రీమంతులు


శ్రీపురం రంగనాథస్వామి ఆలయం వ్యూ (ఇన్‌సెట్‌లో) శ్రీ రంగనాథస్వామి

రూ.కోటి వ్యయంతో అతి పురాతన వైష్ణవాలయానికి పూర్వవైభవం

- శ్రీరంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణకు గ్రామస్తుల చేయూత
- శిథిలావస్థ నుంచి సర్వాంగ సుందరంగా..
- జిల్లాలోనే ప్రముఖ ఆలయంగా గుర్తింపు
- ఏటా జ్యేష్ట మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు

నాగర్‌కర్నూల్‌: వంద ఆలయాలు నిర్మించడం కంటే.. శిథిలమైన ఒక పురాతన ఆలయాన్ని పునరుద్ధరించడం వంద జన్మల పుణ్యఫలమని పండితులు చెబుతుంటారు. ఆ మాటలు విన్న కొంతమంది భక్తులు కలిసికట్టుగా కృషిచేసి అత్యంత పురాతనమైన ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి సరికొత్త చరిత్ర లిఖించారు. తమిళనాడులోని శ్రీరంగంలో కొలువైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకోలేని భక్తులకు నాగర్‌కర్నూల్‌ జిల్లాకేంద్రానికి అత్యంత చేరువలో ఉన్న శ్రీపురం శ్రీరంగనాథస్వామి కొంగు బంగారంగా మారారు. అత్యంత మహిమాన్వితమైన శ్రీపురం శ్రీరంగనాథస్వామి ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ జిల్లాలోనే ప్రముఖ ఆలయంగా మారింది. జిల్లాలోనే పురాతన వైష్ణవాలయాల్లో ఒకటైన శ్రీపురం రంగనాథస్వామిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్‌ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

శ్రీరంగం నుంచి తలపై విగ్రహంతో..

శ్రీపురంలోని రంగనాథస్వామి ఆలయ నిర్మాణంతోపాటు ఆలయ చారిత్రక వైభవంపై చరిత్రకారులు రాసిన పుస్తకాల ద్వారా పలు విశేషాలు తెలుస్తున్నాయి. సుమారు 500 ఏళ్ల కిందట తిరుమల వింజమూరి వంశానికి చెందిన నాలుగో నర్సింహాచార్యులు శ్రీపురంలో శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని నిర్మించారు. రంగనాథుడికి పరమ భక్తుడైన నర్సింహాచార్యుడికి కలలో స్వామివారు కనిపించి, తమకు శ్రీపురంలో ఆలయం నిర్మించాలని ఆదేశించారని, దీంతో ఆయన కాలినడకన శ్రీరంగం వెళ్లి అక్కడే రంగనాథస్వామి విగ్రహాన్ని తయారు చేయించారని.. అక్కడి నుంచి తలపై విగ్రహాన్ని పెట్టుకొని శ్రీపురం దాకా కాలినడకన వచ్చి ప్రతిష్ఠించారని చరిత్రకారులు చెబుతున్నారు. కాలక్రమేణా రంగనాథస్వామి మహిమల కారణంగా భక్తుల సంఖ్య విపరీతంగా పెరుగుతూ వచ్చింది. దీంతో సమీపంలోని పలు సంస్థానాధీశులు కూడా శ్రీపురం రంగనాథస్వామికి భక్తులుగా మారడంతోపాటు ఆలయ నిర్వహణ కోసం వందలాది ఎకరాల భూములను ఇనామ్‌గా ఇచ్చారని ఆధారాలున్నాయి. ఆత్మకూరు ప్రాంతంతోపాటు గద్వాల, నాగర్‌కర్నూల్‌ చుట్టుపక్కల అనేక గ్రామాల్లో రంగనాథస్వామి ఆలయానికి భూములు ఉండేవని, కాలక్రమంలో చాలా భూములు అన్యాక్రాంతమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్‌ చుట్టుపక్కల మాత్రమే రంగనాథస్వామికి 120 ఎకరాల దాకా భూములున్నాయి. కాగా, రంగనాథస్వామి ఆలయం 450 ఏళ్లపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏకంగా అగ్రహారం వెలిసినట్లు ఆధారాలు ఉన్నాయి. సుమారు వందకుపైగా బ్రాహ్మణ కుటుంబాలు శ్రీపురంలో ఉండేవని.. మారిన కాలంతోపాటు వారిలో ఎక్కువ భాగం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని స్థానికులు చెబుతున్నారు.

శిథిలావస్థ నుంచి పునరుజ్జీవం వైపు..

ఎంతో ఘన చరిత్ర కలిగిన శ్రీరంగనాథస్వామి ఆలయం 50 ఏళ్ల నుంచి క్రమంగా శిథిలావస్థకు చేరింది. ఆలయ నిర్వహణ కోసం కేటాయించిన భూములపై కౌలు సక్రమంగా రాకపోవడంతో ధూప, దీప, నైవేద్యాలకు కూడా నోచుకోని పరిస్థితి ఏర్పడింది. దీంతో నిర్వహణ కొరవడి ఆలయం శిథిలావస్థకు చేరింది. 2012లో కొంతమంది భక్తులు, ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని పునర్నిర్మించాలని సంకల్పించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో రూ.కోటి వ్యయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పురాతన శైలి దెబ్బతినకుండా గతంలో ఉన్న శిల్పకళను పోలిన రీతిలో ఆలయాన్ని పునరుద్ధరించారు. దీంతోపాటు ఆలయం చుట్టూ భారీ ప్రాకారం, కోనేరు, 25 అడుగుల ఎత్తయిన భారీ రథం సమకూర్చుకున్నారు.


బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీ రంగనాయకస్వామి దేవాలయం


2014కు ముందు శిథిలావస్థలో ఉన్న ఆలయం (ఫైల్‌)

2014 జూన్‌లో పునఃప్రతిష్ట

ఒకప్పుడు కూలిన గోడలు.. విరిగిన విగ్రహాలు, పిచ్చి మొక్కలతో నిర్మానుష్యంగా కనిపించే ఆలయ ప్రాంగణం ప్రస్తుతం అత్యంత శోభాయమానంగా మారింది. 2014 జూన్‌లో ఆలయాన్ని పునఃప్రతిష్ఠించగా.. భక్తులు స్వామివారికి నిత్య పూజలు చేస్తున్నారు. అచెంచలమైన భక్తి స్వామివారి వైభవాన్ని నలువైపులా చాటుతోంది. ఏటా వైకుంఠ ఏకాదశితోపాటు ధనుర్మాస ఉత్సవాలు, గోదా కల్యాణం, విజయదశమి, సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

జ్యేష్ట మాసంలో..

ఏటా జ్యేష్ఠ మాసంలో నాలుగు రోజులపాటు స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడ ముద్ద, భేరీ పూజ, దేవతాహ్వానం, శ్రీగోదా రంగనాథస్వామి తిరు కల్యాణం, రథోత్సవం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశారాధన, ధ్వజారోహణ, కుంభ సంప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ప్రముఖ వైష్ణవాలయం..


పదేళ్ల కాలంలో జిల్లాలోనే అత్యంత ప్రముఖ వైష్ణవాలయంగా మారింది. ఈ ఆలయాన్ని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. ఆలయ పునఃప్రతిష్టలో ప్రతిఒక్కరి సహకారం మరువలేనిది. కలిసికట్టుగా ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చారు.

– నర్సింహారెడ్డి, ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షుడు



ఆలయం పునర్‌నిర్మాణ దశలో ఉన్న సమయంలో (ఫైల్‌)

అందరూ సహకరించారు..


రంగనాథస్వామి ఆలయ పునర్నిర్మాణంలో అందరూ విశేషంగా సహకరించారు. 2012లో కొంతమంది గ్రామ యువకులతో కలిసి మా కుమారుడు శ్రీధరాచార్యులు ఆలయాన్ని పునరుద్ధరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి వైభవాన్ని రంగనాథస్వామి ఆలయం మళ్లీ సంతరించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఏటా ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతాయి.

– తిరుమల వింజమూరి రంగాచార్యులు, ఆలయ ధర్మకర్త

గతంలో జాతర జరిగేది..


నా చిన్నప్పుడు ఇక్కడ జాతర జరిగేది. చుట్టుపక్కల ఊళ్ల నుంచి భక్తులు ఎడ్ల బండ్లపై వచ్చేవారు. పదిరోజులపాటు జాతర ఉండేది. గుడి చుట్టూ అగ్రహారం ఉండేదని.. దాదాపు 30 బ్రాహ్మణ కుటుంబాలు ఉండేవని మా అమ్మ చెప్పేది. ఇక్కడ ఎంతో మంది పెళ్లిళ్లు చేసుకున్నారు. తర్వాత రోజుల్లో ఆలయ నిర్వహణ కష్టం కావడంతో బ్రాహ్మణ కుటుంబాలు వలస వెళ్లాయి. 12 ఏళ్ల కిందట గ్రామస్తులు, ధర్మకర్తలు భక్తులతో కలిసి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు.

– నారాయణరెడ్డి, శ్రీపురం

మహిళలకు కుట్టుమెషీన్ల కోసం డిప్యూటీ సీఎంతో మాట్లాడతా

కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే మా సంకల్పం: మహేశ్‌గౌడ్‌



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని మహిళలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ఫైనాన్స్‌ కార్పొరేషన్ల ద్వారా ఉచితంగా కుట్టుమెషీన్లు ఇచ్చే అంశాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చిస్తానని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ వ్యాఖ్యానించారు. తెలంగాణ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం కాంగ్రెస్‌ పార్టీ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లోని ప్రకాశం హాల్‌లో మదర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ బొజ్జా సంధ్యారెడ్డి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన 2 వేల మంది మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదర్‌ ఫౌండేషన్‌ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే కాంగ్రెస్‌ పార్టీ సంకల్పమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్య, టూరిజం డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌లో దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌. చిత్రంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్‌ షెకావత్‌, బండి సంజయ్‌, ఎంపీ ఈటల రాజేందర్‌, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తదితరులు


బుధవారం సికింద్రాబాద్‌ పరేడ్‌ గ్రౌండ్స్‌ నిర్వహించిన ‘హైదరాబాద్‌ లిబరేషన్‌ డే’ఉత్సవాల్లో ప్రదర్శిస్తున్న శకటాలు

సర్వీస్‌ టీచర్లకు టెట్‌ నుంచి మినహాయింపు ఇవ్వాలి

టీచర్స్‌ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: సర్వీస్‌లో ఉన్న టీచర్లు ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులవ్వాలనే నిబంధన నుంచి మినహాయింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డిని టీచర్స్‌ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌ రెడ్డి కోరారు. పీఆర్టీయూటీఎస్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్గం దామోదర్‌రెడ్డి, సుంకరి భిక్షంగౌడ్‌తో కలిసి ఆయన సీఎంను బుధవారం కలిశారు. టెట్‌ నిబంధనపై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ వేయాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో పీఆర్టీయూటీఎస్‌ ఆడిట్‌ కమిటీ చైర్మన్‌ సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.

పోలీస్‌ ఖాళీలపై ఏదైనా పిల్‌ దాఖలైందా?

పరిశీలించి చెప్పాలని రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రవ్యాప్తంగా పోలీసు శాఖలోని పోస్టులు భర్తీ చేయడం లేదంటూ ఏదైనా పిల్‌ దాఖలైందో.. లేదో.. తెలియజేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేస్తూ, ఆలోగా వివరాలు తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. పోలీసు పోస్టుల్లో 14 వేలకు పైగా పోస్టులను భర్తీ చేపట్టకపోవడాన్ని సవాల్‌ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కె.అఖిల్‌ శ్రీ గురుతేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అపరేశ్‌కుమార్‌ సింగ్‌, జస్టిస్‌ జీఎం మొహియుద్దీన్‌ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసు నియామకాలు చేపట్టకపోవడంతో శాంతిభద్రతలకు భంగం కలుగుతోందన్నారు. దర్యాప్తులు నత్తనడకన సాగుతున్నాయని, ప్రజాభద్రతకు ముప్పు ఉందని చెప్పారు. ఫిబ్రవరి 7 నాటికి పోలీసు శాఖలో మంజూరైన 91,183 పోస్టుల్లో 14,935 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇందులో డీజీపీలు 7, అదనపు డీజీపీ పోస్టులు 8, ఎస్పీలు 46, డీఐజీలు 4, సివిల్‌ కానిస్టేబుళ్లు 9,785, ఏఆర్‌ కానిస్టేబుళ్ల పోస్టులు 354 ఉన్నాయని తెలిపారు. పోలీస్‌ శాఖ ఖాళీలను పర్యవేక్షిస్తూ ఉండాలని హైకోర్టులకు సుప్రీంకోర్టు పలుమార్లు సూచించిందన్నారు. వాదనలను విన్న ధర్మాసనం.. సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా హైకోర్టు ఏదైనా సుమోటో పిటిషన్‌ విచారణకు స్వీకరించిందో లేదో చెప్పాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

స్పోర్ట్స్‌ అథారిటీని ప్రతివాదిగా చేర్చండి

రిజిస్ట్రీని ఆదేశించిన హైకోర్టు.. డీఎస్సీ పిటిషన్‌ వాయిదా

సాక్షి, హైదరాబాద్‌: డీఎస్సీ–2024 నియామకాలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో స్పోర్ట్స్‌ అథారిటీని ప్రతివాదిగా చేర్చాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్‌ 15కు వాయిదా వేసింది. 2024లో 11 వేల టీచర్స్‌ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ జారీ చేసింది. వీటిలో 96 ఎస్జీటీ పోస్టులను స్పోర్ట్స్‌ కోటా కింద కేటాయించారు. ఈ పోస్టుల నియామకంలో అవకతవకలు జరిగాయంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గండ్లగూడెంకు చెందిన టి.జోత్స్న పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్‌ పుల్ల కార్తీక్‌ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్‌ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 9 నెలల్లో అక్రమాలపై పునఃపరిశీలన చేస్తామన్న అధికారులు.. ఆ ప్రక్రియ పూర్తి చేయడంలేదన్నారు. పాఠశాల విద్యా శాఖ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. స్పోర్ట్స్‌ అథారిటీ అధికారులు జాబితాను పంపితే గానీ పరిశీలన చేయలేమని వారిని వివరాలు కోరినా సమర్పించలేదని తెలిపారు.

వివిధ జిల్లాల్లో ఎఫ్‌ఆర్‌ఎస్‌ అమల్లోకి రాకముందు, వచ్చిన తరువాత (ప్రస్తుత) టీచర్ల సగటు హాజరు శాతం వివరాలు..

జిల్లా	టీచర్లు	గతంలో హాజరు	ప్రస్తుతం	పెరిగిన శాతం
సూర్యాపేట	4,694	3,755	3,990	5.01
యాదాద్రి	3,578	2,315	2,543	6.36
నల్లగొండ	6,875	4,812	4,950	2.01
సిద్దిపేట	5,649	4,236	4,519	5
మెదక్‌	3,580	2,148	2,506	10
సంగారెడ్డి	5,301	3,180	3,710	9.99
భద్రాద్రి కొత్తగూడెం	4,298	3,180	3,524	8
ములుగు	1,595	1,100	1,217	7.95
మహబూబాబాద్‌	3,930	2,554	3,144	15.01
ఖమ్మం	5,825	5,534	5,362	2.95
గద్వాల	2,514	1,508	1,781	10.85
నాగర్‌కర్నూల్‌	3,560	2,997	3,304	8.61
నారాయణ్‌పేట్‌	1,879	1,150	1,335	71.04
నిర్మల్‌	3,112	1,945	2,334	9.83
ఆదిలాబాద్‌	3,098	1,858	2,650	25.52
మంచిర్యాల	3,209	2,201	2,310	71.98
ఆసిఫాబాద్‌	2,493	1,720	1,994	3.39
జగిత్యాల	2,572	1,596	2,089	19.16
రాజన్న సిరిసిల్ల	2,549	1,759	2,068	12.11
పెద్దపల్లి	2,723	2,450	2,505	2.01
నిజామాబాద్‌	6,536	4,973	5,195	3.39

అధికార సాధనే లక్ష్యంగా హోమం

బీజేపీ అధ్యక్షుడు ఎన్‌.రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావడం, దేశాన్ని ‘వికసిత్‌ భారత్‌’గా మార్చడమే లక్ష్యంగా హోమం నిర్వహించినట్టు బీజేపీ అధ్యక్షుడు ఎన్‌.రాంచందర్‌రావు తెలిపారు. మానవ కృషితో పాటు, దైవానుగ్రహం అవసరమని, అనేక ఏళ్లుగా కార్యకర్తల కృషితో పార్టీ నిర్మాణం సుస్థిరమైందన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో యువమోర్చా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో...విశ్వకర్మ జయంతి, ప్రధాని మోదీ 75వ పుట్టినరోజు సందర్భంగా ఓబీసీ మోర్చా, విశ్వకర్మ సెల్‌ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. మోదీ పుట్టినరోజు సందర్భంగా.. బీసీ కమిషన్‌ మాజీ చైర్మన్‌ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌ భాషల్లో రచించిన ‘నరేంద్ర మోదీ – విప్లవాత్మక ప్రపంచ నాయకుడు’పుస్తకాన్ని రాంచందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ ‘మోదీ బలహీన వర్గాలకు అండగా నిలిచి, సంక్షేమం, అభివృద్ధి, సమానత్వం అనే మూడు సూత్రాలను ఆయన పాలనలో సమన్వయం చేశారు’అని ప్రశంసించారు.

జలజల జలపాతం నువ్వు..



కొండల మధ్య నుంచి జాలువారుతున్న రంగినిగూడ జలపాతం

దట్టమైన అడవుల్లో గిరుల నడుమ.. వంపులు తిరుగుతూ పరుగులు తీస్తున్నాయి వాగులు. కొండలపై నుంచి పాలనురగలా జాలువారుతూ, పరవళ్లు తొక్కుతూ.. పర్యాటకుల హృదయాలను పరవశింపజేస్తున్నాయి జలపాతాలు. అల్లూరి సీతారామరాజు జిల్లా లోని మన్యం అందాలను ఆస్వాదించాలనుకునే ప్రకృతి ప్రేమికులకు 'రా రమ్మని' పిలుస్తున్నట్లుగా ఆహ్వానం పలుకుతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పులకించి, మరింత అందంగా కనువిందు చేస్తున్నాయి.

- ముంచంగిపుట్టు/రంపచోడవరం/మోతుగూడెం



558 అడుగుల ఎత్తునుంచి జాలువారుతున్న డుడుమ జలపాతం

గనుల శాఖ డైరెక్టర్‌గా ప్రవీణ్ కుమార్

సాక్షి, అమరావతి: ఇటీవల ఐఏఎస్‌ల బదిలీల్లో గనుల శాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను ఢిల్లీలోని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు గనుల శాఖ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించాల్సిందిగా సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ఉత్తర్వులు జారీ చేసింది.

సెర్ప్-అలీప్ మధ్య ఎంవోయూ

సాక్షి, అమరావతి: పారిశ్రామిక రంగంలో మహిళలను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సెర్ప్, అలీప్ మధ్య జరిగిన బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఎంవోయూ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఏపీ మహిళా పారిశ్రామికవేత్తల మండలి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ సంయుక్తంగా 'ర్యాంప్' కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన 35 బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్లకు మంత్రి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విద్యుత్ సంస్థలకు స్వతంత్ర డైరెక్టర్‌గా కిశోర్


సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ సంస్థలైన ఏపీ జెన్‌కో, నెడ్‌క్యాప్, ఏపీ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు స్వతంత్ర (ఇండిపెండెంట్) డైరెక్టర్‌గా కేవీ కిశోర్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఇటీవలే ఆయన ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

ఏపీ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా మోదీ జన్మదినం

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర శాఖ బుధవారం పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో బీజేపీ శ్రేణులు రక్తదాన శిబిరాలు నిర్వహించాయి. ప్రధాని జన్మదినం, విశ్వకర్మ జయంతి ఒకే రోజు సందర్భంగా గుంటూరు జిల్లా ఉద్దండ రాయునిపాలెంలో విశ్వకర్మలతో నిర్వహించిన యాగంలో బీజేపీ రాష్ట్ర నేతలు పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌కు పటిష్ట ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లో ఈ నెల 26 నుంచి నిర్వహించే బీచ్ ఫెస్టివల్‌కు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని మంత్రుల బృందం అధికారులను ఆదేశించింది. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పార్థసారథి, రవీంద్ర, అనగాని, గొట్టిపాటితో కూడిన బృందం ఈ నెల 26 నుంచి 28 వరకు సూర్యలంక బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించింది. పర్యాటకులకు ఆహ్లాదం కలిగించే విధంగా క్రీడలు, మౌలిక వసతులు కల్పించాలన్నారు.



ఆడబిడ్డకు మరణశాసనం!

- శ్రీకాళహస్తికి చెందిన ఓ జంటకు గతేడాది వివాహం జరిగింది. గర్భం దాల్చడంతో కుటుంబ పెద్దల లింగ నిర్ధారణ పరీక్షల కోసం స్థానికంగా ఉన్న ఓ డాక్టర్‌ను సంప్రదించారు. తమకు తొలి సంతానం పురుషుడు కావాలని చెప్పారు. వెంటనే ఆ వైద్యుడు ఆమెకు పరీక్షలు నిర్వహించి కడుపులో పెరుగుతోంది బాలిక ఆనవాళ్లు అని నిర్ధారించి కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో లింగ నిర్ధారణకు రూ. 45 వేలు, గర్భస్రావానికి సుమారు రూ. 35 వేలు దండుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో అధికారులు ఆ డాక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.
- నాయుడుపేటకు చెందిన ఓ జంటకు ఇప్పటికే ఇద్దరు బాలికలు పుట్టారు. తమకు వంశోద్ధారకుడు కావలంటూ మూడవసారి ప్రెగ్నెన్సీ కావడంతో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. దీంతో మూడవ సారి సైతం బాలిక పుట్టే ఆనవాళ్లు ఉన్నాయంటూ సంబంధిత పరీక్షా కేంద్రాలకు చెందిన డాక్టర్లు నిర్ధారించారు. దీంతో ఆమెకు గర్భస్రావం చేయాలని బంధువులు కోరారు. దీంతో పరీక్షించి డాక్టర్లు ఆ మాతృమూర్తి బంధువుల నుంచి వేలకు వేలు దండుకుని పని పూర్తి చేశారు.



అమ్మగా.. అక్కగా.. చెల్లిగా..అర్ధాంగిగా.. చెయ్యిపట్టి నడిపించే ఆడబిడ్డకు కడుపులోనే మరణ శాసనం లిఖిస్తున్నారు. ఆడపిల్ల భారమనుకునే రోజుల నుంచి ఆడబిడ్డ కోసం ఎదురుచూసే రోజులు వచ్చినా తిరుపతి జిల్లాలోని కొన్ని మండలాల్లో ఆడపిల్లల లింగ నిష్పత్తి గణనీయంగా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. భ్రూణ హత్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. లింగ నిర్ధారణ మాఫియా రెచ్చిపోతున్నా వైద్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులోనే జోగుతుండడం విస్మయానికి గురిచేస్తోంది.

పెరుగుతున్న భ్రూణ హత్యలు

- రెచ్చిపోతున్న లింగ నిర్ధారణ మాఫియా
- ఆందోళనకరంగా బాలికల నిష్పత్తి
- గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు

సాక్షి ప్రతినిధి తిరుపతి : అయ్యో.. మాతృమూర్తుల కడుపులు చిదిమేస్తున్నారే... ప్రెగ్నెన్సీ అయిన నవ వధువులను సైతం వదలకుండా తొలి ప్రసవంలోనే మగబిడ్డ పుట్టాలంటూ స్కానింగ్ చేయించి రక్త ముద్దలపై దాడిచేసి హత్య చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో రోజు రోజుకు విచ్చలవిడిగా భ్రూణ హత్యలకు పాల్పడుతున్నా మామూళ్లకు అలవాటు పడ్డ ప్రభుత్వాధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ఆధ్యాత్మిక నగరం తిరుపతితో పాటు, దేశంలోనే పేరొందిన శైవక్షేత్రం శ్రీకాళహస్తిలో సైతం బాలికల సంఖ్య రోజురోజుకు పడిపోతోంది. లింగనిర్ధారణ పరీక్షా కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో విచ్చల విడిగా ఏర్పాటు చేసుకుని కోట్ల వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులకు ముడుపులు ముట్టచెప్పి లింగనిర్ధారణ పరీక్షల మాఫియా రెచ్చిపోతున్నా పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో భ్రూణ హత్యలు రోజుకు పదుల సంఖ్యలో జరుగుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. ఈ విషయంపై వైద్య శాఖలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సైతం చర్చించుకుంటున్నారు.

వంశోద్ధారకుడు కావాలనే మూఢ నమ్మకం..

ముందు మగబిడ్డ పుడితే చాలు.. ఆ తర్వాత ఎవరూ పుట్టినా పర్వాలేదు. మళ్లీ మగ బిడ్డ పుడితే ఇంకా మేలే.. ఒకవేళ ఆడ బిడ్డ పుట్టినా.. కొడుకూ, కూతురు పుట్టిందని సంబర పడిపోతాం.. ఇదీ ప్రస్తుత సమాజంలో పిల్లలు కావాలంకుంటున్న తల్లిదండ్రుల పరిస్థితి. ముందు కొడుకు పుట్టి మరో సంతానంగా కూతురు పుడితే అక్కడితో ఆపేస్తున్నారు. అలా కాకుండా ముందు ఎంత మంది కూతుళ్లు పుట్టినా కొడుకు కోసం కొందరు ఆరాటపడుతున్నారు. ఇంకొందరు కొడుకుల కోసం ఆడ నలుసులను గర్భంలోనే నులిమేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే శ్రీకాళహస్తి ప్రాంతంలో వీధికో గాథ బయటపడుతోంది. ఇలా ఆడ నలుసు పురిటిలో కళ్లు కూడా తెరవకముందే భ్రూణ హత్యలకు గురవుతుంటే మరో పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత అంటూ సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇకనైనా వైద్య శాఖ నిద్ర మేల్కొని లింగ నిర్ధారణ, గర్భ స్రావాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పడిపోతున్న బాలికల జనన రేటు

జనగణన 2018 ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెయ్యి మంది బాలురకు 922 మంది బాలికలు ఉన్నారు. అదే 2021 లెక్కలకొచ్చేసరికి ఈ సంఖ్య 901కి పడిపోయింది. జిల్లాల విభజన అనంతరం 2024లో జరిగిన జనగణన లెక్కల ప్రకారం తిరుపతి జిల్లాలో బాలికల సంఖ్య స్వల్పంగా పెరిగి 916కు చేరింది. అయితే శ్రీకాళహస్తిలో మాత్రం జిల్లా నిష్పత్తికి వ్యతిరేకంగా నానాటికీ బాలికల నిష్పత్తి తగ్గుతూ వస్తోంది. బాలురు - బాలికల నిష్పత్తిలో తీవ్ర వ్యత్యాసం నమోదైన ప్రాంతాలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రభుత్వ విభాగాలను భాగస్వామ్యం చేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తేనే బాలికల నిష్పత్తి పడిపోకుండా ఆపగలమని మేధావులు సూచిస్తున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో తొలి సంతానం మగబిడ్డ పుట్టగానే కుటుంబ నియంత్రణ పాటిస్తున్న కుటుంబాలు ఎక్కువగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

మొద్దునిద్రలో వైద్యాధికారులు

తిరుపతి జిల్లాలో బాలురు- బాలికల నిష్పత్తి దారుణంగా ఉందన్న విషయాన్ని కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో సాక్షాత్తు జిల్లా కలెక్టరే ఈ అంశాన్ని బహిర్గతం చేయడం గమనార్హం. ఆరేళ్లలోపు బాలల్లో బాలికలు అతి తక్కువగా ఉన్న మండలాల్లో తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు ఉన్నట్లు సమాచారం. మూడు నెలల కిందట స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అడ్వయిజరీ కమిటీ సమావేశంలో సైతం ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ఇదే అంశాన్ని లేవనెత్తారు. అయినా వైద్యాధికారుల్లో ఎలాంటి చలనం లేకపోవడంతో పెద్ద ఎత్తున భ్రూణ హత్యలు చోటు చేసుకున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ లింగ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్న నిబంధనను అధికార యంత్రాంగం ఆచరణలో పెట్టకపోవడంతో ఆడ నలుసు అమ్మ గర్భంలోనే అంతమైపోయే పరిస్థితి ఏర్పడింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆడ-మగ నిష్పత్తి వెయ్యికి తొమ్మిది వందలు ఉండగా శ్రీకాళహస్తిలో మాత్రం వెయ్యికి 629 మందే ఆడ బిడ్డలే ఉండటం ఇందుకు నిలువెత్తు సాక్ష్యం.

రూ.కోట్లలో వ్యాపారం

లింగ నిర్ధారణ పరీక్షలు అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. దళారులు గర్భిణులను, సంబంధీకులను గుట్టుగా తిరుపతి, గూడూరు తీసుకెళ్తున్నారు. అక్కడికి వెళ్లాక ఒప్పందం కుదుర్చుకున్న ఆసుపత్రికి సమాచారం అందిస్తారు. గర్భిణితో ఎక్కువ మంది రాకుండా, ఆమెతోపాటు మరొకరిని వెంటబెట్టుకుని ప్రత్యేక వాహనంలో తరలిస్తారు. ఆస్పత్రి పేరుగానీ, చిరునామాగానీ ఎలాంటివి చెప్పకుండానే తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి పుట్టబోయేది ఆడ.. మగ చెప్పి రిపోర్టులు చేతికి ఇవ్వకుండా పంపేస్తున్నారు.



విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు



పేదల మూఢ నమ్మకాలను ఆసరాగా చేసుకుని శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరుల్లో.. లింగ నిర్ధారణ పరీక్షల నిర్వాహకులు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో బాలికల నిష్పత్తి లింగ నిర్ధారణ పరీక్షల కారణంగానే గణనీయంగా తగ్గిపోతుందన్న విమర్శలు వస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని కొన్ని స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15 నుంచి రూ. 20 వేలు ఫీజులు తీసుకుంటున్నట్లుగా చెప్పుకుంటున్నారు. అదేవిధంగా నాయుడుపేట, గూడూరు కేంద్రంగా లింగ నిర్ధారణ పరీక్షలు పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. గూడూరు పట్టణంలోని పేరుగాంచిన ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు నడుపుతున్న నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షల పేరుతో కోట్లు గడిస్తున్నారని చెప్పుకుంటున్నారు. ఆ ఫలితమే భ్రూణ హత్యలకు కారణమవుతున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమై ప్రైవేటు నర్సింగు హోముల్లో, స్కానింగ్ సెంటర్లలో విరివిగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గర్భస్రావాలకు ప్రత్యేక ధర

లింగ నిర్ధారణ స్కానింగ్ కోసం సుమారు రూ.25 నుంచి రూ. 30 వేలు వసూలు చేస్తుండగా గర్భస్రావం చేయించేందుకు మరో రేటు తీసుకుంటున్నారు. తిరుపతిలో అయితే రూ.25 వేలు, గూడూరు, శ్రీకాళహస్తి, నాయుడుపేట ఇతర ఆసుపత్రుల్లో రూ.20 వేలు తీసుకుంటున్నట్లు తెలిసింది. కొన్ని ఆసుపత్రులు ఈ దందాను గుట్టుగా సాగిస్తున్నాయి. గర్భం దాల్చిన 20 వారాల తర్వాత గర్భ విచ్ఛిత్తి చేయడం అత్యంత ప్రమాదకరం. అందుకే ప్రభుత్వాలు కఠిన నిబంధనలు, చట్టాలు తీసుకొచ్చాయి. కొందరు ధనార్జన కోసం ఇష్టారీతిగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలతో గర్భస్రావాలు ఎక్కువగా చేస్తున్నారు. ఈ ప్రభావం లింగ నిష్పత్తిపై పడుతోంది. ముఖ్యంగా గూడూరు, తిరుపతి నగరాల్లో ప్రసూతి ప్రైవేటు ఆసుపత్రుల కేంద్రంగా ఈ దందా సాగుతున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తాం

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో దీనిపైన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీలో స్పెషలిస్ట్ డాక్టర్లు జిల్లా అధికారులు నియోజకవర్గ స్థాయి వైద్యాధికారి ఈ కమిటీలో ఉంటారు. సమగ్రంగా దీనిపైన విచారించి ఒక నెల రోజుల్లో కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తాం. గతంలో ఈ విధంగా స్కానింగ్ చేస్తూ దొరికిన ఓ ప్రైవేటు ఆసుపత్రిని సీజ్ చేసి మిషన్లు కూడా స్వాధీనం చేసుకున్నాం. వారిపై కేసులు నమోదు చేయడం జరిగింది. తప్పు చేసినట్టు తెలిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తాం.

– డాక్టర్ బాలకృష్ణ నాయక్, డీఎంహెచ్‌ఓ, తిరుపతి

కురులు.. సిరులు



శ్రీ రెడ్డెమ్మతల్లి మూలవిరాట్

భక్తుల కురులు సిరులు కురిపిస్తున్నాయి. రెడ్డెమ్మ తల్లి ఆలయ తలనీలాలు ఎక్కువ ధర పలుకుతున్నాయి. విదేశాలకు సైతం ఎగుమతి అవుతున్నాయి. వేలంపాటలో పాటాదారులు పోటాపోటీగా పాల్గొంటున్నారు. అధిక రేటు హెచ్చించి కైవసం చేసుకుంటున్నారు. దేవస్థానానికి ఏటా భారీ ఆదాయం సమకూరుతుండటం విశేషం.



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

- రెడ్డెమ్మకొండ తలనీలాలకు భారీ డిమాండ్
- చైనాకు ఎగుమతి
- రికార్డు స్థాయిలో వేలం

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లాలోనే సంతాన దేవతగా ప్రసిద్ధి పొందిన శ్రీ రెడ్డెమ్మ తల్లి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి చైనాతోపాటు ఇతర దేశాలకు తలనీలాలు ఎగుమతి చేస్తుంటారు. నాణ్యమైన తలనీలాలు ఇక్కడ లభించడమే బయట దేశాల్లో డిమాండ్‌కు కారణం. ఈ నేపథ్యంలో పాటాదారులు పోటాపోటీగా వేలంలో అధిక ధర పెట్టి తలనీలాలు దక్కించుకుంటున్నారు. రెడ్డెమ్మకొండకు వచ్చే భక్తులంతా ఎక్కువగా సంతాన కోసం వచ్చేవారే. అందరూ 22 నుంచి 45 ఏళ్ల వయసులోపు మహిళలే కావడం విశేషం. ఇక్కడి ఆలయ పరిసరాల్లో పంపిణీ చేసే ఆకు పసరును సేవించి.. అమ్మవారి ఎదుట వర పడితే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. కోర్కెలు తీరిన మహిళలతోపాటు వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి భక్తితో తలనీలాలు సమర్పిస్తుంటారు. అందరూ యుక్త వయసులో ఉన్న వారు కావడంతో.. వారి తలనీలాలు ఎంతో నాణ్యమైనవిగా ఉంటాయనేది వ్యాపారుల నమ్మకం. అందువల్ల రెడ్డెమ్మకొండలోని తలనీలాలు ఎక్కువ ధర పలుకుతుంటాయి. దీంతో ఇక్కడి ఆలయంలోని తలనీలాలకు భారీ డిమాండ్ ఉంది.

కిలో తలనీలాలు రూ.60 వేలు



భక్తులు సమర్పించిన నాణ్యమైన పొడవాటి జుట్టు

ప్రస్తుతం తలనీలాలు మార్కెట్లో కిలో రూ.60 వేల వరకు ధర ఉంది. గతంలో కిలో ధర రూ.30 వేలు నుంచి రూ.40 వేల వరకు మాత్రమే ఉండేది. అయితే తలనీలాలకు మార్కెట్లో ఉన్న డిమాండ్ దృష్ట్యా.. మన దేశంతోపాటు విదేశాల్లోనూ ఒక్కసారిగా ధరలు పెరిగిపోయాయి. దీంతో వ్యాపారులు ఎగబడి తలనీలాల వేలంపాటలో పాల్గొనడం విశేషం.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథిగృహం వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,607 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 23,856 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.87 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామివారిని దర్శించుకోగలుగుతున్నారు.

సూర్యప్రభ వాహనం ట్రయల్ రన్ విజయవంతం

తిరుమల: తిరుమలలో అధికారులు బుధవారం సూర్యప్రభ వాహనం ట్రయల్ రన్ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో వినియోగించే సూర్యప్రభ వాహనం పటిష్టతను పరిశీలించేందుకు ఈ ట్రయల్ రన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. వాహనం అంతా బాగుందని బ్రహ్మోత్సవాల్లో విజయవంతంగా వినియోగించవచ్చునని తెలియజేశారు.

రిలీవ్ కాని ఉపాధ్యాయులకు న్యాయం చేయండి

సాక్షి, అమరావతి: బదిలీల్లో రిలీవ్ కాని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సి.వి.ప్రసాద్ విద్యా శాఖను కోరారు. రిలీవ్ కాని ఉపాధ్యాయుల ఖాళీలను డీఎస్సీ ద్వారా వచ్చే కొత్త ఉపాధ్యాయులకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

- డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వడానికి ముందు హైస్కూల్ ప్లస్‌ల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను శాశ్వత ప్రాతిపదికన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతుల ద్వారా కల్పించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, పి.నరోత్తమరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దసరాకు మధ్యంతర భృతి ప్రకటించండి

దసరా కానుకగా 30% మధ్యంతర భృతి (ఐఆర్) వెంటనే ప్రకటించాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నియమించిన పీఆర్సీ కమిషన్ ఛైర్మన్ విధులు నుంచి తప్పుకుని ఏడాది దాటినా కొత్త కమిషన్ వేయకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అలాగే ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కూడా దసరాకు 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేసింది.

బకాయిలు వెంటనే చెల్లించాలి: ఆప్టా

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏపీ ప్రైమరీ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణపతిరావు, ప్రకాష్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఆర్సీ, డీఏ, ఎరియర్స్ పెండింగ్‌లోనే ఉన్నాయని, దసరాకు 2 డీఏలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.







● ఆషాఢమాసంలో శాకాంబరీ మాతగా దర్శనమిచ్చిన అమ్మ వారు



కొలిచిన వారికి బంగారు తల్లి



ఇంతగా ప్రసిద్ధి పొందిన ఈ దేవాలయం స్థలపురాణంలోకి వెళితే...

పూర్వం ఇక్కడి భద్రాద్రికొత్త గూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం-జగన్నాథపురం గ్రామాల మధ్యలో ఖమ్మం-భద్రాచలం వెళ్లే రాజ మార్గం సమీపంలో ఒక పెద్దపులి సంచరిస్తూ ఉండేది. ఆ పెద్దపులి రాజమార్గం సమీపంలో గల ఒక చింతచెట్టు కింద విశ్రాంతి తీసుకుంటూ సమీప గ్రామ ప్రజలకు ఎలాంటి హానీ తలపెట్టకుండా సాధు జంతువులా సంచరిస్తూ ఉండేది. ఈ పెద్దపులిని గ్రామ ప్రజలు, బాటసారులు రాజమార్గాన ప్రయాణించే వాహనదారులు వనదేవతగా, శ్రీకనకదుర్గ అమ్మవారి వాహనంగా భావించి భక్తితో పూజించేవారు. అలా ప్రణమిల్లిన వారి మనోభావాలు, వాంఛలు నెరవేరుస్తూ కాలక్రమంలో ఆ పులి అదృశ్యం కావడంతో చింతచెట్టు కింద అమ్మవారి ఫొటోను పెట్టి గ్రామప్రజలు పూజించేవారు.

1961-62లో శ్రావణపు వెంకటనర్సయ్య అమ్మవారి దేవాలయం నిర్మించేందుకు కొంత స్థలం దానం ఇవ్వగా.. కంచర్ల జగ్గారెడ్డి భక్తుల ఆర్థిక సహాయ సహకారాలతో శ్రీ పెద్దమ్మతల్లికి దేవాలయం నిర్మించి శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటినుంచి స్మార్త సంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ విధంగా వన దేవత అయిన శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఆది, గురువారాలలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వివాహాది శుభకార్యాలు ఏవైనా ఇక్కడే..

శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో భక్తులు ప్రత్యేక పూజాకార్యక్రమాలను ప్రతినిత్యం నిర్వహిస్తుంటారు. అంతేకాక ప్రతియేటా అమ్మవారి ఆలయంలో వివాహాది శుభకార్యాలు జరుగుతూ ఉంటాయి. పిల్లలకు బారసాల, అన్నప్రాశన, అక్షరాభ్యాసం, పుట్టిన రోజు, పెళ్లిరోజు, పదవీ విరమణ కార్యక్రమాలు... ఇలా ఏ శుభకార్యమైనా అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తుండడం ఆనవాయితీ. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన ప్రత్యేక 'పొంగల్ షెడ్'తోపాటు ప్రైవేటు వారి నిర్వహణలో ఉన్న వివిధ ఫంక్షన్ హాళ్లలో నిత్యం ఏదో ఒక శుభ కార్యాలు జరుగుతూనే ఉంటాయి.

నవరాత్రులు ప్రత్యేకం..

పెద్దమ్మతల్లి దేవాలయంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించి.. అన్ని రకాల పూజలు చేస్తారు. దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీ లలితాదేవి, శ్రీ గాయత్రి దేవి, శ్రీ మహాలక్ష్మి దేవి, శ్రీ కనకదుర్గాదేవి, శ్రీ సరస్వతి దేవి, శ్రీ అన్నపూర్ణాదేవి, శ్రీ మంగళ గౌరీ దేవి, శ్రీ మహిషాసుర మర్ధనీదేవి అలంకారాలు నిర్వహించి.. విజయదశమి రోజు అమ్మవారికి గ్రామ సేవ, శమీపూజలు నిర్వహిస్తుంటారు. ఇక ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఎవరు వాహనం కొనుగోలు చేసినా ముందు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకపూజ చేయించాల్సిందే. నవరాత్రుల సమయంలో ఆయుధపూజ రోజున ప్రత్యేకంగా వేలాది వాహనాలకు పూజలు చేయించడం విశేషం. ఇక్కడ పూజలు చేయిస్తే ఎటువంటి ఆటంకాలు, అవరోధాలు లేకుండా ప్రయాణం సాగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. సమీప ప్రాంత రైతులు అమ్మవారికి పూజ చేసిన తర్వాతే వ్యవసాయ పనులను ప్రారంభిస్తుంటారు.

'పెద్దమ్మతల్లి అంటేనే అందరికీ పెద్ద దిక్కు.. ఆ తల్లి ఆశీస్సులు ఉంటే ఏ పనైనా ఇట్టే జరిగిపోతుంది. భక్తుల పాలిట కొంగుబంగారమై విలసిల్లుతున్న ఆ తల్లి నేనున్నానంటూ అందరికీ దీవెనలందిస్తోంది' ఇదీ భక్తుల నమ్మకం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి నిత్యం భారీ సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ఆదివారం అయితే వేల సంఖ్యలోనే వస్తారు. కొత్తగూడెం-భద్రాచలం ప్రధాన రహదారిపై పెద్దమ్మతల్లి(కనకదుర్గమ్మ) ఆలయం ఉంటుంది. ఆ రహదారిపై వెళ్లే ప్రతి ఒక్కరూ అమ్మవారికి నమస్కరించనిదే వెళ్లరంటే అతిశయోక్తి కాదు.







ఆలయ విశేషాలు..

అమ్మవారి ఆలయ ప్రాంగణంలో రావిచెట్టు, వేపచెట్టు కలిసి ఉంటాయి. ఈ మహావృక్షాన్ని శ్రీ లక్ష్మీనారాయణ స్వరూపాలుగా భక్తులు భావిస్తారు. ఈ వృక్షానికి ఊయలకట్టి చుట్టూ ప్రదక్షిణ చేస్తే సంతానం లేని మహిళలు గర్భం దాలుస్తారని, అష్టైశ్వర్యాలు, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ప్రతి ఏటా ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను కూడా ఇక్కడ ఘనంగా నిర్వహిస్తుంటారు.

బస్సు మార్గం..

హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, వరంగల్ నుంచి భద్రాచలం, మణుగూరు వెళ్లే ప్రతి బస్సు అమ్మవారి ఆలయం ముందు నుంచే వెళ్తాయి. భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, మణుగూరు డిపోలకు చెందిన బస్సులు ప్రతినిత్యం ఈ రహదారిలో ప్రయాణిస్తూ ఉంటాయి.

రైలు మార్గం..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి కొత్తగూడెం(భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్) వరకు రైలు సౌకర్యం ఉంది. ఖమ్మం వరకు రైలు మార్గం ఉంది. ఖమ్మం నుంచి 100 కి.మీ., కొత్తగూడెం నుంచి నుంచి 20 కి.మీ. దూరంలోగల అమ్మవారి ఆలయం మీదుగా నిత్యం బస్సులు తిరుగుతుంటాయి.

– గగనం శ్రీనివాస్, సాక్షి పాల్వంచ రూరల్

● ధర్మ సందేహం

ప్రతి ఇంట్లో తప్పకుండా ఉండవలసిన చిత్రపటం ఏది?

శ్రీరామ పట్టాభిషేకం మూర్తి ప్రతి ఇంటిలోనూ ఉండాలి. ఎందుచేత అంటే ప్రణవాన్ని పిల్లలు, స్త్రీలు, పలకకూడదు.

కానీ 'ఓం'కారాన్ని తీసుకువచ్చి ఇంట్లో పూజ చేయడానికి తేలిక మార్గం ఏమిటంటే శ్రీరామ పట్టాభిషేకం.



పట్టాభిషేకంలో అందరూ ఉన్నా మనం ఇంట్లో పెట్టుకునే పట్టాభిషేక మూర్తిలో నలుగురే ఉంటారు – సీతారాములు, లక్ష్మణస్వామి, కాళ్ళ దగ్గర హనుమ. రాముడు అకారానికి ప్రతినిధి,

యో వేదాదౌ స్వరః ప్రోక్తః! వేదాంతేచ ప్రతిష్ఠితః!.

అకారం విష్ణువు అయితే ఉకార మకారములు లక్ష్మణస్వామి, సీతమ్మ.


'మ్' అనే నాదస్వరూపం వాయుపుత్రుడైన హనుమ.

అకార ఉకార మకార నాద స్వరూపమైనటువంటి హనుమతో కలిపి ఓంకారమే ఇంట్లో సీతారామచంద్ర మూర్తి పట్టాభిషేక మూర్తిగా ఉంటుంది. ఆయనకి పూజ చేయడానికి వాళ్ళు చేయవచ్చా? వీళ్ళు చేయవచ్చా? అని అభ్యంతరం ఉండదు. కాబట్టి ఓంకారానికి పూజ చేయడం ఎంత గొప్పదో పట్టాభిషేకానికి పూజ చేయడం అంత గొప్పది.

● ఇస్లాం వెలుగు

అమ్మను మించిన ప్రేమ

పూర్వకాలంలో ఒక మనిషి ఏదో ఊరుకు వెళుతున్నాడు. సుదూరప్రయాణం. ప్రయాణానికి అవసరమైన సరంజామా అంతా సర్దుకున్నాడు. ఆహారం, నీళ్ళు, దుస్తులు, పైకం అంతా వాహనం పైనే సర్దేశాడు. కొండలు, కోనలు, అడవి మార్గాన ప్రయాణం సాగుతోంది. మార్గమధ్యంలో అనూహ్యంగా ఒంటె తప్పిపోయింది. చుట్టూదట్టమైన అడవి. అంతా కీకారణ్యం. కనుచూపుమేర ఎక్కడా జనసంచారమే లేదు. ఒంటరిగా, సాధ్యమైనంతమేర అడవి అంతా గాలించాడు. కాని ఒంటి ఆచూకీ దొరకలేదు. ఆహారం, తాగునీరు, దుస్తులు, పైకం అన్నీ దానిపైనే ఉన్నాయి. కనీసం గొంతుతడుపుకుందామన్నా చుక్కనీరులేదు. ఆకలి..దాహం.. అలసట.. భయం..ఒంట్లో ఏమాత్రం సత్తువ లేదు. నీరసం ఆవహించింది. ఏం చేయాలో అర్థంకావడం లేదు. వెదికే ఓపిక లేదు. కాళ్ళు తడబడుతుండగా ఆ వ్యక్తి ఓ చెట్టుకింద కూలబడ్డాడు. బాగా అలసిపోయి ఉండడం వల్ల కళ్ళు మూతలుపడ్డాయి. నిద్రముంచుకొచ్చేసింది. క్షణాల్లో గాఢనిద్రలోకి జారుకున్నాడు.



తరువాత కళ్ళు తెరిచేసరికి ఎదురుగా తప్పిపోయిన తన ఒంటె దర్శనమిచ్చింది. నీరు, ఆహారం, దుస్తులు, పైకం అన్నీ పదిలంగా ఉన్నాయి. ఆశ్చర్యం.. ఆనందం.. తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు.. ఇదికలా.. నిజమా..? అన్నసంశయంలో పడిపొయ్యాడు. కొన్ని క్షణాలపాటు అతనికేమీ అర్థం కాలేదు. చివరికి కలకాదు నిజమే అని నిర్ధారించుకున్నాడు. ముహమ్మద్ ప్రవక్త వారు ఈసంఘటనను సహచరులకు వినిపించి 'ఆవ్యక్తి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది?' అని ప్రశ్నించారు. 'దైవప్రవక్తా.! ఆవ్యక్తి ఆనందానికి అవధులే ఉండవు. జీవితంపై ఆశలు వదులుకున్న అతను ఎంతగా సంతోషిస్తాడో మేము మాటల్లో చెప్పలేము. అతని మానసిక ఆనందాన్ని వర్ణించడం ఎవరితరమూ కాదు. అమితమైన సంతోషంతో అతని హృదయం ఉప్పొంగి, ఆనంద తాండవం చేస్తుంది.' అని విన్నవించారు సహచరులు.

అప్పుడు ప్రవక్తమహనీయులు, ''దారితప్పిన ఒకవ్యక్తి నిజం తెలుసుకొని, సన్మార్గం అవలంబించి తన వైపుకు మరలినప్పుడు దైవం కూడా అలాగే సంతోషిస్తాడు. తన దాసుల్లో ఏ ఒక్కరూ నరకంలోకి పోవడాన్ని అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు. అందుకే ఆయన మానవుల మార్గదర్శకం కోసం అనేక ఏర్పాట్లు చేశాడు. కనుక మానవులు తమ తప్పు తెలుసుకొని, మంచిమార్గం వైపు మరలితే అల్లాహ్ ప్రేమకు, ఆయన కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులై ఇహ, పరలోకాల్లో సాఫల్యం పొందవచ్చు'' అని బోధించారు.


పరాత్పరుడైన దైవం మనందరికీ రుజుమార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.!

– ముహమ్మద్ ఉస్మాన్‌ఖాన్

● సువార్త

క్రీస్తు కనికరము... సమాధానము

సమాధానం, కనికరాలతో యేసుక్రీస్తు యూదా జనానికి అద్భుతాలు చూపించాడు. ఉదాహరణకు కానా అను ఊరిలోకి తన తల్లియైన మరియమ్మతో పెండ్లి విందుకు వెళ్లి, వారి సాంప్రదాయం ప్రకారం యిస్తున్న ద్రాక్షారసం అయిపోగా... తొట్టి నీళ్ళను ద్రాక్షారసంగా మార్చి, విందుకు వచ్చిన వారు ఇలాంటి రుచికరమైన ద్రాక్షారసం ఏనాడూ తాగలేదనేటట్లు చేశాడు. వేరొక మరియ ఆమె సహోదరియైన మార్తల సహోదరుడు చనిపోయి నాలుగు రోజులు సమాధిలో వున్న 'లాజరు' సమాధి నుండి పునర్జీవునిగా జీవమిచ్చాడు. ఈ సంగతి ఓర్వలేని యూదులు అసూయతో, మత ఛాందసవాదులు, మోషే ధర్మ శాస్త్రాన్ని అనుసరించడం లేదని, దేవదూషణ చేశాడన్న నేరారోపణ చేసి సిలువకప్పగించారు.



ఆ విధంగా ఎవరిని బ్రతకనిచ్చారు ప్రజలు? ఆయన నరావతారాన్ని సమాప్తం చేసి, ఆత్మను దేవునికి అప్పగించి, దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడయ్యాడని బైబిల్ చెప్తుంది.

పట్టుదల కలిగియున్నప్పుడు దేవుడు ఆశీర్వదిస్తాడు. దేవుడు విశ్వాసులకు, శిష్యులకు నేర్పినది సమాధానము. ఆ విధంగా యేసుక్రీస్తును, శాస్త్రులును, పరిసయ్యులును, అధికారులు సిలువ వేసినా 'తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక క్షమింపుడు' అని పరమ తండ్రిని వేడుకున్నాడు. నీ సహోదరునితో సమాధానము పడకపోతే దేవునికి అర్పించు. అర్పణలు ఏ విధంగా అంగీకరింపబడలేదో ప్రార్థనలు కూడా అంగీకరింపబడవని వాక్యము బోధిస్తున్నది. కావున శిష్యత్వమునకు ఉండాల్సిన లక్షణాలు ఏమనగా కనికరము, సమాధానము, శాంతి, ప్రేమ, పట్టుదల, క్షమించే గుణాలే. కనికరము గలవారు ధన్యులు, వారు కనికరము పొందుదురు. (మత్తయి 5: 7).

సువార్త సేవలో శ్రమలు, బాధలు భరించాలి. (2వ కొరంధి 11 : 21-31). అంతము వరకు సహించువాడు దేవునిరాజ్య వారసులుగుదురు గాక!

– కోట బిపిన్ చంద్రపాల్

● సుగ్రంథం

అరచేతిలో ఇమిడిపోయేలా లలితా సహస్ర నామాలు.. అర్థాలు



నిత్యజీవితంలో రోజు చదువుకుని పారాయణ చేసే లలితాసహస్రనామలలోని నామాలకు గల అంతరార్థం తెలుసుకుని చదవడం ద్వారా ఆ లలితాదేవిని చేరడం ఎంతటి సులభమో మనలో ఉన్న అంతర్ముఖ దైవిక శక్తిని వెలికితీసి మోక్షమార్గం వైపు నడిచేలా చేయడానికి జరిగిన ఓ చిరుప్రయత్నమే ఈ 'లలితా సహస్రనామార్థ కనకవల్లి' ఇది ప్రధానంగా మూడు విధాలుగా చదువుకునేలా ఆలోచించి రూపొందించిన గ్రంథం. అది నామావళిగా చదువుకోవడానికి, సులభంగా అర్థం తెలుసుకునే అర్థవివరణ, స్తోత్రంలో ఏ నామాన్ని ఎక్కడ విడదీసుకోవాలి అనే రకమైన విభజనతో ఉండటం వల్ల పుస్తకానికి మరింత పఠనీయత చేకూరినట్లయింది. ఇంకో సౌలభ్యం ఏమిటంటే... హాయిగా అరచేతిలో ఇమిడేవిధంగా రూపొందించడం. రానున్నవి దేవీ నవరాత్రులు. ఈ సందర్భంగా ఇటువంటి పుస్తకాలు వెలువడటం అమ్మవారిని పూజించుకునే భక్తులకు మార్గం సులభతరం చేయడానికే అన్నట్లే అనిపిస్తుంది.


శ్రీలలితా సహస్ర నామార్థ కనకవల్లి
సంకలనం: శ్రీమతి తెన్నేటి వల్లీ కనకమహాలక్ష్మి
పుటలు: 233; వెల: రూ. 100, (తపాలా ఖర్చులు అదనం)
ప్రతులకు: ఇం.నెం. 76, గాయత్రీనగర్ కాలనీ ఆనాజ్ పూర్ గ్రా.,రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద, అబ్దుల్లాపూర్ మెట్ మం. రంగారెడ్డిజిల్లా -501512, చరవాణి: 9490192962

● మంచి మాటలు

● మితిమీరిన నమ్మకం చాలా ప్రమాదం... నమ్మకం ఎంత బలపడితే నమ్మకద్రోహం అంత గట్టిగా తగులుతుంది.!!

● కష్టాలు కన్నీళ్ళనే కాదు నిజాలను బయటకు రప్పిస్తుంది, దాపరికాల ముసుగును తొలగిస్తుంది... వాస్తవాలను వెలుగు చూసేలా చేస్తుంది... కష్టం కూడా ఒక మంచి స్నేహితుడే... మనలో ధైర్యాన్ని... మన సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది... మన భవిష్యత్తుకు... గమ్యాన్ని వెతికేలా చేస్తుంది.!!

ప్రార్థన అంటే..?



ప్రార్థన అనేది నోటితో అనేదీ కాదు. లోపల్లోపల అనుకునేదీ కాదు. మనసుతో చేయాలి ప్రార్థన. ప్రార్థన మనసులో మెదలి నప్పుడు ప్రేమ జాలువారాలి. ఆర్ద్రమైన మనసులో భక్తి వెల్లువై కన్నీరు కాల్వలు కట్టాలి. గుండెగూడులో నుంచి చీకటి పారిపోవాలి. దివ్య కాంతితో నిండిపోవాలి. ఆ దివ్య ప్రభువు స్మృతితో, ఆయన కురిపించే కరుణామృత కాంతివర్షంతో నీ చిన్నిగుండె పులకించి నిండిపోవాలి. పండిపోవాలి.

నీ భవరోగాలకు, నీ మనసు గాయాలకు, నీ తీరని కోర్కెల బాధలకు ఏ మందు వేయాలో ఆయనకు తెలుసు. తీపి మందే కావాలని మారాము చేయకు. ఏదిచ్చినా స్వీకరించే దాసునిగా ఆ విశ్వ ప్రభుని ముందు వినమ్రతతో మోకరిల్లు.

నీ పాత్ర... నీ గుండె పాత్రను ఆయన ముందు ఖాళీగా ఉంచడం వరకే సుమా! ఇది కావాలి అని యాచించకు. ఇదే ఇమ్మని సూచించకు. ఆయన ఏది అనుగ్రహిస్తే అదే మహద్భాగ్యమనుకో. అదిగో ఆ దివ్యభావనే ఒక కాంతి పుంజమై నీ గుండె నిండిపోతుంది. ఒళ్ళంతా పులకరించేలా ఆ దివ్యత్వం నిండడమే కాదు, పొంగిపొరలుతుంది. నీ చుట్టుపక్కలకూ వ్యాపిస్తుంది. అదే ఆలోచన, అదే ఆలాపన, అదే ధ్యాస. అదిగో అదే ధ్యానం. అదే ప్రార్థన.

నారదుడు చెప్పిన వర్ణాశ్రమ ధర్మాలు



నారదుడు ఒకసారి ధర్మరాజుతో తాను నారాయణుడి ద్వారా బదరీవనంలో విన్న సనాతన ధర్మాన్ని వర్ణాశ్రమ ధర్మాలను గురించి ఇలా వివరించాడు.

అన్ని వర్ణాలవారికి సత్యం, దయ, ఉపవాసం మొదలైన దీక్షలతో పాటు, సదాచారం, ఓరిమి, మంచి-చెడ్డల తెలివి, సంతృప్తి, మృదు స్వభావం, ప్రాణుల్లో పరమాత్మను దర్శించడం, శ్రీమన్నారాయణ స్మరణ లాంటి ముప్పై లక్షణాలు కలిగి వుండాలి. సంస్కారాలకు భంగం కలగకుండా బ్రాహ్మణుడు మంత్రయుక్తంగా కర్మలు చేయాలి. శాస్త్రంలో విధించబడ్డ యజ్ఞాలు చేయడం-చేయించడం లాంటి ఆరు కర్మలు బ్రాహ్మణుడు విధిగా నిర్వహించాలి. అలాగే క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు శాస్త్రం చెప్పిన రీతిలో వారి వారి ధర్మాలను నెరవేర్చాలి. దొంగతనం, హింస లాంటివి ఎవరికీ తగవు. స్త్రీ తన ధర్మాన్ని, పురుషుడు తన ధర్మాన్ని శాస్త్రం చెప్పిన రీతిలో ఆచరించాలి. సాత్త్విక ధర్మంతో ఎప్పుడూ వంశాచార క్రమంగా తనకు విధించబడ్డ ధర్మాన్ని తప్పక ఆచరించే మానవుడు మెల్లగా స్వభావసిద్ధమైన కర్మాచరణను విడిచి, ముక్తిని పొందుతాడు. పుట్టుకతో మానవుడి కులాన్ని నిర్ణయించాల్సిన అవసరం లేదు. అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహాదులు మొదలైన లక్షణాల ఆచరణతో గుర్తించాలి.

బ్రహ్మచర్యంలో వున్నవాడు మంచి నడవడితో దేవతార్చన చేయాలి. ఇంద్రియాలను వశపర్చుకుని సత్యాన్నే మాట్లాడాలి. ఆత్మస్వరూపం తెలుసుకున్న జీవుడు తాను,ఈశ్వరుడు ఒకటేనని గ్రహించాలి. సత్ప్రవర్తనతో తన ధర్మం నిర్వర్తించిన వాడే ఉత్తమ గృహస్థుడు. బ్రాహ్మణుడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించి, గురువుల వద్ద విద్యనభ్యసించి, నియమనిష్ఠలతో వుండాలి. అలాగే, వానప్రస్థ జీవనంలో వున్నవారికి కూడా మునులు కొన్ని ధర్మాలను బోధించారు. అవి విధిగా నెరవేర్చాలి. గృహస్థ ధర్మాన్ని వదిలిన తరువాతే వానప్రస్థ ధర్మాన్ని స్వీకరించాలి. దైవయోగం వల్ల వృద్ధాప్యం వచ్చిన తరువాత, అంతా పరమాత్మలో లయం చేయాలి. పరబ్రహ్మంలో లీనం కావాలి. వానప్రస్థ ధర్మాలను ఆచరిస్తూ ఇంకా బతికున్నట్లయితే అన్ని బంధాల నుండి విడివడి సన్యసించాలి. ఇక అప్పటి నుండి దేహమాత్రావశిష్టుడై జీవించాలి. పరమాత్మలో విశ్వాన్ని చూస్తూ, సత్యాసత్యమైన విశ్వంలో పరబ్రహ్మమైన ఆత్మను చూస్తూ, మృత్యువు సత్యమని తెలుసుకుంటూ, కాలానికై ఎదురు చూస్తూ, పరమహంస తత్త్వాన్ని పొంది జీవబ్రహ్మైక్య భావనతో మెలగాలి.

నారదుడు చెప్పడం కొనసాగిస్తూ చతుర్విధ ఆశ్రమాల ధర్మాలను చెప్పాడిలా:

గృహస్థ ధర్మంలో వున్నవాడు చేసే పనులన్నీ వాసుదేవార్పణంగా చేయాలి. నారాయణుడి దివ్యమైన అవతార కథలను వినాలి. ధన, ధాన్య నిధులు దైవ సంకల్పం అనుకుని వాటి పట్ల అభిమానం పెంచుకోకూడదు. పంచయజ్ఞాలు చేసి, అనంతరం పరమాత్మకు అర్పించి, జీవుడు బతుకు సదుపాయాన్ని చక్కగా నిర్వర్తించాలి. అతిథి శుశ్రూష చేసి ధర్మమార్గంలో ఈశ్వరుడిని గెలవాలి. అందరినీ సంతృప్తి పరచాలి. ముఖ్యమైన రోజుల్లో ఆయా తిథుల ప్రకారం పుణ్యకాలాలలో జపహోమ స్నాన వ్రతాలను చేయాలి. దేవతలకు, బ్రాహ్మణులకు పూజలు సంతర్పణలు చేయాలి. శ్రాద్ధ కర్మలు విధిగా చేయాలి. కురుక్షేత్రం, ప్రయాగ, కాశి, రామేశ్వరం లాంటి పుణ్యక్షేత్రాలను దర్శించాలి. ఇంకా అనేక ధర్మాలను నారదుడు ధర్మరాజుకు బోధించాడు. మిగిలినవి మరోమారు చెప్పుకుందాం...

5 ఏళ్లలో రూ. 70 లక్షల కోట్లు

ప్రయివేట్ పెట్టుబడులపై ఎస్అండ్‌పీ అంచనా



ముంబై: మధ్య, దీర్ఘకాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి సాధించేందుకు అత్యుత్తమ అవకాశాలున్నట్లు గ్లోబల్ రేటింగ్ సంస్థ ఎస్అండ్‌పీ తాజాగా అభిప్రాయపడింది. దీంతో రానున్న ఐదేళ్లలో ప్రయివేట్ రంగం నుంచి 800 బిలియన్ డాలర్ల(రూ. 70 లక్షల కోట్లు) పెట్టుబడులకు వీలున్నట్లు అంచనా వేసింది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రయివేట్ పెట్టుబడులు ఊపందుకునే చాన్స్‌లేనట్లు పేర్కొంది. ప్రయివేట్ రంగంలో భారీస్థాయి సామర్థ్య విస్తరణలో అప్రమత్తత కనిపిస్తున్నట్లు సంస్థ అధికారి గీతా చుగ్ తెలియజేశారు. కాగా.. ప్రయివేట్ రంగంలో పెట్టుబడులు కనిపిస్తున్నప్పటికీ నామినల్ జీడీపీ వృద్ధి రేటుకంటే తక్కువ స్థాయిలో నమోదవుతున్నట్లు ఎస్అండ్‌పీ దేశీ రేటింగ్స్ యూనిట్ క్రిసిల్ చీఫ్ ఎకనమిస్ట్ డీకే జోషీ పేర్కొన్నారు. ప్రపంచ వాణిజ్య విధానాలు, టారిఫ్‌లలో మార్పులు, తదితర తీవ్ర అనిశ్చితులు కార్పొరేట్ సంస్థల పెట్టుబడి నిర్ణయాలలో ఆలస్యానికి కారణమవుతున్నట్లు వివరించారు. పలు కంపెనీలు పెట్టుబడులను సమకూర్చుకోవడంలో బ్యాంకులకు బదులుగా సొంత అంతర్గత వనరులకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. బ్యాంక్ రుణాలు లేదా క్యాపిటల్ మార్కెట్ల నుంచి రుణ సమీకరణ ద్వారా కనీసస్థాయిలోనే నిధులను సమీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ద్వితీయార్ధం నుంచి పరిస్థితులు మెరుగుపడనుండటంతో బ్యాంకింగ్ వ్యవస్థలో 12-13 శాతం రుణ వృద్ధికి వీలున్నట్లు అంచనా వేశారు.

బెంగళూరులో కిమ్స్ కొత్త ఆస్పత్రి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) తాజాగా కర్ణాటకలోని బెంగళూరులో తమ తొలి మల్టీ-స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించినట్లు తెలిపింది. 450 పడకల సామర్థ్యంతో అధునాతనంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ సీఎండీ భాస్కర్ రావు తెలిపారు. ఇందులో 35 పైగా మెడికల్, సర్జికల్ స్పెషాలిటీలు, 120 పైచిలుకు ఐసీయూ పడకలు మొదలైన ప్రత్యేకతలు ఉన్నట్లు వివరించారు. అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలను అందించే దిశగా త్వరలోనే ఎలక్ట్రానిక్ సిటీలో మరో ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు భాస్కర్ రావు చెప్పారు.

గరిష్టాల వద్ద బంగారంలో అమ్మకాలు

- 10 గ్రాములకు రూ.1,300 నష్టం
- ఫెడ్ సమావేశానికి ముందు అప్రమత్తత



న్యూఢిల్లీ: జీవిత కాల గరిష్ట స్థాయిల వద్ద పసిడి అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాములకు రూ.1,800 పెరిగి మంగళవారం కొత్త గరిష్ట స్థాయి రూ.1,15,100 స్థాయికి చేరుకోగా.. బుధవారం రూ.1,300 నష్టపోయి రూ.1,13,800కు పరిమితమైంది. ''యూఎస్ ఫెడ్ పాలసీ సమావేశానికి ముందు లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు మొగ్గు చూపించడంతో బంగారం బలహీనంగా ట్రేడయ్యింది. కీలకమైన సమావేశానికి ముందు ఇన్వెస్టర్లు రిస్కును తగ్గించుకున్నారు. కేవలం ఫెడ్ రేట్ల కోతపైనే కాకుండా, తదుపరి రేట్ల సవరణ దిశగా ప్రకటించే అంచనాల కోసం మార్కెట్లు వేచి చూస్తున్నాయి. తటస్థ విధానం లేదా తదుపరి రేట్ల కోతకు సంబంధించి స్పష్టమైన కార్యాచరణ లోపిస్తే బంగారం ధరలు ఇక్కడి నుంచి కొంత శాతం తగ్గొచ్చు''అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ సీనియర్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. మరోవైపు వెండి సైతం అమ్మకాల ఒత్తిడితో కిలోకి రూ.1,670 నష్టపోయి రూ.1,31,200 స్థాయికి దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు ఒక శాతం తగ్గి 3,665 డాలర్ల వద్ద, కామెక్స్ ఫ్యూచర్స్‌లో పావు శాతం తగ్గి 3,717 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

బిజినెస్ రీల్

రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధి: తనైరా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల స్థాయిలో ఆదాయ వృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తనైరా చీఫ్ సేల్స్, మార్కెటింగ్ ఆఫీసర్ సోమ్‌ప్రభ్ కుమార్ సింగ్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఆదాయం రూ. 276 కోట్లుగా నమోదైందని చెప్పారు. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో 7 స్టోర్స్, దేశవ్యాప్తంగా సుమారు 80 స్టోర్స్ ఉన్నాయని బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో వివరించారు. ఈసారి ఇప్పటికే రెండు స్టోర్స్ తెరవగా, ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి మరో రెండు, మూడు ప్రారంభించే అవకాశం ఉందని సింగ్ చెప్పారు. పండుగ సీజన్ సందర్భంగా సంప్రదాయ దుస్తులకు సంబంధించి కొత్త కలెక్షన్ మియారాను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. గోల్డెన్ కకూన్ పర్చేజ్ ప్లాన్, రూ. 10,000 విలువ చేసే కొనుగోళ్లపై రూ. 1,000 వోచర్‌లాంటి పథకాలను అందిస్తున్నట్లు వివరించారు.

చిన్న వర్తకులకు ఎస్ఎంఎఫ్‌జీ రుణాలు

న్యూఢిల్లీ: యూపీఐ ఆధారిత చెల్లింపుల సేవల్లోని ఫోన్‌పేతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ (ఎస్ఎంఐసీసీ)ప్రకటించింది. ఫోన్‌పే ప్లాట్‌ఫామ్‌పై నమోదైన వర్తకులకు మర్చంట్ క్యాష్ అడ్వాన్స్ రుణాలను ఇవ్వనున్నట్టు తెలిపింది. ఎక్కువ మంది వర్తకులు టైర్ 2, 3 పట్టణాల నుంచే ఉన్నట్టు ఇరు సంస్థలు విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. మర్చంట్ క్యాష్ అడ్వాన్స్ రుణాల్లో ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ స్థానం మరింత బలపడుతుందని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,135.70	3.99
SBIN	856.9	3.05
BEL	411.8	2.21
KOTAKBANK	2,051.00	1.45
MARUTI	15,790.00	1.39

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	766	-1.08
BAJAJFINSV	2,060.00	-0.98
TITAN	3,524.60	-0.91
SBILIFE	1,803.00	-0.87
HINDALCO	749.5	-0.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,464
ఎన్ఎస్ఈ	1,01,041
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,31,677
ఎఫ్ఐఐ	- 1,125
డీఐఐ	+ 2,294

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.33 (రాత్రి 11.30కు)	$ 64.52 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.18 (రాత్రి 11.30కు)	$ 68.47 (క్రితం ముగింపు)

పండుగ సీజన్‌పై 'సోనీ' ఆశలు..!

- విక్రయాల్లో డబుల్ డిజిట్ వృద్ధి
- జీఎస్‌టీ తగ్గింపుతో అమ్మకాలు పెరుగుతాయి
- కంపెనీ ఎండీ సునీల్ నయ్యర్



న్యూఢిల్లీ: కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సోనీ ఇండియా ప్రస్తుత పండుగల సీజన్ పట్ల ఆశావహంగా ఉన్నట్టు ప్రకటించింది. ముఖ్యంగా జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పెద్ద తెరల టీవీల ధరలు తగ్గుతాయని.. దీంతో విక్రయాలు రెండంకెల మేర వృద్ధి చెందుతాయని (గతేడాది ఇదే సీజన్‌తో పోల్చి చూస్తే) అంచనా వేస్తున్నట్టు సంస్థ ఎండీ సునీల్ నయ్యర్ ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి టీవీల అమ్మకాలు ఫ్లాట్‌గా, ఎలాంటి వృద్ధి లేకుండా ఉన్నట్టు చెప్పారు. జీఎస్‌టీ శ్లాబుల్లో మార్పుల వల్ల వీటి ధరలు 7.5-8 శాతం మేర తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. దీంతో కొనుగోళ్ల సెంటిమెంట్ మెరుగుపడుతుందన్నారు. పెద్ద సైజు తెరల టీవీల మార్కెట్లో (ప్రీమియం మార్కెట్) సోనీ ప్రముఖ సంస్థగా ఉండడం తెలిసిందే. ఈ విభాగంలో టీవీల ధరలు మోడల్ ఆధారంగా రూ.8,000 నుంచి రూ.70,000 మధ్య తగ్గుతాయని నయ్యర్ ప్రకటించారు. ధరలు తగ్గడంతో కస్టమర్లు పెద్ద సైజు టీవీలు, మెరుగైన టెక్నాలజీ ఫీచర్లతో ఉన్న వాటికి మారతారన్న (అప్‌గ్రేడ్) ఆశాభావం వ్యక్తం చేశారు. విక్రయాలు 10-15 శాతం వరకు పెరగొచ్చన్నారు.

మాకు ప్రయోజనం..

జీఎస్‌టీలో 32 అంగుళాలకు మించిన టీవీలపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం గమనార్హం. కొత్త రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. 55 అంగుళాలు, అంతకుమించిన సైజు టీవీల మార్కెట్లో కీలకంగా ఉన్న సోనీ ఈ రేటు తగ్గింపుతో ప్రయోజనం పొందుతుందని నయ్యర్ చెప్పారు. ''55, 65, 75, 85, 98 అంగుళాల టీవీలను పెద్ద సంఖ్యలో విక్రయిస్తుంటాం. ఈ టీవీలన్నీ ప్రీమియం, పెద్ద సైజు విభాగం కిందకు వస్తాయి''అని తెలిపారు. 55 అంగుళాల టీవీ ధర రూ.8,000 వరకు తగ్గుతుందని.. 75 అంగుళాలు అంతకుమించిన సైజు టీవీలపై రూ.19,000-51,000 వరకు, 85 అంగుళాల టీవీలపై రూ.47,000-70,000 వరకు రేట్లు తగ్గుతాయని చెప్పారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఆదాయ పన్ను ప్రయోజనాలతో ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుందని.. దీని ఫలితంగా కెమెరాలు, సౌండ్ బార్లు, పార్టీ స్పీకర్లు, హెడ్‌ఫోన్లు, ప్లే స్టేషన్ ఉత్పత్తుల అమ్మకాలు సైతం పెరుగుతాయని నయ్యర్ అంచనా వేశారు. విక్రయాల్లో సగం వాటా కలిగిన చిన్న పట్టణాలు, గ్రామీణ మార్కెట్లలో సోనీ స్థానం మరింత బలపడుతుందన్నారు.

నిలిచిన కొనుగోళ్లు

ప్రభుత్వం జీఎస్‌టీపై నిర్ణయాలు ప్రకటించిన తర్వాత వినియోగదారులు టీవీల కొనుగోళ్లను నిలిపివేసినట్టు నయ్యర్ తెలిపారు. ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉన్నట్టు చెప్పారు. అందరూ సెప్టెంబర్ 22 కోసం వేచి చూస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ తర్వాత కొనుగోళ్లు ఒక్కసారిగా పెరుగుతాయని అంచనా వేశారు.

అట్లాంటా ఎలక్ట్రికల్స్ @ రూ. 718-754

- ఈ నెల 22-24 మధ్య ఐపీవో
- రూ. 687 కోట్ల సమీకరణకు రెడీ



న్యూఢిల్లీ: విద్యుత్, ఆటో, ఇన్వెర్టర్ డ్యూటీ ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీ కంపెనీ అట్లాంటా ఎలక్ట్రికల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 718-754 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 22న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 287 కోట్ల విలువైన 38.1 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 24న ముగియనున్న ఇష్యూ ద్వారా మొత్తం రూ. 687 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 19న షేర్లను విక్రయించనుంది. లిస్టింగ్ ద్వారా కంపెనీ రూ. 5,800 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది.

యస్ బ్యాంక్‌లో ఎస్ఎంబీసీ వాటా జూమ్

- కార్లయిల్ నుంచి మరో 4 శాతం వాటా
- ఎస్‌బీఐ నుంచి 13.18 శాతం బదిలీ



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) నుంచి యస్ బ్యాంక్‌కు చెందిన 13.18 శాతం వాటాను జపనీస్ దిగ్గజం సుమితోమొ మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్(ఎస్ఎంబీసీ) చేజిక్కించుకుంది. దీంతో ఎస్ఎంబీసీ నుంచి రూ. 8,889 కోట్లు అందుకున్నట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. ఫలితంగా యస్ బ్యాంక్‌లో ఎస్‌బీఐ వాటా 10.8 శాతానికి దిగివచ్చింది. ఈ డీల్‌లో భాగంగా ఇతర 7 ప్రయివేట్ బ్యాంకింగ్ సంస్థల నుంచి సైతం మరో 6.82 శాతం వాటాను ఎస్ఎంబీసీ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా యస్ బ్యాంక్‌లో పీఈ దిగ్గజం కార్లయిల్ నుంచి మరో 4.2 శాతం వాటాను ఎస్ఎంబీసీ సొంతం చేసుకోనుంది. ఇందుకు షేరుకి రూ. 21.5 ధరలో(ఎస్‌బీఐ వాటా విక్రయ ధర)నే కొనుగోలు చేసేందుకు తప్పనిసరి ఒప్పందం కుదుర్చుకున్నట్లు బుధవారం (17న) తెలియజేసింది. ఇందుకు రూ. 2,800 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. వెరసి యస్ బ్యాంక్‌లో వాటాను జపనీస్ దిగ్గజం సుమితోమొ మిత్సుయి ఫైనాన్షియల్ గ్రూప్(ఎస్ఎంఎఫ్‌జీ)కు చెందిన ఎస్ఎంబీసీ 24.2 శాతానికి పెంచుకోనుంది. తద్వారా యస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా నిలుస్తోంది. ప్రస్తుతం యస్ బ్యాంక్‌లో కార్లయిల్ గ్రూప్ 4.22 శాతం వాటా కలిగి ఉంది.

ఈ వార్తల నేపథ్యంలో యస్ బ్యాంక్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 21.15 వద్ద ముగిసింది.

ఫార్మా ఆవిష్కరణల కోసం ప్రత్యేక స్కీమ్

న్యూఢిల్లీ: ఫార్మా, మెడ్‌టెక్ రంగాల్లో కొత్త ఆవిష్కరణలను మరింతగా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ప్రత్యేక స్కీమును కేంద్రం అధికారికంగా అమల్లోకి తేవడంపై దృష్టి పెడుతోంది. ప్రమోషన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ ఫార్మా మెడ్‌టెక్ (పీఆర్ఐపీ)ని ఈ నెలలోనే ప్రారంభించే అవకాశం ఉందని ఫార్మా విభాగం కార్యదర్శి అమిత్ అగ్రవాల్ తెలిపారు. 2023 ఆగస్టు 17న రూ. 5,000 కోట్లతో ఈ పథకాన్ని నోటిఫై చేశారు. ఇందులో రూ. 4,250 కోట్ల మొత్తాన్ని పరిశోధనలు, అభివృద్ధి కార్యకలాపాల కోసం కేటాయించారు. ఆయా ప్రాజెక్టుల ప్రతిపాదిత వ్యయాల్లో 35 శాతం నుంచి 50 శాతం వరకు భరించే విధంగా, ప్రారంభ దశతో పాటు తదుపరి దశలో కూడా నిధులపరమైన మద్దతునిచ్చే విధంగా ఈ పథకం ఉంటుంది. కీలకమైన ముడి పదార్థాలు, పరికరాలను దేశీయంగానే ఉత్పత్తి చేసే పటిష్టమైన వ్యవస్థను ఏర్పర్చడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు అగ్రవాల్ చెప్పారు.

ఎయిర్‌పోర్ట్ లాంజ్ సర్వీసులు నిలిపివేసిన డ్రీమ్‌ఫోక్స్

న్యూఢిల్లీ: తీవ్రమైన పోటీ, కాంట్రాక్టుల రద్దు తదితర సవాళ్లతో కొట్టుమిట్టాడుతున్న డ్రీమ్‌ఫోక్స్ సంస్థ దేశీయంగా విమానాశ్రయాల్లో డొమెస్టిక్ లాంజ్ సర్వీసులను బుధవారం నుంచి నిలిపివేసింది. గ్లోబల్ లాంజ్ వ్యాపార కార్యకలాపాలు యథాప్రకారంగా కొనసాగుతాయని సంస్థ తెలిపింది. కస్టమర్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై కసరత్తు చేస్తున్నట్లు పేర్కొంది. నిర్దిష్ట సర్వీసులను నిలిపివేయనున్నట్లు సరఫరాదారులైన అదానీ డిజిటల్, సెమోలినా కిచెన్స్, ఎన్‌కామ్ హాస్పిటాలిటీ నుంచి లేఖలు అందినట్లు ఆగస్టు 29న కంపెనీ వెల్లడించిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 1,292 కోట్ల ఆదాయంపై రూ. 65 కోట్ల లాభం నమోదు చేసింది.

షేరు 5% క్షీణించి రూ. 131 వద్ద ముగిసింది.

అంతర్జాతీయంగా ఏఐ నైతిక ప్రమాణాలపై కసరత్తు

వినియోగదారుల వ్యవహారాల విభాగం కార్యదర్శి నిధి ఖరే వెల్లడి



న్యూఢిల్లీ: రోజువారీ జీవనంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో దాన్ని నైతికంగా ఉపయోగించడానికి సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ప్రమాణాలను రూపొందించడంపై కసరత్తు జరుగుతోందని వినియోగదారుల వ్యవహారాల విభాగం కార్యదర్శి నిధి ఖరే తెలిపారు. ఆయా కమిటీల్లో భారతీయ నిపుణులు కూడా ఉన్నారని వివరించారు. గ్లోబల్ ప్రమాణాలు ఖరారైన తర్వాత భారత్ సహా ప్రపంచ దేశాలు వాటిని అమలు చేస్తాయని పీహెచ్‌డీసీసీఐ సదస్సులో చెప్పారు. ఇప్పటికే 39 ఉండగా, మరో 45 గ్లోబల్ ఏఐ ప్రమాణాలను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. ఏఐ టెక్నాలజీకి రెండు పార్శ్వాలు ఉన్నాయని చెప్పారు. రిటైల్, ఈ-కామర్స్ రంగాల్లో మోసాలను అరికట్టేందుకు ఇది ఉపయోగపడనుండగా, అదే సమయంలో అనైతికంగా ఉపయోగిస్తే ప్రమాదకరంగా పరిణమించే అవకాశాలూ ఉన్నాయని నిధి చెప్పారు. 'ప్రస్తుతం ప్రపంచంలో ఏఐ చాలా పెద్ద సవాలుగా మారింది. దీనితో ఎంతగా దుష్ప్రచారం జరుగుతోందో మనం చూస్తున్నాం. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. మోసాల నుంచి వినియోగదారులను కాపాడేందుకు ప్రభుత్వాలు తప్పనిసరిగా చట్టాలు చేసే పరిస్థితి ఏర్పడుతోంది. అలాగని ఏఐ వల్ల ప్రయోజనాలు లేవని చెప్పడానికి లేదు. సోషల్ మీడియా, ప్లాట్‌ఫాంలు, నవకల్పనలకు సంబంధించి ఇదొక సానుకూల, సృజనాత్మక ఆవిష్కరణ' అని తెలిపారు.

సౌత్ ఇండియా సూపర్ ధమాకా ఆఫర్లు

ఆర్.ఎస్.బ్రదర్స్ దసరా ఆఫర్లు

డిజిటల్ మార్కెట్ల నియంత్రణ తక్షణావసరం

- పోటీపై అధ్యయనం పారదర్శకంగా ఉండేలా చూడాలి
- కేంద్రానికి అంకురాల లేఖ



న్యూఢిల్లీ: డిజిటల్ మార్కెట్లలో బడా టెక్ కంపెనీలు, పోటీ సంస్థలను దెబ్బతీసే విధానాలను ఉపయోగించకుండా ముందస్తుగా నివారించేలా ప్రత్యేక విధానాన్ని (ఎక్స్-యాంటీ) రూపొందించడం తక్షణావసరమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను దేశీ అంకుర సంస్థల వ్యవస్థాపకులు కోరారు. డిజిటల్ పోటీపై తలపెట్టిన మార్కెట్ అధ్యయనం పారదర్శకంగా, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే విధంగా ఉండేలా చూడాలని కోరారు. ఎక్స్-యాంటీ నిబంధనలను వ్యతిరేకిస్తూ గ్లోబల్ టెక్ దిగ్గజాలు దుష్ప్రచారం సాగిస్తున్నాయని వివరించారు. పీపుల్ గ్రూప్ వ్యవస్థాపకుడు అనుపమ్ మిట్టల్, మ్యాట్రిమోనీడాట్‌కామ్ ఫౌండర్ మురుగవేల్ జానకిరామన్, ట్రూలీమ్యాడ్లీ సహ వ్యవస్థాపకులు స్నేహిల్ ఖనోర్, అమిత్ గుప్తా తదితరులు ఈ మేరకు నిర్మలా సీతారామన్‌కి లేఖ రాశారు. డిజిటల్ మార్కెట్లలో పోటీని అణగదొక్కేలా వ్యవహరిస్తున్న బిగ్ టెక్ సంస్థల వల్ల స్టార్టప్ వ్యవస్థ నిరంతరం సవాళ్లు ఎదుర్కొంటోందని అందులో పేర్కొన్నారు. ఎక్స్-యాంటీ నిబంధనలను పునఃసమీక్షించడానికి ముందుగా ప్రస్తుత డిజిటల్ కాంపిటీషన్ బిల్లు ముసాయిదాను ఉపసంహరించి, మార్కెట్‌ను సవివరంగా అధ్యయనం చేయాలన్న ప్రభుత్వ యోచనను తాము స్వాగతిస్తున్నామని స్టార్టప్‌ల ఫౌండర్లు తెలిపారు. అయితే, ఇది స్వతంత్రంగా, పారదర్శకమైన విధంగా జరిగేలా చూడాలని కోరారు.

బ్యాంక్ రుణాల్లో 12 శాతం వృద్ధి

2025-26పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా



ముంబై: బ్యాంకుల రుణ వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 12 శాతంగా ఉండొచ్చని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. ముఖ్యంగా ద్వితీయ ఆరు నెలల కాలంలో (అక్టోబర్ నుంచి) రుణ వృద్ధి వేగాన్ని అందుకోవచ్చని తెలిపింది. కార్పొరేట్ రుణాలు నిదానిస్తాయంటూ.. రిటైల్ రుణాలు వృద్ధిని నడిపించనున్నట్టు వెల్లడించింది. డిపాజిట్లలో గృహాల వాటా తగ్గుతుండడం ఆందోళనకరమంటూ, డిపాజిట్లలో స్థిరత్వం సమస్యలకు దారితీయొచ్చని పేర్కొంది. ''2025-26 క్యూ1లో (ఏప్రిల్-జూన్) రుణ వృద్ధి 9.5 శాతానికి నిదానించింది. ఆ తర్వాత 10 శాతానికి పెరిగింది. ద్వితీయ ఆరు నెలల్లో రుణాల్లో వృద్ధి వేగవంతమై పూర్తి ఆర్థిక సంవత్సరానికి 11-12 శాతానికి చేరుకోవచ్చు''అని క్రిసిల్ చీఫ్ రేటింగ్ ఆఫీసర్ కృష్ణన్ సీతారామన్ తెలిపారు. ప్రభుత్వం, ఆర్‌బీఐ చర్యలు ఇందుకు అనుకూలిస్తాయన్నారు. ఆర్‌బీఐ రెపో రేట్ల తగ్గింపు ఎంసీఎల్ఆర్ ఆధారిత రుణాలపై ఇంకా పూర్తిగా ప్రతిఫలించాల్సి ఉందన్నారు. బ్యాంకు రుణ రేట్లు తగ్గుముఖం పడితే అప్పుడు డిమాండ్ పుంజుకుంటుందని అంచనా వేశారు. ప్రైవేటు మూలధన వ్యయాలు పుంజుకోవడానికి కొంత సమయం పట్టొచ్చని చెప్పారు.

డిపాజిట్లు కీలకం..

బ్యాంక్ డిపాజిట్లలో గృహాల వాటా ఐదేళ్ల క్రితం 64 శాతంగా ఉంటే, అది 60 శాతానికి తగ్గడం పట్ల క్రిసిల్ రేటింగ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. స్థిరమైన రుణ వృద్ధికి డిపాజిట్లు కీలకమని పేర్కొంది. వ్యవస్థలో లిక్విడిటీ పెంచే దిశగా ఆర్‌బీఐ తీసుకున్న చర్యలతో (సీఆర్ఆర్ తగ్గింపు, లిక్విడిటీ కవరేజీ నిబంధనలు) డిపాజిట్లలో వృద్ధి తగినంత ఉన్నట్టు తెలిపింది. బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 2026 మార్చి నాటికి 2.3-2.5 శాతానికి పెరగొచ్చని అంచనా వేసింది.

వ్యవసాయేతర కమోడిటీలకు సెబీ సై

- బ్యాంకులు, బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్స్‌కు అనుమతి



ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా వ్యవసాయేతర కమోడిటీ డెరివేటివ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు బ్యాంకులు, బీమా సంస్థలు, పెన్షన్ ఫండ్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతేకాకుండా నగదేతర సెటిల్‌మెంట్, వ్యవసాయేతర కమోడిటీ డెరివేటివ్ కాంట్రాక్టులలో లావాదేవీలు చేపట్టేందుకు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు)ను అనుమతించే యోచనలో ఉన్నట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. వెరసి నాన్‌క్యాష్, నాన్‌అగ్రికల్చర్ మార్కెట్లలో లావాదేవీలు చేపట్టేందుకు దేశీ సంస్థలు, విదేశీ ఇన్వెస్టర్లను అనుమతించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు ఎంసీఎక్స్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో వెల్లడించారు.

సెబీ తాజా ప్రతిపాదనల నేపథ్యంలో ఎంసీఎక్స్ షేరు బీఎస్ఈలో 3.5 శాతం ఎగసి రూ. 7,919 వద్ద ముగిసింది.



ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం 24-22, 21-13తో జునైదీ ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేసియా) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకుంది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) 21-11, 21-10తో లక్ష్య సేన్‌పై గెలుపొందాడు. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) ద్వయం 19-21, 13-21తో ఫెంగ్ యాన్ జె-హువాంగ్ డాంగ్ పింగ్ (చైనా) జంట చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రుతపర్ణ-శ్వేతాపర్ణ (భారత్) జోడీ 8-21, 13-21తో ఆంగ్ జిన్ యి-కార్మెన్ టింగ్ (మలేసియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

మళ్లీ ఓడిన తెలుగు టైటాన్స్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్‌కు 'హ్యాట్రిక్' పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన తొలి పోరులో టైటాన్స్ 29-33 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓడింది. టైటాన్స్‌కు ఇది వరుసగా మూడో పరాజయం కాగా... ఆడిన ఆరో మ్యాచ్‌లోనూ గెలిచిన దబంగ్ ఢిల్లీ 12 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. లీగ్‌లో భాగంగా వైజాగ్‌లో 'హ్యాట్రిక్' విజయాలు నమోదు చేసుకున్న తెలుగు టైటాన్స్ జట్టు... పోటీలు జైపూర్‌కు తరలిన తర్వాత ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేదు. తాజా పోరులో టైటాన్స్ తరఫున కెప్టెన్ విజయ్ మలిక్ 5 పాయింట్లు సాధించగా... మన్‌జీత్, అజిత్ పవార్ చెరో 4 పాయింట్లు సాధించారు. మరోవైపు దబంగ్ ఢిల్లీ తరఫున నీరజ్ నర్వాల్ 9 పాయింట్లు సాధించగా... సౌరభ్, ఫజల్ ఐదేసి పాయింట్లతో విజయంలో కీలకపాత్ర పోషించారు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో టైటాన్స్ 13 రెయిడ్ పాయింట్లు సాధించగా... ఢిల్లీ 15 ఖాతాలో వేసుకుంది. ట్యాక్లింగ్‌లో టైటాన్స్‌కు 12 పాయింట్లు దక్కగా... ఢిల్లీ 15 పాయింట్లతో ముందంజ వేసింది. తాజా సీజన్‌లో 8 మ్యాచ్‌లాడిన టైటాన్స్ 3 విజయాలు, 5 పరాజయాలతో ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో 8వ స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 43-32 పాయింట్ల తేడాతో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. హర్యానా తరఫున శివమ్ 15 పాయింట్లతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. పట్నా పైరేట్స్ తరఫున అయాన్ 7 పాయింట్లతో పోరాడాడు. లీగ్‌లో భాగంగా గురువారం జైపూర్ పింక్ పాంథర్స్‌తో బెంగాల్ వారియర్స్, యు ముంబాతో పుణేరి పల్టన్ ఆడతాయి.



ఫిల్ సాల్ట్ మెరుపులు

తొలి టి20లో ఐర్లాండ్‌పై ఇంగ్లండ్ విజయం

డబ్లిన్: ఫిల్ సాల్ట్ (46 బంతుల్లో 89; 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ఐర్లాండ్ పర్యటనలో ఇంగ్లండ్ క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బుధవారం జరిగిన తొలి టి20లో ఇంగ్లండ్ 4 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. హ్యారీ టెక్టర్ (36 బంతుల్లో 61 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), లార్కాన్ టకర్ (36 బంతుల్లో 55; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలు చేశారు. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (22 బంతుల్లో 34; 1 ఫోర్, 4 సిక్స్‌లు), రాస్ అడైర్ (25 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించడంతో ఐర్లాండ్ భారీ స్కోరు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో జేమీ ఓవర్టన్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 17.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 197 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫిల్ సాల్ట్ విజృంభించగా... జోస్ బట్లర్ (10 బంతుల్లో 28; 5 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ జాకబ్ బెథెల్ (16 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్), స్యామ్ కరన్ (15 బంతుల్లో 27; 3 సిక్స్‌లు) తలా కొన్ని పరుగులు చేశారు. ఇటీవల దక్షిణాఫ్రికాతో రికార్డు స్కోరు చేసిన ఇంగ్లండ్ జట్టు... ఇప్పుడు అదే జోరు కనబరుస్తూ మరో 14 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. ఐర్లాండ్ బౌలర్లలో మాథ్యూ హంఫ్రేస్, గ్రహమ్ హ్యూమ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య శుక్రవారం రెండో టి20 జరగనుంది.



ఫిల్ సాల్ట్

ఈ మ్యాచ్ ద్వారా ఇంగ్లండ్ కెప్టెన్ జాకబ్ బెథెల్ అరుదైన రికార్డు ఖాతాలో వేసుకున్నాడు. సుదీర్ఘ చరిత్ర ఉన్న ఇంగ్లండ్ జట్టుకు సారథ్యం వహించిన అతి పిన్న వయస్కుడిగా (21 ఏళ్ల 329 రోజులు) బెథెల్ నిలిచాడు. 19వ శతాబ్దంలో మాంటీ బౌడెన్ 23 ఏళ్ల వయసులో ఇంగ్లండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించగా... ఇప్పుడా రికార్డును బెథెల్ తన పేరిట రాసుకున్నాడు.

పోరాడుతున్న భారత్ 'ఎ'

తొలి ఇన్నింగ్స్‌లో 116/1

- జగదీశన్ అజేయ అర్ధశతకం
- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 532/6 డిక్లేర్డ్
- జోష్ ఫిలిప్ సూపర్ సెంచరీ



జగదీశన్



ఫిలిప్ లియామ్ స్కాట్

లక్నో: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో భారత 'ఎ' జట్టు పోరాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో కంగారూలు భారీ స్కోరు చేయగా... బుధవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత 'ఎ' జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 116 పరుగులు చేసింది. నారాయణ్ జగదీశన్ (95 బంతుల్లో 50 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకంతో రాణించగా... మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (58 బంతుల్లో 44; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. తొలి రోజు మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించగా... రెండో రోజు వరుణుడి ధాటికి 55 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. బ్యాటింగ్ చేసినంతసేపు జగదీశన్ సాధికారికంగా ఆడగా... అభిమన్యు ధాటిగా ఆడాడు. తొలి వికెట్‌కు 88 పరుగులు జోడించిన అనంతరం అభిమన్యు అవుట్ కాగా... టీమిండియా ప్లేయర్ సాయి సుదర్శన్ (27 బంతుల్లో 20 బ్యాటింగ్; 3 ఫోర్లు)తో కలిసి జగదీశన్ ఆటను ముగించాడు. ఆసీస్ బౌలర్లలో లియామ్ స్కాట్ ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న భారత్ 'ఎ'... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 416 పరుగులు వెనుకబడి ఉంది. జగదీశన్, సుదర్శన్ క్రీజులో ఉండగా... కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, దేవదత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, తనుశ్ కొటియాన్ బ్యాటింగ్‌కు రావాల్సి ఉంది.

ఫిలిప్ ఫటాఫట్...

ఓవర్‌నైట్ స్కోరు 337/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 'ఎ' జట్టు చివరకు 98 ఓవర్లలో 532/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. వికెట్ కీపర్ జోష్ ఫిలిప్ (87 బంతుల్లో 123 నాటౌట్; 18 ఫోర్లు, 4 సిక్స్‌లు) 'శత'క్కొట్టగా... లియామ్ స్కాట్ (122 బంతుల్లో 81; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీ సాధించాడు. జేవియర్ బార్ట్‌లెట్ (24 బంతుల్లో 39 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడాడు. భారత బౌలర్లలో హర్ష్ దూబే 3 వికెట్లు పడగొట్టగా... గుర్‌నూర్ బ్రార్ 2, ఖలీల్ అహ్మద్ ఒక వికెట్ తీశారు. తొలి రోజు వేగంగా పరుగులు రాబట్టిన ఆసీస్ ప్లేయర్లు... రెండో రోజు మరింత ధాటిగా ఆడారు. టి20 తరహాలో ధనాధన్ షాట్‌లతో రెచ్చిపోయారు. లియామ్ స్కాట్ ఓ మాదిరిగా ఆడగా... జోష్ ఫిలిప్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. స్కాట్‌తో కలిసి ఫిలిప్ ఆరో వికెట్‌కు 81 పరుగులు జోడించాడు. జేవియర్ అతడికి తోడవడంతో పరుగుల వేగం మరింత పెరిగింది. ఈ జోడీ అబేధ్యమైన ఏడో వికెట్‌కు 62 బంతుల్లోనే 118 పరుగులు జోడించింది. రెండో రోజు 25 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన ఆసీస్... దాదాపు రెండొందల పరుగులు చేసింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్: కొన్‌స్టాస్ (బి) హర్ష్ దూబే 109; క్యాంప్‌బెల్ (సి) తనుశ్ (బి) గుర్‌నూర్ బ్రార్ 88; నాథన్ మెక్‌స్వీనీ (ఎల్బీ) (బి) హర్ష్ దూబే 1; ఒలీవర్ పీక్ (ఎల్బీ) (బి) ఖలీల్ 2; కూపర్ కనోల్లీ (సి) పడిక్కల్ (బి) హర్ష్ దూబే 70; లియామ్ స్కాట్ (సి) శ్రేయస్ (బి) గుర్‌నూర్ బ్రార్ 81; ఫిలిప్ (నాటౌట్) 123; జేవియర్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు: 19; **మొత్తం (98 ఓవర్లలో 6 వికెట్లకు డిక్లేర్డ్) 532. వికెట్ల పతనం:** 1-198, 2-205, 3-214, 4-224, 5-333, 6-414. **బౌలింగ్:** ప్రసిధ్ కృష్ణ 16-0-86-0; ఖలీల్ అహ్మద్ 15-0-80-1; గుర్‌నూర్ బ్రార్ 19-2-87-2; తనుశ్ కొటియాన్ 21-1-119-0; హర్ష్ దూబే 27-1-141-3. **భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్:** అభిమన్యు (బి) లియామ్ స్కాట్ 44; జగదీశన్ (బ్యాటింగ్) 50; సాయి సుదర్శన్ (బ్యాటింగ్) 20; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (30 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 116. వికెట్ల పతనం:** 1-88. **బౌలింగ్:** ఫెర్గూస్ 7-2-23-0; జేవియర్ 7-1-23-0; టాడ్ మర్ఫీ 8-1-22-0; కోరీ రోచిసియోలి 5-0-38-0; లియామ్ స్కాట్ 3-1-9-1.

ప్రధాని మోదీకి మెస్సీ జన్మదిన కానుక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదినం (బుధవారం) సందర్భంగా క్రీడా లోకం శుభాకాంక్షలు తెలిపింది. పలు రంగాలకు చెందిన ప్రముఖులు ప్రధానికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని పుట్టిన రోజు సందర్భంగా... అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ 2022 ఫిఫా ప్రపంచకప్ గెలిచిన జెర్సీని బహుమతిగా పంపించాడు. రెండు మూడు రోజుల్లో మెస్సీ అందించిన జెర్సీని ప్రధానికి బహుకరించనున్నట్లు ప్రమోటర్ సతాద్రు దత్తా వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో మెస్సీ భారత్‌లో పర్యటించనున్నాడు. ఇందులో భాగంగా కోల్‌కతా, ముంబై, ఢిల్లీలో అతడు పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నాడు. 'మెస్సీని కలిసినప్పుడు ప్రధాని 75వ పుట్టిన రోజు రానుందని చెప్పాను. దీంతో అతడు వరల్డ్‌కప్ విన్నింగ్ జెర్సీపై తన ఆటోగ్రాఫ్ చేసి ప్రధాని నరేంద్ర మోదీకి ఇవ్వాల్సిందిగా నాకు చెప్పాడు' అని సతాద్రు దత్తా తెలిపారు. మెస్సీ పర్యటనలో భాగంగా... ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా-2025' పేరిట మెస్సీ పర్యటన కోల్‌కతా నుంచి ప్రారంభం కానుంది. 2011లో చివరిసారిగా మెస్సీ భారత్‌లో పర్యటించాడు. వెనిజులాతో ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేందుకు అర్జెంటీనా జట్టు అప్పట్లో కోల్‌కతాకు వచ్చింది. మరోవైపు ఈ ఏడాది నవంబర్‌లో అర్జెంటీనా జట్టు ఒక ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడేందుకు కేరళలో పర్యటించనుందని... ఆ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి అబ్దురెహమాన్ వెల్లడించారు.



కాంస్యం రేసులో అంతిమ్

జాగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల 53 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అంతిమ్ పంఘాల్ కాంస్య పతకం కోసం పోటీపడనుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో అంతిమ్ 3-5 పాయింట్ల తేడాతో ప్రపంచ నంబర్‌వన్ లూసియా యెపెజ్ గుజ్‌మన్ (ఈక్వెడార్) చేతిలో ఓడిపోయింది. మహిళల 76 కేజీల విభాగం కాంస్య పతక మ్యాచ్‌లో భారత రెజ్లర్ ప్రియా 0-10తో మిలైమి మారిన్ (క్యూబా) చేతిలో ఓడిపోయింది.

బ్రాత్‌వైట్‌పై వేటు చందర్‌పాల్‌కు చోటు

భారత్‌తో టెస్టు సిరీస్‌కు విండీస్ జట్టు ప్రకటన

సెయింట్ జాన్స్ (ఆంటిగ్వా): భారత గడ్డపై జరిగే రెండు టెస్టుల సిరీస్ కోసం వెస్టిండీస్ సెలక్షన్ కమిటీ తమ జట్టును ప్రకటించింది. 15 మంది సభ్యుల ఈ జట్టుకు రోస్టన్ ఛేజ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఆస్ట్రేలియాతో ఆడిన గత సిరీస్‌లో సభ్యుడైన మాజీ కెప్టెన్, 100 టెస్టుల సీనియర్ ఆటగాడు క్రెయిగ్ బ్రాత్‌వైట్‌ను జట్టు నుంచి తప్పించారు. అతని స్థానంలో ఓపెనర్‌గా తేజ్ నారాయణ్ చందర్‌పాల్‌కు మళ్లీ స్థానం లభించింది. విండీస్ విఖ్యాత క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ తనయుడైన తేజ్‌నారాయణ్ దాదాపు ఏడాదిన్నర క్రితం తన చివరి టెస్టు ఆడాడు. వైస్ కెప్టెన్ జోమెల్ వారికాన్ టీమ్‌లో ప్రధాన స్పిన్నర్ కాగా... ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడని ఖారీ పైర్‌ను రెండో స్పిన్నర్‌గా ఎంపిక చేశారు. 2018-19లో చివరిసారిగా వెస్టిండీస్ జట్టు భారత్‌లో పర్యటించగా... నాటి టీమ్‌లో ఉన్న నలుగురు ఆటగాళ్లు ఛేజ్, హోప్, వారికాన్, అల్జారి జోసెఫ్ మాత్రమే ఈసారీ వస్తున్నారు. ఈ నెల 24న వెస్టిండీస్ జట్టు భారత్ చేరుకుంటుంది. **అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో తొలి టెస్టు,** అక్టోబర్ 10 నుంచి న్యూఢిల్లీలో రెండో టెస్టు జరుగుతుంది.



తేజ్ నారాయణ్ చందర్‌పాల్



క్రెయిగ్ బ్రాత్‌వైట్

విండీస్ జట్టు వివరాలు: రోస్టన్ ఛేజ్ (కెప్టెన్), తేజ్ నారాయణ్ చందర్‌పాల్, బ్రెండన్ కింగ్, కెవ్‌లాన్ అండర్సన్, షై హోప్, జాన్ క్యాంప్‌బెల్, అతనాజ్, ఇమ్‌లాక్, గ్రీవ్స్, అండర్సన్ ఫిలిప్, అల్జారి జోసెఫ్, షామర్ జోసెఫ్, జేడెన్ సీల్స్, **ఖారీ పైర్, జోమెల్ వారికాన్.**

వరల్డ్ కప్ ఫైనల్‌కు మను, సురుచి, ఇషా

మొత్తం 8 మంది భారత షూటర్లు అర్హత

న్యూఢిల్లీ: అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) సీజన్ ముగింపు టోర్నమెంట్ వరల్డ్‌కప్ ఫైనల్‌కు భారత్ నుంచి 8 మంది షూటర్లు అర్హత సాధించారు. ఈ ఏడాది డిసెంబర్ 4 నుంచి 9 వరకు ఖతర్ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో మన దేశం నుంచి పారిస్ ఒలింపిక్స్ పతక విజేత మనూ భాకర్‌తో పాటు మరో ఏడుగురు షూటర్లు బరిలోకి దిగనున్నారు. 12 వ్యక్తిగత ఒలింపిక్ ఈవెంట్‌లలో ఈ ఏడాది అత్యుత్తమ షూటర్‌ను నిర్ణయించేందుకు ఈ టోర్నీ నిర్వహిస్తున్నారు. వీటిలో ఐదింట భారత షూటర్లు పోటీపడుతున్నారు. స్టార్ షూటర్ మనూ భాకర్ రెండు విభాగాల్లో వరల్డ్‌కప్ ఫైనల్‌కు ఎంపికైంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌తో పాటు, 25 మీటర్ల విభాగంలో మను పోటీపడనుంది. ఇక ఈ సీజన్‌లో చక్కటి గురితో మూడు స్వర్ణాలు కైవసం చేసుకున్న టీనేజర్ సురుచి సింగ్ కూడా భారత్ నుంచి బరిలోకి దిగనుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో బ్యూనస్ ఎయిర్స్, లిమా, మ్యూనిక్‌లలో సురుచి పసిడి పతకాలు ఖాతాలో వేసుకుంది. ఇక ఇటీవల నింగ్బో ప్రపంచకప్‌లో స్వర్ణంతో మెరిసిన హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ సైతం ఈ టోర్నీలో పాల్గొననుంది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో ఇషా పోటీపడనుంది. ప్రపంచ మాజీ చాంపియన్ రుద్రాంక్ష్ పాటిల్, అర్జున్ బబుతా పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగానికి ఎంపికయ్యారు. రుద్రాంక్ష్ బ్యూనస్ ఎయిర్స్ వరల్డ్‌కప్‌లో స్వర్ణంతో మెరవగా... ఒలింపియన్ అర్జున్ లిమా ప్రపంచకప్‌లో రజతం గెలుచుకున్నాడు. ఆసియా చాంపియన్, ప్రపంచ రికార్డు హోల్డర్ సిఫ్ట్ కౌర్ సమ్రా... మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో, ఒలింపియన్ విజయ్‌వీర్ సిద్ధూ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో పోటీపడనున్నారు. సిఫ్ట్ కౌర్ సమ్రా బ్యూనస్ ఎయిర్స్ ప్రపంచకప్‌లో స్వర్ణం గెలవగా... అదే పోటీలో విజయ్‌వీర్ పసిడి నెగ్గాడు. మహిళల 25 మీటర్ల విభాగంలో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ కూడా వరల్డ్‌కప్ ఫైనల్ అవకాశం దక్కించుకుంది. లిమా ప్రపంచకప్‌లో రజతం నెగ్గడం ద్వారా సిమ్రన్‌కు ఈ చాన్స్ దక్కింది. వరల్డ్‌కప్ ఫైనల్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన వారికి వరుసగా 5000 యూరోలు (రూ. 5 లక్షల 20 వేలు), 4000 యూరోలు (రూ. 4 లక్షల 16 వేలు), 2000 యూరోలు (రూ. 2 లక్షల 8 వేలు) ప్రైజ్‌మనీగా లభిస్తాయి. ఈ ఏడాది జరిగిన నాలుగు వరల్డ్‌కప్ వేర్వేరు విభాగాల్లో కలిసి భారత షూటర్లు 22 పతకాలు సాధించింది. అందులో 9 స్వర్ణాలు, 6 రజతాలు, 7 కాంస్యాలు ఉన్నాయి.



మను



సురుచి



ఇషా



బుధవారం వాటికన్‌లో వారాంతపు సమావేశంలో భారతీయ బృందం తీసుకొచ్చిన మోదీ చిత్రపటంతో కలిసి ఫొటో దిగుతున్న పోప్ లియో-14



ఢిల్లీలోని పాలికా పార్కులో మోదీ 75వ బర్త్‌డేకు గుర్తుగా 75 కేజీల భారీ లడ్డూను ప్రదర్శనకు పెట్టిన దృశ్యం



మోదీ బర్త్‌డే సందర్భంగా బుధవారం ఢిల్లీలో సేవా సంకల్ప్ వాక్ కార్యక్రమంలో రక్తదానం చేస్తున్న ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

శుభాకాంక్షల వెల్లువ

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి ముర్ము, వివిధ దేశాల అధినేతలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 75వ జన్మదినం సందర్భంగా బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతోపాటు వివిధ దేశాల అధినేతలు, పలువురు ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. మోదీ మార్గనిర్దేశకత్వం పట్ల నేడు ప్రపంచ దేశాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయని రాష్ట్రపతి ముర్ము ప్రశంసించారు. గొప్ప లక్ష్యాలు సాధించాలన్న సంకల్పాన్ని దేశంలో పాదుకొల్పారని చెప్పారు. రాష్ట్రపతికి మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. 140 కోట్ల మంది భారతీయులకు మేలు చేయడమే ధ్యేయంగా స్వావలంబన భారత్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నట్లు ఉద్ఘాటించారు. రాష్ట్రపతి ముర్ము దార్శనికత, ఆలోచనలు తమకు స్ఫూర్తిదాయకమని స్పష్టంచేశారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, సినీ నటి, బీజేపీ ఎంపీ హేమా మాలిని తదితరులు మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా ప్రఖ్యాత బాలీవుడ్ నటులు ధర్మేంద్ర, జితేంద్ర, షారూక్ ఖాన్, ఆలియా భట్, అమీర్ ఖాన్, అక్షయ్ కుమార్, అజయ్ దేవగన్, అనుపమ్ ఖేర్, కంగనా రనౌత్, సోనూ సూద్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జాకీ ష్రాఫ్, గాయకురాలు ఆశా భోంస్లే, తెలుగు నటుడు మహేశ్ బాబు, దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి సైతం శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు.

మోదీ తనకు మంచి మిత్రుడు అని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్‌నెతన్యాహు పేర్కొన్నారు. భారత్, ఇజ్రాయెల్ ప్రగతి కోసం తాము కలిసి పని చేస్తామని వెల్లడించారు. రెండు దేశాల భాగస్వామ్యాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని స్పష్టంచేశారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధాని రిషి సునాక్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్, శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిసనాయకే, మైక్రోసాఫ్ట్ సంస్థ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, భూటాన్ ప్రధాని త్సేరింగ్ టాబ్గే, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్, మయన్మార్ అధినేత మిన్ ఆంగ్ హిలాంగ్, గయానా అధినేత ఇర్ఫాన్ అలీ, డొమినికా ప్రధానమంత్రి రూజ్‌వెల్ట్ స్కెరిట్, పపువా న్యూగినియా ప్రధాని జేమ్స్ మరాపే, సైప్రస్ అధ్యక్షుడు నికోస్, బ్రిటిష్ హోం సెక్రెటరీ ప్రీతి పటేల్, మాల్దీవుల మాజీ విదేశాంగ మంత్రి అబ్దుల్లా షహీద్ తదితరులు మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

మోదీ సొంత పట్టణంలో వేడుకలు

ప్రధాని జన్మదినాన్ని పురస్కరించుకొని గుజరాత్‌లోని ఆయన సొంత పట్టణం వాద్‌నగర్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. హాటకేశ్వర మహాదేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులకు మిఠాయిలు పంచిపెట్టారు. స్వచ్ఛతా కార్యక్రమంలో భారీగా జనం పాల్గొన్నారు. రక్తదాన శిబిరం, కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోదీ సోదరుడు సోమాభాయి మోదీ పాల్గొన్నారు. గుజరాతీ సంప్రదాయ జానపద సంగీత కార్యక్రమం సైతం జరిగింది. ప్రధాని మోదీకి వరుసకు సోదరులయ్యే భరత్‌భాయి మోదీ, అశోక్‌భాయి మోదీ ప్రస్తుతం వాద్‌నగర్‌లోని నివసిస్తున్నారు. భరత్‌భాయి మోదీ అద్దె గదిలో కిరాణా దుకాణం నడిపిస్తున్నారు. అశోక్‌భాయి మోదీ భక్తి సంబంధమైన వస్తువులు విక్రయిస్తుంటారు. ఆయన నెల సంపాదన రూ.5,000 మాత్రమే. తాము పేదరికంలో ఉన్నప్పటికీ నరేంద్ర మోదీ నుంచి ఏనాడూ ఎలాంటి సాయం కోరలేదని అశోక్‌భాయి మోదీ చెప్పారు. వాద్‌నగర్‌లో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో ఆయన చిన్ననాటి మిత్రులు కూడా పాల్గొన్నారు.

మోదీ జన్మదినం సేవా దినం

దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు

పాల్గొన్న కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ 75వ జన్మదినం సందర్భంగా బుధవారం దేశవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ నేతలు, కార్యకర్తలు ఉత్సాహం పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పరిశుభ్రతా కార్యక్రమాలు, నిర్వహించారు. స్వదేశీ ఉత్పత్తుల మేళాలు జరిగాయి. మొక్కలు సైతం నాటారు.

- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా హరియాణాలోని రోహ్‌తక్‌లో 'నమో వ్యాన్'ను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు.
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఢిల్లీలో 17 సంక్షేమ పథకాలు ప్రారంభించారు. ఐదు నూతన ఆసుపత్రులు, ఆయుష్మాన్ ఆరోగ్యో మందిర్ క్లినిక్‌లు ప్రారంభించారు. 10 నూతన రిసోర్స్ సెంటర్లకు శ్రీకారం చుట్టారు.
- మోదీ జీవితం, నాయకత్వంపై ప్రత్యేక ప్రదర్శనను కేంద్ర సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా ఢిల్లీ శాసనసభలో ప్రారంభించారు. అలాగే షార్ట్‌ఫిలింను ప్రదర్శించారు.
- ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మంత్రులు రక్తదానం చేశారు. నగరంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. నమో సుగమ్య రథ్, సుగమ్య ఢిల్లీ యాత్రను రేఖా గుప్తా ప్రారంభించారు.
- ఉత్తరాఖండ్‌లో ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ స్వచ్ఛతోత్సవ్-2025ను ప్రారంభించారు. చార్‌ధామ్ క్షేత్రాలతోపాటు ఇతర ఆలయాల్లో మోదీ పేరిట ప్రత్యేక పూజలు జరిగాయి.
- రాజస్తాన్‌లో సీఎం భజన్‌లాల్ శర్మ 'నమో ఎగ్జిబిషన్' ప్రారంభించారు.
- రాజస్తాన్‌లోని కోటా పట్టణంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నమో హెల్త్, న్యూట్రీషన్ క్యాంప్‌లో పాల్గొన్నారు.
- నమో పార్కుల అభివృద్ధికి మున్సిపల్ కౌన్సిళ్లు, పట్టణ కౌన్సిళ్లకు రూ.కోటి చొప్పున అందజేస్తామని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు.
- తమిళనాడులో గవర్నర్ ఆర్.ఎన్.రవి 75 మొక్కలు నాటారు.
- ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా కోటికిపైగా మొక్కలు నాటారు.
- రాజస్తాన్‌లోని అల్వార్‌లో రక్తదాన శిబిరంలో, మొక్కలు నాటే కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ పాలుపంచుకున్నారు.
- అఖిల భారతీయ తేరాపంత్ యువక్ పరిషత్ అనే ప్రభుత్వేతర సంస్థ(ఎన్జీఓ) బ్లడ్ డొనేషన్ క్యాంపులు ఏర్పాటుచేసి, 3 లక్షల యూనిట్ల రక్తం సేకరించింది. సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది.
- చత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి స్వచ్ఛతా హీ సేవా, అగ్నికార్-2025, పీఎం స్వనిధి యోజన 2.0ను ప్రారంభించారు.
- అస్సాంలో రాబోయే 15 రోజులపాటు 14,690 ఆరోగ్య శిబిరాలు నిర్వహించబోతున్నట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ప్రకటించారు.
- జమ్మూకశ్మీర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు.

ఫారోల అమూల్య బ్రాస్‌లెట్ అదృశ్యం

చోరీకి గురైన 3,000 సంవత్సరాల పురాతన ఆభరణం

- కైరోలోని మ్యూజియంలో ఘటన
- జాడ కనిపెట్టేందుకు మొదలైన పోలీసుల వేట



కైరో: ఈజిప్ట్ నాగరికతతో ఫారో చక్రవర్తులకు విడదీయరాని అనుబంధం ఉంది. ఫారో చక్రవర్తుల కాలంలోనే ప్రపంచ ప్రఖ్యాత గిజా పిరమిడ్‌ల నిర్మాణం జరిగింది. అద్భుతమైన పాలనతో మంచి పేరు తెచ్చుకున్న ఫారో చక్రవర్తులకు చెందిన ఒక ముంజేతి కంకణం ఇప్పుడు కనబడకుండా పోయింది. ఈజిప్ట్ రాజధాని కైరో నగరంలోని తహ్రీర్ స్క్వేర్‌లోని ప్రఖ్యాత మూజియంలో చివరిసారిగా ఇది బహిరంగంగా కనిపించింది. మధ్యలో లాపిస్ లజూలీ మణిపూస పొదిగిన ఈ కంకణాన్ని స్వచ్ఛమైన స్వర్ణంతో తయారుచేశారు. మ్యూజియంకు చెందిన పునరుద్ధరణ లేబొరేటరీకి తీసుకురాగా ఆ తర్వాత ఇది కనిపించకుండాపోయిందని ఈజిప్ట్ పర్యాటకం, పురాతత్వ మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. దీనిని దొంగలించిన వ్యక్తులు విదేశాలకు అక్రమ రవాణా చేయొచ్చని ఈజిప్ట్ ప్రభుత్వం అనుమానిస్తోంది. అనుకున్నదే తడవుగా వెంటనే దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, సరిహద్దుల వద్ద తనిఖీలను ముమ్మరంచేసింది. బ్రాస్‌లెట్ ఫొటోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టా గ్రామ్, వాట్సాప్ సహా అన్ని సామాజిక మాధ్యమాల్లో షేర్‌చేస్తోంది.

వేల ఏళ్ల పాత కంకణం

క్రీస్తు పూర్వం 1,076 సంవత్సరం నుంచి క్రీస్తు పూర్వం 723 సంవత్సరాల కాలంలో ఈజిప్ట్‌ను పరిపాలించిన రాజవంశానికి చెందిన అమేనీమోప్ రాజుకు చెందిన కంకణంగా దీనిని గుర్తించారు. తూర్పు నైలు నదీతీర ప్రాంతంలోని టానిస్‌లో ఖననంచేసిన అమేనీమోప్ ఆన్‌ఆర్‌టీ-4 ఛాంబర్‌లో ఈ కంకణాన్ని గతంలో కనుగొన్నారు. తొలుత వేరే చోట అమేనీమోప్ పార్థివదేహాన్ని ఖననం చేసి కొన్నాళ్లకు సుసేన్నెస్ రాజు సమీప ఛాంబర్‌కు మార్చారు. ఈ కాలంలో అత్యంత శక్తివంతమైన రాజుల్లో ఒకడిగా సుసేన్నెస్ వెలుగొందారు. అమేనీమోప్ సమాధాని 1940లో కనుగొన్నారు. ''వేల ఏళ్ల చరిత్ర గల ఇలాంటి కంకణం కనబడకుండా పోవడం వింతేమీ కాదు. వీటికి బహిరంగ మార్కెట్లో చాలా విలువ ఉంది. స్మగ్లర్లు వీటిని దొంగించి విదేశాలకు తరలిస్తారు'' అని బ్రిటన్‌లోని కేంబ్రిడ్జ్ వర్సిటీలో ఫోరెన్సిక్ పురాతత్వవేత్త క్రిస్టోస్ సిరోగియాన్నిస్ చెప్పారు. ''త్వరలోనే ఇది ఎక్కడో, ఏ దేశంలోనో ప్రఖ్యాత వేలం సంస్థ వేలంపాటలోనే, ఆన్‌లైన్‌లోనే ప్రత్యక్షమవుతుంది. ఫారో చక్రవర్తుల వస్తువులను సొంతం చేసుకునే సంపన్నులకూ కొదువలేదు. వాళ్లు వీటిని బ్లాక్‌మార్కెట్‌లో కొని దాచుకుంటారు''అని ఆయన అన్నారు. ''చోరీకి గురై తమ దేశంలోకి వచ్చిన పురాతన వస్తువులను కొన్ని అరబ్ దేశాలు తిరిగి ఈజిప్ట్‌కు అప్పగించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కొన్ని అయితే అధికారికంగా అప్పగించే ఉద్దేశంలేక మ్యూజియం తోటలోనే, ప్రాంగణాల్లోనూ తర్వాత పడేసి వెళ్లిన సందర్భాలు సైతం ఉన్నాయి''అని ఆయన గుర్తుచేశారు. ''కంకణంలోని బంగారం కరిగించి సొమ్ముచేసుకునే అవకాశం చాలా తక్కువ. కరిగిస్తే వచ్చే బంగారం విలువ కన్నా అలాగే కంకణం రూపంలోనే అమ్మితే లెక్కలేనంత సొమ్ము సంపాదించొచ్చు''అని ఆయన వ్యాఖ్యానించారు. ఉత్తర ఆఫ్రికా దేశమైన ఈజిప్ట్‌కు దశాబ్దాలుగా పురాతన వస్తువుల స్మగ్లింగ్ అనేది పెద్ద తలనొప్పిగా తయారైంది. శక్తిమేరకు కాపాడుతున్నా ప్రతి ఏటా ఎక్కడో ఓ చోట ఇలా విలువైన వస్తువులు అదృశ్యమవుతూనే ఉన్నాయి.

పాక్ నకిలీ ఫుట్‌బాల్ జట్టు వెనక్కి

- అనుమానమొచ్చి ఎయిర్‌పోర్ట్‌లో ఆపేసిన జపాన్ అధికారులు
- వెలుగులోకి మానవ అక్రమ రవాణా కేసు

లాహోర్: చిట్టడవులు, కొండ ప్రాంతాలు, సరిహద్దు గుండా ఉగ్రవాదులను పాకిస్తాన్ అక్రమంగా భారత్‌లోకి పంపిస్తుంటే.. ఇదే స్ఫూర్తితో ఒక పాకిస్తానీయుడు తోటి పాకిస్తానీయులను మోసం చేసి జపాన్‌కు పంపించాడు. 'గోల్డెన్ ఫుట్‌బాల్ ట్రయల్' పేరిట ఫుట్‌బాల్ క్లబ్ బృంద సభ్యులుగా జపాన్‌లోకి అడుగుపెట్టిన ఈ నకిలీ ఆటగాళ్లను జపాన్ అధికారులు ఎయిర్‌పోర్ట్‌లోనే అనుమానంతో ఆపేశారు. అట్నుంచి అటే మళ్లీ పాకిస్తాన్‌కు తిరుగుటపా చేశారు. 15 రోజుల తాత్కాలిక పాక్ వీసాతో జపాన్‌కు వచ్చిన 22 మందిని వెనువెంటనే తిరిగి పంపించిన ఘటన జూన్‌లో జరగ్గా చాలా ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. నకిలీ ఫుట్‌బాల్ టీమ్ అంశాన్ని పాకిస్తాన్ దర్యాప్తు సంస్థ.. ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ సీరియస్‌గా తీసుకుంది. 22 మందిని జపాన్‌కు పంపిన మానవ అక్రమ రవాణా కేసులో మాలిక్ వకాస్‌ను ఎఫ్ఐఏ అధికారులు అరెస్ట్‌చేశారు.

ఫుట్‌బాల్ ఆటగాళ్లలాగే

ఫుట్‌బాల్ ఆటగాళ్లమాదిరే నిజమైన టీమ్ జెర్సీ దుస్తుల్లో జపాన్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు. అయితే తర్వాత వీళ్ల ధోరణి చూసి జపాన్ ఇమిగ్రేషన్ అధికారులకు అనుమానమొచ్చి వీళ్లను లోతుగా ప్రశ్నించి అసలు విషయంరాబట్టారు. పాక్ ఎయిర్‌పోర్ట్ అధికారుల కళ్లుగప్పి ఇక్కడిదాకా ఎలా రాగలిగారనే ప్రశ్న జపాన్ అధికారులను తొలచేస్తోంది. పాకిస్తాన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధికారులతో మాలిక్ వక్రాస్‌కు సంబంధం ఉండొచ్చని అనుమానిస్తున్నారు. జపాన్‌కు పంపేందుకు ఈ ఒక్కో అక్రమ వలసదారుడి నుంచి కనీసం 45 లక్షల పాక్ రూపాయలను వసూలుచేసినట్లు తెలుస్తోంది. మాలిక్ జపాన్‌కు ఇలా గతంలోనూ కొందరిని తరలించాడని సమాచారం. ఫోర్జరీ డాక్యుమెంట్లతో 17 మందిని జపాన్‌కు తరలించాడు. ఈ విషయంలో గత ఏడాది జనవరిలో వెలుగులోకి వచ్చింది. అప్పుడు వెళ్లిన వాళ్లెవరూ తిరిగి పాక్‌కు రాలేదు.

'దిశా పటానీ' కాల్పుల ఘటనలో నిందితుల ఎన్‌కౌంటర్

బుల్లెట్ గాయాలతో ఇద్దరూ హతం

న్యూఢిల్లీ: నేరాలను ఏమాత్రం సహించేదిలేదన్న ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అనుకున్నది చేసి చూపించింది. ఒక వర్గం వాళ్లను కించపరిచే వ్యాఖ్యలుచేశారంటూ బాలీవుడ్ నటి దిశా పటానీ సోదరి ఖుష్బూ పటానీపై కక్షపెట్టుకున్న గ్యాంగ్‌స్టర్ బృందసభ్యులు కాల్పులు జరిపిన ఘటనలో ఆ ఇద్దరినీ యూపీ, ఢిల్లీ పోలీసులు అంతంచేశారు. దిశా పటానీకి చెందిన యూపీలోని బరేలీ పట్టణంలోని సొంతింటిపై సెప్టెంబర్ 12న ఇద్దరు ఆగంతకులు తుపాకీల మోత మోగించడం తెల్సిందే. నిందితులను హరియాణాలోని రోహ్‌తక్‌కు చెందిన రవీందర్, సోనీపట్‌కు చెందిన అరుణ్‌గా గుర్తించింది. వీళ్లు ఘాజియాబాద్‌లోని ట్రోనికా సిటీలో ఉన్నట్లు పసిగట్టి వాళ్లపై యూపీ నోయిడా, ఢిల్లీ నేర విభాగ పోలీసుల బృందం దాడిచేసింది. నిందితులిద్దరూ ప్రతిదాడి చేయడంతో పోలీసులు ఎన్‌కౌంటర్ జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు బుల్లెట్ల గాయాలతో మరణించారు. నిందితులను రోహిత్ గోదారా-గోల్డీ బ్రార్ గ్యాంగ్ సభ్యులుగా గుర్తించారు.

భారత కాన్సులేట్‌ను ముట్టడిస్తాం

- కెనడాలో భారతీయ కార్యాలయానికి ఖలిస్తాన్ వేర్పాటువాదుల హెచ్చరిక
- 18న ముట్టడి ఖాయమంటూ బెదిరింపు

ఒట్టావా(కెనడా): భారత్‌పై ఖలిస్తానీ వేర్పాటువాద విషం చిమ్మే ఖలిస్థానీ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జే) సంస్థ ఏకంగా ఇండియన్ కాన్సులేట్‌ను ముట్టడిస్తామని బహిరంగ బెదిరింపులకు దిగింది. కెనడాలోని వాంకోవర్ నగరంలోని భారతీయ కాన్సులేట్ కార్యాలయాన్ని సెప్టెంబర్ 18వ తేదీన ముట్టడించి 12 గంటలపాటు తమ అధీనంలో తెచ్చుకుంటామని అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ఎస్ఎఫ్‌జే ప్రకటించింది. ఖలిస్తానీ వేర్పాటువాద ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జార్‌ను అంతమొందించినందుకు ప్రతీకారంగా భారత కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎస్ఎఫ్‌జే బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ మేరకు ఒక పోస్టర్ సైతం విడుదలచేసింది. ఆ పోస్టర్‌లో కెనడాలోని భారత హైకమిషనర్ దినేశ్ పట్నాయక్ ఫొటోను ముద్రించింది. దీంతో కెనడా కేంద్రంగా ఖలిస్తానీవేర్పాటువాదుల తాజాగా భారత్, కెనడా సత్సంబంధాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశాలు ఎక్కువయ్యాయి. ఎస్ఎఫ్‌జేను భారత సర్కార్ 2019లోనే ఉగ్రసంస్థగా ప్రకటించింది. బుధవారం ఎస్ఎఫ్‌జే ఒక ప్రకటన విడుదలచేసి అందులో భారత్‌పై తన విద్వేషాగ్ని వెదజల్లింది. ''ఖలిస్తానీ మద్దతుదారులపై కెనడాలో భారత ఏజెన్సీలు నిఘా పెట్టాయి. కెనడాలో హిందుత్వ ఉగ్రవాదాన్ని దినేశ్ ముందుండి నడిపిస్తున్నారు. కెనడా గడ్డపై భారతప్రభుత్వ ఖలిస్తాన్ వ్యతిరేక కార్యకలాపాలను నిరసిస్తూ 18న వాంకోవర్‌లో ఇండియన్ కాన్సులేట్‌ను సీజ్ చేయబోతున్నాం. కాన్సులేట్‌ను సీజ్ చేయడం ద్వారా ఖలిస్తానీ సానుభూతిపరులు నిజ్జర్‌కు ఘన నివాళులర్పిస్తారు. నిజ్జర్ హత్యకు కాన్సులేట్ బాధ్యత వహించాలని డిమాండ్‌చేస్తారు'' అని ఎస్ఎఫ్‌జే పేర్కొంది. బ్రిటిష్ కొలంబియాలోని సర్రే సిటీలో గురుద్వారా ప్రాంగణంలో నిజ్జర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు షూట్‌చేసిచంపేయగా అది భారత 'రా'ఏజెంట్ల రహస్య ఆపరేషన్ అని కెనడాలోని సిక్కు వేర్పాటువాద సంస్థలు ఆరోపించడం తెల్సిందే. తమ దేశంలో భారతీయ దర్యాప్తు, నిఘా ఏజెన్సీలు అక్రమంగా పనిచేస్తున్నాయని నాటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పార్లమెంట్‌వేదికగా చేసిన వ్యాఖ్యలతో భారత్, కెనడా దౌత్యసంబంధాలు దారుణంగా దెబ్బతిన్న విషయంవిదితమే. ఇరువైపులా దౌత్యాధికారులను వెనక్కి పిలిపించడం, ఎంబసీలు, కాన్సులేట్ల సిబ్బంది సంఖ్యను కుదించడం వంటి పరిణామాలెన్నో జరిగాయి. అయితే ఇటీవల కెనడాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మార్క్ కార్నీ విజయంతో ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణ మొదలైంది.

ఆ దేవుడినే అడగండి

ఖజురహో ఆలయాల్లో విష్ణుమూర్తి విగ్రహ పునరుద్ధరణ పిటిషన్ కొట్టేస్తూ సీజేఐ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ధ్వంసమైన ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహాన్ని పునరుద్ధరించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టేసింది. మధ్యప్రదేశ్‌లోని ఛాతర్‌పూర్‌జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన ప్రఖ్యాత ఖజురహో ఆలయ సముదాయంలోని జవారీ ఆలయంలో విష్ణుమూర్తి విగ్రహం ధ్వంసమైన విషయం తెల్సిందే. ఈ విగ్రహాన్ని పక్కనబెట్టి కొత్త విగ్రహాన్ని ప్రతిష్టించేలా ఆదేశాలు ఇవ్వాలని రాకేశ్ దలాల్ అనే వ్యక్తి ఈ పిల్ వేశారు. ఈ పిల్ స్వీకరణ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రనల్ ధర్మాసనం పరిశీలించింది. ''ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం కాదు. పబ్లిసిటీ ప్రయోజన వ్యాజ్యం. ఇందులో మేం చేసేది ఏం లేదు. భారత పురతత్వ విభాగం(ఏఎస్ఐ) పరిధిలో ఆలయం ఉంది. వాళ్లనే అభ్యర్థించండి. లేదంటే మీరెలాగూ విష్ణుమూర్తికి పరమభక్తుడిని అని చెబుతున్నారుగా. ఆయననే వేడుకోండి. శైవత్వానికి మీరు వ్యతిరేకులు కాకపోతే అదే ఖజురహోలో అతిపెద్ద శివలింగం ఉంది. అక్కడ కూడా మీరు విన్నవించుకోవచ్చు. విగ్రహ పునరుద్ధరణ, పునర్‌నిర్మాణంపై ఏఎస్ఐ తుది నిర్ణయం తీసుకుంటుంది'' అని అన్నారు.

24న పట్నాలో సీడబ్ల్యూసీ భేటీ

- బిహార్ ఎన్నికలపై మేధోమథనం చేయనున్న కాంగ్రెస్
- ఓట్ల చోరీ అంశంపై విస్తృతంగా చర్చించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల అంశం సహా దేశ రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఈ నెల 24వ తేదీన బిహార్ రాజధాని పట్నాలో సమావేశం కానుంది. ఇందులో పార్టీ అగ్రనాయకత్వం అంతా కలిసి బిహార్ అసెంబ్లీ ఎన్నికలపై మేధోమథనం చేయనుంది. 'ఓటు చోరీ' అంశంపై బీజేపీపై పోరును తీవ్రతరం చేసే అంశాలపై ఇందులో చర్చించనుందని పార్టీ వర్గాలు తెలిపాయి. 24వ తేదీ ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు శాశ్వత, ప్రత్యేక ఆహ్వానితులు, పార్టీ ముఖ్యమంత్రులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు పాల్గొననున్నారు. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో పొత్తులు, సీట్ల పంపకాలు, తీసుకోవాల్సిన ఎన్నికల కార్యాచరణ, భవిష్యత్తు ఎన్నికలను ఎదుర్కొనే వ్యూహాలు, వివిధ రాష్ట్రాల్లోనూ ఓట్ల చోరీ, ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)లపై ఎన్నికల కమిషన్ వాదనాలు సహా పలు అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై చర్చిస్తారని తెలుస్తోంది.

ప్రధాని మోదీ బయోపిక్‌లో ముకుందన్

తిరువనంతపురం: ప్రముఖ మలయాళం నటుడు ఉన్ని ముకుందన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌లో నటిస్తున్నారు. అన్ని ప్రధాన భారతీయ భాషల్లో నిర్మితంకానున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. 'మా వందే' అనే పేరుతో తీస్తున్న ఈ సినిమాలో ముకుందన్ మోదీ పాత్రలో నటించనున్నారు. బుధవారం మోదీ 75వ జన్మదినం సందర్భంగా ముకుందన్ ఈ మేరకు తన ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో ప్రకటించారు. ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు క్రాంతి కుమార్ సీహెచ్ దర్శకత్వం వహించనున్నారు. 'నేను అహ్మదాబాద్‌లో పెరిగాను. నా చిన్నతనంలో మోదీ ముఖ్యమంత్రిగా తెలుసు. చాలాఏళ్ల తర్వాత 2023 ఏప్రిల్‌లో నేను వ్యక్తిగతంగా ఆయనను కలిశాను. ఆ రోజును నేనెప్పటికీ మరిచిపోలేను' అని ముకుందన్ చెప్పారు. 'అతని రాజకీయ ప్రయాణం అసాధారణమైనది. కానీ ఈ చిత్రంలో రాజనీతిజ్ఞుడికి అతీతంగా ఉన్న వ్యక్తిని, తల్లితో అతని లోతైన బంధాన్ని అన్వేషించడమే మా లక్ష్యం' అని ముకుందన్ చెప్పారు. ఆయన తనతో గుజరాతీలో చెప్పిన రెండు మాటలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. పరిస్థితులకు ఎప్పుడూ తలొగ్గద్దు అని చెప్పారని, ఆ మాటలు తనకు మరింత బలాన్నిచ్చాయని పేర్కొన్నారు.

చిన్నారికి రాహుల్ కానుక

చండీగఢ్: వరదల్లో సైకిల్ దెబ్బతినిందని విలపించిన చిన్నారికి కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ కొత్త సైకిల్ బహుమతిగా ఇచ్చారు. ఈ మేరకు అమృత్‌పాల్ సింగ్ అనే ఆరేళ్ల చిన్నారి రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు చెప్పిన వీడియోను పంజాబ్‌కు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు మీడియాకు విడుదల చేశారు. కొత్త సైకిల్ నీకు నచ్చిందా అని అమృత్‌పాల్ సింగ్‌ను రాహుల్ అడిగినట్లు ఆ వీడియోలో ఉంది. ఈనెల 15న పంజాబ్‌లో వరద ప్రభావితప్రాంతాల్లో రాహుల్‌గాంధీ పర్యటించారు. అమృత్‌సర్‌లోని ఘోనేవాల్ అనే గ్రామంలో అమృత్‌పాల్ ఇంటిని రాహుల్ సందర్శించారు. అప్పుడు ఆ చిన్నారి ఏడుస్తూ తన సైకిల్ పాడైపోయిందంటూ ఏడిచాడు. దీంతో రాహుల్ ఆ బాబును హత్తుకొని నీకు కొత్త సైకిల్ కొనిస్తానంటూ ఓదార్చాడు. అప్పుడు ఇచ్చిన హామీ మేరకు రాహుల్ కొత్త సైకిల్‌ను బహుమతిగా ఇచ్చారు. దీనికి అమృత్‌పాల్ తండ్రి రవిదాస్ సింగ్ రాహుల్‌గాంధీకి ధన్యవాదాలు తెలిపారు.

గిరిజన మహిళకు వజ్రాలు దొరికాయ్!

పన్నా: మధ్యప్రదేశ్ పన్నా జిల్లాలోని గనిలో ఓ గిరిజన మహిళకు మూడు విలువైన వజ్రాలు దొరికాయి. వీటి విలువ రూ.లక్షల్లో ఉంటుందని పన్నాకు చెందిన డైమండ్ ఆఫీసర్ అనుపమ్ సింగ్ మంగళవారం చెప్పారు. 1.48 కేరట్లు, 20, 7 సెంట్ల బరువున్న ఈ విలువైన రాళ్లను వేలంలో పెడతామని, అప్పుడు వాటి వాస్తవ విలువ ఎంతో తెలుస్తుందని తెలిపారు. వీటిలో ఒక వజ్రం మంచి నాణ్యతతో ఉందని, దీని ధర చాలా ఎక్కువగా ఉంటుందని, మిగిలిన రెండు తక్కువ నాణ్యతతో ఉన్నాయన్నారు. రాజ్‌పూర్ జిల్లాకు చెందిన వినితా గోండ్ అనే గిరిజనవాసి డైమండ్ ఆఫీసు అనుమతితో పాటీ ప్రాంతంలో ఓ గనిని లీజుకు తీసుకున్నారని, ఇందులోనే ఆ మహిళకు వజ్రాలు దొరికాయని చెప్పారు.

అలెక్సీ నవాల్నీపై విష ప్రయోగం

నవాల్నీ భార్య ఆరోపణ



మాస్కో: రష్యా అధినేత పుతిన్ రాజకీయ ప్రత్యర్థి అలెక్సీ నవాల్నీ మృతివెనుక ముమ్మాటికీ కుట్ర ఉందని ఆయన భార్య యూలియా నవాల్నీ ఆరోపించారు. తన భర్తపై విష ప్రయోగం జరిగినట్లు పరీక్షల్లో తేలిందని బుధవారం చెప్పారు. రెండు ల్యాబ్ రిపోర్టులు ఇదే విషయం నిర్ధారిస్తున్నాయ ని పేర్కొన్నారు. తన భర్త మృతదేహం నుంచి నమూనాలు సేకరించి, విదేశాలకు తరలించినట్లు చెప్పారు. అక్కడే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 2024 ఫిబ్రవరిలో రష్యాలోని ఆర్కిటిక్ పెనాల్ కాలనీ జైలులో అలెక్సీ నవాల్నీ(47) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అనారోగ్యంతో ఆయన చనిపోయినట్లు అప్పట్లో అధికార వర్గాలు తెలిపాయి. పూర్తి వివరాలు బయటపెట్టేందుకు నిరాకరించాయి. పుతిన్ అవినీతిపై అలెక్సీ గళమెత్తారు. పుతిన్‌కు వ్యతిరేకంగా పలు ప్రదర్శనలు నిర్వహించారు. పోరాటం ప్రారంభించారు. ప్రభుత్వాన్ని కూల్చడానికి కుట్ర చేస్తున్నారని, ప్రజలను రెచ్చగొడుతున్నారని పుతిన్ సర్కార్ ఆయనపై అభియోగాలు మోపింది. 19 ఏళ్లపాటు జైలు శిక్ష విధించింది.

22 రోజులతర్వాత మొదలైనా... యాత్రకు తప్పని తిప్పలు

ఉదయం మొదలై సాయంత్రానికి ఆగిన వైష్ణోదేవి ఆలయ యాత్ర

కత్రా: జమ్మూకశ్మీర్‌లోని త్రికూట పర్వతాల్లో కొలువైన మాతా వైష్ణోదేవిని ఎట్టకేలకు 22 రోజుల నిరీక్షణ తర్వాతైనా దర్శనం చేసుకుందామనుకున్న భక్తుల ఆశ కొన్ని గంటల్లోనే ఆవిరైంది. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో ఆగస్ట్ 26న యాత్రను నిలిపేయగా 22 రోజుల తర్వాత బుధవారం ఉదయం ఆరు గంటలకు యాత్రను పునఃప్రారంభించారు. అయితే సాయంత్రం ఐదున్నర గంటలకు కారుమబ్బులు దట్టంగా కమ్ముకుని కుంభవృష్టి సూచన రావడంతో వెంటనే శ్రీమాతా వైష్ణోదేవి ఆలయ బోర్డ్ యాత్రను వెంటనే నిలిపేసింది. ఉదయం ఆరుగంటలకు రెండు భిన్న మార్గాల్లో 2,500 మంది భక్తులను బేస్‌క్యాంప్ నుంచి దర్శనాలకు అనుమతించగా సాయంత్రంకల్లా ఇలా యాత్ర నిలిచిపోయింది.

ప్రతాపరుద్రుడి మరణం... కాకతీయ వంశం అంతం

'ప్రతాపరుద్ర చరిత్ర' ప్రకారం ప్రతాపరుద్రుడికి విశాలాక్షి అనే భార్య ఉంది. లక్ష్మీదేవి అనే భార్య ఉన్నప్పటికీ వారికి సంతానం లేదని ఎలిగేడు శాసనం ద్వారా తెలుస్తోంది. అయితే ప్రతాపరుద్రుడికి వీరభద్రుడు, అన్నమదేవుడు అనే కుమారులు ఉన్నారని, వారు రాజ్యపాలన చేశారని కథనాలున్నాయి. కానీ అవి నిర్ధారణ కాలేదు. అందువల్ల ప్రతాపరుద్రుడితోపాటే కాకతీయ సామ్రాజ్యం, కాకతీయవంశం అంతరించిందని చెప్పవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



కాకతీయులపై ఢిల్లీ దండయాత్రలు

ప్రతాపరుద్రుడు రాజ్యాన్ని సుస్థిర పరుచుకుంటుండగా ఉత్తర భారతదేశంలో అనేక మార్పులు సంభవించాయి.

ఖిల్జీ వంశం

మాలిక్ ఫిరోజ్.. ఖిల్జీ తెగకు చెందినవాడు. ఇతడి పూర్వీకులు తుర్కిస్తాన్ నుంచి అఫ్గానిస్తాన్ వచ్చారు. అక్కడి నుంచి ఢిల్లీ చేరి తురుష్క సుల్తాన్ల కొలువులో చేరారు. మాలిక్ ఫిరోజ్ (జలాలుద్దీన్ ఫిరోజ్ ఖిల్జీ) సుల్తాన్ల వద్ద ఉన్నత పదవులు పొందాడు. సుల్తాన్ వారసుల్ని చంపి క్రీ.శ.1290లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. జలాలుద్దీన్ అల్లుడైన గర్షాస్ప్ మాలిక్(అల్లా ఉద్దీన్ ఖిల్జీ) తన మామను చంపి క్రీ.శ.1296లో ఢిల్లీ సుల్తానుగా ప్రకటించుకున్నాడు. తర్వాత దాదాపు ఉత్తర భారతం అంతటినీ జయించాడు. అనంతరం దక్షిణ భారతాన్ని జయించాలని సంకల్పించాడు. అప్పటికి దక్షిణాదిలో దేవగిరి, హోయసాల, కాకతీయ రాజ్యాలు బలంగా ఉండేవి. వింధ్య పర్వతాలను దాటి దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు అల్లా ఉద్దీన్ ఖిల్జీ. చక్రవర్తి కాకముందే క్రీ.శ.1294లో దేవగిరి మీద దండెత్తి విజయం సాధించాడు.

చక్రవర్తి అయ్యాక జరిపిన దండయాత్రల్లో భాగంగా అల్లా ఉద్దీన్ క్రీ.శ.1303లో కాకతీయ సామ్రాజ్యంపై దండెత్తాడు. మాలిక్ ఫక్రుద్దీన్ జునా,ఝాజా నాయకత్వంలో అల్లా ఉద్దీన్ సైన్యం కాకతీయ రాజ్యంపై దండెత్తింది. ఇది తురుష్కుల మొదటి దండయాత్ర. ఖిల్జీ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఉప్పరపల్లి వద్ద ఓడించింది. ఇది అల్లా ఉద్దీన్ తొలి పరాజయం. ముస్లింల ఓటమికి రేచర్ల ప్రసాదిత్యుడి కుమారుడు వెన్నమ కారణమని 'వెలుగోటి వంశావళి' తెలుపుతోంది. మనసర్లోదారి రాజు, అయన దేవులు ముస్లింల ఓటమికి కారకులని ఓరుగల్లు కోటలోని స్తంభ శాసనం తెలుపుతోంది. ప్రతీకారేచ్ఛతో అల్లా ఉద్దీన్ ఖిల్జీ రెండోసారి దండెత్తాడు. ఈసారి అతడి సేనలకు మాలిక్ కఫూర్ నాయకత్వం వహించాడు. 25 రోజుల ముట్టడి తర్వాత ప్రజల కష్ట నష్టాలను చూడలేక ప్రతాపరుద్రుడు మాలిక్ కఫూర్‌కి అపార ధనరాశులు, ఏనుగులు ఇచ్చి సంధి చేసుకున్నాడు. కప్పం చెల్లించి అల్లా ఉద్దీన్ ఖిల్జీని సార్వభౌముడిగా గుర్తించాడు. ఈ దండయాత్రతో దక్షిణ భారతదేశంలోని రాజ్యాలన్నీ ఢిల్లీ సార్వభౌమత్వాన్ని అంగీకరించాయి.

తిరుగుబాట్ల అణచివేత

ముస్లింల చేతిలో ప్రతాపరుద్రుడు ఓటమి పొందడంతో ఇదే అదనుగా కొందరు సామంతరాజులు తిరుగుబాటు చేశారు. వారిలో కాయస్థ మల్లిదేవుడు, నెల్లూరు రంగనాథుడు ముఖ్యులు. ప్రతాపరుద్రుడు మల్లిదేవుడిపై జుట్టయలెంక గొంకయరెడ్డి నాయకత్వంలో సేనను పంపాడు. అతడు మల్లిదేవుడిని ఓడించి చంపాడు.గొంకయరెడ్డిని ప్రతాపరుద్రుడు ఆ ప్రాంత పాలకుడిగా నియమించాడు. ఈ యుద్ధాలు, తురుష్కుల దండయాత్రలు (క్రీ.శ.1315 నాటికి) ఢిల్లీ సుల్తాన్‌కు కప్పం చెల్లించాల్సి రావడంతో ఖజానా ఖాళీ అయింది. కోశాగారాన్ని నింపడానికి ప్రతాపరుద్రుడు ఎన్నో ప్రయత్నాలు చేశాడు. కడప, కర్నూలు, పల్నాడు ప్రాంతాల్లో అడవులను నరికించి భూములను వ్యవసాయ యోగ్యం చేయించాడు. చెరువులు, బావులు తవ్వించాడు. ఫలితంగా అనేక కొత్త గ్రామాలు, నగరాలు ఏర్పడ్డాయి. క్రమంగా రాజ్య ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

క్రీ.శ.1316లో అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించాడు. ఢిల్లీపై అధికారం కోసం కొంత కాలం అంతఃకలహాలు చేలరేగిన తర్వాత ఖిల్జీ మూడో కుమారుడైన ముబారక్ షా సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఈ అంతఃకలహాలను అవకాశంగా తీసుకొని ప్రతాపరుద్రుడు కప్పం చెల్లించడం మానేశాడు. దీనికి ఆగ్రహించిన ముబారక్‌షా ఖిల్జీ కాకతీయ ప్రతాపరుద్రునిపై దండెత్తి కప్పం వసూలు చేశాడు. తెలుగుదేశంపై ఢిల్లీ సామ్రాజ్య అధికారాన్ని తిరిగి స్థాపించాడు. ఇది తురుష్కుల మూడో దండయాత్ర. ఇంతలో ముబారక్ షాను చంపి నాసిరుద్దీన్ ఖుస్రూ ఖాన్ క్రీ.శ.1320లో చక్రవర్తి అయ్యాడు.

తుగ్లక్ వంశం

ఢిల్లీ సుల్తాన్ల అధికారిగా, పంజాబ్ పాలకుడిగా ఉన్న ఘాజీ మాలిక్ ఖుస్రూ ఖాన్‌ను వధించి ఘియాజుద్దీన్ తుగ్లక్‌షా పేరుతో క్రీ.శ.1320లో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడు. తన పెద్ద కుమారుడు ఫక్రుద్దీన్ మహ్మద్ (ఉలూఘ్ ఖాన్ /మహమ్మద్ బిన్ తుగ్లక్)ను క్రీ.శ. 1321లో ఓరుగల్లుపై దండయాత్రకు పంపాడు. ఉలూఘ్ ఖాన్ స్వయంగా ఓరుగల్లు కోటను ఆరు నెలలపాటు ముట్టడించాడు. కానీ కోట స్వాధీనం కాలేదు. సుల్తాన్ మరణించాడని ఉబైద్ దుష్ప్రచారం చేయడంతో ముస్లింసేనలో కలకలం రేగింది. సైన్యంలో చాలాభాగం పారిపోయింది. దీంతో ఉలూఘ్ ఖాన్ ముట్టడి ఆపివేశాడు. పారిపోతున్న ముస్లిం సైన్యంపై కాకతీయ సైనికులు దాడిచేసి కోటగిరి దాకా తరిమివేశారు. ఇది తురుష్కుల నాలుగో దండయాత్ర.

ఓడిపోయి దేవగిరికి చేరిన ఉలూఘ్ ఖాన్ ఢిల్లీ నుంచి వచ్చిన కొత్త సైన్యంతో క్రీ.శ.1323లో తిరిగి ఓరుగల్లుపై దండెత్తాడు. ఉలూఘ్ ఖాన్ అంత తొందరగా తిరిగి దాడి చేస్తాడని ఊహించని ప్రతాపరుద్రుడు తగిన యుద్ధ సన్నాహాలు చేయలేదు. అయినప్పటికీ అయిదునెలలపాటు కోటను కాపాడగలిగాడు. ఇది తురుష్కుల అయిదో దండయాత్ర. లొంగిపోయిన ప్రతాపరుద్రుడిని ఖాదిర్‌ఖాన్, ఖ్వాజీ హాజీ అనే సేనానుల రక్షణలో ఉలూఘ్ ఖాన్ ఢిల్లీకి పంపాడు. కానీ ప్రతాపరుద్రుడు ముస్లిం సైనికుల అవమానాలను భరించలేక నర్మదానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రతాపరుద్రుడి మరణంతో కాకతీయ వంశం అంతమైంది. ఈ ప్రాంతం ఢిల్లీ సుల్తానుల రాజ్యంలో 23వ రాష్ట్రమైంది. క్రీ.శ.1325లో ఉలూఘ్ ఖాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ పేరుతో ఢిల్లీ సింహాసనం అధిష్ఠించి ప్రతినిధుల ద్వారా తెలంగాణను పాలించాడు.

మాదిరి ప్రశ్నలు

1. రుద్రమదేవికి ఎంతమంది కుమార్తెలు?
   1) 4 2) 2 3) 3 4) 5
2. నాయంకర వ్యవస్థను పునర్వ్యవస్థీకరించింది?
   1) గణపతిదేవుడు 2) రుద్రమదేవి
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రదేవుడు
3. దక్షిణాపథంపై దండెత్తిన తొలి ముస్లిం పాలకుడు?
   1) మహమ్మద్ బిన్ తుగ్లక్
   2) అల్లా ఉద్దీన్ ఖిల్జీ 3) ఘియాజుద్దీన్ ఖిల్జీ
   4) ఫిరోజ్‌షా తుగ్లక్
4. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కాకతీయ సామ్రాజ్యంపై మొదటిసారి దండెత్తిన సంవత్సరం?
   1) క్రీ.శ.1300 2) క్రీ.శ.1303
   3) క్రీ.శ.1301 4) క్రీ.శ.1304
5. అల్లా ఉద్దీన్ సైన్యాన్ని కాకతీయ సైన్యం ఏ ప్రాంతం వద్ద ఎదిరించి ఓడించింది?
   1) పానగల్లు 2) ఏలకుర్తి
   3) పిల్లలమర్రి 4) ఉప్పరపల్లి
6. అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఓరుగల్లుపై రెండోసారి దండెత్తినప్పుడు సేనలకు నాయకత్వం వహించింది ఎవరు?
   1) మాలిక్ ఫక్రుద్దీన్ 2) ఝాజ
   3) మాలిక్ కఫూర్ 4) ముబారక్ షా
7. అల్లా ఉద్దీన్ ఖిల్జీ మరణించిన సంవత్సరం?
   1) క్రీ.శ.1313 2) క్రీ.శ.1316
   3) క్రీ.శ.1314 4) క్రీ.శ.1317
8. ముబారక్‌షా ఖిల్జీ ప్రతాపరుద్రుడిపై దండయాత్రకు ఎవరి ఆధ్వర్యంలో సైన్యాన్ని పంపాడు?
   1) మాలిక్ కఫూర్ 2) మాలిక్ ఫక్రుద్దీన్
   3) ఝాజ 4) ఖుస్రూ ఖాన్
9. ఓరుగల్లుపై నాలుగో దండయాత్ర చేసిన ఢిల్లీ సేనాధిపతి?
   1) ఖుస్రూఖాన్ 2) ఉలూఘ్ ఖాన్
   3) మాలిక్ కఫూర్ 4) ఝాజ
10. ప్రతాపరుద్రుడు మరణించిన సంవత్సరం?
   1) క్రీ.శ.1320 2) క్రీ.శ.1321
   3) క్రీ.శ.1323 4) క్రీ.శ.1325
11. ప్రతాపరుద్రుడు ఏ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని చరిత్రకారుల అభిప్రాయం?
   1) గోదావరి 2) నర్మద
   3) కృష్ణా 4) తుంగభద్ర
12. ఉలూఘ్ ఖాన్ మరో పేరు?
   1) ఘియాజుద్దీన్ తుగ్లక్
   2) ముబారక్ షా 3) మహ్మద్ బిన్ తుగ్లక్
   4) ఫిరోజ్‌షా తుగ్లక్
13. రేచర్ల రెడ్ల వంశ మూలపురుషుడు?
   1) రేచర్ల బేతిరెడ్డి
   2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
   4) రెండో కాటచమూపతి
14. పిల్లలమర్రి పట్టణాన్ని నిర్మించింది?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల బమ్మిరెడ్డి
   3) రేచర్ల నాగిరెడ్డి 4) ఎవరూ కాదు
15. రేచర్ల రెడ్లలో మొదటి రాజు?
   1) రేచర్ల బేతిరెడ్డి
   2) రేచర్ల బమ్మిరెడ్డి 3) రేచర్ల నాగిరెడ్డి
   4) రెండో కాటచమూపతి
16. రెండో కాటచమూపతి రాజ్య రాజధాని?
   1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
   3) ఆమనగల్లు 4) పానగల్లు
17. రుద్రదేవుడు బేతిరెడ్డికి ఏ రాజ్యానిచ్చి సామంతుడిగా చేసుకున్నాడు?
   1) ఏలకుర్తి 2) పిల్లలమర్రి
   3) ఆమనగల్లు 4) దేవరకొండ
18. మొదటి ప్రతాపరుద్రుడని ఎవరిని పిలుస్తారు?
   1) రెండో ప్రోలరాజు 2) రెండో బేతరాజు
   3) జాయప సేనాని 4) రుద్రదేవుడు
19. రేచర్ల రెడ్డి రాజుల్లో ప్రసిద్ధుడు?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల నామిరెడ్డి
   3) రేచర్ల రుద్రారెడ్డి 4) రెండో కాటచమూపతి
20. పిల్లలమర్రిలో ఎరకేశ్వర, కాచేశ్వర, నామేశ్వర దేవాలయాలను కట్టించినవాడు?
   1) రేచర్ల బేతిరెడ్డి 2) రేచర్ల రుద్రారెడ్డి
   3) రేచర్ల లోకిరెడ్డి 4) రేచర్ల నామిరెడ్డి
21. 'కాకతీయ రాజ్య భార ధౌరేయు' అని పేరొందింది ఎవరు?
   1) రేచర్ల రుద్రారెడ్డి 2) రేచర్ల చెవిరెడ్డి
   3) రేచర్ల కాటిరెడ్డి 4) రేచర్ల లోకిరెడ్డి
22. భేతాళరెడ్డి అని మరోపేరు ఎవరికి ఉంది?
   1) మల్లారెడ్డి 2) చెవిరెడ్డి
   3) కాటిరెడ్డి 4) లోకిరెడ్డి
23. ఎవరి వంశస్థులు కాలక్రమంలో రేచర్ల పద్మనాయకులు అయ్యారు?
   1) మల్లారెడ్డి 2) కోటిరెడ్డి
   3) లోకిరెడ్డి 4) చెవిరెడ్డి
24. కింద పేర్కొన్న ఏ దేవాలయాలు అజంతా తర్వాత ప్రాచీనమైనవని చరిత్రకారుల అభిప్రాయం?
   1) పిల్లలమర్రి 2) పానగల్లు
   3) కొలనుపాక 4) ఓరుగల్లు
25. చెరకురెడ్డి వంశస్థుల తొలి రాజధాని?
   1) పిల్లలమర్రి 2) పానగల్లు
   3) జమ్ములూరు 4) కొలనుపాక
26. విరియాల వంశంలో సుప్రసిద్ధుడు?
   1) పోరంటి వెన్న 2) ఎర్రభూపతి
   3) ఎర్ర నరేంద్రుడు 4) దన్నసేనాని

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 2	5) 4
6) 3	7) 2	8) 4	9) 2	10) 3
11) 2	12) 3	13) 2	14) 1	15) 4
16) 1	17) 3	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 4	24) 1	25) 3
26) 3				

విమర్శ ప్రధానాంశంగా ఉండే ప్రక్రియ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు (ఎస్‌జీటీ)

కావ్య ప్రక్రియలు – లక్షణాలు

నవల

క్రీ.శ. 19వ శతాబ్దిలో ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో ఎన్నో సృజనాత్మక వచన సాహితీ ప్రక్రియలు వచ్చాయి. ఆంగ్లం నుంచి పుట్టిన వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది 'నవల'. ఆధునిక సాహిత్య ప్రక్రియలో ఎక్కువ జనాదరణ పొందిన ప్రక్రియ కూడా ఇదే. ఈ ప్రక్రియ మొదటిసారిగా ఇటలీలో ప్రారంభమైంది.

- నవల అనే పదం Novel (నోవెల్) అనే ఆంగ్లపదం నుంచి వచ్చింది.
- తెలుగులో మొదట నవలను వచన ప్రబంధం అని, నవీన ప్రబంధం అని, గద్య ప్రబంధం అని వ్యవహరించేవారు.
- నరహరి గోపాల కృష్ణమచెట్టి నవలను మొదట నవీన ప్రబంధం అన్నారు.
- కందుకూరి వీరేశలింగం దీన్ని వచన ప్రబంధంగా పేర్కొన్నారు.
- తెలుగులో నవలా ప్రక్రియకు నామకరణం చేసినవారు – కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి.

నవల – నిర్వచనాలు:

- యథార్థ జీవితాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల. – రిచర్డ్ క్రాస్
- నవాస్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవల. – కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి
- సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, ప్రజల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల. –శ్రీ మొదలి నాగభూషణ శర్మ

ముఖ్యమైన నవలలు:

- తొలి తెలుగు నవల – **రంగరాజ చరిత్ర**
- నరహరి గోపాలకృష్ణమచెట్టి రాసిన రంగ రాజ చరిత్ర అనే నవలకు సోనాబాయి పరిణయం అనే నామాంతరం ఉంది.
- సమగ్ర నవలా లక్షణాలతో వెలసిన మొదటి నవలగా కందుకూరి వీరేశలింగం రాసిన రాజశేఖర చరిత్ర ప్రసిద్ధికెక్కింది. దీనికి 'వివేక చంద్రిక' అనే పేరు కూడా ఉంది.

నవల పేరు- కర్తలు

రాజశేఖర చరిత్ర (1878), సత్యరాజా పూర్వదేశ యాత్రలు – కందుకూరి వీరేశలింగం
గణపతి (తొలి హాస్య నవల) – చిలకమర్తి లక్ష్మీనరసింహం
హిమబిందు – అడవి బాపిరాజు
మాతృమందిరం – వేంకట పార్వతీశ కవులు
మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ
మైదానం, దైవమిచ్చిన భార్య – గుడిపాటి వెంకటాచలం
వేయిపడగలు, ఏకవీర – విశ్వనాథ సత్యనారాయణ
బారిష్టరు పార్వతీశం – మొక్కపాటి నరసింహశాస్త్రి
రక్షాబంధనం, శ్మశాన వాటిక – శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
చదువు – కొడవటిగంటి కుటుంబరావు
అసమర్థుని జీవయాత్ర, పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా– త్రిపురనేని గోపీచంద్
చివరకు మిగిలేది? – బుచ్చిబాబు
అల్పజీవి – రాచకొండ విశ్వనాథశాస్త్రి
కీలుబొమ్మలు – జి.వి. కృష్ణారావు
అంపశయ్య – నవీన్
తులసిదళం – యండమూరి వీరేంద్రనాథ్
కాలాతీత వ్యక్తులు – శ్రీదేవి
బలిపీఠం – ముప్పాళ్ల రంగనాయకమ్మ

నాటకం

సాహిత్య ప్రక్రియల్లో అత్యంత శక్తిమంతమైన, విశిష్టమైన ప్రక్రియ 'నాటకం'. ఇది పాఠకుల హృదయాలను రంజింపజేయడంలో ఉత్తమమైంది. తెలుగు నాటక రంగానికి మహోజ్వల చరిత్ర ఉంది. నాటకం దృశ్య ప్రక్రియకు చెందింది. ఇది లలిత కళలతో సమాహారకళగా ప్రసిద్ధికెక్కింది. క్రీ.శ. 19వ శతాబ్ది చివరి భాగంలో కోరాడ రామచంద్రశాస్త్రి రాసిన మంజరీ మధుకరీయం (1860)తో ఆధునిక తెలుగు నాటకం ప్రారంభమైంది.

నాటకం – నిర్వచనాలు:

- కావ్యేషు నాటకం రమ్యం – **భరతుడు (నాట్యశాస్త్రం)**
- నాటకాంతం హి సాహిత్యం – **అభినవ గుప్తుడు (అభినవ భారతి)**
- మంగళాది, మంగళమధ్య, మంగళాంతః నాటకం – **భారతీయ లాక్షణికులు**

నాటకం- లక్షణాలు:

1. నాంది 2. ప్రస్తావన
3. విష్కంభం 4. అంకవిభజన
5. పంచసంధులు 6. భరతవాక్యం

కథ- కథానిక

ప్రాచీన సంప్రదాయ ప్రక్రియ 'కథ' అయితే, ఆధునిక సంప్రదాయ ప్రక్రియ 'కథానిక'. క్రీ.శ. 19వ శతాబ్దిలో ఆంగ్లం నుంచి దిగుమతి అయిన వచన సాహితీ ప్రక్రియలో కథానిక ఒకటి. కథ, కథానిక పదాలను ప్రస్తుతం పర్యాయపదాలుగా వాడుతున్నారు. కథానిక ప్రస్తావన మొదట అగ్ని పురాణంలో కనిపిస్తుంది. 'షార్ట్ స్టోరీ' అనే పదానికి సమానార్థకంగా కథానిక, చిన్న కథ అనే పదాలు ప్రయోగంలో ఉన్నాయి. 1936లో ప్రతిభ అనే పత్రికలో వ్యాసం రాస్తూ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి తొలిసారిగా 'షార్ట్ స్టోరీ' అనే ఆంగ్ల పదానికి సమానార్థకంగా 'కథానిక' పదాన్ని సూచించారు. ఆధునిక తెలుగు కథ 1910లో గురజాడ 'దిద్దుబాటు'తో ప్రారంభమైంది. మొదట దిద్దుబాటు కథను ఆంధ్రభారతి పత్రికలో ప్రచురించారు. ఆధునిక తెలుగు కథా రచయితలకు గురజాడ మార్గదర్శకుడు.

- కథానిక ప్రధాన లక్షణాలు సంక్షిప్తత, ఏకాగ్రత, సమగ్రత, నిర్బరత.
- శీలా వీర్రాజు అభిప్రాయం ప్రకారం 'కథానికకు శిల్పమే ప్రాణం'.

	కథ/ కథానిక పేరు	రచయితలు
1.	కాశీ మజిలీ కథలు	మదిర సుబ్బన్న దీక్షితులు
2.	విక్రమార్కుని కథలు	రావిపాటి గురుమూర్తి
3.	కాంతం కథలు	మునిమాణిక్యం నరసింహారావు
4.	అత్తగారి కథలు	భానుమతి రామకృష్ణ
5.	యజ్ఞం కథలు	కాళీపట్నం రామారావు
6.	మొగలాయి కథలు	సురవరం ప్రతాపరెడ్డి
7.	అమరావతి కథలు	సత్యం శంకమంచి
8.	గులాబీ అత్తరు	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
9.	కలుపు మొక్కలు	శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి
10.	ఓ పువ్వు పూసింది	గుడిపాటి వెంకటాచలం

గల్పిక

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో వచ్చిన వచన సాహితీ ప్రక్రియల్లో 'గల్పిక' ఒకటి. ఇది పరిమాణంలో కథానిక కంటే చిన్నది. దీంట్లో విమర్శ ప్రధానాంశంగా ఉంటుంది. సంఘటనకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

- మానవ జీవితంలోని ఒడుదుడుకుల్ని చిత్రించేది కథానిక అయితే ఒక వ్యక్తిని గానీ, ఒక వ్యవస్థను గానీ అవహేళన చేసేదే గల్పిక.
- గల్పికలో అనుభూతి చిత్రణ కంటే అనుభవ ప్రకటనకు, భావ దృష్టికి రచయితలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు.
- ఒక వ్యక్తి అనుభవంలోని ఒక దశగానీ, ఒక సంస్థ పరిణామక్రమంలోని ఒక విశేషంగానీ గల్పికలో ప్రధాన వస్తువు.
- వ్యక్తిని గానీ, వ్యవస్థనుగానీ విమర్శించడం గల్పికలో సర్వసాధారణం.
- 1940 ప్రాంతంలో త్రిపురనేని గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు గల్పికలు రాసి ప్రసిద్ధి చెందారు.
- తెలుగులో గల్పిక ప్రక్రియకు ఆద్యుడు కొడవటిగంటి కుటుంబరావు. ఆయన రాసిన గల్పికలు యువ పత్రికలో ప్రచురితమయ్యాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. మునిమాణిక్యం నరసింహరావు 'దీక్షితులు' నవలకు స్ఫూర్తి?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) నాయని సుబ్బారావు
   3) చింతా దీక్షితులు
   4) అడవి బాపిరాజు
2. వచన ప్రబంధంగా చలామణి అయిన సాహిత్య ప్రక్రియ?
   1) కథానిక 2) కథ
   3) వ్యాసం 4) నవల
3. ఖాకీవనం నవలా రచయిత?
   1) తల్లావఝ్జల పతంజలి శాస్త్రి
   2) కె.ఎన్.వై. పతంజలి
   3) చాట్ల నారాయణ మూర్తి
   4) కాళీపట్నం రామారావు
4. ఐదు నుంచి పది అంకాల వరకు ఉండే దృశ్య రూపక భేదం?
   1) ఈహామృగం
   2) నాటకం 3) ప్రహసనం
   4) వీధి
5. ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి అనువదితమైన తొలి నాటకం?
   1) మర్చంట్ ఆఫ్ వెనిస్
   2) జూలియస్ సీజర్
   3) రోమియో జూలియట్
   4) కామెడీ ఆఫ్ ఎరర్స్
6. ఒకే అంకంలో ఇమిడిపోయే సంభాషణాత్మక ప్రదర్శన యోగ్య సాహిత్య ప్రక్రియ?
   1) నాటకం 2) నవల
   3) కథానిక 4) ఏకాంకిక
7. పంచ సంధులుండే రూపక భేదాలు?
   1) నాటక, ప్రకరణాలు
   2) డిమ, సమవాకారాలు
   3) వ్యాయోగ, ఈహా మృగాలు
   4) భాణ, ప్రహసనాలు
8. ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ?
   1) ఖండకావ్యం 2) గల్పిక
   3) కథానిక 4) ఏకాంకిక
9. తెలుగు కథానికకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిపెట్టింది?
   1) దిద్దుబాటు 2) గాలివాన
   3) నేను 4) ప్రేమలేఖ
10. కథానిక ప్రధాన లక్షణాలు?
   1) విస్తృతి, సమగ్రత
   2) నిర్బరత, బహు సంఘటనాత్మకత
   3) వివరణాత్మకత, పాత్ర బాహుళ్యం
   4) సంక్షిప్తత, ఏకాగ్రత
11. 'మార్లీదుర్గంలో కుక్క' కథా రచయిత?
   1) గుడిపాటి వెంకటాచలం
   2) శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి
   3) పెద్దిభొట్ల సుబ్బరామయ్య
   4) విశ్వనాథ సత్యనారాయణ
12. గల్పిక ప్రధాన లక్షణం?
   1) వ్యంగ్యంతో కూడిన ఒక కొసమెరుపు ఉండటం
   2) సుదీర్ఘమైన వర్ణన ఉండటం
   3) అనేకానేక సంఘటనలు ఉండటం
   4) నిడివి ఎక్కువగా ఉండటం

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 2
5) 2	6) 4	7) 1	8) 3
9) 2	10) 4	11) 4	12) 1

మాదిరి ప్రశ్నలు

1. తెలుగులో మొదటగా నవలల పోటీలు నిర్వహించిన పత్రిక?
   1) వివేక వర్ధిని
   2) కృష్ణాపత్రిక
   3) గోలకొండ
   4) చింతామణి
2. తొలి తెలుగు మనోవైజ్ఞానిక నవల?
   1) కపాల కుండల
   2) చివరకు మిగిలేది
   3) అసమర్థుని జీవయాత్ర
   4) కీలుబొమ్మలు
3. కన్నడ భాషలో నవలా ప్రక్రియను ఏమని పిలుస్తారు?
   1) ఉపన్యాస్
   2) లలిత ప్రబంధ్
   3) ఉదినం
   4) కాదంబరి
4. ధర్మారావు, అరుంధతి పాత్రలు ఉన్న ప్రసిద్ధ నవల?
   1) వేయిపడగలు
   2) మాలపల్లి
   3) ఏకవీర
   4) అసమర్థుని జీవయాత్ర
5. మూడు మాండలికాల్లో రచనలు చేసిన ఏకైక నవలాకారుడు?
   1) దాశరథి రంగాచార్యులు
   2) పోరంకి దక్షిణామూర్తి
   3) మహీధర రామ్మోహనరావు
   4) సూర్యదేవర రామ్మోహనరావు
6. ధర్మవరం రామకృష్ణమాచార్యులకు 'ఆంధ్ర నాటక పితామహుడు' అనే బిరుదును ఎవరిచ్చారు?
   1) గద్వాల మహారాజు
   2) పిఠాపురం మహారాజు
   3) విజయనగర మహారాజు
   4) దేవరకోట మహారాజు
7. తెలుగులో ఆబాలగోపాలాన్ని అలరించిన చింతామణి నాటక కర్త?
   1) కందుకూరి వీరేశలింగం
   2) కాళ్లకూరి నారాయణరావు
   3) ధర్మవరం రామకృష్ణమాచార్యులు
   4) కొప్పరపు సుబ్బారావు
8. తెలుగులో తిరుపతి వేంకట కవులు అనగానే గుర్తుకు వచ్చే నాటకం?
   1) కురుక్షేత్ర సంగ్రామం
   2) బొబ్బిలి పట్టాభిషేకం
   3) బుద్ధ చరిత్రం
   4) పాండవోద్యోగ విజయాలు
9. తెలుగులో అత్తగారి కథల సృష్టికర్త?
   1) చింతా దీక్షితులు
   2) మునిమాణిక్యం నరసింహారావు
   3) మాలతీ చందూర్
   4) భానుమతీ రామకృష్ణ
10. శ్రీశ్రీ కలం నుంచి జాలువారిన చరమరాత్రి కథలు ఏ కోవకు చెందినవి?
   1) అభ్యుదయ కథలు
   2) విప్లవ కథలు
   3) చైతన్యస్రవంతి కథలు
   4) అధివాస్తవికత వాద కథలు

సమాధానాలు

1) 4	2) 3	3) 4	4) 1
5) 2	6) 1	7) 2	8) 4
9) 4	10) 3		

గ్రూపులో సాధారణంగా పెరిగే ధర్మాలు ఏవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

రసాయన శాస్త్రం

మూలకాల వర్గీకరణ - ఆవర్తన ధర్మాలు

అసంఖ్యాకంగా ఉన్న మూలకాల ధర్మాలను అర్థం చేసుకోవడానికి వాటి వర్గీకరణ చాలా అవసరం. ఈ దిశగా చేసిన ప్రయత్నాల్లో మొదటగా చెప్పుకోవాల్సింది 'డాబర్ నీర్ త్రికసిద్ధాంతం'. దీని ప్రకారం మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు త్రికంలోని మధ్య మూలకం పరమాణుభారం మొదటి, మూడో మూలకాల పరమాణు భారాల సగటుకు దాదాపుగా సమానం.

డాబర్‌నీర్ త్రికాలకు ఉదాహరణలు:

- క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్ (Cl, Br, I)
- లిథియం,సోడియం,పొటాషియం(Li, Na, K)
- ఐరన్, కోబాల్ట్, నికెల్ (Fe, Co, Ni)

న్యూలాండ్, మెండలీఫ్ కూడా మూలకాలను వాటి పరమాణుభారాల ఆరోహణ క్రమంలో వర్గీకరించారు. న్యూలాండ్ మూలకాలను వాటి పరమాణు భారాల ఆరోహణ క్రమంలో అమర్చినప్పుడు ప్రతి 8వ మూలకం, మొదటి మూలక ధర్మాన్ని పోలి ఉండటాన్ని గమనించి, ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. దీన్నే 'న్యూలాండ్ అష్టక సిద్ధాంతం' అంటారు. దీన్ని భారతీయ సంగీతంలోని స్వరాలు 'స రి గ మ ప ద ని స'లతో పోల్చవచ్చు.

మెండలీఫ్ పూర్తిస్థాయిలో, క్రమ పద్ధతిలో వర్గీకరణ చేశాడు. ఇతడు మూలకాల ధర్మాలు వాటి పరమాణు భారాల ఆవర్తన ప్రమేయాలు అనే ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించాడు. పరమాణు భారాలను నిర్ణయించే సరైన పద్ధతులు లేనప్పటికీ కొన్ని మూలకాల ఉనికిని, వాటి ధర్మాలను ఊహించగలగడం మెండలీఫ్ గొప్పదనం. ఉదాహరణకు పరమాణుభారం 68 ఉన్న మూలకాన్ని ఊహించి, దానికి 'ఎకా అల్యూమినియం' అని పేరు పెట్టాడు. 1875లో డెబోస్బాడ్రన్ ఈ మూలకాన్ని కనుగొని 'గాలియం' అని పేరు పెట్టాడు. అదేవిధంగా పరమాణు భారం 44 ఉన్న మూలకాన్ని ఊహించి, 'ఎకా బోరాన్'గా నామకరణం చేయగా, దీన్ని నిల్సన్ కనుగొని 'స్కాండియం' అని పేరు పెట్టాడు.

మూలకాల ధర్మాలు వాటి పరమాణు సంఖ్య లేదా ఎలక్ట్రాన్ విన్యాసాల ఆవర్తన ప్రమేయాలు అని మోస్లే ప్రతిపాదించాడు. ప్రస్తుతం వినియోగిస్తున్న విస్తృత ఆవర్తన పట్టిక లేదా ఆధునిక ఆవర్తన పట్టికను ఈ ఆవర్తన నియమం ఆధారంగానే రూపొందించారు.

- ఆవర్తన పట్టికలోని నిలువు వరుసలను గ్రూపులుగా, అడ్డు వరుసలను పీరియడ్‌లుగా వ్యవహరిస్తారు.



- సుమారు 117 మూలకాలను 7 పీరియడ్‌లు, 16 గ్రూపులుగా విభజించారు.
- మొదటి పీరియడ్ అతి చిన్న పీరియడ్. దీనిలో హైడ్రోజన్, హీలియం అనే రెండు మూలకాలు మాత్రమే ఉన్నాయి. హైడ్రోజన్ పట్టికలోని మొదటి మూలకం. ఇది అత్యంత తేలికైంది.
- అత్యంత పొడవైన పీరియడ్ 6వది. దీంట్లో 32 మూలకాలున్నాయి.
- 7వది అసంపూర్తి పీరియడ్.
- ప్రతి పీరియడ్ జడవాయువుతో అంతమవుతుంది.

అవి: హీలియం (He), నియాన్ (Ne), ఆర్గాన్ (Ar), క్రిప్టాన్ (Kr), క్జినాన్ (Xe), రెడాన్ (Rn) సాధారణంగా ఆవర్తన పట్టికలో ఎడమవైపు లోహాలు, కుడివైపు అలోహాలుంటాయి.

ఆవర్తన ధర్మాలు: ఒక నిర్దిష్ట వ్యవధిలో పునరావృతమయ్యే ధర్మాలను ఆవర్తన ధర్మాలు అంటారు.

అవి:

- పరమాణు పరిమాణం
- రుణ విద్యుదాత్మకత
- ఎలక్ట్రాన్ అఫినిటీ
- అయనీకరణ శక్మం
- ధన విద్యుదాత్మకత

పరమాణు పరిమాణం: కేంద్రకం నుంచి బాహ్య కక్ష్యలోని ఎలక్ట్రాన్ మేఘం వరకు ఉన్న మధ్య దూరాన్ని పరమాణు పరిమాణం అంటారు. దీన్ని అంగ్‌స్ట్రామ్ యూనిట్లలో కొలుస్తారు.

- పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి కేంద్రకావేశం పెరగడం వల్ల పరమాణు పరిమాణం తగ్గుతుంది.
- గ్రూపులో పై నుంచి కిందికి కక్ష్యల సంఖ్య పెరగడం కారణంగా (ఉల్లిగడ్డపై పొరలు పెరిగినట్లు) పరమాణు పరిమాణం పెరుగుతుంది.

రుణ విద్యుదాత్మకత (ఎలక్ట్రో నెగెటివిటీ): బంధంలోని పరమాణువు ఎలక్ట్రాన్ జంటను తన వైపు ఆకర్షించుకునే స్వభావాన్ని రుణ విద్యుదాత్మకత అంటారు.

- రుణ విద్యుదాత్మకతను పౌలింగ్ స్కేలు ద్వారా కొలుస్తారు.
- పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి రుణ విద్యుదాత్మకత పెరుగుతుంది.
- గ్రూపులో పై నుంచి కిందికి రుణ విద్యుదాత్మకత తగ్గుతుంది.
- రుణ విద్యుదాత్మకత గరిష్ఠంగా ఫ్లోరిన్‌కు, కనిష్ఠంగా సీజియంకు ఉంటుంది.
- రుణ విద్యుదాత్మకత కలిగిన మూలకాలు ఎలక్ట్రాన్‌లను గ్రహించి 'రుణ అయాన్‌లు లేదా ఆనయాన్'లను ఏర్పరుస్తాయి.

అయనీకరణ శక్మం: వాయుస్థితిలోని పరమాణు బాహ్య ఆర్బిటాల్ నుంచి ఒక ఎలక్ట్రాన్‌ను తీసివేయడానికి కావాల్సిన కనీస శక్తిని 'అయనీకరణ శక్మం' అంటారు. దీని ప్రమాణం ఎలక్ట్రాన్ వోల్ట్.

- సాధారణంగా పీరియడ్‌లో ఎడమ నుంచి కుడికి అయనీకరణ శక్మం పెరుగుతుంది. (కొన్ని మినహాయింపులుంటాయి)
- గ్రూపులో పై నుంచి కిందికి అయనీకరణ శక్మం తగ్గుతుంది. సాధారణంగా లోహాలకు అత్యల్ప అయనీకరణ శక్మం ఉంటుంది.

ఎలక్ట్రాన్ అఫినిటీ: వాయుస్థితిలో ఉన్న పరమాణు బాహ్య ఆర్బిటాల్‌లో ఒక ఎలక్ట్రాన్‌ను చేర్చినప్పుడు వెలువడే శక్తినే 'ఎలక్ట్రాన్ అఫినిటీ లేదా ఎలక్ట్రాన్ గ్రాహ్య ఎంథాల్పీ' అంటారు.

- గ్రూపులో పై నుంచి కిందికి ఎలక్ట్రాన్ అఫినిటీ తగ్గుతుంది. పీరియడ్‌లో పెరుగుతుంది (కొన్ని మినహాయింపులుంటాయి)
- ఆవర్తన పట్టికలో గరిష్ఠ ఎలక్ట్రాన్ అఫినిటీ ఉన్న మూలకం క్లోరిన్.

ధన విద్యుదాత్మకత: ఎలక్ట్రాన్‌లను కోల్పోయే స్వభావాన్ని ధన విద్యుదాత్మకత అంటారు.

- సాధారణంగా లోహాలకు ధన విద్యుదాత్మకత ఎక్కువగా ఉంటుంది.
- పరమాణువులు ఎలక్ట్రాన్‌లను కోల్పోయి 'ధనాత్మక అయాన్‌లు లేదా కేటయాన్'లుగా మారతాయి.

ఆక్సీకరణ, క్షయకరణ ధర్మాలు:

- ఒక సమ్మేళనానికి ఆక్సిజన్ కలపడం లేదా హైడ్రోజన్‌ను తీసివేయడం లేదా పరమాణువు నుంచి ఎలక్ట్రాన్‌లను తీసివేయడాన్ని 'ఆక్సీకరణం' అంటారు.
- ఒక సమ్మేళనానికి హైడ్రోజన్‌ను కలపడం లేదా ఆక్సిజన్‌ను తీసివేయడం లేదా పరమాణువులకు ఎలక్ట్రాన్‌లను కలపడాన్ని 'క్షయకరణం' అంటారు.
- ఆవర్తన పట్టికలో ఎడమవైపున్న మూలకాలు లేదా లోహాలు బలమైన క్షయకరణులుగా పని చేస్తాయి **ఉదా:** సీజియం, పొటాషియం. గ్రూపులో ఈ ధర్మం పెరుగుతుంది, పీరియడ్‌లో తగ్గుతుంది.

కార్బన్ మోనాక్సైడ్ (CO), కోక్ లాంటివి కూడా బలమైన క్షయకరణులుగా పని చేస్తాయి. ఇవి లోహశాస్త్రంలో ఎక్కువగా ఉపయోగపడతాయి. ఆక్సీకరణ ధర్మం గ్రూపులో తగ్గుతుంది, పీరియడ్‌లో పెరుగుతుంది. ఆవర్తన పట్టికలో కుడివైపున ఉన్న మూలకాలు (జడవాయువులు మినహా) బలమైన ఆక్సీకరణులు.

ఉదా: హాలోజన్‌లు (ఫ్లోరిన్, క్లోరిన్, బ్రోమిన్, అయోడిన్).

మాదిరి ప్రశ్నలు

1. మెండలీఫ్ ఆవర్తన పట్టికను దేని ఆధారంగా రూపొందించాడు?

1) పరమాణు భారం
2) పరమాణు సైజు
3) పరమాణు సంఖ్య
4) పరమాణు ఘన పరిమాణం

2. సరైన వాక్యాలను గుర్తించండి.

ఎ. మూలకాలను మొదటిసారిగా వర్గీకరించింది డాబర్‌నీర్
బి. పరమాణు సైజు ప్రమాణం అంగ్ స్ట్రామ్
సి. ఎకా అల్యూమినియంకు గాలియం అని పేరు పెట్టారు
డి. విస్తృత లేదా ఆధునిక ఆవర్తన పట్టికను పరమాణు సంఖ్య ఆధారంగా రూపొందించారు.

1) ఎ, బి మాత్రమే
2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే
4) ఎ, బి, సి, డి

3. గ్రూపులో పై నుంచి కిందికి పోయే కొద్దీ పరమాణు పరిమాణం?

1) తగ్గుతుంది
2) పెరుగుతుంది
3) మారదు
4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది

4. స్కాండియంను కనుగొన్నది?

1) డెబోస్బాడ్రన్
2) నీల్సన్
3) డాబర్‌నీర్
4) లోథర్ మేయర్

5. సరైన వాక్యాలు గుర్తించండి.

ఎ. ఒక సమ్మేళనానికి హైడ్రోజన్ కలపడాన్ని క్షయకరణమంటారు
బి. లోహాలు బలమైన క్షయకరణులు
సి.గ్రూపులో క్షయకరణ ధర్మం పెరుగుతుంది

1) ఎ, బి మాత్రమే
2) బి, సి మాత్రమే
3) ఎ, బి, సి
4) ఏదీకాదు

6. నిశ్చితవాక్యం (A): ఆవర్తన పట్టికలో రసాయన మూలకాల ఎలక్ట్రాన్ అఫినిటీ ఎల్లప్పుడూ పై నుంచి కిందికి పెరుగుతుంది.
కారణం(R): పరమాణు వ్యాసార్ధం సాధారణంగా పై నుంచి కిందికి పెరుగుతుంది.

1) A, R సరైనవి. R, A కు సరైన వివరణ.
2) A, R సరైనవి. R, A కు సరైన వివరణ కాదు.
3) A సరైంది, R సరైంది కాదు
4) A సరైంది కాదు, R సరైంది

7. సాధారణంగా ఒక ఎలక్ట్రోనెగెటివ్ మూలకం పరమాణువు అయాన్ అయితే?

1) అది ఒకటి లేదా అంత కంటే ఎక్కువ ఎలక్ట్రాన్‌లను కోల్పోతుంది
2) అది అయనీకరణం చెందుతుంది
3) దాని పరమాణు సంఖ్య పెరుగుతుంది
4) దాని ఎలక్ట్రాన్ల సంఖ్య పెరుగుతుంది

8. సరైన వాక్యాన్ని గుర్తించండి.

ఎ. ఒక పరమాణువు ఎలక్ట్రాన్‌లను గ్రహించినప్పుడు ఏర్పడే రుణ అయాన్ సైజు పెరుగుతుంది.
బి. ఒక పరమాణువు ఎలక్ట్రాన్లను కోల్పోయి అయనీకరణం చెందినప్పుడు దాని పరిమాణం తగ్గుతుంది.
సి. పరమాణువు ఎలక్ట్రాన్లను గ్రహించినా లేదా కోల్పోయినా దాని పరిమాణం మారదు
డి. లోహాలకు ఎలక్ట్రాన్‌లను గ్రహించే స్వభావం అధికంగా ఉంటుంది.

1) సి మాత్రమే
2) సి, డి మాత్రమే
3) ఎ, బి, సి మాత్రమే
4) ఎ, బి, సి, డి

9. గ్రూపులో సాధారణంగా పెరిగే ధర్మాలు ఏవి?

ఎ) పరమాణు పరిమాణం
బి) లోహ స్వభావం
సి) ఎలక్ట్రో నెగెటివిటి
డి) అయనీకరణ శక్మం

1) ఎ, బి
2) బి, సి
3) సి, డి
4) బి, సి, డి

సమాధానాలు:

1) 1; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 1.

If you plan carefully and save money..



Directions (Q.No. 1 to 5): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase printed in ***BOLD*** *in the sentence to make it grammatically correct? If the sentence is correct as it is given and no correction is required, mark (5) as the answer.*

1. Since the girl did not want to be disturbed while studying, she left the **phone off hooks**.
   1) of hook 2) for the hook
   3) off hooking 4) off the hook
   5) No correction required
2. Since the officer was overburdened with work, her colleague decided to **gave her hand.**
   1) giving hands
   2) give her a hand
   3) giving her handful
   4) gave her hands
   5) No correction required
3. Despite having passed out from school over ten years back, most schoolmates **has keep touch** with each other.
   1) had kept in touch
   2) keep touched
   3) is keeping touch
   4) are kept touched
   5) No correction required
4. We must **take it granted** that he will not come for today's function.
   1) have it granted
   2) took it as granted
   3) taking it granted
   4) take it for granted
   5) No correction required
5. The train will leave at 8.30 pm; we **have been** ready by 7.30 pm so that we can reach the station.
   1) should have
   2) are 3) must be
   4) were 5) No correction required

Directions (Q.No. 6 - 15): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

One day an expert in time management was … (6)… to a group of business management students and to drive home a point he used an … (7)… they will never forget. As he stood in front of a group of brilliant students he said, "Okay it's … (8)… for a quiz." He then pulled out a one gallon jar and set it on the table in front of him. He also … (9)… a dozen fist sized rocks and carefully placed them one at a time into the jar. When the jar was filled to the top and … (10)… more rocks would fit inside, he asked, "Is the jar full?" Everyone in the class … (11)… said 'Yes!' The professor said nothing. He then … (12)… under the table and pulled out a bucket of gravel. He dumped some gravel into the jar and shook it … (13)… pieces of gravel to work themselves down into the spaces between the big rocks. He asked the group once more, "Is the jar full?" 'Probably not.' some answered. 'Good!' he said and began… (14)… sand to the contents in the jar. The sand fitted into the spaces between the rocks and gravel. He also poured water into the jar. "What was the point of this exercise?" he asked. "The point is that no matter how busy your schedule is you can always manage to fit something in," replied one student. 'No' said the professor, "The truth is if you don't fit in the rocks which symbolize the … (15) … things in your life like your family and your dreams first, you'll never have time for them."

6. 1) expressing
   2) discussing
   3) speaking
   4) conveying
   5) addressing
7. 1) illustration
   2) emblem
   3) expression
   4) impression
   5) imagination
8. 1) scheduled 2) time
   3) opportunity 4) usual
   5) ready
9. 1) ploughed
   2) constructed
   3) dug 4) produced
   5) made
10. 1) any 2) much
    3) some 4) few 5) no
11. 1) emphatically
    2) positive
    3) convince 4) forcibly
    5) definite
12. 1) found 2) searching
    3) gone 4) hid
    5) reached
13. 1) resulting 2) while
    3) causing 4) until
    5) making
14. 1) filling 2) pushing
    3) substituting
    4) adding
    5) stuffing
15. 1) important 2) necessarily
    3) vitally 4) ideal
    5) expensive

Directions (Q.No 16 to 25): In each of the following sentences, a word is italicized and it is followed by five words marked (1), (2), (3) (4) and (5). Choose from these words the one which is nearest in meaning to the italicized word, and indicate your choice.

16. Harish joined the ***ordnance*** factory.
    1) Scheduled
    2) Experimenting and observations
    3) Arms and ammunitions
    4) Laboratory 5) Hi-tech
17. Scientists carry out ***empirical*** methods.
    1) Mathematical calculation
    2) Experimenting and observations
    3) Imagination 4) Impractical
    5) Rough
18. We cannot enjoy with ***material*** things.
    1) Physical 2) Unimportant
    3) Unspiritual 4) Tiny 5) Great
19. If you plan carefully and save money, it ***accrues.***
    1) Is payable regularly
    2) Comes as a natural growth or development
    3) Does not occur much
    4) Loss
    5) Mounts rapidly
20. The whole argument was ***fallacious.***
    1) Misleading 2) Sound
    3) Funny 4) Witty
    5) Guiding
21. He spent his whole life caught up in ***spiritual*** matters.
    1) Worldly 2) Criminal
    3) Foolish 4) Sacred
    5) Inconsequential
22. In spite of the restrictions many nations have been vigorously pursuing ***clandestine*** nuclear weapons programme.
    1) Nefarious 2) Progressive
    3) Systematic
    4) Openly
    5) Secretive
23. Mala is ***defiant*** in her behavior.
    1) Disobedient
    2) Complainant
    3) Meek
    4) Majestic
    5) Magnanimous
24. Blue cross ***vehemently*** criticizes using animals in circus.
    1) Weakly 2) Feebly
    3) Gently 4) Softly
    5) Strongly
25. He was known for his ***magnanimity.***
    1) Small 2) Petty
    3) Noble 4) Generosity
    5) Fare

Directions (Q.No.26 to 30): In each of the following sentences a word or phrase is italicized and it is followed by five words marked (1), (2), (3) (4) and (5). Choose from these words the one which is most nearly opposite in meaning to the italicized word.

26. They were disturbed by his ***hostile*** attitude.
    1) Friendly 2) Positive
    3) Negative 4) Vibrant
    5) Inimical
27. His ***repugnant*** attitude is not appreciable to anyone.
    1) Amiable 2) Repulsive
    3) Ambience
    4) Apolitical
    5) Amoral
28. People who are actually running the system often took ***myriad*** aspects into consideration.
    1) Far sighted
    2) Numerous
    3) Few 4) Glassy
    5) Smooth

Directions (Q. No. 29 to 31): Read each sentence to find out whether there is any grammatical error or idiomatic error in it. The error if any will be in one part of the sentence. The number of that part will be the answer. If there is no error, mark (5) as your answer. (Ignore punctuation errors if any.)

29. Honesty and integrity are (1)/ the qualities which cannot be (2)/ done away with (3)/ and hence assume a lot of importance. (4)/ No error (5)
30. Psychologists point out (1)/ that there are (2)/ human processes which does not involve (3)/ the use of words.(4)/ no error (5)
31. It is high time (1)/ that (2)/ we send (3)/ the answer. (4)/ No error (5)

KEY

1) 4; 2) 2; 3) 1; 4) 4; 5) 3; 6) 3; 7) 1; 8) 2; 9) 4; 10) 5; 11) 1; 12) 5; 13) 3; 14) 4; 15) 1 16) 3; 17) 2; 18) 1; 19) 2; 20) 1; 21) 4; 22) 5; 23) 1; 24) 5; 25) 4; 26) 1; 27) 1; 28) 3; 29) 5; 30) 3; 31) 3.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐటీ బీహెచ్‌యూలో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

వారణాసిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) బెనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్‌యూ).. ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంటెక్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.61,000.
» **వయసు:** 32 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**27.09.2025
» **వెబ్‌సైట్:** https://iitbhu.ac.in

ఐఐటీ ఢిల్లీలో ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) ఢిల్లీ ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ/పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.56,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** anupsm@iitd.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.09.2025.
» **వెబ్‌సైట్:** https://ird.iitd.ac.in

ఐఐటీ ఖరగ్‌పూర్‌లో చీఫ్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఖరగ్‌పూర్ ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,44,200 నుంచి రూ.2,18,200.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.09.2025.
» **వెబ్‌సైట్:** www.iitkgp.ac.in